ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

epaper.vaartha.com WWW.VAARTHA.COM

తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

శ్రీకాకుళం

కపిల్ చిట్స్‌తో బంధం ఆనందాల అనుబంధం
KAPIL GROUP కపిల్ చిట్స్ 45
Visit Us: www.kapilchits.com
కపిల్ చిట్స్ మీ కలలకు సాకారం

: fb.com/vaartha Digital

Published from Srikakulam Visakhapatnam, Vijayawada, Hyderabad, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem,

20-11-2025 గురువారం సంపుటి: 31 సంచిక: 289 పేజీలు: 16 వెల: 6.50

# సత్యసాయి సేవలు జాతికి స్ఫూర్తి

- ఆయన బోధించారు.. ఆచరించారు
- భుజ్ భూకంప సమయంలో సాయి అందించిన సేవలు మరువలేం
- మానవ సేవే మాధవ సేవకు దర్పణం సాయి
- సాయి శతజయంతి వేడుకల్లో ప్రధాని మోడీ
- రూ. 100 స్మారక నాణెం, స్టాంపులు విడుదల చేసిన ప్రధాని
- పేదలకు 100 గిర్ జాతి గోవులు అందజేత

**పుట్టపర్తి, నవంబరు 19 ప్రభాతవార్త:** సేవ పరమో ధర్మః అనేది మన మూల జీవన విధానంలోనే ఉందని... లవ్ ఆల్ సర్వ్ ఆల్ అని భగవాన్ సత్యసాయి బాబా బోధించారని... బోధించడమే కాకుండా తాను ఆచరించడంతో పాటు ఆయన సంస్థలూ అదే పాటించేలా సత్యసాయి బాబా అందరిలోనూ స్ఫూర్తి నింపారని ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ అన్నారు. సత్యసాయి బాబా 100వ జయంత్యుత్సవాలకు ప్రధాని మోడీ, సిఎం చంద్రబాబు హాజరయ్యారు. వీరితోపాటు డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్, కేంద్ర మంత్రులు రామ్మోహన్ నాయుడు, శ్రీనివాస వర్మ, కిషన్ రెడ్డి, మంత్రి నారా లోకేష్ సహా పయ్యావుల, సవిత, అనగాని సత్యప్రసాద్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రధాని మోడీ రూ.100 స్మారక నాణేన్ని విడుదల చేశారు. సత్యసాయి స్మారక తపాళా బిళ్లల్ని ప్రధాని, సిఎం ఆవిష్కరించారు. మొదట సత్యసాయి బాబా జయంతి ఉత్సవాల్లో పాల్గొనడానికి పుట్టపర్తికి చేరుకున్న ప్రధాని మోడీకి సిఎం చంద్రబాబు, డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్ సహా పలువురు కేంద్ర, రాష్ట్ర మంత్రులు స్వాగతం పలికారు. ఆ తర్వాత కుశ్వంత్ >>2



బుధవారం పుట్టపర్తిలో సత్యసాయిబాబా శతజయంతి వేడుకల్లో ప్రధాని మోడీకి జ్ఞాపికను బహూకరిస్తున్న సిఎం చంద్రబాబు. చిత్రంలో కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు, సచిన్ టెండూల్కర్, రత్నాకర్ తదితరులు

## బంగారూ... అంటూ పిలిచే సాయి
### -ముఖ్యమంత్రి

**పుట్టపర్తి, నవంబరు 19, ప్రభాతవార్త ప్రతినిధి:** "బంగారూ' అంటూ ఆయన పిలిచే పిలుపు ఎప్పటికీ గుర్తుంటుంది. బాబాతో నాకు ఎన్నో అనుభవాలు ఉన్నాయని సిఎం చంద్రబాబు అన్నారు. ట్రస్ట్ కార్యక్రమాలపై పలుమార్లు నాతో చర్చించారు. విలువలతో కూడిన విద్యను 1వ తరగతి నుంచి ఉన్నత విద్య వరకూ ఉచితంగా అందించారు. 102 సత్యసాయి విద్యాలయాలు.. 60,000 మందికి ఉత్తమ విద్యను అందిస్తున్నాయి. సూపర్ స్పెషాలిటీ, జనరల్ ఆస్పత్రులు, మొబైల్ ఆస్పత్రుల ద్వారా రోజూ రోగులకు సేవలందుతున్నాయి. రాయల సీమ ప్రజలకు తాగునీటిని అందించేందుకు ప్రశాంతి నిలయాన్ని తాకట్టుపెట్టి అయినా ప్రాజెక్టును పూర్తి చేయాలను >>2

## ప్రేమ, శాంతి బాట చూపిన సాయి: సిఎం చంద్రబాబు

**పుట్టపర్తి, నవంబరు 19, ప్రభాతవార్త ప్రతినిధి:** నాస్తికులను సైతం ఆధ్యాత్మిక మార్గం వైపు నడిపించిన సత్యసాయి సమ్మోహన శక్తి ప్రపంచంలో అరుదైనదని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. బుధవారం హిల్ వ్యూ స్టేడియంలో భగవాన్ సత్యసాయి బాబా శతజయంతి సందర్భంగా ప్రధాన మంత్రి నరేంద్రమోడి పర్యటనను పురస్కరించుకొని ఏర్పాటు చేసిన సభలో ముఖ్యమంత్రి పాల్గొని ప్రసంగించారు. ఈసందర్భంగా సిఎం చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ, భగవాన్ సత్యసాయి బాబా మనకాలంలో ప్రత్యక్ష దైవ స్వరూపంగా ప్రజలకు ప్రేమ, సేవ, శాంతి, సౌభాగ్యం మార్గాన్ని చూపించిన మహానుభావుడని కొనియాడారు. "అందరినీ ప్రేమించు, అందరినీ సేవించు (లవ్ ఆల్ సర్వ్ ఆల్), అందరికీ సహాయం అందించు... ఎవ్వరినీ బాధించకు (హెల్ప్ ఎవర్, హర్ట్ నెవర్) అనే బాబా మహావాక్యాలు ఈ ప్రపంచానికి విశ్వశాంతి, సర్వజన సుఖాయ అనే ఆయన సంకల్పాన్ని ప్రతిబింబిస్తాయన్నారు. ఈ పుణ్యభూమి పుట్టపర్తిలో నేడు జరుగుతున్న భగవాన్ సత్యసాయి బాబా శతజయంతి ఉత్సవాలను ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రాష్ట్ర స్థాయి కార్యక్రమంగా ప్రకటించడం ఎంతో గౌరవంగా >>2

# అన్నదాత అభివృద్ధికి పంచసూత్రాలు

నీటి భద్రత, డిమాండ్ ఆధారిత పంటలు, అగ్రిటెక్, ఫుడ్ ప్రాసెసింగ్, ప్రభుత్వాల మద్దతు అంశాలపై ఫోకస్

మొంథా తుఫాన్ బాధిత రైతులకు త్వరలో రూ.390 కోట్లు ఇస్తాం

రెండో విడత అన్నదాత సుఖీభవ- పిఎం కిసాన్ నిధులు విడుదల చేసిన సిఎం చంద్రబాబు



బుధవారం పెండ్లిమర్రిలో రైతులతో మాట్లాడుతున్న సిఎం చంద్రబాబు

**పెండ్లిమర్రి, నవంబరు 19 ప్రభాతవార్త:** వ్యవసాయ రంగాన్ని అభివృద్ధి చేసేందుకు... అన్నదాతకు అండగా నిలిచేందుకు.. పంచసూత్ర ప్రణాళికతో వెళ్తున్నామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తెలిపారు. తెలుగు ఐటీ నిపుణులకు ఎంత మంచి పేరు ఉందో.. ఎపి రైతులు కూడా ప్రపంచ వ్యాప్తంగా అదే స్థాయిలో గుర్తింపు రావాలని సిఎం చంద్రబాబు చెప్పారు. కడప జిల్లా కమలాపురం నియోజకవర్గం పెండ్లిమర్రిలో అన్నదాత సుఖీభవ పీఎం కిసాన్ రెండో విడత నిధులను ముఖ్యమంత్రి చంద్రబాబు విడుదల చేశారు. రెండో విడత చెల్లింపుల్లో భాగంగా రూ.7 వేల చొప్పున 46,85,838 మంది రైతుల ఖాతాలకు రూ.3,135 కోట్లను జమ చేశారు. రచ్చబండలో పాల్గొని రైతులతో ముఖాముఖి నిర్వహించారు. అనంతరం ప్రజావేదిక నుంచి ప్రజలను ఉద్దేశించి ముఖ్యమంత్రి మాట్లాడుతూ... "మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా రైతులు సాగు విధానాలు అవలంభించాలి. సాగులో టెక్నాలజీ వినియోగంపై దృష్టి పెడితే పెట్టుబడి వ్యయం తగ్గుతుంది. మనది రైతు ప్రభుత్వం. అన్నదాత సుఖీభవ పీఎం కిసాన్ పథకంలో భాగంగా తొలి విడతలో రూ.3,175 వేల కోట్ల సొమ్మును ఈ ఏడాది ఆగస్టులో జమ చేశాం. రెండు విడతలు కలిపి మొత్తం రూ.6,310 కోట్లు అన్నదాతకు అందించాం. గత ఐదేళ్ల కాలంలో రాష్ట్రంలో విధ్వంసం జరిగింది. ఆర్థిక ఇబ్బందులున్నా ఇచ్చిన మాట ప్రకారం నిధులు జమ చేయడం రైతు సంక్షేమంపై ప్రజా ప్రభుత్వ చిత్తశుద్ధికి నిదర్శనం" అని సీఎం చంద్రబాబు అన్నారు.

**పంచ సూత్రాల అమలుతో రైతే రాజు**

"నీరు సమృద్ధిగా ఉన్నచోటే అభివృద్ధి జరిగింది. రాయలసీమ వాసుల కష్టాలు నేను కళ్లారా చూశాను. కరువు రహిత రాష్ట్రంగా ఏపీని తయారు చేసి ప్రతి ఎకరాకు నీరివ్వాలన్నదే నా సంకల్పం. భూగర్భ జలాలు పెంచాలి. ఒకప్పుడు సీమలో 100 అడుగుల కింద నీరు ఉండేది. ఇప్పుడు 7.3 మీటర్లకే నీరు వస్తోందంటే మన దూరదృష్టి వల్లే సాధ్యమైంది. ఆనాడు నా నియోజకవర్గం కుప్పంలో ఇజ్రాయిల్ టెక్నాలజీ తీసుకొచ్చి మైక్రో ఇరిగేషన్‌కు వెళ్లాం. భూగర్భ జలాలు పెరిగితే పర్యావరణం కూడా బాగుంటుంది. రాష్ట్రంలో నీటిభద్రత కల్పించేందుకు నిరంతరం పని చేస్తున్నాం. పట్టిసీమ పూర్తిచేసి కృష్ణా డెల్టాకు నీరందించాం. సముద్రంలోకి వృథాగా పోయే వరద నీటిని >>2

# మరో భారీ ఎన్‌కౌంటర్

- కీలక నేత టెక్ శంకర్ హతం
- మరో ఆరుగురు కూడా మృతి
- కేంద్ర కమిటీ కార్యదర్శి దేవ్ జీ ఎన్‌కౌంటర్‌లో మరణించలేదన్న అధికారులు

**విజయవాడ/పాడేరు, నవంబరు 19,పభాతవార్త ప్రతినిధి:** మావోయిస్టులకు వరుస ఎదురుదెబ్బలు జరుగుతున్నాయి.మావోయిస్టు కదలికలపై ఎపి పోలీసు తీక్షణ దృష్టిపెట్టింది. కేవలం 24గంటల వ్యవధిలో ఆపార్టీ కీలక నేతల్లో ఒకరైన టెక్‌శంకర్ ఎదురు కాల్పుల్లో హతమయ్యారు.ఈ విషయాన్ని డిజిపి హరీష్ కుమార్ గుప్తా స్పష్టం చేసారు. మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ కార్యదర్శి దేవ్ జీ ఈరోజు ఎన్‌కౌంటర్‌లో మరణించాడని వస్తున్న సమాచారం నిజం కాదు. మారేడిమిల్లిలో నిన్నజరిగిన ఎన్‌కౌంటర్‌లో మావోయిస్టుపార్టీ అగ్రనేత హిడ్మాతో పాటు ఐదుగురు హతమయ్యారు. బుధవారం ఏవోబీలో కాల్పులు కొనసాగుతున్నాయన్నారు. మారేడిమిల్లిలో ఉదయం జరిగిన ఎన్‌కౌంటర్‌లో ఏడుగురు మావోయిస్టు కీలక నేతలు హతమయ్యారు. సౌత్ జోనల్ కమిటీ సభ్యుడు, ఆంధ్రా ఒరిస్సా బోర్డర్ ఇన్చార్జి జోగారావు అలియాస్ టెక్ శంకర్ ఎన్‌కౌంటర్‌లో చనిపోయారని డిజిపి వివరించారు.పార్టీ కేంద్ర కమిటీ సభ్యుడు నంబాల కేశవరావు ప్రొటెక్షన్ టీం కమాండర్, డివిజనల్ కమిటీ సభ్యురాలు జ్యోతి కూడా ఎన్‌కౌంటర్‌లో మృతి చెందారు. మావోయిస్టు పార్టీ కమ్యూనికేషన్ టీం ఛీఫ్, సౌత్ జోనల్ కమిటీ మెంబర్ సురేష్ అలియాస్ రమేష్, ఏరియా కమిటీ సభ్యులు జాగరగొండ ఏరియా మిలిషియా కమాండర్ లోకేష్ అలియాస్ గణేష్ కూడా హతమయ్యారు. వీరితోపాటు జాగరగొండ డిప్యూటీ కమాండర్, ఏరియా కమిటీ సభ్యుడు శ్రీను అలియాస్ వాసు.. జాగరగొండ డివిజినల్ కమిటీ, ఏరియా కమిటీ సభ్యురాలు అనిత, ఇదే కమిటీలో సభ్యురాలు షమ్మి ఎన్‌కౌంటర్‌లో మరణించారు. మొత్తం ఏడుగురు మావోయిస్టులు మరణించినట్టు అధికారులు ధృవీకరించారు. మావోయిస్టు జాడలున్న ఏ ప్రాంతాన్ని వదిలేది లేదని, అన్ని చోట్ల జల్లెడపడుతున్నామన్నారు.విజయవాడ సహా రాష్ట్రంలో నిన్న అదుపులోకి తీసుకున్న వారిలో 50మందిని కోర్టుకు రిమాండ్ నిమిత్తం హాజరు పరుస్తామని తెలిపారు.ఛత్తీస్‌గఢ్, ఆంధ్రప్రదేశ్ సరిహద్దులో భద్రతా బలగాలు బుధవారం కూడా భారీ ఆపరేషన్‌ను కొనసాగిస్తున్నాయి. మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ కార్యదర్శి దేవ్ జీ ఈరోజు ఎన్‌కౌంటర్‌లో మరణించాడని వస్తున్న సమాచారాన్ని పోలీసులు ఖండించారు. విజయవాడను మావోయిస్తుటు షెల్టర్‌జోన్‌గా చేసుకోవడం,పెద్ద సంఖ్యలో ఇక్కడి పరిసర ప్రాంతాల్లో తలదాచుకోవడం కలకలం సృష్టించింది. ఎవరి దృష్టి ఉండదని ఆటోనగర్‌లో 27మంది ఒకేభవనంలో ఆయుధాలతో ఉన్నారు. విజయవాడలోని >>2



బుధవారం మావోయిస్టుల నుంచి పట్టుబడిన ఆయుధాలను చూపిస్తున్న ఎడిజి లడ్డా



## ఆస్తుల కేసులో నేడు సిబిఐ కోర్టుకు జగన్
### ఆరేళ్ల తర్వాత వ్యక్తిగతంగా కోర్టు ముందుకు

**విజయవాడ, నవంబరు 19, ప్రభాతవార్త ప్రతినిధి:** వైఎస్సార్సీ అధ్యక్షుడు,మాజీ ముఖ్యమంత్రి జగన్ అక్రమాస్తుల కేసులో హైదరాబాద్‌లోని సిబిఐ ప్రత్యేక కోర్టుకు గురువారం హాజరు కానున్నారు. ఇప్పుడు కూడా వ్యక్తిగత హాజరు నుంచి తనకు మినహాయింపు ఇవ్వాలని జగన్ కోరగా సిబిఐ తీవ్రంగా వ్యతిరేకించింది. ఆరేళ్లుగా జగన్ కోర్టుకు ప్రత్యక్షంగా హాజరవడం లేదని, ఈకేసుల్లో డిశ్చార్జి పిటీషన్‌లపై రోజు వారీ విచారణ జరుగుతున్నందున ఆయన ప్రత్యక్షంగా హాజరుకావాలని సిబిఐ తెలిపింది. దీంతో ఈ నెల 21లోగా వ్యక్తిగతంగా హాజరవ్వాలని కోర్టు ఆదేశించింది. ఈ నేపథ్యంలో ఒక రోజు ముందే ఆయన కోర్టుకు హాజరయ్యేందుకు సిద్ధమయ్యారు. గత నెల >>2

## హిడ్మాను పట్టుకుని, చంపలేదు ఎన్‌కౌంటర్‌లోనే హతమయ్యాడు: లడ్డా 2లో

# పరకామణి చోరీపై త్వరలో మరో కేసు

కుట్రదారులను తేల్చేందుకు బోర్డు కీలక నిర్ణయం

రవికుమార్ కాల్ డేటాయే ప్రధానం

కీలక మలుపు తిరిగిన దర్యాప్తు



**తిరుపతి,నవంబరు 19ప్రభాతవార్తప్రతినిధి:** తిరుమల పరకామణి చోరీ ఘటనపై మళ్లీ కొత్తగా కేసు నమోదు చేయాలని టిటిడి బోర్డు నిర్ణయించడం సంచలనాలు రేకెత్తించనుందా అనేది హాట్‌టాఫిక్‌గా మారింది. ఈ కేసులో రానున్న రోజుల్లో ఎవరూ ఊహించలేని విధంగా దర్యాప్తు జరిగితే అసలు దోషులు ఎవరనేది వెలుగుచూస్తుందా? అసలు ఏ కోణంలో ఎవరు లబ్ధిపొందారనేది తేల్చాలనేది టిటిడి బోర్డు ముందున్న కీలక విషయం. ఇప్పటికే ఈ కేసులో ఫిర్యాదిదారుడు, కీలక వ్యక్తి పూర్వ పరకామణి ఏవిఎస్‌ఒ వైవి సతీశ్‌కుమార్ ప్రాణాలు కోల్పోవడం జరిగింది. అయితే కీలక ఫిర్యాది మరణించడంతో కేసు మూసివేయకుండా ఇప్పుడు కొత్తగా తిరుమల పోలీసులకు క్రిమినల్ కేసుగా ఫిర్యాదు చేసి పూర్తిస్థాయిలో దర్యాప్తు చేయాలని భావిస్తున్నారు.

ఏకంగా ఏడుకొండల వేంకటేశ్వరస్వామికి భక్తులు మొక్కుబడుల రూపంలో కానుకలుగా సమర్పించుకున్న నగదునే చోరీచేయడం వెనుక అసలు ఎవరున్నారనేది తేల్చి భక్తుల ముందు, చట్టం ముందు బహిరంగం చేయాలనేది బోర్డు నిర్ణయంగా తెలుస్తోంది. 2023 ఏప్రిల్‌లో తిరుమల పరకామణిలో జరిగిన 920 అమెరికన్ డాలర్లు చోరీలో అప్పట్లో నమోదైన కేసు పరిధి పరిమితంగానే ఉందనే కోణంలో అదేఉదంతంపై మరోకేసు నమోదుకు టిటిడి బోర్డు నిర్ణయించింది. మరిన్ని చోరీలు, దుర్వినియోగాల దృష్ట్యా క్రిమినల్ కేసు నమోదు దిశగా ఆలోచన చేసి అందుకు తగిన చర్యలు తీసుకుంటున్నారు. 2023లో పరకామణి భవనంలో 920 అమెరికన్ డాలర్లు చోరీచేసి రవికుమార్ అనే వ్యక్తి పట్టుబడటం, అదేరోజు నిఘాభద్రత పర్యవేక్షిస్తున్న ఏవిఎస్‌ఒ వైవి సతీశ్‌కుమార్ అతనిని పట్టుకోవడం జరిగింది. తదుపరి దానిపై తిరుమల వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. సమగ్రంగా విచారణ చేపట్టి నిందితుడిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాల్సిన కొందరు పోలీస్ అధికారులు, టిటిడి గత బోర్డు పెద్దలు, టిటిడి >>2



## చెవిరెడ్డి కుటుంబ ఆస్తుల జప్తు
### లిక్కర్ కేసులో ప్రభుత్వం సంచలన ఆదేశం

**విజయవాడ,నవంబరు 19,ప్రభాతవార్తప్రతినిధి:** ఎపి లిక్కర్ స్కాం కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న వైఎస్సార్సీ సీనియర్ నేత, మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి, ఆయన కుటుంబ సభ్యుల ఆస్తులను జప్తు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం కీలక ఆదేశాలు జారీ చేసింది. ఈ మేరకు ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) చేసిన సిఫార్సులకు ప్రభుత్వం ఆమోదం తెలిపింది. చెవిరెడ్డి, ఆయన కుమారులు, బంధువుల పేరిట ఉన్న ఆస్తులపై చర్యలు రూ. 54.87 కోట్ల నల్లధనం లావాదేవీలు జరిపినట్టు సిట్ గుర్తించింది. సిట్ సమాచారాన్ని అనుసరించి తిరుపతి, నెల్లూరు, >>2

# ధాన్యం నగదు జమ 24 గంటల్లోనే..

రైతులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా ప్రతి బస్తా కొనుగోలు చేస్తాం: మంత్రి నాదెండ్ల



బుధవారం గండిగుంట-2 రైతు సేవా కేంద్రంలో ధాన్యం సేకరణ ప్రక్రియను పరిశీలిస్తున్న మంత్రి నాదెండ్ల

**ఉయ్యూరు, నవంబరు 19, ప్రభాతవార్త:** రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రతి బస్తా కొనుగోలు చేస్తామని, ఎలాంటి దిగులు అవసరం లేదని ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ రైతులకు భరోసా ఇచ్చారు. బుధవారం ఉదయం ఆయన ఉయ్యూరు మండలంలో పర్యటించారు. రాష్ట్ర పౌరసరఫరాల సంస్థ వైస్ చైర్మన్, ఎండి ఎస్ డిల్లీరావు, జిల్లా కలెక్టర్ డికె బాలాజీ, జాయింట్ కలెక్టర్ ఎం నవీన్, పెనమలూరు నియోజకవర్గ శాసనసభ్యుడు బోడె ప్రసాద్ తదితరులతో కలిసి మండలంలోని గండిగుంట-2 రైతు సేవా కేంద్రాన్ని సందర్శించి ధాన్యం సేకరణ ప్రక్రియను పరిశీలించారు. కేంద్రంలో ధాన్యం కొనుగోలు సాంకేతిక సిబ్బందితో మాట్లాడి అందుబాటులో ఉన్న గోనె సంచులు, రవాణా వాహనాలు, ఇప్పటివరకుసేకరించిన ధాన్యంవివరాలను మంత్రి తెలుసుకున్నారు. ఈ క్రమంలో >>2

## మద్యం కుంభకోణం కేసు నిందితులకు హైకోర్టులో ఎదురు దెబ్బ 2లో

20-11pg2exHMNWJQE.qxd:20-11pg2exHMNWJQE.qxd 1/1/02 8:05 AM Page 1





బుధవారం సత్యసాయిబాబా మహాసమాధివద్ద నివాళులర్పిస్తున్న ప్రధాని మోదీ



ప్రశాంతి నిలయంలో సిఎం చంద్రబాబు, డి.సిఎం పవన్‌తో ప్రధాని మోదీ



వేడుకలలో డ్రమ్స్ వాయిస్తున్న ప్రముఖ కళాకారుడు శివమణి

# సత్యసాయి సేవలు జాతికి స్ఫూర్తి

>> హాల్లో సత్యసాయి బాబా మహాసమాధిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా హిల్ వ్యూ స్టేడియంలో నిర్వహించిన శతజయంతి ఉత్సవాల్లో ప్రధాని మోదీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రధాని ప్రసంగిస్తూ... "సత్యసాయి బాబా మన మధ్య భౌతికంగా లేనప్పటికీ ఆయన స్థాపించిన సంస్థలు గ్రామీణ అభివృద్ధి, ప్రజలకు వైద్యం లాంటి సేవల్ని అందిస్తున్నారు. సత్యసాయి బాబా శతజయంతి ఉత్సవాలు జరుపుకోవటం మనకు ఓ వరం. బాబా పాటించిన ప్రేమ, సేవ భావన ప్రపంచ వ్యాప్తంగా కోట్ల మందిని ప్రభావితం చేస్తోంది. బాబా జీవితమే వసుధైక కుటుంబం అనే భావనతో ఉండేది. మన భారతీయుల జీవన విధానమే సేవ, భక్తి, జ్ఞానం. కోట్ల మంది బాబా భక్తులు దేశవ్యాప్తంగా మానవ సేవే మాధవ సేవ అని భావించి సేవలు అందిస్తున్నారు. దేశవ్యాప్తంగా ఎక్కడ ప్రకృతి వైపరీత్యం వచ్చినా సత్యసాయి సేవా దళ్ సభ్యులు ప్రజలకు సేవలందిస్తున్నారు. భుజ్ భూకంపం సమయంలో సేవాదళ్ చేసిన సేవలు నాకు బాగా గుర్తున్నాయి. 3 వేల కిలోమీటర్లకు పైగా తాగునీటి పైపుల్ని ఏర్పాటు చేసి ప్రజలకు దాహార్తి తీర్చారు. వైద్యం ఉచితంగా అందిస్తున్న సంస్థలను బాబా నిర్మించారు. సుకన్య సమృద్ధి యోజన కోసం వేల మంది బాలికలకు ఆర్థిక సాయం అందిస్తోంది ట్రస్టు. దేశ వ్యాప్తంగా ప్రస్తుతం 4 కోట్లకు పైగా సుకన్య సమృద్ధి యోజన ఖాతాలు ఉన్నాయి. రూ.3.25 లక్షల కోట్లకు పైగా నిధులు ఈ ఖాతాల్లో ఉన్నాయి. వారణాసి ఎంపీగా అక్కడ 27 వేల మంది బాలికలకు సుకన్య సమృద్ధి యోజన కింద నిధులు జమ చేయించాను. సోషల్ సెక్యూరిటీ కవరేజ్ కోసం దేశంలో చాలా పథకాలను ప్రారంభించాం. వీటిపై విదేశాల్లో కూడా పెద్ద ఎత్తున చర్చ జరుగుతోంది. సత్యసాయి ట్రస్టు తరపున వంద గిర్ జాతి గోవులను పేదవారికి నా చేతుల మీదుగా అందించటం సంతోషంగా ఉంది. పేద ప్రజల జీవితాలు ఈ గోవుల ద్వారా పెను మార్పు వస్తుంది. రాష్ట్రీయ గోకుల్ మిషన్‌లో భాగంగా వారణాసిలో 480కి పైగా గిర్ జాతి ఆవులను పేదవారికి అందించాం. ఇప్పుడు వెయ్యికి పైగా గిర్ ఆవులు ఆ ప్రాంతంలో తయారు అయ్యాయి. రువాండాలో 200కు పైగా గిర్ ఆవులు ఉన్నాయి. గోవుల దానం లాంటి సంప్రదాయం అక్కడ కూడా ఉంది. గోసంపద ద్వారా పాల ఉత్పత్తి, పోషకాహారం, సోషల్ ఇమ్యూనిటీ లాంటివి పెరుగుతాయి. వికసిత్ భారత్ లక్ష్యంతో దేశం ముందుకు వెళ్తోంది. ఇందులో ప్రజల భాగస్వామ్యం కూడా అవసరం. వోకల్ ఫర్ లోకల్ అనే మంత్రాన్ని అందిపుచ్చుకోవాలని కోరుతున్నాను. స్థానిక ఉత్పత్తులను కొనుగోలు చేస్తే ఆత్మనిర్భర్ భారత్ తయారైనట్టే. భగవాన్ సత్యసాయి ప్రేరణతో అంతా కలిసి పనిచేద్దాం. ప్రతీ వ్యక్తి ఆలోచనలో కరుణ, శాంతి, కర్మ అనే విధానాల ద్వారా ముందుకు వెళ్లాలి" అని ప్రధాన మంత్రి సూచించారు.

# బాట చూపిన సాయి: సిఎం చంద్రబాబు

>> భావిస్తున్నామన్నారు. బాబా నమ్మింది ఒకటే - మానవ సేవే మాధవ సేవ. అదే ఆయన జీవితం, అదే ఆయన సందేశమని పేర్కొన్నారు. ప్రేమే ఏకైక మతం, హృదయమే ఏకైక భాష, మానవత్వమే ఏకైక కులం, విధి ఒకటే చట్టమని, సర్వవ్యాపకమైన దైవం ఒకటేనని బాబా చెప్పిన మాటలు ప్రపంచం నలుమూలలా కోట్లాది మందిని ప్రభావితం చేశాయన్నారు. వందలాది దేశాల నుంచి వచ్చిన భక్తులందరికీ ఆయన దివ్య అనుగ్రహం లభించిందని, పేద నుండి అగ్ర కులాల దాకా, సామాన్యుల నుండి ప్రపంచ నాయకులదాకా అందరి బాధలు వినడం, పరిష్కార మార్గం చూపడం ఆయన ధర్మమైందన్నారు. సత్యసాయి సంస్థల ద్వారా అందుతున్న సేవలు ప్రపంచంలో ఏ సంస్థలతో పోల్చిన ప్రత్యేకమై, విశిష్టమై అద్వితీయంగా ఉంటాయన్నారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఈ మహోత్సవానికి స్వయంగా హాజరై ఆశీస్సులు పొందడం, బాబాతో ఆయనకు ఉన్న ఆత్మీయ బంధాన్ని వెల్లడిస్తున్నదన్నారు. ఈ కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, విద్య, ఐటి, పారిశ్రామిక శాఖ మంత్రి నారాలోకేష్, ప్రముఖ బాలీవుడ్ నటి ఐశ్వర్యరాయ్, ప్రముఖ క్రికెటర్ సచిన్ టెండుల్కర్, మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు, సుప్రీం కోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి ఎన్.వి.రమణ, శ్రీసత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జె.రత్నాకర్, కేంద్ర మంత్రులు రామ్మోహన్ నాయుడు, కిషన్ రెడ్డి, , ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్, రాష్ట్ర రెవిన్యూ శాఖ మరియు జిల్లా ఇన్చార్జి మంత్రి అనగాని సత్యప్రసాద్, బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవితమ్మ, వైద్యారోగ్య శాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్, చీఫ్ సెక్రటరీ విజయానంద్, ఎంపి బికెపార్థసారథి, ఎమ్మెల్యేలు పల్లె సింధూర రెడ్డి, ఎంఎస్ రాజు, కందికుంట వెంకటప్రసాద్, బండారు శ్రావణి, దగ్గుపాటి ప్రసాద్, మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి, స్వచ్ఛందకార్పొరేషన్ ఛైర్మన్ పట్టాభి రామ్, సినీ నటుడు మురళీమోహన్, సత్యసాయి యూనివర్శిటీ ఛాన్స్‌లర్ చక్రవర్తి, ట్రస్ట్ సభ్యులు నాగనంద, నిమిష్ పాండ్య, జిల్లా కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్, జిల్లా ఎస్‌పి సతీష్ కుమార్, కేరళ సంగీత విద్వాంసులు హరిహరన్, పద్మశ్రీ అవార్డు గ్రహీత శివమణి, బిజెపి నాయకుడు విష్ణువర్ధన్ రెడ్డిలతో పాటు పలువురు ప్రముఖులు, వేలాది మంది సాయి భక్తులు పాల్గొన్నారు.

# మరో భారీ ఎన్‌కౌంటర్

>> ఆటోనగర్,కానూరు లోని కొత్త ఆటోనగర్‌లు అసాంఘిక శక్తులకు అడ్డాగా మారాయి. ఇక్కడ కర్మాగారాల్లో ఉత్తరాది నుంచి వేలమంది కార్మికులు వచ్చి పనిచేస్తుంటారు. ఈ ప్రాంతంపై పోలీసుల నిఘా లేకపోవడం,గస్తీ లోపించడం అరాచక శక్తులకు మరింత ఊతమిస్తోంది. మావోయిస్టుల కార్యకలాపాలపై నిరంతరం నిఘా ఉంచే ఎస్ఐబీ(స్పెషల్ ఇంటలిజెన్స్ బ్యూరో) కార్యాలయానికి సమీపంలోనే మావోయిస్టులు షెల్టర్ పొందిన భవనం ఉంది. ఈ కార్యాలయానికి 3.5కి.మీ దూరంలోనే మావోయిస్టులు షెల్టర్ తీసుకోవడం చర్చనీయాంశమైంది. ఇదేమార్గంలో మంత్రి పార్థసారథి క్యాంపు కార్యాలయం కూడా ఉంది. సమీపంలోనే భారతీయ జనతా పార్టీ ఎంఎల్‌ఏ సుజనాచౌదరి నివాసం ఉంది. మచిలీపట్నంలోని ఎస్పీ బంగ్లాలో మరమ్మత్తులు జరుగుతుండటంతో ఈ ప్రాంతానికి 500 మీటర్ల దూరంలోని ఒగేటెట్ కమ్యూనిటీలో ఏస్పీ విద్యాసాగర్ నాయుడు తన బంధువుల ఇంట్లో తాత్కాలికంగా ఉంటున్నారు.ఈ క్రమంలో పకడ్బంది సమాచారంతో లభించడంతో మావోయిస్టు ఆశ్రిత ప్రాంతంపై దాడి జరిగిందంటున్నారు. ఇక డీజీపీ హరీష్‌కుమార్ గుప్తా చెప్పిన సమాచారాన్ని అనుసరించి అయిదు జిల్లాల్లోను,విజయవాడ,గుంటూరు నగరాల్లో కీలకం ఎన్టీఆర్, గుంటూరుజిల్లా నదితీర ప్రాంతాల్లో గాలింపు చర్యలు జరుగుతున్నాయి,.ఇక ఇదే క్రమంలో ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన భవన నిర్మాణ కార్మికులను,ఇతర సంచార కార్మికులను పోలీసులు విచారిస్తున్న సమాచారం

**దేవ్‌జీ, అజాద్ లొంగిపోవాలి: ఇంటలిజెన్స్ ఎడిజి లడ్డా**

ఆంధ్రప్రదేశ్ ఏజెన్సీ ప్రాంతంలోని రంపచోడవరం అటవీ ప్రాంతంలో బుధవారం ఉదయం జరిగిన ఎన్ కౌంటర్‌లో ఏడుగురు మావోయిస్టులు చనిపోయారు. వారిలో దేవ్ జీ, ఆజాద్‌తో సహా పలువురు కేంద్ర కమిటీ సభ్యులు ఉన్నారన్న ప్రచారం జరిగింది. అయితే చనిపోయిన వారిలో టెక్ శంకర్ ఒక్కరే కీలకమైన నేతల అని ఏపీ ఇంటలిజెన్స్ ఎడిజి లడ్డా ప్రకటించారు. నేటి ఎన్‌కౌంటర్‌లో హతమైన మృతుల్లో మావోయిస్టు అగ్రనేత, పార్టీ ప్రధాన కార్యదర్శి తిప్పిరి తిరుపతి అలియాస్ దేవ్ జీ ఉన్నట్లు ప్రచారం జరిగింది. ఆయన సెక్యూరిటీ టీం అంతా పట్టుబడటంతో ఆయనను కూడా పట్టుకున్నారని.. ఎన్ కౌంటర్ చేస్తారని కొంత మంది ఆరపణలుచేశారు. అయితే ఈ ప్రచారాన్ని పోలీసులు ఖండించారు. మొత్తం నలుగురు పురుషులు, ముగ్గురు మహిళలు ఈ ఎన్కౌంటరులో చనిపోయారు. జోగారావు, జ్యోతితో పాటు సురేశ్, గణేష్, వాసు, అనిత, షమ్మిగా మిగిలిన వారిని గుర్తించారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం రంపచోడవరం ఏరియా ఆస్పత్రికి తరలించారు.

షెల్టర్ కోసం చత్తీస్ ఘడ్ నుంచి ఎపికి వస్తున్న మావోయిస్టులు లొంగిపోవాలని లడ్డా పిలుపునిచ్చారు. కృష్ణ, ఏలూరు, కాకినాడ, కోనసీమ జిల్లాల్లో 50 మంది మావోయిస్టులు, వారి సహాయకులు అరెస్టయ్యారు. మాడ్వీ హిడ్మాతో సన్నిహితంగా ముడిపడినవారే ఎక్కువగా అరెస్టయ్యారు. ఈ ఆపరేషన్లు ప్రజలకు ఎలాంటి హాని జరగకుండా నిర్వహించామని, మావోయిస్టుల నుంచి భారీ మొత్తంలో ఆయుధాలు స్వాధీనం చేసుకున్నామని తెలిపారు.వాటిని లడ్డా మీడియాకు ప్రదర్శించారు.

**అరెస్టయిన మావోయిస్టులకు రిమాండ్**

విజయవాడలో పట్టుబడిన మొత్తం 24 మంది మావోయిస్టులకు రిమాండ్ విధించారు. అనంతరం ఈ 24 మంది మావోయిస్టులను రాజమహేంద్రవరం లోని కర్మాగారానికి తరలించాలని అధికారులు ఆదేశాలను జారీ చేశారు. అంతేకాకుండా మరో నలుగురు మావోయిస్టుల వయసు నిర్ధరించాలని కోర్టు ఆదేశించింది.

# ధాన్యం నగదు జమ 24 గంటల్లోనే..

>> గ్రామానికి చెందిన సతీష్ కుమార్ పొలంలో పండించిన ఎంటియు 1262 రకం ధాన్యం తేమ శాతాన్ని మంత్రి సమక్షంలో పరీక్షి ంచగా 15.9 శాతం వచ్చింది. ప్రభుత్వ నిబంధనల ప్రకారం 17 శాతం ఉండాలని, అంతకుమించి తేమశాతం ఉన్న ధాన్యాన్ని రైతుకు సమ్మతమైతే ఒక శాతానికి ఒక కేజీ చొప్పున మినహాయింపు చేస్తున్నట్లు వివరించారు. అక్కడికి చేరుకున్న రైతులతో మంత్రి ముఖాముఖి మాట్లాడి ధాన్యం సేకరణలో వారికున్న సమస్యలు, అభిప్రాయాలు తెలుసుకున్నారు.

అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వ ఆధ్వర్యంలో ధాన్యం సేకరణ పారదర్శకంగా చేపడుతూ రైతులకు అండగా ఉన్నామని అన్నారు. రైతు సేవ కేంద్రాల (ఆర్ఎస్కే) ద్వారా ధాన్యాన్ని కొనుగోలు చేస్తూ మద్దతు ధర ఇచ్చి 24 గంటల్లోపే రైతు ఖాతాలకు నగదు జమ చేస్తున్న సందర్భాన్ని ఆయన గుర్తు చేశారు. గత సంవత్సరంతో పోలిస్తే నేటికి 2 వేల శాతంతో అధికంగా ధాన్యం కొనుగోలు చేశామన్నారు. రాష్ట్ర చరిత్రలో ఎన్నడూ లేని విధంగా రాష్ట్ర వ్యాప్తంగా దాదాపు 51 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు.

వాతావరణ మార్పులకు రైతులు ఎలాంటి ఆందోళన చెందకుండా ఆర్ఎస్కే ల ద్వారా విక్రయించి మద్దతు ధర పొందాలని మంత్రికోరారు. జిల్లాలో ఎక్కడాకూడా గోనె సంచుల కొరత, రవాణా వాహనాల ఇబ్బందులు లేకుండా గత సంవత్సరపు అనుభవాలను దృష్టిలో పెట్టుకొని జిల్లా కలెక్టర్ ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకున్నట్లు మంత్రి తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా 6.52 కోట్ల గోనె సంచులు ఆర్ఎస్కేల ద్వారా రైతుల కల్లాల వద్దకే చేరుస్తున్నామన్నారు. జిల్లాలో ఈ నెలాఖరుకల్లా లక్ష మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ లక్ష్యంగా పెట్టుకున్నామని, డిసెంబరులో 7.90 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యమును కొనుగోలు చేయనున్నామని తెలిపారు.

జిల్లాలో 99 శాతం ఈ-పంట పూర్తి చేశామని, కౌలు రైతులకు గంటల వ్యవధిలోనే ధాన్యం కొనుగోలు నగదు జమ చేస్తున్నట్లు మంత్రి తెలిపారు. వాతావరణ మార్పుల సమయంలో ప్రభుత్వ సూచనలను పాటిస్తూ పంటను సురక్షితంగా కాపాడుకునేందుకు రైతులు అప్రమత్తంగా ఉండాలని ఆయన ఈ సందర్భంగా సూచించారు.

జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ధాన్యం కొనుగోలుకు ముందస్తు ప్రణాళికలతో సిద్ధంగా ఉన్నామని తెలిపారు. ప్రస్తుతం జిల్లాలో దాదాపు 190 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించామని, వాటిద్వారా నిన్న మంగళ వారం వరకు 40 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించామన్నారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని ఆర్ఎస్కే లలో నాణ్యమైన గోనె సంచులు, రవాణా వాహనాలు సిద్ధంగాఉంచినట్లు తెలిపారు. ధాన్యం సేకరణలో రైతులకు ఎలాంటి సమస్యలు ఇబ్బందులు ఉన్నా ఆర్ఎస్కే లలోని సిబ్బందిని సంప్రదించి సహాయం పొందాలని రైతులకు సూచించారు. వరి కోత యంత్రం మళ్ళీ రాదనే ఆందోళనలో, పరిపక్వానికి రాని వరి పంటను ముందుగానే కోసి నష్టపోవద్దని, అవసరమైనప్పుడు వరి కోత యంత్రాన్ని పంపించి కోత కోయిస్తామని కలెక్టర్ ఈ సందర్భంగా హామీ ఇచ్చారు.

# పరకామణి చోరీపై త్వరలో మరో కేసు

>> ఓ అధికారి కలసి నిందితుడ్ని అరెస్ట్ చేయకుండా రాజీధోరణిలో లోక్అదాలత్‌లో అప్పటి ఏవిఎస్‌ఒ ఇటీవల అనుమానాస్పదంగా ప్రాణాలు కోల్పోయిన సతీశ్‌కుమార్‌పై ప్రోద్భలం చేసి రాజీచేయించారనేది ప్రధాన ఆరోపణలు. అందుకు ప్రతిఫలంగా రవికుమార్‌నుండి 14కోట్ల రూపాయలు విలువైన ఆస్తులను శ్రీవారి కానుకగా రాయించారు. ఈ మొత్తం వ్యవహారంలో ఇప్పుడు కీలకంగా వ్యవహ రించిన గత బోర్డులో పెద్దలు ,టిటిడి ,పోలీస్ అధికారుల పాత్ర ఏంటనేది తేల్చడానికి ప్రస్తుత టిటిడి బోర్డు కీలకంగా నిర్ణయం తీసుకుంది. ఈ కేసు సమగ్ర దర్యాప్తులోభాగంగా హైకోర్టు ధర్మాసనం ఆదేశాలతో సిఐడి చీఫ్ రవిశంకర్ అయ్యన్నార్ నేతృత్వంలో 20మంది బృందం మరింత లోతుగా అనేక కోణాల్లో విచారణ చేస్తోంది. పూర్వ ఎవిఎస్‌ఒ సతీశ్‌కుమార్ ఈ కేసుపై గతంలో హైకోర్టులో కౌంటర్‌దాఖలు చేసి కేసు రాజీలో తనకెలాంటి దురుద్దేశం లేదని,పై అధికారులు చెబితేనే అలా చేయాల్సి వచ్చిందని కూడా పేర్కొన్నారు. దాని వెనుక అంతర్యమేమిటనేది కొందరు పోలీసు అధికారులు తప్పుపడుతున్నారు. టిటిడి పరిధిలోని అంశం గనుక బోర్డు, ఉన్నతాధికారులు ఆదేశాలు పాటించాలనేది అప్పట్లోనే గుప్పుమంది. ఇదే పరిణామంలో వారం రోజుల క్రిందట ఆయన అనుమానాస్పదంగా మృతిచెందాడు. ఈ కేసులో డిసెంబరు 2వతేదీకి తుది నివేదిక సమర్పించాలని హైకోర్టు ఆదేశాలతో తాజాగా మరో కొత్తట్విస్ట్ నెలకొంది. వడ్డీకాసుల వేంకటేశ్వరస్వామికి భక్తులు తమ మొక్కుబడుల్లో భాగంగా హుండీకి సమర్పించిన కానుకలు లెక్కించే పరకామణి నుండి ఏకంగా 920 అమెరికన్ డాలర్లు చోరీ చేయడం పెద్ద విషయంగానే బోర్డు భావిస్తోంది. డాలర్ల చోరీకేసు వెనుక కుట్రదారులను తేల్చేలా విచారణ చేయాలని తీర్మానించింది. ఈ కేసుతో సంబంధం ఉన్న గత టిటిడి ఛైర్మన్, అధికారులు, పోలీసు అధికారులతోబాటు లోక్అదాలత్‌లో పరకామణికేసు రాజీచేసిన న్యాయమూర్తిపై కూడా చర్యలు చేపట్టాలని హైకోర్టు సూచించడం సంచలనంగా మారింది. పరకామణి చోరీ వ్యవహారంలో "పెద్ద"లుగా వ్యవహరించి చేతివాటం చూపిన వారెవరనేది ఇప్పుడు డిసెంబర్ 2వతేదీకి వెలుగుచూడనుంది. అదేగాక చోరీచేసిన గుమస్తా టిటిడి ఉద్యోగికూడా కాకపోవడం మరో కొసమెరుపు. మరోవైపు రవికుమార్ కూడబెట్టిన ఆస్తులు, కుటుంబసభ్యుల ఆస్తులు, బ్యాంక్‌ఖాతాలు, లోక్అదాలత్‌లో రాజీతో ఎవరెవరికి ఎంత మొత్తంలో లాభపొందారనే వివరాలు రాబట్టడంలో ఆయన కాల్‌డేటా ఆధారంగా పోలీసులు విచారణ వేగవంతంగా చేస్తున్నారు. చోరీ జరిగిన రోజు నుండి రాజీచేసుకున్నవరకు నిందితుడుఎవరెవరితో,ఎంతకాలంగా,ఎన్ని రోజులు మాట్లాడారు,ఎవరితో వాట్సాప్ ఛాటింగ్‌లుచేశాడు ఆధారాలు సేకరిస్తున్నారు. ఆయనతో సంభాషించిన వారికాల్‌డేటానుకూడా పరిశీలించనున్నట్లు తెలుస్తోంది. రవికుమార్ పేరున అతనికుటంబ సభ్యుల పేరున ఉన్న ఆస్తులు ఎవరిపేరున మారాయనేది తమిళనాడు ప్రభుత్వం నుండి సమాచారం అందితే ఈ మొత్తం కేసులో చిక్కుముడివీడిపోనుందనేది సమాచారం. ఇప్పుడు కొత్తగా తిరుమల పోలీసులు కేసు నమోదుచేస్తే అసలు దోషులుఎవరనే కీలక విషయాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉందనేది హాట్‌టాఫిక్‌గా మారింది. మరోవైపు రవికుమార్ కూడా తన ఆస్తులపై దర్యాప్తు విచారణ ఆపాలని హైకోర్టును ఆశ్రయించారు.

## సిబిఐ కోర్టుకు జగన్

>> ఆయన కోర్టు అనుమతితో ఐరోపా పర్యటనకు వెళ్లారు. ఆ పర్యటన ముగియగానే ప్రత్యక్షంగా హాజరుకావాలని న్యాయస్థానం ఆదేశించింది. కానీ ఆయన కోర్టుకు వెళ్ళకుండా, వ్యక్తిగతంగా హాజరు మినహాయింపు కోరారు. సిబిఐ అభ్యంతరం చెప్పడంతో ఇప్పుడు కోర్టుకు వెళ్లేందుకు సిద్ధమయ్యారు. అక్రమాస్థుల కేసులో 2013 సెప్టెంబరునుంచి జగన్ బెయిలుపై ఉన్నారు.

## ఆగ్నేయ బంగాళాఖాతంలో 22న అల్పపీడనం

**విజయవాడ,నవంబరు19,ప్రభాతవార్తప్రతినిధి:** నైరుతి బంగాళాఖాతం, పరిసర ప్రాంతాలపై ఉపరితల ఆవర్తనం సగటు సముద్ర మట్టానికి 3.1 కిలోమీటర్ల ఎత్తు వరకూ విస్తరించి ఉందని అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం వెల్లడించింది. ఈనెల 22న ఆగ్నేయ బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడే అవకాశఉందని, అనంతరం అది పశ్చిమ వాయువ్య దిశగా కదులుతూ తదుపరి 48 గంటల్లో మరింత బలపడే అవకాశముందని బుధవారం ఒక ప్రకటనలో పేర్కొంది. అదే విధంగా కొమోరిన్ పరిసర ప్రాంతాలపై మంగళవారం ఏర్పడిన అల్పపీడనం బుధవారం ఉదయానికి లక్షద్వీప్ దీవులకు సరిహద్దు, మాల్దీవుల ప్రాంతాలకు విస్తరించిందని తెలిపింది.

## వారం - వర్జ్యం

20-11-2025, గురువారం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,
కార్తీకమాసం, దక్షిణాయణం
శరద్ ఋతువు, శుక్లపక్షం
● అమావాస్య మ.12.16
విశాఖ ఉ.10.58, అనూరాధ కార్తె
వర్జ్యం : మ.3.28-5.15
దు.ఉ.10.01-10.46, మ.2.33-3.18
రాహుకాలం - మ.1.30-3.00

## వార్తాఫలం

**మేషం:** శ్రేయోభిలాషుల ఒత్తిడికి తలవంచి ఇష్టం లేకపోయినా ఓ సందర్భంలో రాయభారం నిర్వహిస్తారు.దూరప్రాంతాల నుండిశుభవార్తలు.

**వృషభం:** మధ్యవర్తిత్వాలకు వివాదాస్పద అంశాలకు ఎంత దూరంగా ఉంటే అంత మంచిది.వివాహం ఉద్యోగయత్నాలు కలిసివస్తాయి.

**మిథునం:** ఉద్యోగస్తులు సహోద్యోగుల సహాయ సహకారాలు అందుకుంటారు. బంధువుల నుండి శుభవార్తలు అందుకొంటారు.

**కర్కాటకం:** ముఖ్యమైన నిర్ణయాలు తీసుకుంటారు.ఇంటా బయటా ప్రోత్సాహం లభిస్తుంది. మీలోని ప్రతిభకు గుర్తింపు పొందుతారు.

**సింహం:** శ్రమకు తగిన ఫలితం దక్కుతుంది. వివాదాలు తీరి ప్రశాంతత పొందుతారు. ఆరోగ్య సమస్యలు ఎదురైన అధిగమిస్తారు.

**కన్య :** ఎంతో కాలంగా ఎదురు చూస్తున్న అవకాశాలు అందిపుచ్చు కోవడంలో నైపుణ్యం చూపండి.సంతానం నాకు సాంకేతిక విద్యావకాశాలు పొందుతారు.

**తుల :** బంధువులను కలిసి ఆనందంగా గడుపుతారు. కలిగిన దానితో తృప్తి పడతారు. గృహనిర్మాణ ఆలోచనలు కార్యరూపం దాలుస్తాయి.

**వృశ్చికం:** ఆర్థిక ప్రణాళికలు నూతనమైన మలుపులు తిరుగుతాయి.కాంట్రాక్టులు అతికష్టం మీద దక్కించుకొంటారు.

**ధనుస్సు:** కొత్త పెట్టుబడులు అనుకూలమైన ఫలితాలను ఇస్తాయి. షేర్లు, భూముల క్రయ విక్రయా లలో లాభాలు పొందుతారు.

**మకరం:** కొద్దికాలం పరిచయమున్న మిత్రులు మీకు అండదండగా నిలుస్తారు.చేపట్టిన పనులు సకాలంలో పూర్తిచేస్తారు.

**కుంభం:** సరికొత్త ఇన్‌స్టాల్‌మెంట్స్ కట్టడంలో మాత్రం కొంత వెనుకబడతారు.దూరప్రాంతాల నుండి వచ్చిన ఆహ్వానాలు ఆశ్చర్యపరుస్తాయి.

**మీనం:** దరఖాస్తు పారములు పంపునప్పుడు వాటిని బాగా పరిశీలించి పంపండి. భూముల క్రయ విక్రయాలలో లాభాలు పొందుతారు.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# హిడ్మాను పట్టుకుని, చంపలేదు

## ఎన్‌కౌంటర్‌లోనే హతమయ్యాడు: లడ్డా

**విజయవాడ,నవంబరు 19,ప్రభాతవార్త:** చత్తీస్‌ఘడ్ నుంచి ఎపికి రావాలని మావోయిస్టులు ప్రయత్నం చేస్తున్నారని నిఘా వర్గాల సమాచారం మేరకు మావోయిస్టుల కదలికలపై నిఘా పెట్టామని, నవంబరు 17న చేపట్టిన కీలక ఆపరేషన్ చేపట్టామని,నిన్న మారేడుమల్లిలో హిడ్మా మరో ఐదుగురు ఎన్‌కౌంటర్‌లో మృతిచెందారని ఎపి అడిషనల్ డిజి మహేష్ చంద్ర లడ్డా పేర్కొన్నారు. ఎన్టీఆర్ పోలీస్ కమీషరేట్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ హిడ్మాను పట్టుకుని అనంతరం చంపామనే ప్రచారంలో నిజం లేదన్నారు.మంగళవారం ఎపి లోని నాలుగు ప్రాంతాల్లో అదుపులోకి తీసుకున్న 50 మంది పీఎల్‌జీఏ సభ్యుల అరెస్ట్ విషయం గురించి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సమాచారం మేరకు ఎక్కడెక్కడ మావోయిస్టులు ఉన్నారనే దానిపై దృష్టి పెట్టామని,ఎన్టీఆర్,కృష్ణా,కాకినాడ,కోనసీమ,ఏలూరు జిల్లాల నుంచి యాభై మంది మావోయిస్టులను పట్టుకున్నామన్నారు. ఎక్కడా ఎవ్వరికీ ప్రమాదం జరగకుండా ఆపరేషన్‌ను పూర్తి చేశామన్నారు.వీరి నుండి 45 ఆయుధాలు,272 రౌండ్లు,రెండు మ్యాగ్‌జైన్‌లు,750 గ్రాముల వైర్,నాలుగు కత్తులు,నగదు రూ.12 లక్షల72వేలు,84 మెమరీ కార్డులు,రేడియో సెట్‌లు-1,ఇతర సామాగ్రిని స్వాధీనం చేసుకున్నామన్నారు.వీటితో పాటు రెండు కత్తులు తదితర మారణాయుధాలను కూడ పట్టుకున్నామన్నారు. రాష్ట్ర చరిత్రలో ఇంత మంది కీలక వ్యక్తులను పట్టుకోవడం ఇదే ప్రథమమన్నారు. వీరిలో బీజాపూర్ జిల్లాకు చెందినవారు 28 మంది,సుకుమా ప్రాంతానికి సంబంధించి-21,నారాయణపూర్ ప్రాంతానికి సంబంధించి-1, ఉన్నారన్నారు. కేంద్ర,రాష్ట్ర ఏరియా కమిటీ సభ్యులు,ప్లాటూన్ టీంలను పట్టుకున్నామని పేర్కొన్నారు.

# అభివృద్ధికి పంచసూత్రాలు

>> రాయలసీమ వైపు మళ్లించి రిజర్వాయర్లు నింపాం. హంద్రినీవా ద్వారా సీమకు నీరిచ్చాం. రాష్ట్రంలో 95 శాతం జలాశయాలు నిండాయి. చెప్పిన విధంగా నదుల అనుసంధానం చేసి చూపిస్తాం. అటు కేంద్రం, ఇటు రాష్ట్రంలో డబుల్ ఇంజన్ సర్కార్లు ఉండబట్టే రైతులకు మేలు జరుగుతోంది." అని సీఎం అన్నారు. "ప్రపంచవ్యాప్తంగా ఆహారపు అలవాట్లలో మార్పులు వస్తున్నాయి. ఆర్గానిక్ ఉత్పత్తులకు డిమాండ్ పెరిగింది. ఇందుకు అనుగుణంగా మన సాగు పద్ధతులు మారాలి. ప్రకృతి సేద్యం వైపు రైతులు మళ్లాలి. డిమాండ్ ఉన్న పంటలను పండించాలి. రాష్ట్రంలో 12 లక్షల ఎకరాల్లో ప్రకృతి సేద్యం జరుగుతోంది. ఇంకో 6 లక్షల ఎకరాలను ప్రకృతి సేద్యం పరిధిలోకి తీసుకువస్తున్నాం. మొత్తంగా 18 లక్షల ఎకరాల్లో ప్రకృతి సేద్యం చేసే ఏకైక రాష్ట్రం దేశంలో ఏపీనే. ఒకప్పుడు దేశానికే అన్నం పెట్టిన పంజాబ్ లో ఎరువుల వాడకం విపరీతంగా పెరగడంతో ప్రజలు క్యాన్సర్ వంటి రోగాల బారిన పడుతున్నారు. ప్రస్తుతం రసాయనిక రహిత పంటలకే విదేశాల్లో కూడా డిమాండ్ ఉంది. టెస్టింగ్, ట్రేసబులిటీ వంటి అంశాలనేవి ఇప్పుడు దేశ, విదేశాల్లో కీలకంగా మారాయి. అందుకే రైతులు క్రిమిసంహారక మందులు, ఎరువుల వాడకం తగ్గించాలి." అని చంద్రబాబు పేర్కొన్నారు.

## మద్యం కుంభకోణం కేసు నిందితులకు హైకోర్టులో ఎదురుదెబ్బ

**విజయవాడ నవంబరు 19,ప్రభాతవార్త ప్రతినిధి :** గత ప్రభుత్వ హయాంలో జరిగిన మద్యం కుంభకోణం కేసులో ముగ్గురు నిందితులకు హైకోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. ధనుంజయరెడ్డి,కృష్ణమోహన్‌రెడ్డి,బాలాజీ గోవిందప్పకు ఏసీబీ కోర్టు ఇచ్చిన డీఫాల్ట్ బెయిల్‌ను ఉన్నత న్యాయస్థానం రద్దు చేసింది. వీరి బెయిల్ రద్దుకు సీఐఈడి వేసిన పిటీషన్‌ను కోర్టు అనుమతించింది. ఈ నెల 26 లోపు జడ్జి ఎదుట ముగ్గురూ సరెండర్ కావాలని ఆదేశించింది. రెగ్యులర్ బెయిలు పిటీషన్‌లను ఎసిబి కోర్టులో దాఖలు చేసుకోవాలని సూచించింది. రెగ్యులర్ బెయిలు పిటీషన్లను విచారించాలని ఎసిబి కోర్టును హైకోర్టు ఆదేశించింది.

# బంగారూ... అంటూ పిలిచే సాయి

>> కున్నారు. ఈ విషయం తెలిసి భక్తులు ముందుకు వచ్చి కోట్లాది రూపాయలు విరాళంగా ఇచ్చారు. రూ.550 కోట్లు ఖర్చు పెట్టి ఎపి, తెలంగాణ, తమిళనాడులో 1600 గ్రామాలు, 30 లక్షలకు పైగా జనాభాకు నీరిచ్చారు. చెన్నై డ్రింకింగ్ వాటర్ మోడర్నైజేషన్ స్కీంకు రూ.250 కోట్లు ఖర్చు పెట్టారు. సత్యసాయి స్ఫూర్తిని, ఆయన చూపిన మార్గాన్ని భవిష్యత్ తరాలకు అందించాలి. రాష్ట్రప్రభుత్వం భగవాన్ సత్యసాయి శతజయంతి ఉత్సవాలను అధికారికంగా నిర్వహిస్తోంది" అని సిఎం చంద్రబాబు వెల్లడించారు.

## సామాన్య ప్రజలకు ఫ్యాన్లు, లైట్లు, బల్బులు పంపిణి

**విజయవాడ,నవంబరు 19,ప్రభాతవార్తప్రతినిధి:** సామాన్య,దిగువ మధ్యతరగతి ఆదాయ వర్గాల కుటుంబాల వారికి ఏపీ ప్రభుత్వం మరో శుభవార్తను అందించనున్నది..విద్యుత్తు ఆదాను చేసే దిశలో ఈ కుటుంబాలకు ఫ్యాన్లు, లైట్లు, బల్బుల పంపిణీ చేయాలని ప్రభుత్వం మరో ముఖ్యమైన నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం!. రాష్ట్రంలోని ప్రధానమంత్రి ఆవాస్ యోజన లబ్ధిదారులందరికీ బీఈఈ స్టార్‌రేటెడ్, ఎనర్జీ ఎఫిషియంట్ పరికరాలు అందించనుంది. క్లీన్ ఎనర్జీని అందరికీ అందుబాటులోకి తెచ్చే క్రమంలో భాగంగా.. విద్యుత్‌ను ఆదా చేసే చర్యలలో భాగంగా.. ఈ నిర్ణయం తీసుకున్నారు. ఎనర్జీ ఎఫిషియెంట్ సర్వీసెస్ లిమిటెడ్ సహకారంతో ఏపీ హౌసింగ్ డిపార్టుమెంట్ ప్రధానమంత్రి ఆవాస్ యోజన లబ్ధిదారులకు నాలుగు ఎల్‌ఈడీ బల్బులు, ఆరు ఎల్‌ఈడీ ట్యూబ్ లైట్లు, రెండు బీఎల్‌డీసీ ఫ్యాన్లు అందించనుంది. 2026 నాటికి ఆరు లక్షల మంది ప్రధానమంత్రి ఆవాస్ యోజన లబ్ధిదారులకు వీటిని పంపిణీ చేయనున్నారు. ప్రభుత్వం అందించే అదనపు సాయం ద్వారా వీటిని అందిస్తారు. ఈ కార్యక్రమం ద్వారా ఏటా సుమారుగా 10.24 మిలియన్ కిలోవాట్ అవర్స్ ఆదా అవుతుందని అధికారుల అంచనా. అలాగే కోట్ల రూపాయలు ఆదా అవుతాయని అంచనా వేస్తున్నారు.

# చెవిరెడ్డి కుటుంబ ఆస్తుల జప్తు

>> చిత్తూరు జిల్లాల్లోని ఆస్తులు ఉన్నాయి.వీటిని జప్తు చేయాలని సిట్ విజ్ఞప్తి మేరకు హోం శాఖ కీలక ఉత్తర్వులు జారీ చేసింది.చెవిరెడ్డి భాస్కర్ రెడ్డితో పాటు ఆయన కుమారులు మోహిత్ రెడ్డి, హర్షిత్ రెడ్డి, కెవిఎస్ ఇన్‌ఫ్రా ఎండీ చెవిరెడ్డి లక్ష్మి పేరిట ఉన్న చర, స్థిరాస్తులన్నింటినీ జప్తు చేయాలని ఉత్తర్వుల్లో స్పష్టం చేశారు. తిరుపతి, నెల్లూరు, చిత్తూరు జిల్లాల్లోని భూములు, ఇతర ఆస్తులు ఈ జాబితాలో ఉన్నాయి. మద్యం కుంభకోణం ద్వారా చెవిరెడ్డి కుటుంబం అక్రమ మార్గాల్లో భారీగా ఆస్తులు కూడబెట్టిందని సిట్ తన విచారణలో గుర్తించింది. సుమారు రూ. 54.87 కోట్ల నల్లధనాన్ని అధికార అండతో భూ లావాదేవీల ద్వారా మళ్లించినట్టు సిట్ నిర్ధారించింది. ఈ మేరకు సిట్ చేసిన విజ్ఞప్తి ఆధారంగా హోం శాఖ ముఖ్య కార్యదర్శి కుమార్ విశ్వజిత్ అవినీతి నిరోధక చట్టం కింద ఈ ఉత్తర్వులు జారీ చేశారు. తదుపరి చర్యలు చేపట్టాలని డిజిపిని ప్రభుత్వం ఆదేశించింది.

20-11Pg3exHMNWJQETR.qxd:20-11Pg3exHMNWJQETR.qxd 1/1/02 8:07 AM Page 1





గోవులకు మేత అందిస్తున్న ప్రధాని నరేంద్రమోదీ



బాలికలకు సంవృద్ధి యోజన పథకం కింద సర్టిఫికెట్ అందజేస్తున్న ప్రధాని నరేంద్రమోదీ

# పుట్టపర్తిలో ప్రధాని పర్యటన గ్రాండ్ సక్సెస్

## - ఫలించిన రాష్ట్ర ప్రభుత్వం ప్రయత్నాలు - సత్యసాయి సెంట్రల్ ట్రస్టు సేవలను పొగడ్తలతో ముంచెత్తిన అగ్రనేతలు - ట్రస్టు ద్వారా 100 ఆవులను రైతులకు బహూకరణ - సుకన్య సంవృద్ధి యోజన కింద పేద బాలికలను ట్రస్ట్ ద్వారా ఎంపిక

**అనంతపురం, నవంబర్ 19 ప్రభాతవార్త బ్యూరో** భగవాన్ శ్రీ సత్యసాయి బాబా శత జయంతి ఉత్సవాల్లో భాగంగా బుధవారం శ్రీ సత్యసాయి జిల్లా పుట్టపర్తిలో జరిగిన దేశ ప్రధాని నరేంద్రమోదీ పర్యటన గ్రాండ్ సక్సెస్ అయింది. కట్టుదిట్టమైన పోలీసు భద్రత రెవెన్యూ, ఇతర శాఖల అధికారుల కృషి వల్ల ప్రధాని సభ సజావుగా సాగిపోయింది. రాష్ట్ర ప్రభుత్వం, సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ సంయుక్తంగా ఏర్పాటు చేయడంతో ప్రధాని నరేంద్రమోదీ సభ సక్సెస్ అయిందని చెప్పవచ్చు. శ్రీ సత్యసాయి శత జయంతి వేడుకలను రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలోనే చేపట్టాలని నిర్ణయం తీసుకోవడంతో గత కొద్దిరోజులుగా రాష్ట్ర స్థాయి అధికారులు కూడా పుట్టపర్తిలోనే మకాం వేసి శ్రీ సత్యసాయి జిల్లా అధికారులు సెంట్రల్ ట్రస్ట్‌తో కలిసి చర్యలు తీసుకోవడంతో ప్రధాని నరేంద్రమోదీ పుట్టపర్తి పర్యటన సక్సెస్ అయిందని చెప్పవచ్చు. ఒకరోజు ముందుగా మంగళవారం రోజు రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్, మంత్రి నారాలోకేష్, అతిథులు, భారత రత్న అవార్డు గ్రహీత సచిన్‌థెండుల్‌కర్, సినీ నటి ఐశ్వర్యరాయ్‌బచ్చన్‌నే కాకుండా కేంద్ర మంత్రులు, ఇతర మంత్రులు వచ్చారు. మంగళ, బుధవారం పెద్ద ఎత్తున విఐపిలు రావడంతో పుట్టపర్తి కలకలలాడింది. పుట్టపర్తి అంతా విద్యుత్ దీపాలు అలంకరించడం, భక్తులు పెద్ద సంఖ్యలో హాజరు కావడంతో ట్రస్ట్ నిర్వాహకులు ఆనందానికి గురయ్యారు. దేశ ప్రధాని నరేంద్ర మోదీ బుధవారం ఉదయం పుట్టపర్తికి చేరుకుని శ్రీ సత్యసాయి మహాసమాధిని సందర్శించడంతోపాటు సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ ద్వారా 100 ఆవులను బాబా శత జయంతి ఉత్సవాలను పురస్కరించుకుని రైతులకు బహుకరించారు. అందులో ప్రధాన మంత్రి చేతులు మీదుగా రైతులకు అందజేశారు. పుట్టపర్తిలోని హిల్వ్యూహ స్టేడియంలో జరిగిన సభలో సత్యసాయి బాబాసేవలకు గుర్తింపుగా 100 రూపాయల నాణెనాన్ని, పోస్టల్ స్టాంప్‌లను కేంద్ర ప్రభుత్వం తరుపున ప్రధాని నరేంద్రమోదీ చేతులు మీదుగా ఆవిష్కరింపజేశారు. అదే విధంగా శ్రీ సత్యసాయి జిల్లాలోని 1వ తరగతి నుంచి 5వ తరగతి వరకు ప్రభుత్వ పాఠశాలలో చదివే బాలికలకు ఆర్థిక సాయం అందే విధంగా 20వేల మందికి సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ ఆర్థిక సాయం అందించే పథకానికి ప్రధాని నరేంద్రమోదీ ప్రారంభించారు. ఇందులో భాగంగా ముగ్గురు బాలికలను వేదికపైకి ఆహ్వానించి ప్రధాని చేతులు మీదుగా పథకాన్ని వారికి అందజేశారు. సభలో ప్రధాని నరేంద్రమోదీ ప్రసంగిస్తూ..సుకన్య సంవృద్ధి యోజన పథకంకు సంబంధించి గోవులను సహాయంగా అందించే విషయాన్ని ప్రత్యేకంగా ప్రస్తావించారు. కొన్నేళ్ల కిందట వారణాసిలో రాష్ట్రీయ గోకుళ్ మిషన్ ద్వారా 480పైగా గిరి ఆవులను పంపిణీ చేశామని, ఇప్పుడు గిర్‌ఆవులు, లేగ దూడల సంఖ్య దాదాపు 1700లకు పెరిగిందని ప్రధాని గుర్తు చేశారు. ఏడెనిమిది ఏళ్ల క్రింద ఆఫ్రీయాలోని రుమాండలోని తన పర్యటన సందర్భంగా 200 గిరి ఆవులను ఆ దేశానికి భారత్ బహుమతిగా అందించిందని ప్రధాని గుర్తు చేశారు. శ్రీ సత్యసాయి శత జయంతి ఉత్సవాలలో భాగంగా పుట్టపర్తిలోని స్టేడియంలో జరిగిన సభలో ప్రధాని నరేంద్రమోదీ ప్రసంగం సాయి భక్తులను ఆకట్టుకుంది. మధ్యాహ్నం 12:19 గంటలకు ప్రారంభించి 12:39గంటల వరకు ప్రసంగించారు. దాదాపు 20 నిమిషాల వరకు ప్రధాని తన ప్రసంగాన్ని కొనసాగించినా, ఎలాంటి నోట్స్, పేపర్ చూడకుండానే అనర్గలంగా హిందీలో మాట్లాడటం విశేషం. ప్రధాని తన ప్రసంగంలో సత్యసాయి బాబా బోధనలను, సేవలను, ఫిలాసఫీని, అభినందిస్తూనే ప్రస్తుతం సెంట్రల్ ట్రస్టు చేస్తున్న సేవలను ప్రశంసించారు. సభలో సీఎం చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, మంత్రి నారాలోకేష్ తన ప్రసంగాల్లో సత్యసాయిబాబా సేవలను కొనియాడారు. సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ చేపట్టే సేవా కార్యక్రమాలకు సంపూర్ణ మద్దతు ఇస్తామని వెల్లడించారు. డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, మంత్రి నారాలోకేష్ ఒక్కొక్కరు 8 నిమిషాల చొప్పున ప్రసంగించగా, సీఎం ప్రసంగించారు.

## బాబా మార్గాన్ని భావితరాలకు అందించడమే ట్రస్ట్ లక్ష్యం

### - శ్రీసత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ ఆర్.జె.రత్నాకర్

**పుట్టపర్తి, నవంబర్ 19, ప్రభాతవార్త** భక్తులతో భగవాన్ సత్యసాయి మాట్లాడుతూ, దీవెనలు అందించడానికి వస్తుంటానని చెప్పేవారని, ఆ వాగ్దానం నేడు ప్రధాన మంత్రి నరేంద్రమోడి పునీత దర్శనంతో నిజమైందని శ్రీసత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ ఆర్.జె.రత్నాకర్ భావోద్వేగంతో వ్యాఖ్యానించారు. బుధవారం భగవాన్ సత్యసాయి బాబా శతజయంతి ఉత్సవాల సందర్భంగా ప్రధాన మంత్రి నరేంద్రమోడి విచ్చేసిన సందర్భంగా హిల్‌వ్యూ స్టేడియంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక సభలో ఆర్.జె.రత్నాకర్ మాట్లాడుతూ, సాయి భక్తులు, సేవాదళ్ సభ్యులకు, ప్రపంచం నలుమూల నుండి విచ్చేసిన వేలాది మంది భక్తులకు ప్రేమపూర్వక అభినందనలు తెలియజేశారు. పుట్టపర్తి భగవాన్ సత్యసాయి బాబా జన్మభూమి మాత్రమే కాదు, ఆయన కర్మభూమి కూడా అన్నారు. ప్రపంచానికి ప్రేమ, శాంతి, సేవ అనే మానవతా విలువలను ఇక్కడి నుంచే ప్రసారం చేశారన్నారు.సత్యసాయి విద్యాసంస్థల్లో చదివిన వేలాది మంది విద్యార్థులు నేడు ప్రపంచవ్యాప్తంగా వివిధ రంగాల్లో సేవ చేస్తున్నారని గర్వంగా తెలిపారు. ఆ విద్యార్థుల్లో చాలామంది ఈ శతజయంతి కార్యక్రమాలకు ప్రత్యేకంగా విచ్చేసి సేవలో పాల్గొనడం బాబా బోధనల మహాత్యం అన్నారు. సత్యసాయి ప్రసంగాలను ఊటంకిస్తూ, "మా అమ్మ చదవలేదు.. నన్ను కూడా చదవించలేదు. కానీ ఆమె ఇచ్చిన విలువలు, దీవెనలు నన్ను నడిపిస్తున్నాయ్లు అని బాబా చెప్పేవారిని గుర్తు చేసుకున్నారు. దేశంలోని తల్లులు తమ పిల్లలకు జ్ఞానం, విలువలు అందించాలని బాబా ఎల్లప్పుడూ ఉద్బోధించేవారన్నారు.

## సత్యసాయిబాబా జన్మించి నూరేళ్లు అయినా ఆయన దివ్య స్ఫూర్తి ఇప్పటికీ నిలిచి ఉంది

### ప్రముఖ సినీనటి ఐశ్వర్య రాయ్ బచ్చన్




**అనంతపురం, నవంబర్ 19, (ప్రభాతవార్త బ్యూరో)** భగవాన్ శ్రీ సత్యసాయి బాబా శతజయంతి మహోత్సవాల సందర్భంగా శ్రీ సత్యసాయి జిల్లా పుట్టపర్తి లోని హిల్ వ్యూ స్టేడియంలో బుధవారం జరిగిన కార్యక్రమంలో అంతర్జాతీయ నటి ఐశ్వర్య రాయ్ బచ్చన్ తన హృదయపూర్వక భావాలను పంచుకున్నారు. బాబా పట్ల ఆమెకున్న భక్తి, ఆయన బోధనల పట్ల గౌరవం, సేవా మార్గం పట్ల ఉన్న ఆమె నిబద్ధత ఈ సందేశంలో స్పష్టంగా ప్రతిఫలించాయి.భగవాన్ సత్యసాయి బాబా జన్మించి నేటికి వందేళ్లు పూర్తయింది. కానీ ఆయన ప్రభావం, ఆయన దివ్య స్ఫూర్తి ప్రపంచవ్యాప్తంగా ఉన్న మిలియన్ల హృదయాల్లో ఇంకా నిలిచే ఉంది. ఆయన ప్రేమకు, సేవకు, దయకు సరిహద్దుల్లేవు." సేవను నిజమైన నాయకత్వంగా చెప్పిన బాబా బోధనలను గుర్తుచేసుకుంటూ చెప్పారు. మానవ సేవే మాధవ సేవ అని బాబా నమ్మేవారు... చేసి చూపించారు. ఆయన చేసిన ప్రజాసేవ, ప్రేమ, దయ, పరిపూర్ణత – ఇవన్నీ ప్రపంచానికి ఒక ఆదర్శం."భగవాన్ బోధించిన 5 డ్డీల (ఇంగ్లీషు భాషలో)గురించి ఆమె ప్రత్యేకంగా ప్రస్తావించారు. డిసిప్లిన్ ( క్రమశిక్షణ), డెడికేషన్ (అంకితభావం), డివోషనల్ (భక్తి), డిటర్మే షన్(దృఢ సంకల్పం), డిస్క్రిమినేషన్ (సత్యాసత్య వివేకం), ఈ అయిదు డి లు మన జీవితానికి దిశగా, ధర్మంగా నిలుస్తాయి.

## వైసిపి ఎంపి మిథున్ రెడ్డి బెయిల్ పిటిషన్ విచారణ 21కి వాయిదా

### - కౌంటరు దాఖలు చేయాలని సిట్‌కు ఆదేశం

**విజయవాడ,నవంబరు 19, ప్రభాతవార్తప్రతినిధి:** పార్లమెంట్ శీతాకాల సమావేశాలు హాజరయ్యే ందుకు తనకు అనుమతి ఇవ్వాలంటూ ఏపీ మద్యం కుంభకోణం వ్యవహారంలో అరెస్టయిన వైసీపీ ఎంపీ మిథున్ రెడ్డి విజయవాడ ఏసీబీ కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై బుధవారం ఏసీబీ కోర్టు విచారణ జరిపింది. దీనిపై కౌంటర్ దాఖలు చేయాలంటూ సిట్‌ను ఏసీబీ కోర్టు ఆదేశించింది. ఎంపీ మిథున్ రెడ్డి పిటిషన్‌పై తదుపరి విచారణ నవంబర్ 21వ తేదీకి కోర్టు వాయిదా వేసింది.రాష్ట్రంలో సంచలనం సృష్టించిన మద్యం స్కాంలో ఏ4గా ఎంపీ మిథున్ రెడ్డి ఉన్నారు. ఆయన్ని ఈ ఏడాది జులై 19వ తేదీన సిట్ అధికారులు అరెస్ట్ చేశారు. అంతకుముందు ఆయన్ని దాదాపు 7 గంటల పాటు సుదీర్ఘ విచారణ అనంతరం ఆయన్ని అరెస్ట్ చేసి.. రాజమండ్రి సెంట్రల్ జైలుకు తరలించారు. నాటి నుంచి ఆయన జైలులోనే ఉన్నారు. ఉప రాష్ట్రపతి ఎన్నిక నేపథ్యంతో తన ఓటు హక్కు వినియోగించుకొనేందుకు అనుమతి ఇవ్వాలంటూ కోర్టులో మిథున్ రెడ్డి పిటిషన్ దాఖలు చేశారు. అందుకు షరతులతో కూడిన బెయిల్‌ను ఆయనకు ఏసీబీ కోర్టు మంజూరు చేసింది. అనంతరం రాజమండ్రి సెంట్రల్ జైలు అధికారుల ఎదుట లొంగిపోవాలని ఆదేశించింది. ఇక న్యూయార్క్ వెళ్తున్న ఎంపీల ప్రతినిధి బృందంలో ఎంపీ మిథున్ రెడ్డికి కేంద్రం చోటు కల్పించింది. ఈ పర్యటనకు వెళ్లేందుకు అనుమితి ఇవ్వాలంటూ మరోసారి ఏసీబీ కోర్టును ఆయన ఆశ్రయించారు. షరతులతో కూడిన బెయిల్‌ను కోర్టు మంజూరు చేసింది. అక్టోబర్ 23 నుంచి నవంబర్ 4వ తేదీ వరకు ఆయన న్యూయార్క్‌లో పర్యటించారు.

## ప్రముఖుల రాకతో జనసంద్రంగా మారిన పుట్టపర్తి రహదారులు



ప్రధాని మోడీకి ఆశీర్వచనం చేస్తున్న పండితులు

**పుట్టపర్తి రూరల్ నవంబర్ 19 ప్రభాతవార్త:** ప్రపంచ ఆధ్యాత్మిక కేంద్రమైన పుట్టపర్తి ప్రశాంతి నిలయంలో శ్రీ సత్య సాయి శతవర్ష జన్మదిన వేడుకలు అంబరాన్ని అంటుతున్నాయి. ఇందులో భాగంగా బుధవారం మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని స్థానిక హిల్ వ్యూ స్టేడియంలో ఏర్పాటు చేసిన వేడుకలకు ముఖ్య అతిథిగా దేశ ప్రధాని నరేంద్ర మోడీ పాల్గొన్నారు. ఉదయం 9: 50 నిమిషాలకు ప్రత్యేక విమానంలో పుట్టపర్తి విమానాశ్రయానికి చేరుకున్నారు. విమానాశ్రయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ తోపాటు కేంద్ర,రాష్ట్ర మంత్రులు కిషన్ రెడ్డి, కింజరపు రామ్మోహన్ నాయుడు, సత్య కుమార్ యాదవ్, పయ్యావుల కేశవ్ , అనగాని సత్యప్రసాద్ , సవితమ్మ, ఎమ్మెల్యేలు పల్లె సింధూర రెడ్డి, పరిటాల సునీత ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్ రెడ్డి స్వాగతం పలికారు. తొలిత ప్రధానమంత్రి సీఎం డిప్యూటీ సీఎంలతో కలిసి శ్రీ సత్య సాయి మహాసమాధిని దర్శించుకుని, కుల్వంత్ మందిరంలోని సత్యసాయి కాంచ విగ్రహం వద్ద ధ్యానముద్రలో కూర్చుని బాబా ఆశీస్సులు పొందారు. అనంతరం పండితులు ప్రధానిని వేదమంత్రాలతో ఆశీర్వచనం చేశారు. సత్య సాయి ట్రస్టు ద్వారా నిరుపేద రైతులకు అందిస్తున్న గోదాన లబ్ధిదారులకు గోవులను దానం చేశారు. అనంతరం హిల్ వ్యూ స్టేడియంలో నిర్వహిస్తున్న మహిళా దినోత్సవ వేడుకల్లో ప్రధాని పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా సత్యసాయి ముద్రణ కలిగిన 100 రూపాయల నాణ్యాన్ని, స్టాంపును, మరియు సత్యసాయి ట్రస్టు ద్వారా బాలికలకు అందిస్తున్న సమృద్ధి పథకాన్ని పిల్లలకు అందించి ప్రారంభించారు. ఈ పథకం ద్వారా ట్రస్ట్ జిల్లాలోని 20వేల మంది ఆడపిల్లలకు ఆర్థిక భరోసా కల్పించనుంది. ఈ కార్యక్రమంలో క్రికెటర్ సచిన్ టెండూల్కర్, బాలీవుడ్ నటి ఐశ్వర్యరాయ్ పాల్గొన్నారు. ప్రముఖ మ్యూజిక్ డ్రం ప్లేయర్ శివమణి ప్రత్యేక వాయిద్య ప్రదర్శనను , ప్రఖ్యాత గాయని సుధా రఘునాథన్ గీతాలను ఆలపించారు. వీరితోపాటు సత్యసాయి గ్లోబల్ కౌన్సిల్ చైర్మన్ చక్రవర్తి, జాతీయ అధ్యక్షుడు నిమిష్పాండే పాల్గొన్నారు.

## నా శారీరక, మానసిక ఆరోగ్యాన్ని ప్రభావితంచేసిన సాయి బాబా మన వెంట ఉంటే భయం ఉండదు : సచిన్ టెండూల్కర్

**అనంతపురం, నవంబర్ 19, (ప్రభాతవార్త బ్యూరో)** భగవాన్ సత్యసాయి బాబా మన వెంట ఉంటే భయం అనేది ఉండదని, నా శారీరక, మానసిక ఆరోగ్యం పై సత్యసాయి బాబా బోధనలు ఎంతో ప్రభావితం చేశాయని భారతరత్న అవార్డు గ్రహీత, మాజీ క్రికెటర్ సచిన్ టెండూల్కర్ అభిప్రాయపడ్డారు. శ్రీ సత్యసాయి జిల్లా పుట్టపర్తి లో బుధవారం జరిగి నభగవాన్ శ్రీ సత్యసాయి బాబా శతజయంతి మహోత్సవంలో ఆయన పాల్గొని బాబా పట్ల తనకున్న ఆధ్యాత్మిక అనుబంధాన్ని, దివ్యానుభూతులను ఎంతో హృదయపూర్వకంగా పంచుకున్నారు. సభలో వేదికపై ప్రధాని నరేంద్ర మోది, సీఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ తదితర ఎందరో ముఖ్యుల సమక్షంలో భక్తులను, విద్యార్థులను ఉద్దేశిస్తూ సచిన్ టెండుల్కర్ తన సందేశాన్ని ఈ విధంగా కొనసాగించారు... సత్యసాయి బాబాకు నా ప్రణామాలు. ఆయన నాకు చిన్నతనం నుంచే ఒక దైవసంబంధం లాంటి అనుభూతిని ఇచ్చార"ని తన బాల్యాన్ని గుర్తుచేసుకుంటూ చెప్పారు. "నాకు ఐదేళ్ల వయసులో ఉండగా ఎక్కడికైనా వెళ్లినా ఈ బాలుడు బాల సత్యసాయి బాబాలా ఉన్నాడు అని అందరూ చెప్పేవారు. ఆ మాటలు అప్పట్లో వినడానికి ఆశ్చర్యంగా అనిపించినా, తరువాత బాబాతో ఏర్పడిన అనుబంధం ఆ మాటలకు అర్థం చూపింది." 1990లలో వైట్‌ఫీల్డ్‌లో భగవాన్ సత్యసాయి బాబా దర్శనం పొందిన సందర్భాన్ని సచిన్ ప్రత్యేకంగా గుర్తుచేసుకుంటూ "మనం అడగకపోయినా మన మనసులో ఏముందో, ఏ సందేహం వుందో బాబా ముందుగానే చెప్పేవారు. ఇది నమ్మశక్యం కాకపోయినా.. నేను అనుభవించిన సత్యం." శారీరక, మానసిక ఆరోగ్యంపై బాబా ఇచ్చిన బోధనలు తన జీవితాన్ని ప్రభావితం చేశాయని ఆయన తెలిపారు.

## ప్రభుత్వ సంక్షేమ వసతి గృహాల్లో రూ.9.28 కోట్లతోఆర్వో ప్లాంట్లు

### - 45 రోజుల్లో పూర్తి చేయాలని ఆదేశం

**విజయవాడ,నవంబరు 19,పభాతవార్త ప్రతినిధి:** సంక్షేమ వసతి గృహాలు,గురుకులాల్లో కలుషిత నీటి ఘటనలు తరచూ జరుగుతుండటంతో కూటమి ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. విధ్యార్థులకు సురక్షిత నీటిని అందించేందుకు రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఎస్సీ సంక్షేమ వసతిగృహాలు సహా 49 ఎస్సీ గురుకులాలు,రెండు అంబేద్కర్ స్టడీ సర్కిళ్ళలో ఆర్వో ప్లాంట్లను ఏర్పాటు చేసేందుకు చర్చలు చేపట్టింది. ఇందుకు రూ.9.29 కోట్లు మంజూరు చేసింది. ఒక్కో ఎస్సీ వసతి గృహానికి రూ.2 లక్షల చొప్పున మొత్తం 311 వసతి గృహాల్లో ఆర్వో ప్లాంట్ల ఏర్పాటుకు రూ.6.22 కోట్లు విడుదల చేసింది. గురుకులాల్లో విద్యార్థుల సంఖ్య ఎక్కువగా ఉన్నందున అధిక సామర్థ్యం గల ఆర్వో ప్లాంట్లను అందుబాటులోకి తీసుకురానుంది. ఇందుకోసం ఒక్కో దానికి రూ.6లక్షల చొప్పున కేటాయించింది. 49 గురుకులాలు రెండు స్టడీ సర్కిళ్ళకు మొత్తం రూ.3.06 కోట్లు విడుదల చేసింది. వీటన్నింటినీ 45 రోజుల్లో పూర్తి చేయాలని అధికారులను ఆదేశిస్తూ మంగళవారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

# తిరుమల సమాచారం

## కార్తికమాసంలో లక్ష్మీనరసింహస్వామికి ప్రత్యేక అభిషేకం




**తిరుమల,నవంబర్ 19ప్రభాతవార్తప్రతినిధి:** తిరుమల నుండి తిరుపతికి వెళ్ళే మొదటిఘాట్‌రోడ్డుని నడకమార్గంలో లక్ష్మీనరసింహస్వామికి బుధవారం ఉదయం ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. ప్రతి ఏడాది స్వాతితిరునక్షత్రం సందర్భంగా ఆలయంలో ప్రత్యేక అభిషేకాలు, అలంకరణలు చేపడతారు. ఆలయంలో మూలమూర్తికి ఉదయం పాలు, పెరుగు, తేనె,చందనం ,పసుపుతో విశేషంగా అభిషేకిరంచారు. అనంతరం భక్తులకు ప్రసాద వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో టిటిడి అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి, ఆలయ పోటు పేష్కార్ మునిరత్నం, అర్చకులు పాల్గొన్నారు.

## వెంకన్నసేవలో విద్యాదీశతీర్థస్వామి




**తిరుమల,నవంబర్ 19ప్రభాత వార్తప్రతి నిధి:** కార్తీకమాసం స్వాతితిరునక్షత్రం సందర్భంగా బుధవారం ఉదయం వ్యాసరాజమఠం మఠాధిపతి విద్యా దీశతీర్థస్వామి శ్రీవారిని దర్శించుకున్నారు. ఆలయం వద్దకు వచ్చిన స్వామికి టిటిడి ఇఒ అనిల్‌కుమార్ సింఘాల్, అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి ఆలయ సాంప్రదయంగా స్వాగతం పలికారు. ఆలయంలోనికి చేరుకున్న స్వామి తొలుత ధ్వజస్తంభానికి నమస్కరించారు. ఆనందనిలయంలో శ్రీవారిని దర్శించుకున్నారు. రంగనాయకులమండపంలో వేదపండితులు వేదాశీర్వచనం చేశారు. ఆలయ అధికారులు శ్రీవారి తీర్థప్రసాదాలు అందజేశారు.

## ఎస్వీఅన్నప్రసాదంకు రూ.10లక్షలు విరాళం



**తిరుమల,నవంబర్ 19ప్రభాత వార్తప్రతి నిధి:** శ్రీవారి దర్శనార్థం తిరుమలకు వచ్చిన భక్తులకు ఆకలి అనేది తెలియకుండా నిరంతరాయంగా రుచిగా శుచిగా అందిస్తున్న అన్నప్రసాదాల ట్రస్ట్‌కు దాతలు విరివిగా విరాళాలి స్తున్నారు. బుధవారం ఉదయం తమిళ నాడు వేలూరుకు చెందిన డార్లింగ్ గ్రూఫ్ ఆఫ్ హోటల్స్ సంస్థ డైరెక్టర్ మురళీ వెంకటసుబ్బు ఎస్వీ అన్నప్రసాదంకు 10లక్షలు రూపాయలు డిడిని టిటిడి ఛైర్మన్ బిఆర్‌నాయుడుకు అందజేశారు.

## ముత్యపు పందిరిపై శ్రీ మహాలక్ష్మి



**తిరుచానూరు, నవంబర్ 19, ప్రభాతవార్త** తిరుచానూరు పద్మావతి అమ్మవారి కార్తీక బ్రహ్మోత్సవాలలో మూడవ రోజు ముత్యపు పందిరిపై శ్రీ మహాలక్ష్మి తిరుమాడ వీధులలో ఊరేగుతూ భక్తులకు అభయమిచ్చారు. ఈ సందర్భంగా అమ్మవారిని సుప్రభాతంతో మేలుకొలిపి సహస్ర నామార్చన నిత్యర్చన నిర్వహించారు. తర్వాత ఉత్సవర్లను వాహన మండపంకు వేంచేపుచేసి స్వర్ణ పుష్ప మణి మాణిక్యాలతో సర్వాంగ సుందరంగా ధనలక్ష్మి అలంకారంలో ముత్యపు పందిరిపై కొలువు తీర్చారు. తిరుమాడ వీధులలో గజరాజులు నడుస్తుండగా మంగళ వాయిద్యాల నడుమ ముత్యపు పందిరిలో శ్రీ మహాలక్ష్మి భక్తులను అనుగ్రహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు కర్పూర నీరాజనాలతో అమ్మవారి కృప కటాక్షాలకు పాత్రులైనారు. ఈ కార్యక్రమంలో వాహన సేవలో పెద్దజీయర్ స్వామి, చిన్నజీయర్ స్వామి, యుఒ అనిల్ కుమార్ సింగల్, జేఈఒ వీరబ్రహ్మం సివిఎస్వో కే.వి.మురళీకృష్ణ, తిరుపతి ఎస్పీ సుబ్బారాయుడు ఆలయ డెప్యూటీ ఈవో హరింద్రనాథ్, ఆలయ అర్చకులు బాబుస్వామి, సూపరింటెండెంట్ రమేష్, ప్రసాద్, ఏవీఎస్ఒ రాధాకృష్ణ మూర్తి, ఆర్జిత ఇన్స్పెక్టర్ చలపతి, వాహనం ఇన్స్పెక్టర్ సుభాస్కర్, ప్రసాదం ఇన్స్పెక్టర్ సుబ్బరాయుడు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## డిసెంబర్ 30నుండి శ్రీనివాస దివ్యానుగ్రహ హోమం రద్దు



**తిరుమల,నవంబర్ 19ప్రభాతవార్తప్రతినిధి:** ధనుర్మాసంలో వచ్చే ఏకాదశిని వైకుంఠ ఏకాదశి, మరుసటిరోజు ద్వాదశి కావడంతో బాటు తిరుమల ఆలయంలో పదిరోజులు పాటు వైకుంఠద్వారాలను తెరచి ఉండనుండటంతో ఆ రోజుల్లో అలిపిరిలో శ్రీనివాస దివ్యానుగ్రహహోమం రద్దుచేసినట్లు టిటిడి తెలిపింది. డిసెంబర్ 30వతేదీ నుండి 2026 జనవరి 8వరకు ఆన్‌లైన్‌లో హోమానికి సంబంధించి టిక్కెట్లు కూడా జారీచేయలేదు. భక్తులు ఈ విషయాన్ని గమనించి టిటిడికి సహకరించాలని విజ్ఞప్తి చేసింది. తిరుపతి అలిపిరిలో ప్రతిరోజూ ఉదయంశ్రీనివాస దివ్యానుగ్రహ హోమం చేపడుతున్న విషయం తెలిసిందే. ఈ హోమంలో గృహస్థభక్తులు వెయ్యిరూపాయలు చెల్లించి పాల్గొంటున్నారు.హోమం అనంతరం ఈ టిక్కెట్‌పై రోజువారీగా తిరుమలలో 300 రూపాయలు ప్రత్యేక ప్రవేశ దర్శనాలను కల్పిస్తారు. ఆలయంలో శ్రీవారిని దర్శనం చేసుకునే వెసలుబాటు ఉంది. వైకుంఠద్వారాలు తెరచివుంచే రోజులు ఈ హోమం భక్తులకు అందుబాటులో ఉండదు.

## అమెరికాలో ఆంధ్రా మహిళ హత్య కేసులో ట్విస్ట్

### - నిందితుడిని పట్టించిన ల్యాప్‌టాప్

**విజయవాడ.నవంబరు 19,ప్రభాతవార్తప్రతినిధి:** అమెరికాలో దాదాపు 8ఏళ్ళ కితం హత్యకు గురైన ఏపీ మహిళ హత్యకేసులో అసలు నిందితుడిని అక్కడి పోలీసులు గుర్తించారు.అమెరికాలో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన శశికళ నర్రా అనే మహిళ 2017లో తన కుమారుడితో సహా దారుణ హత్యకు గురయ్యారు. ఈ కేసుపై దర్యాప్తు చేస్తున్న అధికారులు ఎనిమిదేళ్ళ తర్వాత అసలు నిందితుడుని గుర్తించారు. అసలేమయ్యిందంటే...ఆంధ్రప్రదేశ్‌కు చెందిన నర్రా హనుమంతరావు అనే వ్యక్తి అమెరికాలోని న్యూజెర్సీలో భార్య శశికళ,కొడుకు అనీష్ సాయితో కలిసి నివసించేవాడు. 2017మార్చి 23న హనుమంతరావు విధులు ముగించుకుని వచ్చేసరికి...మాపుల్ షేడ్ లోని వారి అపార్ట్‌మెంట్‌లో భార్య,కొడుకు రక్తపు మడుగులో పడిఉండటాన్ని గుర్తించారు. దీనిపై పోలీసులకు సమాచారం ఇవ్వడంతో కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు. వీరి మరణాలకు భర్త నర్రా హనుమంతరావే కారణమని...అతడికి ఒక కేరళ మహిళకు మధ్య ఉన్న వివాహేతర సంబంధంతోనే భార్యాబిడ్డలను హత్య చేసినట్లు మృతురాలి బంధువులు ఆరోపించడంతో అతడిని అరెస్ట్ చేశారు. దర్యాప్తులో ఘటనాస్థలంలో లభించిన డిఎన్ఎ హనుమంతరావు డీఎన్ఏతో సరిపోకపోవడంతో అతడిని విడుదల చేశారు. హనుమంతరావు సహోద్యోగి హామీద్‌తో గొడవలు ఉన్నట్లు విచారణలో భాగంగా అధికారులు గుర్తించారు. ఈ హత్య కేసులో హామీదుకు సంబంధం ఉందా అనే కోణంలో దర్యాప్తు చేస్తున్న సమయంలో హత్య జరిగిన ఆరు నెలల అనంతరం అతను భారత్‌కు తిరిగి వెళ్ళినట్లు గుర్తించారు.

## టాటానగర్ ఎక్స్‌ప్రెస్‌కు తృటిలో తప్పిన ప్రమాదం

### పెందుర్తిలోని రైల్వే పనుల్లోని ఒరిగిన విద్యుత్ స్తంభం, రైలు ఆపడంతో తప్పిన ప్రమాదం

**విశాఖపట్నం, నవంబర్ 19 ప్రభాతవార్త** పెందుర్తి వద్ద టాటానగర్ ఎక్స్ ప్రెస్ కు పెను ప్రమాదం తప్పింది. రైల్వే గ్యాంగ్ రైలు రోడ్డు పనులు చేస్తుండగా విద్యుత్ వైర్లతో కలిగిన విద్యుత్ స్తంభ పక్కకి ఒరిగిపోయింది. అదే రోడ్లో టాటానగర్ ఎక్స్ ప్రెస్ పెందుర్తి దాటుతుంది అయితే టాటా నగర్ ఎక్రెస్ లోకో పైలట్ ఈ ప్రమాదాన్ని ముందుగా గమనించి రైలును ఆపేశారు.

దీంతో రైలు బండిలో ఉన్న ప్రయాణికులంతా క్షేమంగా ఉన్నారు. దీన్ని గమనించిన రైల్వే అధికారులు హుటా కొట్టిన ఆ విద్యుత్ స్తంభాన్ని పునరుద్ధరించారు. దీంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.

వార్త

బలీయమైన విశ్వాసాలకు, నైతిక సూత్రాలకు కట్టుబడని వారు ఏ పార్టీలో ఉన్నా వారికి ఆ పార్టీకి కూడా క్షేమం కలగదు.

-ఆండర్సన్

# బాలల హక్కుల పరిరక్షణ కాగితాలకే పరిమితం!

**ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో చదువుల పండగ పేరుతో 2002 ఆగస్టు 1నుండి 10వరకూ, 2003 సంవత్సరం నవంబర్ 24నుండి 29వరకూ బడిబయట ఉన్న పిల్లలను దరిని పాఠశాలలలో చేర్పించే బృహత్ కార్యక్రమాన్ని ఆమలుచేశారు.ఆతర్వాత ఏటా ఆ కార్యక్రమాన్ని అమలు చేస్తూనే ఉన్నారు. అయినా ఆశించిన స్థాయిలో ఫలితాలు రావడం లేదన్నది వాస్తవం. అధికార యంత్రాంగం చిత్తశుద్ధితో కృషి చేస్తున్నట్టు చెబుతున్నా బాలకార్మికులు వివిధ పనుల్లో కొనసాగుతూనే ఉన్నారు. బాల కార్మికవ్యవస్థను నిర్మూలించడానికి, నిర్బంధ ప్రాథమిక విద్య అమలుకు మరింతగా చర్యలు చేపట్టవలసి ఉంది. ముందుగా వారి తల్లిదండ్రులకు చదువు పట్ల అవగాహన కలిగించాలి. బాల కార్మికులకు వసతి సైతం కల్పించేలా ప్రత్యేక పాఠశాలలను ఏర్పాటు చేయాలి. నిరుపేద కుటుంబాల్లో ఆర్థిక సమస్యలను తొలగించేలా వారికి సంక్షేమ పథకాలను అమలు చేయాలి. పిల్లల సంపాదనపై ఆధార పడకుండా తల్లిదండ్రులకు సాధికారత కల్పించాలి.**

రామ కిష్టయ్య సంగన భట్ల

ప్రపంచ బాలల హక్కుల దినోత్సవం ప్రతి సంవత్సరం నవంబరు 20న ప్రపంచవ్యాప్తంగా జరుపుకుంటారు. బాలల హక్కుల గురించి ప్రజల్లో అవగాహన కలిగించి, పిల్లలు తమ భావాలను, సమాచారాన్ని పంచుకోవడాన్ని, పరస్పర అవగాహనను పెంపొందించాలన్న ఉద్దేశ్యంతో ఈ దినోత్సవం నిర్వహించబడుతున్నది. 1954, డిసెంబరు 14న ఐక్యరాజ్య సమితి సాధారణ సభ 1956 నుంచి ప్రపంచ బాలల దినోత్సవాన్ని ప్రతి సంవత్సరం వేడుకగా నిర్వహించాలని అన్ని దేశాలకు సూచించింది. 1959, నవంబరు 20న ఐక్యరాజ్య సమితి జనరల్ శాసనసభ బాలల హక్కుల ప్రకటనను ఆమోదించింది. 1989, నవంబరు 20న బాలల హక్కులపై సంప్రదాయ ఒడంబడికను ఆమోదించింది. చాలా దేశాలు ఐక్యరాజ్య సమితి జనరల్ శాసనసభ సూచించిన నవంబరు 20న ప్రపంచ బాలల దినోత్సవం పాటిస్తున్నారు. అయితే ప్రభుత్వాలు పలు పథకాలు చేపట్టినా ఇంకా అధిక శాతం పిల్లలు విధి లేక బాలకార్మికులుగానే ఉండిపోతున్నారు. బాలల శ్రేయస్సుకు కృషి జరుగుతున్నా ఆచరణలో ఫలితాలు కానరావడం లేదు. పాఠశాల సౌకర్యాలు లేక కొందరు, అవున్నా వివిధ కారణాల రీత్యా బడికి వెళ్లలేక మరికొందరు బాలలు తమ ఉజ్వల భవిష్యత్తును అంధకారమయం చేసుకుంటున్నారు. ఆర్థిక, రాజకీయ, సామాజిక అంశాలతో ముడిపడి సంక్షేమ పథకాలకు నోచుకోక, చదువు చెప్పించే స్తోమత లేక ఎందరో పేద తల్లిదండ్రులు గత్యంతరం లేని స్థితిలో చిన్నారులపై భారాన్ని మోపుతున్నారు. హోటళ్లు, కిరాణా దుకాణాలు, ఫ్యాక్టరీలు, మిల్లులు, క్వారీలు, గనులకు తమ పిల్లలను పనికి పంపుతున్నారు. వ్యవసాయ పనులకు కొందరు బాలలు వెళుతున్నారు. చివరికి కొందరు పిల్లలను భిక్షాటన వృత్తిలోకి బలవంతంగా నెడుతున్నారు. వివిధ రంగాలలో బాలకార్మికులు అవస్థలు పడుతూ అనుక్షణం శ్రమిస్తున్నారు. కొన్ని సందర్భాల్లో పెద్దలు చెయ్యాల్సిన పనులను సైతం వీరే చేస్తున్నారు. ప్రభుత్వ నిబంధనలకు నీళ్లు వదిలి బాలల చేత వెట్టిచాకిరీ చేయించుకుంటున్నా, వారికి విముక్తి కలిగించాలన్న ధ్యాస సంబంధిత అధికారుల్లో లేకపోవడం బాధాకరం యజమానులు చెప్పిందే చట్టంగా, వారు చేసేదే సంక్షేమంగా పరిస్థితులున్నా కార్మిక శాఖ అధికారులు పట్టించుకున్న దాఖలాలు లేవు. అప్పుడప్పుడు తూతూ మంత్రంగా దాడులు చేస్తున్నా దోషులకు ఎలాంటి శిక్షలు పడడం లేదు. 14 సంవత్సరాలలోపు



పిల్లలందరికీ ఉచిత నిర్బంధ విద్యను అమలు చేయాలని భారత రాజ్యాంగంలోని 24వ నిబంధన స్పష్టం చేస్తున్నా అది కాగితాలకే పరిమితమవడం శోచనీయం. పేదరికం కారణంగా గ్రామీణ ప్రాంతాల్లో పసిపిల్లల బంగారు కలలు చెదిరిపోతున్నాయి.పాలుగారే లేత వయసులోనే వారు కార్మికులుగా మారడం బాధాకరం. కార్మిక చట్టాలకు విరుద్ధంగా పిల్లల చేత పనిచేయించుకునే యాజమాన్యాలు తగిన వేతనాలు ఇవ్వడం లేదు. పిల్లలు పనిచేసే చోట రక్షిత లేదా భద్రతా సౌకర్యాలను కల్పించకపోవడం ఆక్షేపణీయం. ప్రాథమిక హక్కులను పేర్కొన్న రాజ్యాంగంలోని 3వ ప్రకరణంలోని 15(8)వ అంశం బాలల కోసం ప్రత్యేక శాసనాలు చేసే అధికారం ప్రభుత్వానికి కలుగజేస్తున్నది. 28వ అధికరణం ప్రకారం బాలలను వ్యాపార వస్తువుగా మార్చడం, నిర్బంధ సేవలను చేయించుకోవడం అపరాధంగానే పరిగణించాలి. 14 సంవత్సరాలలోపు పిల్లలను కర్మాగారాలలో, గనులలో, ఇతర ప్రమాదకరమైన పనులలో నియమించడాన్ని 24వ ఆర్టికల్ నిషేధించింది. 39(ఇ) ప్రకారం బాలలను వారి వయసుకు తగని,శక్తికిమించిన పనులలో నియమించరాదు. పేదరికాన్ని సాకుగా చేసుకుని బాలలను పనుల్లో నియమించడం నిషేధించాలని రాజ్యాంగంఆదేశించింది. కఠిన చట్టాలు ఎన్నివున్నా వాటి అమలులో నిర్లక్ష్యంతో పిల్లలు బాల కార్మికులుగానే మిగిలిపోతున్నారు. రాజ్యాంగంలో పేర్కొన్న నిర్బంధ ప్రాథమిక విద్య ఈనాటికీ ఫలించని కలగానే మిగిలిపోతున్నది. ప్రపంచ బాలకార్మికుల్లో మూడవ వంతు మంది మన దేశంలోనే ఉన్నారని ఒక అంచనా. దీంతో బాలకార్మిక వ్యవస్థను నిర్మూలించడానికి కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలుప్రత్యేక కార్యక్రమాలు చేపడుతున్నాయి. 5నుండి 15 సంవత్సరాలలోపు వయసుగల పిల్లలందరినీ పాఠశాలల్లో చేర్పించేందుకు పలు కార్యక్రమాలను చేపట్టారు.పాఠశాలలో నమోదు కాని, మధ్యలో మానివేసిన, అర్హతగల పిల్లల సమగ్ర వివరాలను సేకరించి వారిని తిరిగి తరగతులకు పంపేందుకుకార్యాచరణ ప్రణాళిక రూపొందించి, ఆచరణాత్మక చర్యలను చేపట్టారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో చదువుల పండగ పేరుతో 2002 ఆగస్టు 1నుండి 10వరకూ, 2003 సంవత్సరం నవంబర్ 24నుండి 29వరకూ బడిబయట ఉన్న పిల్లలను దరిని పాఠశాలలలో చేర్పించే బృహత్ కార్యక్రమాన్ని అమలుచేశారు.ఆతర్వాత ఏటా ఆ కార్యక్రమాన్ని అమలు చేస్తూనే ఉన్నారు. అయినా ఆశించిన స్థాయిలో ఫలితాలు రావడం లేదన్నది వాస్తవం. అధికార యంత్రాంగం చిత్తశుద్ధితో కృషి చేస్తున్నట్టు చెబుతున్నా బాలకార్మికులు వివిధ పనుల్లో కొనసాగుతూనే ఉన్నారు. బాల కార్మికవ్యవస్థను నిర్మూలించడానికి, నిర్బంధ ప్రాథమిక విద్య అమలుకు మరింతగా చర్యలు చేపట్టవలసి ఉంది. ముందుగా వారి తల్లిదండ్రులకు చదువు పట్ల అవగాహన కలిగించాలి. బాల కార్మికులకు వసతి సైతం కల్పించేలా ప్రత్యేక పాఠశాలలను ఏర్పాటు చేయాలి. నిరుపేద కుటుంబాల్లో ఆర్థిక సమస్యలను తొలగించేలా వారికి సంక్షేమ పథకాలను అమలు చేయాలి. పిల్లల సంపాదనపై ఆధార పడకుండా తల్లిదండ్రులకు సాధికారత కల్పించాలి. ●

# భారత్ చేతిలో హసీనా భవిత!

సొంత దేశంలో కల్లోలానికి కారకురాలై పరాయి పంచన కాలం వెళ్లదీస్తున్న బంగ్లాదేశ్ మాజీ ప్రధాని షేక్ హసీనాకు ఆ దేశ అంతర్జాతీయ నేరాల ట్రిబ్యునల్ మరణదండన విధించింది.ఇదేమీ ఊహించనిది కాదు. అధికారంలో ఉన్నా లేకున్నా చట్టానికి ఎవరూ అతీతులు కారన్నది న్యాయ పరిభాషలో, ప్రాథమిక సూత్రంగా వర్తిస్తుంది. లోకకళ్యాణం కోసం దేశాధినేతలు తీసుకునే ప్రతి నిర్ణయం ప్రజాదరణ పొందకపోవచ్చు. కానీ అంతమాత్రాన వాళ్లు దేశ విధ్వంసానికి పాల్పడుతున్నారని చెప్పడం సాహసమే అవుతుంది. హసీనా ఏదో అల్లాటప్పా రాజకీయాలు చేసుకునే చిన్నస్థాయి కుటుంబం నుంచి వచ్చిన మహిళ కాదు.ఆ దేశ ఏర్పాటులో, నిర్మాణంలో ప్రగతిలో పాలు పంచుకున్న బంగ్లా జాతి పిత షేక్ ముజిబుల్ రహ్మాన్ కూతురు. ఎంతో కొంత దేశభక్తి లేకుండా ప్రధాని బాధ్యతలు స్వీకరించారంటే నమ్మలేం. ఆ కుటుంబం చేసిన త్యాగాలు అన్నీ ఇన్నీ కావు. 1971లో బంగ్లాదేశ్ విమోచన కోసం పోరాడి బంగ్లాదేశ్ ప్రత్యేక దేశంగా అవతరించేందుకు ముజిబుర్ చేసిన కృషి ఎనలేనిది. ప్రజల్లోంచి ఉద్యమాలు వచ్చినప్పుడు వాటిని సానునయంగా పరిష్కరించడమో, అది సాధ్యం కానప్పుడు వాటిని అణచివేయడమో ప్రభుత్వాలు చేయగలిగిన పని. ఆమె కూడా అదే చేశారు. అయితే కొన్ని నిర్ణయాలు ప్రజలకు రుచించకపోయి ఉండవచ్చు. వాటినే బూచిగా చూపి విపక్షాలు కూడా జనాన్ని చైతన్యవంతుల్ని చేసి ముందుకురికించే శ్రమ తీసుకున్నారేమో అనిపిస్తుంది. బంగ్లాదేశ్ విమోచన పోరాటంలో పాల్గొన్న స్వాతంత్ర్య సమర యోధుల వారసులకు ప్రభుత్వ ఉద్యోగాల్లో రిజర్వేషన్ల కేటాయింపుతో నిరుద్యోగులు, విద్యార్థుల్లో ఆందోళన రేకెత్తింది. అదే ఉద్యమానికి దారి తీసింది. జూలై 15న విద్యార్థులు ఉవ్వెత్తున చేసిన తిరుగుబాటును ఉక్కుపాదంతో అణచివేయాలని హసీనా తీర్మానించారు. అయితే ఎక్కడో లౌక్యం, చాణక్యం బెడిసికొట్టి 1400 మంది మృతికి ఆ నిర్ణయం కారణమైంది. మానవత్వాన్ని మరచి ఎంతో మంది బలైపోవడానికి ఆమె నిర్ణయం దారి తీసినందుకు జనాగ్రహం వ్యక్తమైంది. ఉద్యమాన్ని అణచివేత వ్యూహాలకు కర్త, కర్మ, క్రియా హసీనాయేనని ప్రస్తుత తాత్కాలిక ప్రభుత్వం అభియోగాలు మోపింది. కాగా ఉద్యమ సమయంలో ఉద్యమకారులపైకి హసినా తమ సొంత పార్టీ అవామీ లీగ్ కార్యకర్తలను కూడా ఉసికొల్పారని అభియోగం. ప్రజాస్వామ్య పునాదుల పునరుద్ధరణకు తాము కృషి చేస్తున్నామని చెప్పుకునే తాత్కాలిక ప్రభుత్వ అధినేత ముహమ్మద్ యూనస్ మాత్రం హసీనాకు పడిన మరణ శిక్ష సబబే అని వ్యాఖ్యానించారు. కాగా ఇది పూర్తిగా రాజకీయ ప్రేరేపిత తీర్పుయని, ఒక అనామిక ప్రభుత్వం ఒత్తిడితో వెల్లడైన తీర్పుగా హసీనా పేర్కొన్నారు. 1975లో సైనిక తిరుగుబాటులో తల్లిదండ్రులు, ముగ్గురు సోదరులు, మరికొందరు కుటుంబ సభ్యులు కూడా హతమయ్యారు. అనంతరమే ఆమె దేశ రాజకీయాల్లోకి ప్రవేశించాల్సిన అగత్యం ఏర్పడింది. ఈ ట్రిబ్యునల్ ఆనాటి హోంమంత్రి అసదుజ్జమాన్ ఖాన్‌కు కూడా మరణశిక్ష విధించారు. మాజీ ఐజి చౌదరి అబ్దుల్లా అల్ మమూల్‌కు ఐదేళ్ల శిక్ష పడింది. ఒక దేశంలో కానీ, ఒక రాష్ట్రంలో కానీ పాలకుల పట్ల విపక్షాలు తీవ్ర ఆగ్రహంతో ఉద్యమించినప్పుడు, వారిని నయానో, భయానో దారిలోకి తెచ్చుకోవాలని ప్రయత్నించడమూ జరిగేదే. అది ప్రభుత్వ బాధ్యత. తాత్కాలిక ప్రభుత్వం కూడా ఆనాటి ఉద్యమకారులకు చేసిందేమీ లేదు. కానీ హసీనాకు శిక్షపడిందంటేనే అది వారికి న్యాయం జరిగినట్లు భావించాలనిచెబుతోంది. ఇదిలా ఉంటే హసీనాకు శిక్ష అయితే వేయగలిగారు కానీ ప్రస్తుతం ఆమె ఇండియా ఆశ్రయంలో ఉంది. ఎక్కడో రహస్యంగా దాక్కోలేదు. భారత ప్రభుత్వం రక్షణ కల్పిస్తోంది. బంగ్లాలో నిరసనకారులను చిత్రహింసలకు గురిచేయడం నిరాయుధ విద్యార్థులపైకి మారణాయుధాలతో దాడి చేసిన చర్యలకు జవాబుదారీగా ఆమెను ట్రిబ్యునల్ అభిశంసించింది. విద్యార్థులపై దాడి జరిపేటట్లుగా హసీనా రెచ్చగొట్టే ప్రసంగాలు చేసిందని మరో ఆరోపణలున్నాయి. ఏదిఏమయినా ముస్లిం దేశాలలో అధికారపక్షాన్ని తిరుగుబాటుతో కూలదోయటమనేది తరచు జరిగే ప్రక్రియ. గతంలో ఆయాప్రభుత్వాలను సైన్యమే కూలదోసేది. ప్రస్తుత బంగ్లాదేశ్ విషయం వేరు. ఇక్కడ ప్రభుత్వ నిర్ణయాలను అమలు చేసిన సైన్యం కూడా మాటపడాల్సి వచ్చింది. ఇదిలా ఉండగా భారత్‌లో ఉన్న ఆమెను ఎలాగైనా స్వదేశానికి రప్పించుకొని మరణశిక్ష అమలు చేయాలని యూనస్ నేతృత్వంలోని తాత్కాలిక ప్రభుత్వం కొత్త వ్యూహాలు పన్నుతోంది. బంగ్లాదేశ్‌లో మరణశిక్ష విధించబడిన షేక్ హసీనాను తక్షణమే తమకు అప్పగించాలని బంగ్లాదేశ్ ఇప్పటికేభారత్‌కు విజ్ఞప్తిచేసింది. భారత్,బంగ్లాదేశ్‌ల మధ్య ఉన్న ఒప్పందం మేరకు షేక్ హసీనా, అసదుజ్జమాన్ ఖాన్‌లను తమకు అప్పగించడమే తక్షణ కర్తవ్యమని బంగ్లాదేశ్ తాత్కాలిక ప్రభుత్వం భారత్‌కు కర్తవ్యబోధ చేస్తోంది. బంగ్లాదేశ్ ప్రజల ప్రయోజనాలు కాపాడే దిశగా శాంతి ప్రజాస్వామ్యం స్థిరత్వం కలిగేటట్లు తమ దేశనిర్ణయాలు ఉంటాయని భారత్ ప్రకటించింది. ఈ రెండు దేశాల మధ్య ఉన్న ఒప్పందంలోని ఆర్టికల్ '6' ప్రకారం హత్య, ఉగ్రవాదం, వంటి తీవ్రమైన నేరాలు మినహా రాజకీయ స్వభావమున్న నేరాల్లోని నిందితులకు అప్పగించకుండా భారత్‌తిరస్కరించే అవకాశముంది. పరస్పర అప్పగింత సందర్భాలలోను 1962ఒప్పందంలోని సెక్షన్ 29ప్రకారం రాజకీయ ప్రేరేపిత ఒప్పందాలకు తిరస్కరించే అధికారం భారత్‌కు ఉంది. హసీనా భవితవ్యం ఇప్పుడు భారత్ దేశ నిర్ణయం మీద ఆధారపడి ఉంది.

అభిప్రాయాలను మార్చుకోలేని వ్యక్తి తన తప్పుల్ని సరిదిద్దుకోలేడు. నేటికంటే రేపు ఎక్కువ వివేకం ప్రదర్శించాలనుకుంటే మనిషిలో మార్పు అవసరం.



ఎడ్వర్డ్

మనిషి అన్నవాడు ఈ భూప్రపంచంలో తామరాకు లాగా జీవించాలి. తామర నీటిలో పెరుగుతున్నప్పటికీ దానికి తడి అంటదు.



స్వామి వివేకానందుడు

# ఎఐతో భాషాభివృద్ధి సాధ్యమేనా?

వి. వరద రాజు

చక్రం పురాతన ఆవిష్కరణ. కొత్త రాతి యుగంలో మెసెపుటోమియన్లు కనుగొన్నారు. రవాణాకు చక్రం, ఇరుసులే ముఖ్యం. ఈ రెండు వాళ్ళ సృష్టే. ఇవి రవాణా గతినే మర్చివేసాయి. ప్రగతి చక్రాన్ని ఫర్ మని త్రిప్పాయి. ఆవిరి, ముద్రణా యంత్రాలు సమాజాన్ని మరింత ముందుకు తీసుకెళ్ళాయి. విద్యుత్, కంప్యూటర్ కనుగొన్నాక అభివృద్ధి ఊహకు అందని తీరాలకు చేరింది. గుండు సూది మొదలు కంప్యూటర్ వరకు ప్రతి ఆవిష్కరణ మానవ జీవితాన్ని ఎంతో వేగవంతం చేసాయి. తేలిక పరిచాయి. అధిక సుఖమయం కావించాయి. అయినప్పటికి ఈ మార్పులు మధ్య ఒక మానవ అనుభవం మాత్రం ఏ మాత్రం మార్పు లేకుండా అలాగే నిశ్చలంగా నిలిచి వుంది. అది భాష. భావాన్ని వ్యక్తం చేసేదే (సాధనం) భాష. తొలినాళ్లలో దూరంగా ఉన్నవారికి సమాచారం అందించడానికి దూతను పంపేవారు. తరువాత ఉత్తరం వచ్చింది. ఫోన్ దూరాన్ని చేరిపేసింది. అదనంగా మెయిల్, వాట్సాప్, ఇలా మెసేజ్ చేసే సాధనాలు చాలా వచ్చాయి. నేరుగా మాట్లాడడానికి వీడియో కాల్స్ అందుబాటులో వున్నాయి. ఎన్ని సాధనాలు వచ్చినా భాష మారలేదు. అలానే వుంది. అప్పుడు, ఇప్పుడు ఇద్దర్ని కలిపేది మాటే. సాధనాలు మారాయి. అంతే కానీ ప్రేరణ అలానే నిలిచివుంది. కృత్రిమ మేధా ఇప్పుడు నేర్చుకోవడం, పని పద్ధతులను తిరిగి రాస్తోంది. ఇది గణిత సమీకరణాలను పరిష్కరిస్తోంది. వ్యాసాలు రచిస్తోంది, సంగీత బాణీలు కడుతోంది. ఇలా ఎన్నో చేస్తున్నది. ఈ మేధా ట్యూటరుగా, అనువాదకునిగా, ఆశ్చర్యకరంగా ఒక సహచరునిగాను వ్యాహరిస్తున్నది. తర్కం, స్థిర వ్యస్థలపై నిర్మితమైన లెక్కలు, ఇంజనీరింగ్ తదితర శాస్త్ర విషయాలు ఇప్పటికే రూపాంతరం చెందాయి. సంక్లిష్ట సైన్స్ సూత్రాల వివరాలు ఇప్పుడు ఎఐ ద్వారా తక్షణమే ఎవరైనా పొందవచ్చు. భాష వేరే కోవకు చెందింది. దీనికి నియమాలు ఉంటాయి.అంతేకాకుండా ఒక భాష ఆ జాతి సంస్కృతి, భావోద్వేగాల జీవన శ్వాస. ఎఐ వ్యాకరణాన్ని, పదజాలాన్ని వివరించగలదు. కానీ హాస్యం,వ్యంగ్యం, ప్రేమలు పట్టుకోలేదు. యంత్రం సాయంతో చేసిన అనువాదంసరిగానే ఉంటుంది. ఐతే దీనిలో హృదయం లోపిస్తుంది. ఎవరైనా ఒకరు 'ఐ మిస్ యు' అంటే, దానిలో భావోద్వేగం ఇమిడి ఉంటుంది. యంత్రం ఆ ఉద్వేగ అనుభూతి చెందదు కదా! టెక్నాలజీ అనువాద క్రియను చాలా సులువు చేసింది. తెలుగు ఉత్తరమో, వ్యాసమో కేవలం క్షణాల్లో తప్పులు లేకుండా ఎఐ మరో భాషలోకి అనువదిస్తుంది. అది కచ్చితంగాఉంటుంది. కానీ పేలావం అనిపిస్తాయి. మనిషి మాటలో వినిపించే పలు స్వరాలు, లయ, మాధుర్యాలు వినిపించవు. అనువాదం అంటే ఒక భాష నుండి మరో భాషలోకి తర్జుమా మాత్రమే కాదు కదా! అనువాదం అంటే విషయంలోకి పరకాయ ప్రవేశం చేసి అందించడం. అందుకే భాష భిన్నమైందని భాషవేత్తలు చెబుతారు. సైన్స్ ఫార్ములా తెలుసుకోవడం ఓ వియుక్త నైపుణ్యం. మాట్లాడటమే భాష. మాటలో, నవ్వులో, స్వరంలో అనేక భావాలూ ఉంటాయి. అలోచన చెప్పడంలో పొరపడి, జాగ్రత్తగా దిద్దుకోంటాం. ఇవి అన్నీ చిన్న చిన్న విషయాలనిపిస్తాయి. తీపి, చేదు అనుభూతులు కలిగిస్తాయి. ఇవన్నీ విశ్వాసం పెంపొందిస్తాయి. ఒకరితో ఒకరిని కలుపుతాయి. ఎందరో గురువులను అందిస్తుంది. ఈ బంధం భాష నేర్చుకోవడంలో మెలుకువలు తెలియజేస్తుంది. ఈ సజీవ శిక్షణ ఏ యాప్, చాట్ బోట్‌లు మనకు అందించగలవు. కృత్రిమ మేధో సాధనాలు పలు రకాలుగా సాయపడతాయి. అవి పలుకుబడి సరిచేస్తాయి.వ్యాకరణం వివరిస్తాయి. ఇంకా వ్యక్తిగతీకరించిన అభ్యాసన్ని అందిస్తాయి.టీచర్లకు బాగా ఉపయోగపడతాయి.లెసన్ ప్లాన్ రాసుకోవచ్చు,విద్యార్థులు నుండి వేగంగా అభిప్రాయాలూ సేకరించవచ్చు. ఎదుటి వ్యక్తి మాటల్లోని భావోద్వేగాన్ని అర్థం చేసుకోనే ప్రయత్నాన్ని యంత్రాలు భర్తీ చేయలేవు. భాషా పటిమ ధారళంగా మాట్లాడడం ద్వారా రాదు. సహానుభూతి ద్వారానే అలవడుతుంది.సజీవ భాషలు నిరంతరం అభివృద్ధి చెందుతూనేఉంటాయి.యాస, మర్యాద పూర్వక సంభషణా స్వరాలు మెల్లగా అనుభవంతో మారుతాయి. యంత్రం వీటిని నమోదు చేయగలదు. కానీ మనిషి కాదు కదా! కనుక అది మన మాటల లాయలోపాల్గొనలేదు. వినడం,అర్థం చేసుకోవడం, తగిన విధంగా ప్రతిస్పందించడం నిరంతర తర్ఫీదు. ఇదే నిజమైన భాష ప్రావీణ్యత సాధనా మార్గం.గత మూడు దశాబ్దాలుగా పట్టణీకరణ జోరక్కెంది. ఆంగ్ల మాధ్యమ కాన్వెంట్ చదువులు బాగా పెరిగాయి. ఉపాధి అవకాశాలు అందిపుచుకోవాలంటే ఇంగ్లీష్ తప్పని సరైంది. నేడు ఏ భాషనైనా ఎఐ పరికరాల సాయంతో అనువదించడం చాలా సులువైంది. కష్టం లేకుండా చేస్తున్నది టెక్నాలజీ. ఇదే పెను ముప్పు కలిగిస్తుంది.భాష నేర్చుకోవలసిన అవసరంలేదనే భావన మనలో నాటుతుంది. అందుకే టెక్నాలజీని నేర్చు, వాడాలని భాషా శాస్త్రవేత్తలు సూచిస్తున్నారు. భాష నేర్వడం అంటే పదవినియోగం అనుకుంటే పొరపాటు. ఈ ప్రపంచాన్ని మరో దృష్టికోణంతో దర్శించడం.భాష నెమ్మదిగా వంటబడుతుంది. ఇలా నేర్చుకోవడంలో భావోద్వేగం, మానవతలు మిళితమైవుంటాయి. ఇదే నిజ భాషా పండిత్య సాధనకు సోపానం. ●

# ప్రజావాక్కు



## నిధుల కొరత

**వాతావరణ** మార్పులుగ్లోబల్ పాలనను పునర్నిర్వచిస్తున్న ఈ దశలో, కాప్30లో భారత్ ప్రకటించిన వైఖరి ఒక ప్రతిస్పందన మాత్రమేకాదు, అది వాతావరణ న్యాయం, సమానత్వం,చారిత్రకబాధ్యతలపైఆధారపడిన ఒక సుస్థిర దృక్కోణం.ప్యారిస్ఒప్పందానికి పునాదిఅయిన సాధారణ కానీ విభిన్న బాధ్యతలు సూత్రం,సర్వదేశాలకు ఒకే రకం బాధ్యతలనుపెట్టడం అసంబద్ధమని స్పష్టంగా చెబుతుంది. పారిశ్రామికీకరణ ద్వారా శతాబ్దాలుగా అధిక ఉద్గారాలు విడుదల చేసిన అభివృద్ధి చెందిన దేశాలు తమ పాత్రను సక్రమంగా నిర్వర్తించకపోవడం వాతావరణ చర్చల్లో ఏర్పడుతున్న అసమతౌల్యాన్ని బహిర్గతం చేస్తుంది. నిధుల కొరతపరిష్కారం కాకుండా ఉద్గార తగ్గింపులపై ఒత్తిడి చేయడం, అభివృద్ధి చెందుతున్న దేశాలకు అన్యాయం.

- సి.హెచ్.ప్రతాప్, శ్రీకాకుళం

## నిబంధనలను పాటించాలి

**వైద్యుల** ప్రెస్క్రిప్షన్ చీటీ లేకుండా మందులు కొనడం, అమ్మడం రెండూ నేరమే కానీ, తెలంగాణలో అన్ని జిల్లాల్లో మెడికల్ షాప్స్ ఈ నిబంధనలను యధేచ్ఛగా ఉల్లంఘిస్తున్నాయి. ధనార్జనే ధ్యేయంగా ప్రజల ఆరోగ్యంతో చెలగాటమాడుతున్నాయి. వైద్యుడి ప్రిస్క్రిప్షన్ లేకుండానే మందులు అమ్మిసొమ్ము చేసుకొంటున్నారు.ఒక్కొక్క మందులషాప్‌లో ఫార్మాసిస్ట్‌లేడు.పర్యవేక్షణలేదు నిబంధనల ప్రకారం ప్రతిమందుల దుకాణంలోఅర్హత పొందిన ఫార్మాసిస్ట్ తప్పనిసరిగా ఉండాలి. యాంటీబయాటిక్ మందుల అమ్మకాలకు సంబంధించిన హెచ్1రిజిస్టర్‌ను చాలా దుకాణాలు నిర్వహించడం లేదు.

- పొద్దుటూరి జగదీశ్వర్, కరీంనగర్ జిల్లా

## పేదరికాన్ని నిర్మూలించాలి

**కేరళ** ముఖ్యమంత్రి ప్రకటించిన విధంగా దేశంలోని అన్ని రాష్ట్రాల ముఖ్యమంత్రులు దుర్భర పేదరికం నిర్మూలన చేసాం అని ప్రకటిస్తే ఎంత బాగుంటుంది. కేరళ మోడల్ లో చేసిందేమిటి కనీస అవసరాల గుర్తింపు చేసి స్థానిక సంస్థల్నుబలంగ్నాపనిచేయడమేకదూ.అయితే తెలంగాణ వంటి రాష్ట్రాలు కేరళ మోడల్‌ను అవలంభించడంతోపాటు గ్రామీణ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయాలి. పేదరిక నిర్మూలన చర్యలు చేపట్టడానికి కావాల్సిన ప్రణాళికలు సెస్ సంస్థ ద్వారా వేయించాలి.

- భారత అవినాష్, జనగామ

## సమాజానికి కొత్త సవాలు

**ఈరోజుల్లో** సోషల్ మీడియా మన జీవితాల్లో భాగమైపోయింది. సమాచారం పంచుకోవడం, వ్యక్తిగత అభిరుచులను వ్యక్తపరచడం, ప్రపంచంతో మమేకం కావడం వంటి అనేక ప్రయోజనాలనుఇది అందిస్తోంది.అయితే అదేసమయంలో దీని దుర్వినియోగం సమాజానికి తీవ్రమైన ప్రమాదాలను కూడా సృష్టిస్తోంది.ముఖ్యంగా వదంతులు,అబద్ధపు వార్తలు వేగంగా వ్యాప్తి చెందడానికి సోషల్ మీడియా వేదిక అవుతోంది. నిజా నిజాలు తెలియకుండానే ప్రజలు షేర్‌చేయడం వల్ల చిన్న సంఘటనలు కూడా పెద్ద వివాదాలుగా మారుతున్నాయి. కొన్నిసార్లు హింసాత్మక ఘటనలకు కూడా ఇది కారణమవుతోంది. వ్యక్తిగత జీవితాన్ని ఇంటర్నెట్‌లో అనవసరంగా ప్రదర్శించడం వల్ల గోప్యత కోల్పోవడం, మోసపూరిత చర్యలకు బలికావడం వంటి సమస్యలుపెరుగుతున్నాయి.అదేవిధంగా యువతసోషల్ మీడియా ఆకర్షణలో మునిగిబాధ్యతలు విస్మరించేపరిస్థితి ఏర్పడుతోంది.

- తిప్పర్తి శ్రీనివాస్, చొప్పదండి

## మాటల కందని మహావిషాదం

**ఇస్లాం** మత ఆచారం ప్రకారం ముస్లిములకు అయిదు ప్రధాన సూత్రాలుంటాయి. అవి భగవంతుడైన అల్లా మీద నమ్మకం, ప్రార్థన,ఉపవాసం,దానం,జీవితంలోఒకసారయినా వారి పవిత్ర స్థలమైన మక్కా యాత్ర చేయడం.ఇందులో అన్నింటినీ తమకు అందుబాటులో నున్నచోట ఆచరించవచ్చు.కానీ హజ్ యాత్రకు సౌదీ అరేబియాకు వెళ్ళితీరాలి.ఈ నెల17వ తారీఖున అక్కడకు వెళ్ళినవారు మక్కా నుండి మదీనా బస్సులో వెడుతుండగా రాత్రి వేళ అందరూ గాఢ నిద్రలో ఉన్న సమయంలో డీజిల్ ట్యాంకర్‌ను ఢీకొనడంతో మంటలు ఉవ్వెత్తున ఎగిసి పడడంతో అందులో ప్రయాణిస్తున్న 45 మంది సజీవ దహనం అవడం ప్రజలందరి హృదయాలను కలచివేసింది.

- డా. ఎస్.ఎస్.ఆర్. మూర్తి, సికింద్రాబాద్

## తెలంగాణలో తార స్థాయికి అవినీతి


**తెలంగాణ** రాష్ట్రంలో అవినీతి తారాస్థాయికి చేరింది. ప్రతిరోజు ఏదోఒకప్రాంతంలో ప్రభుత్వఉద్యోగులు అవినీతికి పాల్పడుతూ ఏసీబీకి చిక్కడం చర్చనీయాంశంగా మారుతుంది. తాజాగా మెదక్ జిల్లా టెక్మాల్ సబ్ ఇన్స్పెక్టర్ ఎసిబికి చిక్కడం అందర్నీ షాక్ గురిచేసింది.లంచం లేనిదే కార్యాలయాల్లో ఫైలు కదలైన పరిస్థితి ఉంది. ఏసీబీ అధికారులు ఎన్ని దాడులు చేసిన లంచగొండి అధికారుల ప్రవర్తనలో మార్పడం రావడం లేదు.

- కామిడి సతీష్ రెడ్డి, భూపాలపల్లి జిల్లా

# పల్లెల ప్రగతియే దేశాభివృద్ధికి సూచిక

డా.పోలం సైదులు

గ్రామంలో ప్రజాస్వామ్యం వికసించి, అది స్వయం సమృద్ధి సాధించినప్పుడే జాతి అభివృద్ధి చెందుతుందన్నారు మహాత్మ గాంధీ. అందుకే గ్రామాలలో ప్రజల భాగస్వామ్యంతో స్వయం పాలన గావించడానికి పంచాయితీరాజ్ వ్యవస్థను ఏర్పాటు చేశారు.ఎప్పుడైతే గ్రామాలు అభివృద్ధి చెందుతాయో అప్పుడే రాష్ట్రం, దేశం అభివృద్ధి దిశగా పయనిస్తాయి. గ్రామాభివృద్ధి అనేది కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాల పరస్పర సహాయ సహకారాలతో ముడిపడి గ్రామపాలన గావించే గ్రామ ప్రథమపౌరుడు (సర్పంచ్)పై ఆధారపడి ఉంటుంది. బీసీల 42శాతం రిజర్వేషన్స్ కారణంగా న్యాయపరమైన చిక్కులు తలెత్తడంతో కాస్తా ఆలస్యమైన ఎన్నో అవాంతరాలను అధిగమించి ఎట్టకేలకు ప్రభుత్వం నవంబర్ 17న జరిగిన కేబినెట్ సమావేశంలో భాగంగా కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి రెండేళ్ల గడుస్తున్న నేపథ్యంలో డిసెంబర్ 1నుండి 9 వరకు ప్రజాపాలన విజయోత్సవాలు నిర్వహించి, డిసెంబర్ రెండవ వారంలో స్థానిక సంస్థల ఎన్నికల నోటిఫికేషన్ వేసి స్థానికసంస్థల ఎన్నికలు నిర్వహించాలని నిర్ణయించడం జరిగింది. గ్రామాలలో విభిన్న రాజకీయపార్టీలకు చెందిన నాయకత్వం రిజర్వేషన్ పరంగా అభ్యర్థులను ఖరారుచేసి ఇప్పటికే ఎవరికి వారు అంతర్గత ప్రచార కార్యకలాపాలలో నిమగ్నమై ఉండటం గమనించవచ్చు. ఈ ఎన్నికలలో ఎన్నో వింతలను అంటే ఒకే కుటుంబానికి చెందిన ఇరువురి వ్యక్తులను అన్నా తమ్ముడు,అన్న చెల్లి, తల్లి కొడుకు, అత్త కోడలు బరిలో నిల్చోవడం లాంటి సంఘటనలను చూడవచ్చు. అలాగే ఈ ఎన్నికలలో ఒకవైపు అధికారపార్టీ తమ స్థానాన్ని సుస్థిరం చేసుకోవడానికి, మరొకవైపు ప్రతిపక్షపార్టీ బలోపేతం కావడానికి ప్రయత్నంలో భాగంగా డబ్బుఏరులై పారనుంది. ఓటర్లను ఆకర్షించడానికి చేయని ప్రయత్నం అంటూ ఉండదు. ఎన్నో నెరవేరలేని హామీలుస్తూ, బ్రతిమిలాడుతూ, భయపెడుతూ, బహుమతులనిస్తూ ప్రచారం చేస్తుంటారు. వాస్తవానికి గ్రామాలలో ఎన్నికయ్యే సర్పంచ్ పైననే గ్రామాభివృద్ధి ఆధారపడి ఉంటుంది. గ్రామ ప్రథమ పౌరుడంటే ఇంటికి పెద్దదిక్కువలే గ్రామానికి పెద్ద. గ్రామ ప్రజలను తమ కుటుంబ సభ్యులుగా భావించి నిరంతరం వారి క్షేమం, సంక్షేమం, అభివృద్ధికి పాటుపడుతుండాలి.అంతేగానీ ఏదో హోదాకోసమో ఆర్థికపరమైన వ్యాపారంగా భావించి లక్షలలో ఖర్చుపెట్టి వడ్డీతో సహా సంపాదించుకోవాలనో ఎన్నికలలో పోటీచేయవద్దు. గ్రామప్రజలు సైతం పార్టీలు, కులాలు, మతాలకతీతంగా డబ్బుకు ఎలాంటి ప్రాధాన్యత నివ్వకుండా, సేవాదృక్పథం కలిగి గ్రామాభివృద్ధికి పాటుపడే నాయకున్ని ఎన్నుకోవాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉన్నది. ఏదిఏమైనప్పటికి ఫిబ్రవరి మాసం నుండి యావత్తు తెలంగాణ రాష్ట్రమంతట నూతనంగా సర్పంచులు, ఉప సర్పంచులు, వార్డుమెంబర్లు నియామకం కాబోతున్నారు.కావున వారి విధుల నిర్వహణ,అభివృద్ధిపై సరైన అవగాహన ఏర్పర్చుకొని, గతంలోచరిత్ర సృష్టించిన కొన్ని విషయాలను



పరిశీలిస్తూ అవగతం చేసుకుంటూ, ఉదాహరణకు రంగారెడ్డి జిల్లా హాజిపల్లి గ్రామపంచాయతీకి గ్రామ ప్రథమపౌరురాలిగా ఎన్నికై గ్రామంలోని వీధులన్నీ సిమెంట్ రోడ్లతో నిర్మించి, ప్రతివీధికి భూఅంతర్భాగం ద్వారా మురికి కాలువలను నిర్మించి,ప్రతి ఇంటికి మరుగుదొడ్లు కట్టించి,పిల్లలకు పాఠశాలలను,అంగన్వాడీ కేంద్రాలను,గ్రామపంచాయితీ భవనాన్ని, గ్రంథాలయాన్నీ నిర్మించి 2008లో అప్పటి దేశ ప్రథమ పౌరురాలు (రాష్ట్రపతి) శ్రీమతి ప్రతిభా పాటిల్ గారి చేతుల మీదుగా నిర్మల గ్రామ పురస్కారాన్నీ అందుకున్నారు.అదే సంవత్సరం నవంబర్ మాసంలో రాష్ట్రప్రభుత్వం నుండి 'శుభ్రం' అవార్డు పొందడం అనేది మిగతా గ్రామ ప్రథమ పౌరులకు ఆదర్శం.అలాగే ఉమ్మడి వరంగల్ జిల్లాలోని గంగదేవిపల్లి, కరీంనగర్ జిల్లాలోని రామ చంద్రపురం, నిజామాబాద్ జిల్లాలోని అంకాపూర్ గ్రామం, మహారాష్ట్రలోని అహ్మదనగర్ జిల్లాలోని హైవేర్ బజార్‌లో కొన్ని అభివృద్ధి కార్యక్రమాలు పరిశీలిస్తే గ్రామ సభలను విజయవంతంగా జరిపి,పలు సమస్యలకు పరిష్కార మార్గాలను చూపుతూ, ఆ సభలలో గ్రామంలోని ప్రతి ఒక్కరిని హాజరయ్యేటట్లు చేసి,గ్రామాభివృద్ధికి కృషిచేశారు. గంగాదేవిపల్లిలో 18రకాల వివిధ కమిటీలను గ్రామసభ ద్వారా శుద్ధమైన త్రాగునీరు కమిటీ,పారిశుద్ధ కమిటీ, ఆరోగ్యా కమిటీ, సమాచార కమిటీలు మొదలగు వాటిని ఏర్పాటు చేసి ఎవ్వరికి ఏ విషయంలో సమస్య వచ్చినా, తగిన కమిటీలను సంప్రదించి సులభంగా పరిష్కరించుకునే విధంగా యంత్రాంగాన్నీ ఏర్పాటుచేసి అభివృద్ధికి దోహదపడటం జరిగింది. పాఠశాలకు వెళ్ళే వయసు వచ్చిన బాలబాలికలను పాఠశాలలలో చేర్పించేటట్లు యంత్రాంగాన్ని తయారుచేసి గ్రామంలో 100 శాతం అక్షరాస్యత సాధించేందుకు కృషిచేస్తూ విజయవంతంకావడం. ప్రతిఇంటికి పరిశుభ్రమైన త్రాగునీరు అందేటట్లు చూడటం. జనాభా నియంత్రణలో భాగంగా దంపతులను ఒక్కరు లేదా ఇద్దరు పిల్లలతోచాలని ప్రోత్సహిస్తూ ఫ్యామిలీ ప్లానింగ్ ఆపరేషన్స్ చేయించడం. గ్రామంలోని ప్రతి పసిపిల్లలకు ప్రభుత్వం తరుపున అందించే పోలియో చుక్కలు, టీకాలు, వివిధ వ్యాక్సిన్లు సకాలంలో అందరికి అందేటట్లు చూడటం. గ్రామంలోని ప్రతి కుటుంబానికి బ్యాంకులో ఖాతా తెరిచి నగదు నమోదు చేసుకోవడానికి ప్రోత్సహించడం.గ్రామంలో పారిశుద్ధానికి అధిక ప్రాముఖ్యత నిస్తూ,ఎవ్వరికి ఎలాంటి అంటూ రోగాలు రాకుండా జాగ్రత్త పడటం. గ్రామంలో అందరి సమేతంగా మధ్యపానాన్ని నిషేధించి అభివృద్ధిలో పరుగులు తీసేవిధంగా తీర్చిదిద్దడంఅనేది యావత్తు రాష్ట్రానికి ఆదర్శప్రాయంగా నిలిచింది. ఇలాంటి కార్యక్రమాల గురించి సర్పంచ్ బరిలో ఉన్నటువంటి అభ్యర్థులు తెలుసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉన్నది. మరీ ముఖ్యంగా గ్రామాలలో జరిగే ఈ పంచాయితీ ఎన్నికలలో స్నేహపూరిత పోటీని కలిగివుండాలే తప్పా, ఒకరిపై ఒకరు వ్యక్తిగతంగా ఛాలెంజ్‌గా తీసుకోని అధిక ధనాన్ని ఖర్చుచేసి, మద్యాన్ని ఏరులై పారిస్తూ,తను నష్టపోయి, ఇతరులను ఇబ్బందులపాలు చేయకుండా చూసుకోవాల్సిన భాద్యత వారిపైనే ఉన్నది. గ్రామంలోని ప్రజలంతా కలిసికట్టుగా వుండి అభివృద్ధిని కాంక్షిస్తూ, వీలైతే ఎలాంటి ఎన్నికలు లేకుండా నిస్వార్థపరుడిని, గ్రామ క్షేమం, సంక్షేమం, అభివృద్ధిని కాంక్షించే వ్యక్తులను ఎన్నుకోవడం ఎంతో మంచి పరిణామం. ఎలాంటి కక్షలు, కుట్రలు లేకుండా, ఎన్నికల అధికారులతో సహకరిస్తూ,పంచాయితీ ఎలక్షన్‌లలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చూసుకోవాల్సిన బాధ్యత ప్రతి పౌరుడిపై వున్నది. ప్రశాంత వాతావరణంలో, మరెంతో ప్రశాంతంగా ఎన్నికలలో పాల్గొంటూ ఒక మంచి వ్యక్తిని గ్రామ ప్రథమ పౌరుడిగా ఎన్నుకొని గ్రామాభివృద్ధికి దోహదపడాలని ఆశిద్దాం. ●

మనవి

ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

20-11Pg5- final.qxd:20-11Pg5- final.qxd 1/1/02 7:34 AM Page 1





బుధవారం ఇందిరాగాంధీ జయంతి సందర్భంగా ప్రయాగ్‌రాజ్‌లోని కాంగ్రెస్ అభిమానులు నివాళులర్పిస్తున్న దృశ్యం

# బీహార్‌లో నేటి నుంచి కొత్త సర్కార్

- ఎన్‌డిఎ శాసనసభా పక్ష నేతగా నితీశ్ ఎన్నిక - పదోసారి సిఎం కానున్న జెడియు అధినేత - డిప్యూటి సిఎంలుగా సామ్రాజ్ చౌదరి, విజయ్ సిన్హా - ప్రమాణస్వీకారోత్సవానికి హాజరుకానున్న ప్రధాని మోడీ, కేంద్ర మంత్రులు, ఎన్‌డిఏ పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులు - డిప్యూటీ సిఎం పదవి కావాలని ఎల్‌జెపి పట్టు



**పాట్నా, నవంబరు 19:** బీహార్‌లో గురువారం కొత్త ప్రభుత్వం కొలువుదీరనుంది. ముఖ్యమంత్రిగా నితీశ్ కుమార్‌ను ఎన్‌డిఏ అధికారికంగా ప్రకటించిన విషయం తెలిసిందే. తాజాగా బుధవారం ఎన్‌డిఏ ఎమ్మెల్యేల సమావేశంలోనూ శాసనసభా పక్ష నేతగా నితీశ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం గవర్నర్ అరిఫ్ అహ్మద్ మొహమ్మద్ ఖాన్ వద్దకు వెళ్లిన నితీశ్ కుమార్ ముఖ్యమంత్రి పదవికి రాజీనామా సమర్పించారు. గవర్నర్ దానిని ఆమోదించారు. తరువాత నితీశ్ కుమార్, ఎన్‌డిఏ నేతలు నూతన ప్రభుత్వ ఏర్పాటుకు ఆహ్వానించాలని గవర్నర్‌ను కోరారు. ఈ నేపథ్యంలో గురువారం పాట్నాలోని చారిత్రిక గాంధీ మైదానంలో సిఎంగా నితీశ్ ప్రమాణస్వీకారం చేయనున్నారు. నితీశ్ కుమార్ ముఖ్యమంత్రి ప్రమాణ స్వీకారం చేయడం ఇది 10వసారి. సిఎంతోపాటు డిప్యూటీ సిఎంలుగా సామ్రాట్ చౌదరి, విజయ సిన్హాలు ప్రమాణ స్వీకారం చేయనున్నట్లు ఎన్‌డిఏ వర్గాలు వెల్లడించాయి. మంత్రులు ఎంతమంది ప్రమాణ స్వీకారం చేయబోతున్నారనేది మాత్రం బహిర్గతం కావడం లేదు. అంతకుముందు జెడియు ఎమ్మెల్యేలు తమ శాసనసభపక్ష నేతగా నితీశ్ కుమార్‌ను ఎన్నుకున్నారు. సచివాలయంలోని సంవాద్‌లో నిర్వహించిన ఈ కార్యక్రమంలో నితీశ్ కుమార్‌ను శాశనసభ పక్ష నేతగా విజయ్ చౌదరి, ఉమేష్ కుష్వాహ్ ప్రతిపాదించగా, పార్టీ నేతలు మద్దతు తెలిపారు. మరోవైపు బిజెపి శాసనసభా పక్షనేతగా తారాపుర్ ఎమ్మెల్యే సామ్రాట్ చౌదరిని ఎన్నుకున్నారు. ఉప నేతగా విజయ సిన్హాను ఎన్నుకున్నారు. బిజెపి కేంద్ర పరిశీలకుడిగా హాజరైన ఉత్తర్‌ప్రదేశ్ ఉపముఖ్యమంత్రి కేశవ్ ప్రసాద్ మౌర్య ఈ విషయాన్ని ప్రకటించారు. కాగా రేపు పట్నాలోని గాంధీ మైదానంలో సీఎం, మంత్రుల ప్రమాణ స్వీకారం జరగనుంది. అంతకుముందు స్పీకర్ పదవితో సహా కీలక మంత్రి పదవుల కేటాయింపుపై చర్చలు జరగనున్నట్లు తెలుస్తోంది. స్పీకర్ పదవి కోసం బిజెపి, జెడియు గట్టిగా పట్టుబట్టినట్లు అధికార వర్గాలు తెలిపాయి. గత అసెంబ్లీలో బిజెపికి చెందిన నంద్‌కిశోర్ యాదవ్ స్పీకర్‌గా ఉన్నారు. జెడియు పార్టీకి చెందిన నరేంద్ర నారాయణ్ యాదవ్ డిప్యూటీ స్పీకర్‌గా వ్యవహరించారు. అయితే ఈసారి కూడా స్పీకర్ పదవిని దక్కించుకోవాలని బిజెపి యోచిస్తున్నట్లు తెలుస్తోంది. అయితే, మంత్రివర్గ కూర్పుపై భాగస్వామ్య పక్షాల మధ్య ఓ నిర్ణయానికి వచ్చినట్లు తెలుస్తోంది. ప్రతి ఆరుగురు ఎమ్మెల్యేలకు ఒక మంత్రి పదవి ఫార్ములాకు ఎన్‌డిఏలోని పార్టీలు సూత్రప్రాయంగా అంగీకరించినట్లు తెలుస్తోంది. ఈ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ 89, జెడియు 85 భారీగా సీట్లు రావడంతో ప్రతి ఆరుగురు ఎమ్మెల్యేలకు ఓ మంత్రి పదవి కేటాయించాలనే నిర్ణయానికి వచ్చినట్లు సమాచారం. ఈ ఫార్ములా ప్రకారం బిజెపికి 15 లేదా 16, జెడియుకు 14, ఎల్ జేపీ (రామ్‌విలాస్) పార్టీకి 3, ఆర్ఎల్ఎం, హెచ్ఏఎంలకు ఒక్కోటి చొప్పున మంత్రి పదవులు లభించే అవకాశం ఉంది. ఎన్‌డిఏ భాగస్వామ్య పక్షం ఎల్‌జెపి ఉప ముఖ్యమంత్రి పదవి కావాలని పట్టుబడుతున్నట్లు తెలుస్తోంది. కూటమిలోని పార్టీలందరికీ కేబినెట్‌లో చోటు కల్పిస్తున్నప్పటికీ డిప్యూటీ సిఎం కావాలని బిజెపి పెద్దల ముందు ఎల్‌జెపి అధినేత, కేంద్ర మంత్రి చిరాగ్ పాశ్వాన్ ప్రతిపాదన పెట్టినట్లు సమాచారం. అయితే, దీనిపై బిజెపి నుంచి ఎలాంటి సానుకూల స్పందన రాలేదని పార్టీ వర్గాలు తెలిపాయి.

# నా తల్లిని బంగ్లాకు అప్పగిస్తే మిలిటెంట్లు చంపేస్తారు!

## హసీనా కుమారుడు సాజీబ్‌వాజెద్ ఆందోళన



**న్యూఢిల్లీ, నవంబరు 19:** బంగ్లాదేశ్ మాజీ ప్రధాని షేక్ హసీనా కుమారుడు సాజీబ్ వాజెద్ జోయ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. తన తల్లిని బంగ్లాదేశ్‌కు అప్పగిస్తే అక్కడి మిలిటెంట్లు ఆమెను చంపేస్తారని తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ప్రస్తుతం భారత్‌లో ఆశ్రయం పొందుతున్న తన తల్లికి భద్రత కల్పించినందుకు ప్రధాని నరేంద్ర మోదీకి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. సరిహద్దుల్లో ఉగ్రవాదం పెరిగిపోతోందని, ఈ విషయంలో అప్రమత్తంగా ఉండాలని భారత్‌ను హెచ్చరించారు. మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో సాజీబ్ మాట్లాడుతూ తన తల్లిని అప్పగించాలన్న బంగ్లాదేశ్ ప్రభుత్వ అభ్యర్థనను తీవ్రంగా వ్యతిరేకించారు. ప్రస్తుత బంగ్లా ప్రభుత్వం న్యాయ ప్రక్రియను అపహాస్యం చేస్తోందని ఆరోపించారు. తన తల్లిపై తప్పుడు కేసులు బనాయించారని, 17 మంది న్యాయమూర్తులను తొలగించి, పార్లమెంట్ ఆమోదం లేకుండానే చట్టాలను సవరించి విచారణ జరుపుతున్నారని విమర్శించారు. కనీసం డిఫెన్స్ లాయర్లను కూడా కోర్టులోకి అనుమతించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. భారత్ మా అమ్మ ప్రాణాలను కాపాడింది. ఆమె బంగ్లాదేశ్ విడిచిపెట్టకపోయి ఉంటే, మిలిటెంట్లు ఆమెను చంపేసేవారని సాజీబ్ అన్నారు. ప్రస్తుత యూనస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక, హసీనా హయాంలో అరెస్టయిన వేలాది మంది ఉగ్రవాదులను విడుదల చేసిందని ఆరోపించారు. ప్రస్తుతం లష్కరే తోయిబా వంటి ఉగ్రవాద సంస్థలు బంగ్లాదేశ్‌లో స్వేచ్ఛగా కార్యకలాపాలు సాగిస్తున్నాయని తెలిపారు. బంగ్లా ఉగ్రవాదంపై ప్రధాని మోదీ కూడా తీవ్ర ఆందోళనతో ఉన్నారని తాను భావిస్తున్నట్లు చెప్పారు. తన తల్లిని అప్పగించాలని బంగ్లా ప్రభుత్వం చేసిన అభ్యర్థనను భారత్ తిరస్కరిస్తుందన్న నమ్మకం ఉందని ఆయన పేర్కొన్నారు.




# ఉచితంగా ఎఐ కోర్స్

## కేంద్రం కీలక నిర్ణయం

**న్యూఢిల్లీ, నవంబర్ 19:** కృత్రిమ మేధకు ఆదరణ పెరుగుతున్న నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. విద్యార్థులు, ఉద్యోగులకు దీనిపై అవగాహన కల్పించడమే లక్ష్యంగా ఒక కోర్సు ను రూపొందించింది. 'యువ ఎఐ ఫర్ ఆల్' పేరిట దీన్ని అందిస్తుండడం విశేషం. ముఖ్యంగా యువతను దృష్టిలో ఉంచుకుని దీన్ని రూపొందించారు. ఈ కోర్సు వ్యవధి 4.5 గంటలు. దీన్ని పూర్తి చేసిన వారికి ఎఐపై ప్రాథమిక అవగాహన ఏర్పడుతుంది. కోర్సు లు చాలా సరళంగా, నిజ జీవితంలో ఉపయోగించే ఉదాహరణలతో రూపొందించారు. ఇది ఫ్యూచర్‌స్కిల్స్ ప్రైమ్, ఐజిఓటి కర్మయోగి సహా మిగిలిన ప్రముఖ ఎడ్‌టెక్ పోర్టళ్లలో అందుబాటులో ఉంది. దీని పూర్తిచేసిన వారికి భారత ప్రభుత్వం తరఫున సర్టిఫికెట్ కూడా లభిస్తుంది. ఈ కోర్సు లో మొత్తం ఆరు మాడ్యూల్స్ ఉంటాయి. ఎఐ అంటే ఏమిటి? ఎలా పనిచేస్తుంది? విద్య, సృజనాత్మకత, ఉద్యోగాలను ఎఐ ఎలా మారుస్తోంది? ఎఐ టూల్స్ ను భద్రంగా, బాధ్యతాయుతంగా ఎలా ఉపయోగించుకోవాలి? నిజజీవితంలో ఎఐ వాడే విధానం, ఎఐ భవిష్యత్తు.. రాబోయే అవకాశాలు. రిజిస్టర్ చేసుకునే విధానం : అధికారిక వెబ్‌సైట్‌లోకి వెళ్లాలి. హోమ్ పేజ్ కుడివైపు 'ఎన్‌రోల్'పై క్లిక్ చేయాలి. గూగుల్ లేదా లింక్డిన్ ఖాతా ద్వారా అకౌంట్ క్రియేట్ చేసుకోవాలి. పేరు, పుట్టినతేదీ, జెండర్ వంటి వివరాలు ఎంటర్ చేయాలి. మొబైల్ నెంబర్ ఎంటర్ చేయాలి. ఒటిపితో ధ్రువీకరించాలి. అపార్ ఐడి ఇవ్వాలి. చెక్‌బాక్స్‌లో టిక్ చేసి సబ్మిట్ చేయాలి.

# సౌదీ ప్రిన్స్ క్షమాపణ చెప్పాల్సిందే: ఖషోగ్గీ భార్య



**వాషింగ్టన్, నవంబరు 19:** సౌదీ క్రౌన్ ప్రిన్స్ మహమ్మద్ బిన్ సల్మాన్ అమెరికాలో పర్యటిస్తున్నారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తో సమావేశమై పలు కీలక ఒప్పందాలు కుదుర్చుకున్నారు. ఈ క్రమంలో సౌదీ క్రౌన్ ప్రిన్స్ అమెరికా పర్యటనపై జర్నలిస్ట్ జమాల్ ఖషోగ్గి భార్య హనన్ ఎలాత్ర ఖషోగ్గి తీవ్రంగా మండిపడ్డారు. తనను వ్యక్తిగతంగా కలుసుకుని క్షమాపణ చెప్పాలని మహమ్మద్ బిన్ సల్మాన్ ను డిమాండ్ చేశారు. భర్త మరణంతో తాను కోల్పోయిన జీవితానికి పరిహారం ఇవ్వాలన్నారు. ఇందుకు సహకరించాలంటూ అమెరికా అధ్యక్షుడు ట్రంప్ కు ఆమె విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు హనన్ ఎలాత్ర ఖషోగ్గి ఎక్స్ లో ఓ పోస్టు పెట్టారు. 2018 లో ఇస్తాంబుల్ లోని దౌత్య కార్యాలయం వద్ద జర్నలిస్ట్ జమాల్ ఖషోగ్గి హత్యకు గురయ్యారు. ఈ హత్యకు సౌదీ ఏజెంట్లే కారణమని, సౌదీ క్రౌన్ ప్రిన్స్ మహమ్మద్ బిన్ సల్మాన్ ఆదేశాల మేరకే వారు ఈ ఆపరేషన్ నిర్వహించారని ఆరోపణలు వినిపించాయి.

# ఎన్నికల సంఘంపై ఆరోపణలు రాజ్యాంగ వ్యవస్థలపై దాడి

- రాహుల్‌గాంధీకి 272 మంది ప్రముఖుల లేఖ
- సంతకం చేసిన వారిలో రిటైర్డ్ జడ్జిలు, మాజీ సైనికాధికారులు, రాయబారులు




**న్యూఢిల్లీ, నవంబరు 19:** కేంద్ర ఎన్నికల సంఘంపై ఆరోపణలు చేయడమంటే రాజ్యాంగ వ్యవస్థలపై దాడి చేసినట్లేనని కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీకి 272 మంది ప్రముఖులు లేఖ రాశారు. ఇసిపై ఆరోపణలు భారత ప్రజాస్వామ్యం, దాని మూల స్తంభాలపై దాడి చేయడమేనని అభిప్రాయ పడ్డారు. ఓట్ల చోరీ జరుగుతోందని కేంద్ర ఎన్నికల సంఘంపై రాహుల్ గాంధీ తీవ్ర ఆరోపణలు చేస్తున్న నేపథ్యంలో ఆయన విధానాలను విమర్శిస్తూ ఈ లేఖ రాయడం రాజకీయంగా ప్రాధాన్యత సంతరించుకుంది. ఈ లేఖపై 16 మంది రిటైర్డ్ జడ్జిలు, 123 మంది మాజీ అధికారులు, 133 మంది మాజీ సైనికాధికారులు, 14 మంది మాజీ రాయబారులు సంతకాలు చేశారు. ప్రజాస్వామ్యం, దాని పునాదులపై దాడి జరుగుతోందని వారు ఆందోళన వ్యక్తం చేశారు. సొంత రాజకీయ ప్రయోజనాల కోసం నిరాధార ఆరోపణలు చేస్తున్నారని ఆ లేఖలో పేర్కొన్నారు. ఆధారాలు లేని ఆరోపణలు చేయడంతో పాటు ప్రభుత్వ ఉద్యోగులను బెదిరిస్తున్నారని వారు ఆరోపించారు. ప్రతిపక్ష నాయకుడు ఎన్నికల కమిషన్‌పై పదేపదే దాడి చేస్తూ, ఓట్ల చోరీకి సంబంధించి తన వద్ద అణుబాంబు లాంటి ఆధారాలు ఉన్నాయని చెబుతూ నమ్మశక్యం కాని, అభ్యంతరకర భాషను ఉపయోగిస్తున్నారన్నారు.

# చిన్న మార్పులతో పాత చట్టాన్నే అమలుచేస్తున్న కేంద్రం!



**ట్రిబ్యునళ్ల సంస్కరణల చట్టంపై సుప్రీం సీరియస్**

**న్యూఢిల్లీ, నవంబరు 19:** ట్రిబ్యునళ్ల సంస్కరణల చట్టం2021 ను సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్లపై సుప్రీంకోర్టు బుధవారం కీలక తీర్పు వెలువరించింది. ఈ చట్టంలో నియామకాలు, సర్వీసు కండీషన్లు, పదవీ కాలాలకు సంబంధించిన కొన్ని నిబంధనలను గతంలో సర్వోన్నత న్యాయస్థానం రద్దు చేసిందని, చిన్నచిన్న మార్పులతో కేంద్రం వాటిని మళ్లీ ప్రవేశపెట్టిందని, ఇది రాజ్యాంగ విరుద్ధమని వ్యాఖ్యానించింది. చట్టంలో కేంద్రం తీసుకొచ్చిన కొత్త నిబంధనలు న్యాయవ్యవస్థ స్వాతంత్ర్యానికి విఘాతం కలిగిస్తున్నాయని, అధికార వికేంద్రీకరణ సూత్రాలను ఉల్లంఘిస్తున్నాయని, అలాంటి వాటిని తిరిగి ప్రవేశపెట్టాల్సిన అవసరం లేదని సీజేఐ జస్టిస్ బీఆర్ గవాయ్ ధర్మాసనం స్పష్టంచేసింది. ఈ చట్టాన్ని తాము సరిచూశామని, గతంలో కోర్టు రద్దు చేసిన నిబంధనలను స్వల్ప మార్పులతో మళ్లీ అమల్లోకి తెచ్చారని పేర్కొంది. ఇది రాజ్యాంగ విరుద్ధమే అవుతుందని స్పష్టంచేసింది. ట్రిబ్యునళ్ల సభ్యుల పదవీకాలాలకు సంబంధించి గతంలో ఇచ్చిన న్యాయపరమైన ఆదేశాలను ఈ సందర్భంగా కోర్టు పునరుద్ధరించింది. ఆదాయపు పన్ను అప్పిలేట్ ట్రిబ్యునల్, కస్టమ్స్, ఎక్సైజ్, సర్వీస్ ట్యాక్స్ అప్పిలేట్ ట్రిబ్యునల్ సభ్యులు 62 ఏళ్ల వచ్చేవరకు పదవిలో కొనసాగవచ్చని తెలిపింది. ఇక ట్రిబ్యునళ్ల ఛైర్ పర్సన్లు/అధ్యక్షుల రిటైర్మెంట్ వయసు 65 ఏళ్ల వరకు ఉంటుందని వెల్లడించింది.

అదే సమయంలో ఈ అంశంపై జాతీయ ట్రిబ్యు నల్స్ కమిషన్ ఏర్పాటు చేయాలని సూచిం చింది. 2021లో తీసుకొచ్చిన ట్రైబ్యునళ్ల సంస్కరణల (హేతుబద్ధీకరణ, సర్వీసు నిబంధనల) చట్టంతో ఫిల్మ్ సర్టిఫికేషన్ అప్పిలేట్ ట్రిబ్యునల్‌తో సహా కొన్ని అప్పిలేట్ ట్రిబ్యునళ్లు రద్దయ్యాయి. వీటితో పాటు పలు ట్రిబ్యునళ్ల జ్యుడీషియల్, ఇతర సభ్యుల నియామక నిబంధనల్లో పలు సవరణలు జరి గాయి. అయితే, ఈ చట్ట నిబంధనలను సవాల్ చేస్తూ సుప్రీంకోర్టులో మద్రాస్ బార్ అసోసియేషన్ సహా పలువురు పిటిషన్లు దాఖలు చేశారు. వీటిపై గతంలో విచారణ జరిపిన న్యాయస్థానం తీర్పును రిజర్వ్ చేసింది. తాజాగా తీర్పు వెలువరించింది.

# గ్రామీ అవార్డుకు దలైలామా నామినేట్



**ధర్మశాల, నవంబరు 19:** నోబెల్ బహుమతి గ్రహీత దలైలామా మొట్టమొదటి సారి గ్రామీ అవార్డుకు నామినేట్ అయ్యారు. ఆధ్యాత్మిక ప్రవచనాలకు చెందిన దలైలామా ఆల్బమ్ ఆ పోటీలో ఉన్నది. 'ద రిఫ్లెక్సన్స్ ఆఫ్ హిజ్ హోలీనెస్ ద దలైలామా' అన్న టైటిల్‌తో ఉన్న ఆల్బమ్ గ్రామీలకు పోటీపడుతున్నది. 90 ఏళ్ల వయసులో దలైలామా ఆ అవార్డుకు నామినేట్ కావడం ఓ మైలురాయిగా భావిస్తున్నారు. బెస్ట్ ఆడియో బుక్, నారేషన్, స్టోరీ టెల్లింగ్ రికార్డింగ్ కేటగిరీల్లో దలైలామా ప్రవచనాల ఆడియో పోటీపడుతున్నది. 2026 ఫిబ్రవరి 1న లాస్ ఏంజిల్స్‌లో 68వ గ్రామీ అవార్డుల ప్రదానోత్సవం జరగనున్నది. కరుణ, ఆత్మ శాంతి, భావోద్వేగాల గురించి దలైలామా చేసిన ప్రసంగాలకు సరోద్ వాయిద్యకారుడు అంజద్ అలీ ఖాన్ బ్యాక్‌గ్రౌండ్ మ్యూజిక్ అందించారు. అంజద్ కుమారుడు అమన్ అలీ బంగాష్, అయ్యన్ అలీ బంగాష్ కూడా మ్యూజిక్ కంపోజ్ చేశారు. దలైలామా ఆల్బమ్ కోసం అంతర్జాతీయ కళాకారులు ఆండ్రా డే, మ్యాగీ రోజర్స్, టోనీ సుకార్, టెడ్ నాష్, దేబీ నోవా, రూఫస్ వెయిన్‌రైట్ పనిచేశారు.

# అల్‌ఫలా గ్రూప్ ఛైర్మన్‌కు 13రోజులు ఇడి కస్టడీ

## చారిటబుల్‌ట్రస్టుకు రూ.415 కోట్లు విరాళాలు!

### మరింత సమగ్ర దర్యాప్తుచేయనున్న ఎన్‌ఐఎ, ఇడిలు

**న్యూఢిల్లీ, నవంబరు 19:** అల్ ఫలాహ్ గ్రూపు ఛైర్మెన్ జావద్ అహ్మద్ సిద్ధికీని సిటీకోర్టు వచ్చేనెల ఒకటవ తేదీవరకూ అంటే 13 రోజులపాటు ఈడీ కస్టడీకి అనుమతించింది. అల్ ఫలాహ్ ఛారిటబుల్ ట్రస్టు మనీల్యాండరింగ్ కేసులో అభియోగాలు ఎదుర్కొంటున్నారు. అడిషనల్ సెషన్స్ జడ్జీ షీతల్ చౌదరీ ప్రధాన్ బుధవారం రాత్రి ఒంటి గంటకు ప్రత్యేక ఆదేశాలు జారీ చేశారు. ఎంపీఎల్ఏ చట్టంలో సెక్షన్ 19 కింద సిద్ధిక్‌ను అరెస్టు చేశారు. ఈడీ రిమాండ్ కోసం అతన్ని రాత్రిపూట కోర్టుకు తీసుకెళ్లారు. అల్ ఫలాహ్ గ్రూపుపై విచారణ చేపట్టిన తర్వాత ఈడీ ఈ చర్యలు తీసుకున్నది. ఢిల్లీ క్రైం బ్రాంచ్ పోలీసులు నమోదు చేసిన ఎఫ్ఐఆర్ ఆధారంగా ఏజెన్సీ చర్యలు మొదలుపెట్టింది. ఫరీదాబాద్‌లోని అల్ ఫలాహ్ కాలేజీ విద్యార్థులను, పేరెంట్స్ ను తప్పుదోవ పట్టించినట్లు గుర్తించారు. నాక్ అక్రెడిటేషన్ ఉన్నట్లు నమ్మించారని ఆరోపించారు. 1956 యూజీసీ చట్టంలోని సెక్షన్ 12(బీ) కింద యూజీసీ అనుమతి ఉన్నట్లు కూడా ఆ యూనివర్సిటీ తప్పుగా చూపించినట్లు ఆరోపణలు ఉన్నాయి. గ్రూపు ఛైర్మన్ జావద్ అహ్మద్ సిద్ధిక్‌కు విరాళాల రూపంలో 415 కోట్లు అందినట్లు ఈడీ పేర్కొన్నది. తన ట్రస్టుకు చెందిన విద్యాసంస్థల్లో చదువుతున్న విద్యార్థుల నుంచి అక్రమ రీతిలో ఆ నిధులను సమీకరించినట్లు ఆరోపణలు ఉన్నాయి. గల్ఫ్‌లో ఫ్యామిలీ సభ్యులు స్థిరపడడం వల్ల అక్కడికి పారిపోయే ఆలోచనలో ఆయన ఉన్నట్లు తెలిసింది. ఫరీదాబాద్‌లో రోజంతా జరిగిన తనిఖీల తర్వాత అల్ ఫలాహ్ వర్సిటీ గ్రూపు ఛైర్మన్ సిద్ధిక్‌ను కస్టడీలోకి తీసుకున్నారు. ఢిల్లీ కారు పేలుడు ఘటన నేపథ్యంలో అల్ ఫలా విశ్వవిద్యాలయం వ్యవహారాలపై అటు దర్యాప్తుసంస్థలు, ఇటు విద్యాశాఖ, నాక్ అధికారులు దృష్టి సారించారు. ఈ క్రమంలో విశ్వవిద్యాలయానికి చెందిన దాదాపు 10 మంది కనిపించకుండా పోయినట్లు వార్తలు ప్రచారంలోకి వచ్చాయి. కనిపించకుండా పోయిన వ్యక్తుల ఫోన్‌లు స్విచ్ఛాఫ్ అని వస్తున్నాయి. ఇందులో ముగ్గురు కశ్మీరీలు ఉన్నారని తెలుస్తోంది. ఫరీదాబాద్ ఉగ్ర నెట్‌వర్క్ కేసులో అరెస్టైన నిందితులకు ఈ విశ్వవిద్యాలయంతో సంబంధం ఉన్నట్లు విచారణలో బయటపడింది. తాజాగా, పదిమంది కనిపించకుండా పోవడం గమనార్హం.

ఢిల్లీలోని పేలుడు ఘటనతో ఫరీదాబాద్ ఉగ్ర మాడ్యూల్‌తో వీరికి సంబంధాలు ఉన్నాయనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఢిల్లీ కారు పేలుడు కేసులో ఈ విశ్వవిద్యాలయానికి చెందిన ముగ్గురు వైద్యులు సహా తొమ్మిది మంది అరెస్టయ్యారు.

ఈనెల 10వ తేదీన జరిగిన ఎర్రకోట కారు పేలుడు ఘటనతో వర్సిటీకి లింకు ఉన్న కారణంగా ఆ కోణంలో దర్యాప్తు ముమ్మరం చేశారు. తప్పుడు అక్రెడిటేషన్, గుర్తింపు చూపిస్తూ విద్యార్థులు, పేరెంట్స్ నుంచి ఆ వర్సిటీ భారీగా వసూళ్లకు పాల్పడినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఆ రూపంలోనే 415 కోట్లు సేకరించినట్లు తెలుస్తున్నది. పరారీ అయ్యే అవకాశం ఉన్న నేపథ్యంలో అతన్ని కస్టడీలోకి తీసుకున్నట్లు ఈడీ పేర్కొన్నది. 1990 నుంచి అల్ ఫలాహ్ వర్సిటీ అంచలంచెలుగా ఎదిగిందని, ఇప్పుడు ఓ పెద్ద విద్యాసంస్థగా మారినట్లు తెలిపింది.

# షెహబాజ్ షరీఫ్ ప్రభుత్వంపై ఖైబర్‌ఫఖ్తూన్‌క్వా సిఎం ధ్వజం



**పెషావర్, నవంబరు 19:** పాకిస్థాన్ ప్రభుత్వంపై ఖైబర్ పఖ్తుంఖ్వా ప్రావిన్స్ ముఖ్యమంత్రి సోహైల్ అఫ్రిది సంచలన ఆరోపణలు చేశారు. తమ ప్రావిన్స్ లో పాకిస్థాన్ ప్రభుత్వమే ఉగ్ర దాడులు చేయిస్తోందని ఆయన ఆరోపించారు. పొరుగున ఉన్న ఆఫ్ఘనిస్థాన్ తో ఖైబర్ పఖ్తుంఖ్వా ప్రావిన్స్ కు సత్సంబంధాలు నెలకొనడంపై ఇస్లామాబాద్ ఆగ్రహంగా ఉందని, దీనిని చెడగొట్టడానికే ఖైబర్ ప్రావిన్స్ లో ఉగ్రవాదాన్ని ప్రోత్సహిస్తోందని ఆయన మండిపడ్డారు. శాంతి ప్రయత్నాలను, చర్చలను అడ్డుకోవడమే దీని వెనకున్న అసలు ఉద్దేశమని ఆయన విమర్శించారు. ఈ మేరకు ఖైబర్ పఖ్తుంఖ్వా సీఎం సోహైల్ అఫ్రిదిని ఉటంకిస్తూ పలు కథనాలువెలువడ్డాయి. సోహైల్ అఫ్రిది కిందటి నెలలోనే ఖైబర్ పఖ్తుంఖ్వా ప్రావిన్స్ ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు. ఆయన పాకిస్థాన్ తెహ్రీక్ ఈ ఇన్సాఫ్ (పీటీఐ) పార్టీకి చెందిన నేత. ఇటీవలి కాలంలో ఖైబర్ ప్రావిన్స్ లో చోటుచేసుకుంటున్న ఉగ్ర దాడులను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ పాక్ ప్రభుత్వమే ఈ దాడులను ప్రోత్సహిస్తోందని ఆరోపించారు. ఇటీవల పష్తూన్ తహాఫుజ్ మూమెంట్ (పీటీఎం) సభ్యులు కిడ్నాప్ కు గురైనట్లు తెలుస్తోంది. దీనిని అఫ్రిది తీవ్రంగా ఖండించారు. ఉగ్రవాదం ఏ రూపంలో ఉన్నా ప్రపంచ దేశాలు సహించకూడదని ఆయన పేర్కొన్నారు. శాంతి ప్రయత్నాలకు భంగం కలిగించేవారిని ఉమ్మడి శత్రువుగా పరిగణిస్తామని సోహైల్ అఫ్రిది హెచ్చరించారు. ఉగ్రవాదంపై యుద్ధం పేరుతో పఖ్తుంఖ్వా ప్రావిన్స్ లో ఉగ్రవాదంపై యుద్ధం పేరుతో సైనిక బలగాలు సామాన్యులను లక్ష్యంగా చేసుకుంటున్నాయని సీఎం అఫ్రిది ఆరోపించారు. ఉగ్రవాదుల ఏరివేత పేరుతో సైనికులు సామాన్యులపై దౌర్జన్యం చేస్తున్నారని, సొంత ప్రజలనే చంపేస్తున్నారని విమర్శించారు.

కాగా, పఖ్తుంఖ్వా ప్రావిన్స్ లోని తిరా లోయలో ఇటీవల పాక్ వైమానిక దాడులు చేసినట్లు వార్తలు వచ్చిన సంగతి తెలిసిందే. ఈ దాడిలో 30 మంది ప్రాణాలు కోల్పోయారని వార్తలు వెలువడ్డాయి. సొంత ప్రజలపైనే పాక్ సైన్యం దాడి చేయడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమయ్యాయి. ఈ ఘటనను ఖైబర్ పఖ్తుంఖ్వా సీఎం సోహైల్ అఫ్రిది గుర్తు చేశారు.

# సంక్షిప్తంగా..

## అన్మోల్ బిష్ణోయ్‌ని అరెస్టు చేసిన ఎన్ఐఎ



**న్యూఢిల్లీ, నవంబరు 19:** కరడు గట్టిన నేరస్థుడు లారెన్స్ బిష్ణోయ్ సోదరుడైన గ్యాంగ్‌స్టర్ అన్మోల్ బిష్ణోయ్‌ను ఎన్ఐఏ అరెస్ట్ చేసింది. అమెరికాలో ఉంటున్న అన్మోల్‌ను అక్కడి అధికారులు భారత్‌కు అప్పగించిన విషయం తెలిసిందే. దీంతో అతడిని నేడు భారత్‌కు తీసుకొచ్చారు. ఢిల్లీలోని ఇందిరా గాంధీ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్‌లో ల్యాండ్‌కాగానే ఎన్ఐఏ అతడిని అరెస్ట్ చేసింది. అరెస్టుకు సంబంధించిన ఫార్మాలిటీస్ అన్నింటినీ అక్కడికక్కడే పూర్తి చేసి అదుపులోకి తీసుకుంది. అతడిని హై సెక్యూరిటీ మధ్య అక్కడి నుంచి తీసుకెళ్లింది. అన్మోల్ బిష్ణోయ్‌ని అలియాస్ భానుగా పిలుస్తారు. అనేక కేసుల్లో అన్మోల్ బిష్ణోయ్ వాంటెడ్ క్రిమినల్‌గా ఉన్నాడు. పంజాబీ సింగర్ సిద్ధూ మోసేవాల్ హత్య కేసులో అన్మోల్ వాంటెడ్ జాబితాలో ఉన్నాడు. అతడిపై మొత్తం 18 కేసులు నమోదు అయ్యాయి.

## సబర్మతి జైలులో ఢిల్లీ పేలుళ్ల ఉగ్రవాదిపై తోటి ఖైదీల దాడి




**అహ్మదాబాద్, నవంబరు 19:** ఆముదం గింజల నుంచి అత్యంత ప్రమాదకర విషం (రైసిన్) తయారు చేసి అమాయకుల ప్రాణాలు తీయాలని చూసిన ఉగ్రవాది అహ్మద్ మొహియుద్దీన్ సయ్యద్ పై జైలులో దాడి జరిగింది. అహ్మద్ ను యాంటీ టెర్రరిస్ట్ స్క్వాడ్ (ఏటీఎస్) పోలీసులు అరెస్ట్ చేసి జైలుకు తరలించిన విషయం విదితమే. ప్రస్తుతం అతడు గుజరాత్ లోని సబర్మతి జైలులో హైసెక్యూరిటీ బ్యారక్ లో ఉన్నాడు. అయితే, ఏం జరిగిందనే విషయంపై పూర్తి సమాచారం లేనప్పటికీ అహ్మద్ పై తోటి ఖైదీలు దాడి చేసి తీవ్రంగా కొట్టారని తెలుస్తోంది. ఈ ఘటనపై దర్యాప్తు జరుపుతున్నామని, ఖైదీలు ఎందుకు దాడి చేశారనే విషయంపై ఆరా తీస్తున్నట్లు జైలు అధికారులు తెలిపారు. ఖైదీలు మూకుమ్మడిగా దాడి చేయడంతో అహ్మద్‌ను కాపాడేందుకు పోలీసులు జోక్యం చేసుకోవాల్సి వచ్చింది.

## బిఎండబ్ల్యు కారు ఢీకొని భారత సంతతి గర్భిణి మృతి




**సిడ్నీ,నవంబరు 19:** ఆస్ట్రేలియాలోని సిడ్నీలో విషాదకర సంఘటన చోటుచేసుకుంది. అదుపుతప్పిన ఓ కారు ఢీ కొట్టడంతో భారత సంతతికి చెందిన 8 నెలల గర్భిణి మరణించింది. భర్తతో కలిసి వాకింగ్ చేస్తున్న సమయంలో కారు ఢీ కొట్టడంతో ఈ ఘోరం జరిగింది. భారత సంతతికి చెందిన సమన్విత ధరేశ్వర్ సిడ్నీలోని ఓ ప్రముఖ సాఫ్ట్ వేర్ కంపెనీలో సిస్టమ్ అనలిస్ట్ గా పనిచేస్తున్నారు. భర్త, మూడేళ్ల బాబుతో పాటు సిడ్నీలో నివాసం ఉంటున్నారు. ప్రస్తుతం ఆమె 8 నెలల గర్భవతి. ఈ క్రమంలోనే కిందటి వారం భర్త, కొడుకుతో కలిసి సమన్విత వాకింగ్ కు వెళ్లారు. ఆ సమయంలో ఓ బీఎండబ్ల్యూ కారు అతివేగంగా దూసుకొచ్చింది. అదుపుతప్పి పార్కింగ్ లాట్ లోని మరో కారును ఢీ కొట్టింది. దీంతో ఆ కారు కదిలి ముందున్న సమన్వితను బలంగా తాకింది. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడ్డ సమన్వితను వెంటనే దగ్గర్లోని ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ ఆమె మరణించింది.


## వైట్‌హౌస్‌లో ట్రంప్ విందు - మస్క్ హాజరు



**వాషింగ్టన్, నవంబరు 19:** ట్రంప్- మస్క్‌ల మధ్య విభేదాలు తలెత్తడంతో దూరంగా ఉంటున్నారు. అయితే, ఈ గొడవల తర్వాత తొలిసారిగా ఎలాన్ మస్క్ వైట్‌హౌస్‌లో అడుగుపెట్టడం రాజకీయ, వ్యాపార వర్గాల్లో ఆసక్తి రేపుతోంది. సౌదీ అరేబియా క్రౌన్ ప్రిన్స్ మహమ్మద్ బిన్ సల్మాన్ అమెరికా పర్యటనకు వచ్చిన వేళ, ఆయన గౌరవార్థం అధ్యక్షుడు ట్రంప్ వైట్‌హౌస్‌లో ప్రత్యేక విందు ఏర్పాటు చేశారు. ట్రంప్ ఆహ్వానం మేరకు ఎలాన్ మస్క్ ఈ విందులో పాల్గొన్నారు. మస్క్‌తో పాటు పోర్చుగల్ ఫుట్‌బాల్ దిగ్గజం క్రిస్టియానో రొనాల్డో, ప్రముఖ చిప్ తయారీ సంస్థ ఎన్విడియా సిఇఓ జెన్సెన్ హువాంగ్ వంటి ప్రపంచ ప్రఖ్యాత వ్యక్తులు కూడా హాజరయ్యారు. ప్రభుత్వ విధానాలపై విభేదించి సలహా మండలి నుంచి వైదొలిగిన మస్క్, ఇప్పుడు మళ్లీమస్క్ విందులో పాల్గొన్నారు.

20-11P□g6exHMNWJQE.qxd:20-11P□g6exHMNWJQE.qxd 1/1/02 7:10 AM Page 1





# చంద్రబాబు 'తిరుగులేని శక్తి'

- ఆనంద్ మహీంద్రా ప్రశంసిస్తూ ట్వీట్
- త్వరలో మిమ్మల్ని ఎపికి ఆహ్వానిస్తా
- ముఖ్యమంత్రి చంద్రబాబు రీట్వీట్

విజయవాడ, నవంబరు 19 ప్రభాతవార్త ప్రతినిధి: మహీంద్రా ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అభివృద్ధి దృక్పథాన్ని, విధానాలను ప్రశంసించిన అంశం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. 30వ సిఐఐ భాగస్వామ్య సదస్సులో చంద్రబాబు రాష్ట్రంలో పెట్టుబడులకు సులభతరమైన వాతావరణం కల్పించేందుకు "ఎస్క్రో సిస్టమ్"ను ప్రవేశపెడతామని ప్రకటించారు. రూ.7.5 లక్షల కోట్ల పెట్టుబడులు లక్ష్యంగా పెట్టుకుని, ప్రతి పెట్టుబడిదారుకు హామీ ఇచ్చిన ఇన్సెంటివ్స్‌ను తక్షణమే చెల్లించేందుకు ఈ వ్యవస్థ ఉపయోగపడుతుందని చెప్పారు. ఈ వీడియోను ఎక్స్‌లో పంచుకున్న మహీంద్రా చంద్రబాబును ప్రశంసించారు. "ఈ మనిషి తిరుగులేని శక్తి.. దశాబ్దాలుగా ఆయన అభివృద్ధి విధానాలకు అకర్షితుడ్ని అవుతున్నారు. కొత్త, ముందుకు తీసుకెళ్లే విధానాలు మాత్రమే కాకుండా, తాను, తన చుట్టూ ఉన్నవారందరి ప్రమాణాలను ఎప్పుడూ పెంచుతూ ఉంటారు" అని ప్రశంసించారు. ఈ పోస్టు వైరల్ అయింది. మహీంద్రా గ్రూప్ చైర్మన్‌గా, భారతదేశీయ పారిశ్రామిక రంగంలో ప్రభావవంతమైన వ్యక్తిగా ఆయన అభిప్రాయాలు ఎప్పుడూ చర్చనీయాంశాలు ఉంటాయి. ఆనంద్ మహీంద్రా ప్రశంసలపై చంద్రబాబు స్పందించారు. భారతదేశం అద్భుతమైన వృద్ధి దశలోకి ప్రవేశిస్తోందని నేను గట్టిగా నమ్ముతున్నాననని.. మన బాధ్యత నిరంతరం నూతన ఆవిష్కరణలు చేయడమన్నారు. ప్రజల విస్తారమైన వ్యవస్థాపక శక్తిని అన్‌లాక్ చేయడానికి కొత్త మార్గాలను సృష్టించాల్సి ఉందన్నారు. తాను ఈ ప్రయత్నంలో తన వంతు పాత్ర పోషిస్తున్నానని చంద్రబాబు తెలిపారు. గత కొన్ని దశాబ్దాలుగా మీ మద్దతు మరియు భాగస్వామ్యం అమూల్యమైనవి. త్వరలో మిమ్మల్ని ఆంధ్రప్రదేశ్‌కు స్వాగతించడానికి తాను ఎదురు చూస్తున్నానని.. పెట్టుబడుల విషయంలో తగ్గేది లేదని హింట్ ఇచ్చారు.

# రాష్ట్ర అభివృద్ధిని ఎవరూ ఆపలేరు

- సిఎం చంద్రబాబుపై నమ్మకంతోనే పెట్టుబడులు
- దేశ భవిష్యత్తుకు యువత చేయి చేయి కలపాలి
- నారా భువనేశ్వరి



కుప్పం, నవంబరు 19 ప్రభాతవార్త: రాష్ట్రంలో సిఎం చంద్రబాబునాయుడు నేతృత్వంలో జరుగుతున్న రాష్ట్రాభివృద్ధిని ఎవరూ ఆపలేరని సిఎం చంద్రబాబు నాయుడు సతీమణి, ఎన్టీఆర్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ నారా భువనేశ్వరి పేర్కొన్నారు. నాలుగు రోజుల కుప్పం పర్యటనలో భాగంగా బుధవారం ద్రవిడ వర్సిటీలో విద్యార్థులను ఉద్దేశించి నారా భువనేశ్వరి ప్రసంగించారు. ఎపి రాష్ట్రం సన్‌రైజ్ రాష్ట్రం అన్నారు. సిఎం చంద్రబాబుపై నమ్మకంతోనే రాష్ట్రానికి పెట్టుబడులు వస్తున్నాయన్నారు. మంత్రి నారా లోకేష్ తన బాధ్యతలను నెరవేర్చుతున్నారన్నారు. సిఎం చంద్రబాబు ఒక విజన్‌తో రాష్ట్ర అభివృద్ధికి పనిచేస్తున్నారన్నారు. పారిశ్రామికవేత్తలతో కూడా సిఎం చంద్రబాబు మాకోసం కాదు, రాష్ట్రం కోసం రావాలని కోరుతున్నారని పేర్కొన్నారు. ఇటీవల జరిగిన సిఐఐ సదస్సులో రూ.13లక్షల కోట్ల పెట్టుబడులు, 16లక్షల ఉద్యోగాలకు అవకాశం రావడం జరిగిందన్నారు. మంత్రి లోకేష్ రూ.1.35 లక్షల కోట్ల పెట్టుబడులతో వైజాగ్‌కు గూగుల్ సంస్థను తెచ్చారన్నారు. ఇప్పటికే వైజాగ్‌లో టిసిఎస్, కాగ్నిజెంట్ సంస్థలు వచ్చాయన్నారు. మిట్టల్ గ్రూప్ సైతం రూ.1.40లక్షల కోట్ల పెట్టుబడులు పెడుతోందన్నారు. రూ.9400 కోట్లతో నెల్లూరులో బిపిసిఎల్ ఆయిల్ రిఫైనరీ ఏర్పాటుకు ముందుకు వచ్చిందన్నారు. కుప్పంలో సైతం ఇటీవలే రూ.2203 కోట్లతో ఏడు పరిశ్రమలు, 23,330 ఉద్యోగాలకు సంబంధించి సిఎం శంకుస్థాపన చేసిన విషయం గుర్తుచేశారు. దేశ భవిష్యత్తుకు యువత చేయి చేయి కలపాలని భువనేశ్వరి పిలుపునిచ్చారు.

### 2029లోగా అమరావతి నగరం పూర్తి

రాష్ట్ర రాజధాని అమరావతి నగర నిర్మాణం 2029లో పూర్తవుతుందని సిఎం సతీమణి నారా భువనేశ్వరి పేర్కొన్నారు. భోగాపురం ఎయిర్‌పోర్ట్ 2026లో, పోలవరం ప్రాజెక్టు 2027నాటికల్లా పూర్తవుతాయన్నారు. యువత దేశ భవిష్యత్తు కోసం పనిచేయాలన్నారు. మనమంతా భారతీయులం అనే విషయం మరువరాదన్నారు. ద్రవిడ వర్సిటీని దివంగత ఎన్టీఆర్ స్థాపించారని ఈ విశ్వవిద్యాలయాన్ని యూనిక్ వర్సిటీగా చేయాలనే దిశగా సిఎం చంద్రబాబు ఆలోచిస్తున్నారన్నారు. అనంతరం విద్యార్థులతో ముఖాముఖి నిర్వహించి వారు అడిగిన ప్రశ్నలకు నారా భువనేశ్వరి సమాధానం ఇచ్చారు. అంతకుముందు వర్సిటీలోని దివంగత ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళి అర్పించారు. కార్యక్రమంలో ప్రభుత్వ విప్ డా॥ కంచర్ల శ్రీకాంత్, ద్రవిడ వర్సిటీ విసి ఆచార్య ఎం. దొరస్వామి, కడ ప్రాజెక్ట్ డైరెక్టర్ వికాస్ మర్మత్, రిజిస్ట్రార్ ఆచార్య కిరణ్‌కుమార్, టిటిడి బోర్డు సభ్యుడు వైద్యం శాంతారాం, రెస్కో చైర్మన్ ప్రతాప్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# విశాఖ ఉక్కుపై వైఎస్సార్సీ ఫేక్ ప్రచారం: మంత్రి సుభాష్

సచివాలయం, నవంబరు 19 ప్రభాతవార్త: విశాఖ స్టీల్ ప్లాంట్ పరిరక్షణ కోసం కార్మికులు కూడా బాధ్యతగా పనిచేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు చెప్పడాన్ని వైసీపీ వక్రీకరించి ఫేక్ ప్రచారం చేస్తుందని రాష్ట్ర కార్మికశాఖమంత్రి వాసంశెట్టి సుభాష్ ఎద్దేవ చేశారు."గుమ్మడి కాయల దొంగ ఎవరంటే భుజాలు తడుముకున్నట్లుగా" విశాఖ పరిరక్షణకు ఎవరేం చేశారని ముఖ్యమంత్రి చెప్పడాన్ని జీర్ణించుకోలేక వైసీపీ అసత్య ప్రచారాలు చేస్తు కార్మికులను రెచ్చగొడుతుందని ఆయన విమర్శించారు. వైసీపీ 5ఏళ్ళ పాలనలో విశాఖ ఉక్కును తుక్కు కింద పోస్కోకి అమ్మేందుకు విశ్వప్రయత్నాలు చేసిన సంగతి మరచి కూటమి ప్రభుత్వంపై అవాకులు చవాకులు మాట్లాడడం సిగ్గు అనిపించడం లేదాని మంత్రి సుభాష్ వైసీపీ నాయకులను ప్రశ్నించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోనికి వచ్చాకనే ముఖ్యమంత్రి నారా చంద్రబాబు స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ జరగదని కేంద్రంతో ప్రకటన చేయించడమే కాక ప్లాంట్ పరిరక్షణకు 12 వేల కోట్ల ప్యాకేజి సాధించిన విషయం గుర్తు చేసుకోవాలని వైసీపీకి సూచించారు. అంతేకాకుండా రాష్ట్ర ప్రభుత్వం మరో 2600 కోట్లు ఇచ్చిందన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఇచ్చిన ప్రజాధనం వృధా కాకుండా కార్మికులందరూ బాధ్యతగా పనిచేయాలని సిఎం చంద్రబాబు చెప్తే దాన్ని వక్రీకరించి జగన్ అండ్ కో ఫేక్ ప్రచారం చేయడాన్ని మంత్రి తీవ్రంగా ఆక్షేపించారు. వైసీపీ పాలనలో విశాఖ స్టీల్ ప్లాంట్ ఉత్పత్తి సామర్థ్యం 20శాతం కాగా నేటి కూటమి ప్రభుత్వంలో అది 79శాతానికి పెరిగిందని కార్మికశాఖ మంత్రి వెల్లడించారు. అప్పట్లో ఒకటి బ్లాస్ట్ ఫర్నేస్ పనిచేయగా ఇప్పుడు మూడు పని చేస్తున్నాయన్నారు. విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు ప్యాకేజీ ఇచ్చి లాభాల బాట పట్టించి ఉద్యోగులు కార్మికులకు అండగా నిలిచిన ఘనత చంద్రబాబుకే దక్కుతుందన్నారు. రాష్ట్ర ప్రగతికి అడ్డుపడే రాజకీయ అజ్ఞానులు,మంద బుద్ధిగల వారే చంద్రబాబు వ్యాఖ్యాలను వక్రీకరిస్తున్నారంటూ ఆయన వైసీపీ పై మండిపడ్డారు.ప్రతి ఒక్కరూ కష్టపడితేనే సంస్థలకైనా, వ్యక్తులకైనా మంచి భవిష్యత్తు ఉంటుందని చంద్రబాబు చెప్పడం తప్పు ఎలా అవుతుందో వైసీపీ నాయకులు సమాధానం చెప్పాలని మంత్రి వాసంశెట్టి సుభాష్ డిమాండ్ చేశారు.



# మైనార్టీల సంక్షేమానికి ప్రభుత్వం ప్రాధాన్యత

### - మంత్రి ఎన్ఎమ్‌డి ఫరూక్

విజయవాడ, నవంబరు 19 ప్రభాతవార్త ప్రతినిధి: మైనార్టీల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం ఇస్తున్న ప్రాధాన్యతను అధికార యంత్రాంగం దృష్టిలో పెట్టుకోవాలని, అందుకు తగ్గట్టుగా సంక్షేమ ప్రణాళికలు ముందుకు తీసుకెళ్లాలని ఆ శాఖ మంత్రి ఎన్ఎమ్‌డి ఫరూక్ సూచించారు. రాష్ట్ర సచివాలయంలోని మైనార్టీ సంక్షేమశాఖ అధికారులతో సమీక్షను మంగళవారం నిర్వహించారు. ఉర్దూ అకాడమీ, కేంద్ర ప్రభుత్వ పథకాలను సమర్థ వినియోగం, వక్ఫ్ ఆస్తుల పరిరక్షణ, ఉపాధికి రుణాలు తదితర కార్యక్రమాల అమలుపై అధికారులను మంత్రి వివరాలు అడిగి తెలుసుకున్నారు. మైనార్టీ సంక్షేమశాఖ ద్వారా చేపట్టిన పనుల పురోగతిని, వివిధ భవన నిర్మాణ పనుల పూర్తికి నిధుల వినియోగం, ప్రధాన మంత్రి విరాసత్‌క సంవర్ధన్ (పిఎం వికాస్), ప్రధాన మంత్రి జన్ వికాస్ కార్యక్రమం (పిఎంజెవికె), జాతీయ మైనార్టీల అభివృద్ధి ఆర్థిక సంస్థ పథకాల ద్వారా రాష్ట్రానికి వచ్చే నిధుల వినియోగం, హజ్‌యాత్ర (2026)కు తీసుకుంటున్న ముందస్తు చర్యలు గురించి అధికారులు ఈ సందర్భంగా మంత్రికి వివరించారు. ఈ సమావేశంలో మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ ఎమ్‌డి యాకుబ్ బాషా, వక్ఫ్ బోర్డు సిఇఒ మహ్మద్ అలీ, క్రిస్టియన్ ఫైనాన్స్ కార్పొరేషన్ ఎమ్‌డి ఎ.శేఖర్ బాబు తదితరులు పాల్గొన్నారు.

# శివనామస్మరణతో హోరెత్తిన శ్రీకాళహస్తీశ్వరాలయం

శ్రీకాళహస్తి, నవంబరు 19 ప్రభాతవార్త: హర హర మహాదేవా అంటూ భక్తులు కీర్తిస్తుండగా ఆలయ అర్చకులు భక్తి భావంతో గంగమ్మ తల్లికి హారతులిచ్చారు. నిండుకుండలా స్వర్ణముఖి నదీ ప్రవహిస్తుండగా కార్తీక మాసం అమావాస్య సందర్భంగా గంగా హారతులతో పునీతమైంది. శ్రీకాళహస్తి దేవస్థానం తరఫున కార్తీక మాసం అమావాస్య పవిత్ర దినమైన బుధవారం రాత్రి 'స్వర్ణముఖి హారతులు' ఏర్పాటు చేశారు. గంగమ్మఅమ్మవారు, మరో వైపు సోమాస్కంద మూర్తి అయిన శివయ్యలను అంగరంగ వైభవంగా ముస్తాబు చేసి జలవినాయక ఆలయం వద్ద ఏర్పాటు చేశారు. నభూతో అన్నట్లు హారతుల్ని నిర్వహించారు. స్వర్ణముఖి అందాల్ని హారతుల్ని తిలకించటానికి స్థానికులే కాకుండా చుట్టుపక్కల గ్రామాలకు చెందిన భక్తులు, ప్రజలు తండోపతండాలుగా కదలివచ్చారు. స్వర్ణముఖి తీరం భక్త జనులతో కిటకిట లాడింది. శివనామస్మరణతో దద్దరిలింది. హారతులతో పునీతమైంది. ఎమ్మెల్యే బొజ్జల వెంకటసుధీర్ రెడ్డి, బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షులు కోలా ఆనంద్ కుమార్, ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ కొట్టె సాయిప్రసాద్, సభ్యులు పగడాల మురళి, లక్ష్మమ్మ, దండి రాఘవయ్య, గాదిపాకుల గోపి, వాకచర్ల గుర్రప్పశెట్టి, తెలుగుదేశం నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు. ఆలయ ఇఓ డి.బాపిరెడ్డి దంపతులు పాల్గొన్నారు. అర్చకులు రాజేష్ గురుకుల్, కమల్, నిరంజన్ గురుకుల్, పౌరోహితులు అర్ధగిరి సతీష్ తదితరులు పాల్గొన్నారు.



స్వర్ణముఖి నదిలో గంగమ్మకు హారతులిస్తున్న దృశ్యం

# పుత్తూరులో ఒకరి దారుణ హత్య



పుత్తూరు, నవంబరు 19 ప్రభాతవార్త: అన్నం తినడానికి డబ్బులు అడిగితే ఇవ్వలేదనే కోపంతో ఒక వ్యక్తిని హత్య చేసిన సంఘటన తిరుపతి జిల్లా పుత్తూరు మండలంలో బుధవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన మేరకు వివరాలిలా వున్నాయి. రవి (35) అనే వ్యక్తి రామ్మూర్తిరెడ్డి (55)ని భోజనం కోసం డబ్బులడిగాడు. డబ్బులివ్వకపోగా తనను తిట్టడంతో ఆ కోపంలో కత్తితో పొడిచి చంపానని నిందితుడు రవి పోలీస్ విచారణలో తెలిపాడు. మిట్టపల్లూరుకు చెందిన రామ్మూర్తిరెడ్డి (55) పుత్తూరు పట్టణంలో నివశిస్తూ విద్యుత్ శాఖలో కాంట్రాక్టర్‌గా జీవనం సాగిస్తున్నాడు. తమిళనాడు రాష్ట్రం తిరువళ్లూరు జిల్లా పల్లిపట్టు తాలూకాలో కేశవరాజకుప్పం గ్రామానికి చెందిన రవి కొన్నాళ్లుగా పుత్తూరులో బికారిగా తిరుగుతున్నాడు. ఇతనికి తల్లిదండ్రులు లేరు. ఆధార్ కార్డు కూడా లేదు. రోడ్లపై ప్లాస్టిక్ బాటిళ్ల ఏరుకుంటూ కాలం గడుపుతున్నాడు. ఈ నేపథ్యంలో రామ్మూర్తి రెడ్డి బుధవారం మధ్యాహ్నం జాతీయ రహదారిపై గొల్లపల్లిలో సమీపంలోని ఒక దాబాలో రోటీలు కొనుక్కొని తిరిగి ద్విచక్ర వాహనంపై పుత్తూరుకు వెళుతున్నాడు. సరిగ్గా గొల్లపల్లి క్రాస్, రిలయన్స్ పెట్రోలు బంక్ దగ్గర రామ్మూర్తిరెడ్డి వాహనాన్ని నిలిపి భోజనానికి డబ్బులివ్వాలని రవి అడిగాడు. డబ్బులివ్వకుండా ఏ ఊరు నుంచి వచ్చావు, ఇక్కడ ఏం పనిచేస్తున్నావని రామ్మూర్తి రెడ్డి కొంచెం గట్టిగా అడగడంతో ఇద్దరి మధ్య వాగ్యుద్ధం జరిగింది. దాంతో రవి తన దగ్గరున్న చాకుతో రామ్మూర్తి రెడ్డిని పొడిచాడు. దీంతో రామ్మూర్తి రెడ్డి కుప్పకూలిపోయాడు. స్థానికులు అతనిని 108 వాహనంలో ప్రభుత్వాస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలోనే మృతి చెందాడు. రామ్మూర్తిరెడ్డికి వివాహమైంది. పిల్లలు లేరు. ఇదిలా వుండగా వారం రోజుల క్రితం ద్రౌపదిదేవి గుడి వద్ద ఒక సెల్ ఫోన్ దొంగిలిస్తూ దొరికిపోయిన రవిని అక్కడే ఇనుప పైప్‌లకు కట్టి స్థానికులు కొట్టారు. ఆ సంఘటనపై ఎవరూ పోలీసులకు ఫిర్యాదు చేయలేదు. హత్య కేసును సిఐ శేఖర్‌రెడ్డి దర్యాప్తు చేస్తున్నారు.

# నవోదయ విద్యార్థిని ఆత్మహత్య



మర్రిపాడు (నెల్లూరు), నవంబరు 19, ప్రభాత వార్త: నెల్లూరు జిల్లా మర్రిపాడు మండలం కృష్ణాపురం జవహర్ నవోదయ విద్యాలయంలో మంగళవారం అర్ధరాత్రి దారుణం చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. నవోదయ విద్యాలయంలో 10వ తరగతి చదువుతున్న విద్యార్థిని ప్రణీత (14) ఫ్యాన్‌కు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకుందని విద్యాలయ ప్రిన్స్‌పాల్ తెలిపారు. ఆత్మహత్య చేసుకున్న ప్రణీతను మొదటగా ఆయమ్మ చూసి ప్రిన్స్‌పాల్‌కు చెప్పడంతో ఆమె విద్యార్థిని తల్లిదండ్రులకు సమాచారం తెలిపారు. వారు హుటాహుటిన విద్యాలయం చేరుకోగా విగతజీవిగా పడి ఉన్న తమ కుమార్తెను చూసి బోరుమన్నారు. బాలిక తండ్రి కొండాపురం ఎంఇఒగా విధులు నిర్వహిస్తూ నవోదయ విద్యాలయంలో బాలికను చదివిస్తున్నారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని విచారణ చేపట్టారు. విద్యార్థిని అనుమానాస్పద స్థితిలో ఆత్మహత్యకు పాల్పడినట్లు తల్లిదండ్రులు ఆందోళనకు దిగారు. అందనంత ఎత్తులో ఉన్న ఫ్యాన్‌కు వైరు బిగించి విద్యార్థిని ఆత్మహత్య చేసుకోవడం ఏమిటని వారు ప్రశ్నించారు. ఈ ఘటనపై విద్యార్థిని తండ్రి, కొండాపురం ఎంఇఒ రవికుమార్ పలు అనుమానాలు వ్యక్తం చేశారు. తన కుమార్తె ఇటువంటి పనులకు పాల్పడే వ్యక్తి కాదని, చదువులోను, క్రీడల్లోను బాగా రాణిస్తుందని ఐపిఎస్ చదవాలనే లక్ష్యంతో తాను కష్టపడి చదువుకుంటుందన్నారు. విద్యాలయంలో అసలేం జరిగిందో తెలియాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల తల్లిదండ్రులు నవోదయ విద్యాలయం లోపలికి వెళ్ళేందుకు ప్రయత్నించగా వారిని పోలీసులు అడ్డుకున్నారు. తల్లిదండ్రులకు ఆంధ్ర విద్యార్థి సంఘం, పలు సంఘాల నాయకులు మద్దతు తెలిపారు. ఆంధ్ర విద్యార్థి సంఘం నాయకులకు, పోలీసులకు మధ్య వాగ్వాదం చోటుచేసుకోవడంతో అక్కడ ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ఈమేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



శ్రీకాళహస్తీశ్వరాలయంలో అష్టోత్తర శత శంఖాభిషేకం నిర్వహిస్తున్న దృశ్యం

# భోళాశంకరునికి అష్టోత్తర కలశాభిషేకం

### లక్షబిల్వార్చన, కుంకుమార్చనలు ముగింపు

శ్రీకాళహస్తి, నవంబరు 19 ప్రభాతవార్త: శ్రీకాళహస్తీశ్వరాలయంలో నెల రోజుల పాటు నిర్వహించిన స్వామి వారికి కోటి బిల్వార్చన, అమ్మవారికి కుంకుమార్చనలు బుధవారంతో ముగిసాయి. ఈ సందర్భంగా ఆలయంలోని గురుదక్షిణామూర్తి ఆలయం వద్ద ఆలయ సంప్రదాయం మేరకు అష్టోత్తర శత శంఖాభిషేకం కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. పది రోజుల పాటు భక్తి శ్రద్దలతో నిర్వహించిన 'లక్ష బిల్వార్చన, కుంకుమార్చనలు' ముగిసాయి. ఈ సందర్భంగా ఆలయంలో భారీ ఎత్తున పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఆలయ అర్చకులు డాక్టర్ స్వామినాధన్ గురుకుల్ సారధ్యంలో హోమాలు, అభిషేకాలు నిర్వహించారు. ఆలయ పౌరోహితులు అర్ధగిరి స్వామి వేదపండితుల వేద మంత్రాలతో ఆలయం దద్దరిల్లింది. శ్రీకాళహస్తీశ్వరాలయంలో నిర్వహించే లక్ష బిల్వార్చన, కుంకుమార్చనల్లో భాగంగా ముగింపు సందర్భంగా స్వామి గర్భగుడి ఎదురుగా స్వామి అమ్మవార్ల కలశాలను ఏర్పాటు చేశారు. అష్టోత్తర శత కలశాభిషేకంకు 108 కలశాలను ఏర్పాటు చేశారు. పూజలు నిర్వహించారు. పూర్ణాహుతి గావించారు. అనంతరం ధూప దీప నైవేద్యాలు సమర్పించారు. ప్రధాన కలశాలను ప్రదక్షిణ జరిపారు. ఆ జలాలతో అభిషేకించారు. స్వామి అమ్మవార్ల గర్భగుడుల వద్ద కుంభం (తిరుప్పావడ) నిర్వహించారు. స్వామి అమ్మవార్లకు ధూప దీప నైవేద్యం హారతులు, మంత్రపుష్పం నిర్వహించారు. పది రోజుల పాటు నిర్వహించిన లక్ష బిల్వార్చన, కుంకుమార్చనలలో వాడిన పత్రి కుంకుమలను భక్తి శ్రద్దలతో సన్నిధి వీధి గుండా ఊరేగింపుగా తీసుకెళ్ళి పవిత్ర జీవనది స్వర్ణముఖి నదిలో నిమజ్జనం జరిపారు. ఈ కార్యక్రమాల్లో ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ కొట్టె సాయిప్రసాద్ దంపతులు, ధర్మకర్తల మండలి సభ్యులు వాకచర్ల గుర్రప్పశెట్టి, గోపినాధ్ వారి కుటుంబసభ్యులు, ఆలయ ఇఓ డి.బాపిరెడ్డి, డిప్యూటి ఇఓ ఎన్ఆర్ కృష్ణారెడ్డి దంపతులు పాల్గొని సంకల్పం చేశారు. ఏర్పాట్లను ఆలయ టెంపుల్ ఇన్‌స్పెక్టర్లు సుదదర్శనం నాయుడు, వెంకటస్వామి, ఆలయ పర్యవేక్షకులు నాగభూషణం యాదవ్, అనువంశిక ప్రధానార్చకులు డాక్టర్ స్వామి నాధన్ గురుకుల్, డాక్టర్ స్వామి నాధన్, అర్చకులు సంబంధం గురుకుల్, కరుణాకర్ గురుకుల్, అచ్చితా గురుకకుల్, సురేష్ గురుకుల్, నిరంజన్ గురుకుల్ వేదపండితులు భక్తులు పాల్గొన్నారు.

# సైబర్ నేరస్తుల ముఠా అరెస్టు

- 8 మంది నిందితులు కటకటాల్లోకి
- తిరుపతి జిల్లా ఎస్పీ



తిరుపతి, నవంబరు 19 ప్రభాతవార్త ప్రతినిధి: డిజిటల్ అరెస్ట్ ముసుగులో అమాయకులను మోసం చేస్తున్న అంతర్ రాష్ట్ర సైబర్ నేరస్తులను తిరుపతి జిల్లా పోలీసులు అరెస్టు చేశారు. 8మంది నిందితులను అరెస్ట్ చేసి ఇద్దరి జాయింట్ అకౌంట్‌లోని నగదును ఫ్రీజ్ చేశారు. బుధవారం జిల్లా ఎస్పీ లంకెల సుబ్బరాయుడు మీడియాకు వెల్లడించారు. తిరుపతి నగరానికి చెందిన 65ఏళ్ళ సీనియర్ సిటిజన్‌ను లక్ష్యంగా చేసుకుని తెలియని వ్యక్తులు వాట్సాప్‌కాల్ చేసి ముంబై సిబిఐ అధికారులుగా పరిచయం చేసుకున్నారు. 583 కోట్ల రూపాయలు మనీలాండరింగ్ కేసులో అతని పేరు ఉందని చెప్పి భయపెట్టారు. వాట్సాప్ వీడియో కాల్ ద్వారా విచారణ చేస్తామని నమ్మించి అతని బ్యాంక్ అకౌంట్ నుండి వివిధ ఖాతాలకు డబ్బు పంపాలని ఒత్తిడిచేసి మోసం చేశారు. ఇలా బాధితుడి నుండి ఏకంగా రూ.80 లక్షలు వివిధ రాష్ట్రాల్లోని మ్యూట్ ఖాతాల్లో జమ చేయించుకున్నారు. బాధితుడు ఈస్టు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. తిరుపతి డిఎస్పీ భక్తవత్సలం ఆధ్వర్యంలో సిఐలు శ్రీనివాసులు, వినోద్‌కుమార్ బృందం దర్యాప్తుచేసింది. బాధితుడి ఖాతా నుండి ముందుగా రెండు మ్యూట్ అకౌంట్లకు అక్కడ నుండి 14 ఇతర రాష్ట్రాల్లోని ఇతర ఖాతాలకు, చివరకు గేమింగ్‌యాప్ వినియోగదారుల ఖాతాలకు నిధులు చేరినట్లు కనుగొన్నారు. ప్రధాన నిందితుడు కోటిబాబు టెలిగ్రామ్ ద్వారా హర్యానాలోని డానియల్, చైనాకు చెందిన టియాన్ ఇంకా డి పేర్లతో ఉన్న విదేశీ నెట్‌వర్కుతో సంబంధాలున్నట్లు తెలిసింది. 2024 జనవరిలో కోటిబాబు కంబోడియాకు వెళ్ళి 24రోజులు అక్కడ సైబర్‌మోసగాళ్ళ నెట్‌వర్కుతో కలసి పనిచేశాడు. తిరిగి వచ్చిన అతను శ్రీనివాస్, చంద్రశేఖర్, ప్రశాంతిరెడ్డి, గౌతమ్ వంటి వ్యక్తుల ద్వారా భారీ సంఖ్యలో మ్యూట్ అకౌంట్ ఖాతాలను సేకరించినట్లు నిర్ధారించారు. ముద్దాయిల బ్యాంక్ అకౌంట్‌లో ఉన్న రూ.2.5లక్షల నగదును ఫ్రీజ్ చేసినట్లు ఎస్పీ తెలిపారు. అరెస్టయిన ముద్దాయిల్లో అనంతపురం జిల్లాకు చెందిన దండే క్రాంతికుమార్, నిమ్మల పవన్‌కుమార్, హైదరాబాద్‌కు చెందిన మానే కోటిబాబు, రాజమండ్రి ప్రాంతానికి చెందిన పరసాల శ్రీనివాస్, బళ్లారి జిల్లాకు చెందిన మరకట్టు చంద్రశేఖర్‌రెడ్డి, కె.శివశంకర్, ప్రశాంత్‌రెడ్డి, గౌతమ్ ఉన్నారు. వీరిని కోర్టులో హాజరుపరచగా న్యాయమూర్తి రిమాండ్‌కు ఆదేశించారు. ఈ మీడియా సమావేశంలో అదనపు ఎస్పీ రవిమనోహరచారి. డిఎస్పీ భక్తవత్సలం, సిఐలు వినోద్‌కుమార్, శ్రీనివాసులు, ఎస్ఐ హేమాద్రి పాల్గొన్నారు.


# విద్యుత్తు చార్జీల్లో రూ.12,717 కోట్ల ట్రూఅప్ ప్రతిపాదన ఉపసంహరించాలి

విజయవాడ, నవంబరు 19 ప్రభాతవార్త ప్రతినిధి: విద్యుత్ వినియోగదారులపై రూ.12,717 కోట్ల ట్రూఅప్ భారాలు వేయాలన్న ప్రతిపాదన తిరస్కరించాలని ప్రజాసంఘాలు, విద్యుత్ నిపుణులు, రాష్ట్ర విద్యుత్ నియంత్రణ మండలి (ఏపీఈఆర్‌సీ)ని కోరారు. నాలుగో నియంత్రిత ఐదేళ్ళలో (2019–20 నుంచి 2023–24) ఫీలింగ్, రిటైల్ విద్యుత్ విక్రయాలకు విద్యుత్ సంస్థలు చేసిన ఖర్చు వినియోగదారుల నుంచి వసూలు చేసిన మొత్తానికి మధ్య వ్యత్యాసాన్ని ట్రూఅప్ కింద వసూలుకు అనుమతించాలని డిస్కంలు ఏపీఈఆర్‌సీలో పిటీషన్ దాఖలు చేశారు. దీనిపై కర్నూలులోని ఏపీఈఆర్‌సీ కార్యాలయంలో కమీషన్ ఇన్‌ఛార్జి చైర్మన్ పీవీఆర్ రెడ్డి ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు బాబూరావు హాజరై, ట్రూఅప్ కింద డిస్కంలు చేసిన ప్రతిపాదన తిరస్కరించాలని కోరారు. 'వైకాపా ప్రభుత్వం ఐదేళ్ళలో రూ.32 వేల కోట్లు ట్రూఅప్ భారాలు వేసింది. అదే బాటలో కూటమి ప్రభుత్వం వెళ్తోంది. ట్రూడౌన్ పేరుతో రూ.923 కోట్లు ప్రజలకు ఇచ్చి... రూ.12,717 కోట్ల భారం వేయడం భావ్యమేనా? ఇప్పటికే రూ.15,845 కోట్ల అదనపు భారాలు ప్రజలు భరిస్తున్నారు' అని బాబూరావు పేర్కొన్నారు. ఇంధన సర్దుబాటు ఛార్జీలు (ఎఫ్‌పీపీసీఏ) నిర్ధేశించే విధానంలో లోపాలున్నాయని, ఈ నేపథ్యంలో ఎఫ్‌పీపీసీఏ పూర్తిగా తొలగించాలని విద్యుత్‌రంగ నిపుణులు వేణుగోపాలరావు డిమాండ్ చేశారు. విద్యుత్ వినియోగదారుల ఐక్యవేదిక తరపున ఆంజనేయులు, సిమెంట్ మాన్యుఫ్యాక్చరర్స్ అసోసియేషన్ తరపున గోపీనాథ్, ఫ్యాప్సీ తరపున వైదేహి, ఏపీ ఫెర్రో అల్లాయీస్ ప్రొడ్యూసర్స్ అసోసియేషన్ తరపున విజయగోపాల్‌రెడ్డి వర్చువల్‌గా హాజరై ట్రూఅప్ ప్రతిపాదన ఉపసంహరించాలని కోరారు.

# నెల్లూరులో పంచలోహ కృష్ణుని విగ్రహం చోరీ

### గంటల వ్యవధిలో నిందితుడి అరెస్ట్, విగ్రహం స్వాధీనం

### ప్రశంసలందుకున్న సంతపేట పోలీసులు



నెల్లూరు క్రైమ్, నవంబరు 19 ప్రభాతవార్త: పంచలోహ కృష్ణుని ఉత్సవ విగ్రహాన్ని గుర్తుతెలియని దుండగుడు అపహరించుకుని వెళ్లారు. ఫిర్యాదు అందుకున్న సంతపేట పోలీసులు గంటల వ్యవధిలో నిందితులను అరెస్ట్ చేశారు. బుధవారం రాత్రి సంతపేట పోలీసు స్టేషన్‌లో స్థానిక ఇన్‌స్పెక్టర్ వై.వి సోమయ్య వివరాలను వెల్లడించారు. కామాటివీధిలో సంతాన బాలగోపాల కృష్ణమందిరం ఉంది. వాచ్‌మెన్ అంకయ్య రోజులాగానే బుధవారం ఉదయం ఆలయం గేట్లు తెరచి పనులు చేసుకుంటుండగా గుర్తుతెలియని దుండగుడు లోనికి ప్రవేశించి గర్భగుడిలోని పంచలోహ కృష్ణుని ఉత్సవ విగ్రహం, ఇత్తడి గంటను అపహరించుకుని వెళ్లారు. అర్చన చేసేందుకు ఆలయంకు వచ్చిన పూజారి రఘునందన్ ఈ విషయాన్ని ఆలయ చైర్మన్ సీహెచ్ భాస్కర్‌కు ఫోన్‌లో తెలియజేశారు. దీంతో భాస్కర్ చోరీ ఘటనపై సంతపేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇన్‌స్పెక్టర్ సోమయ్య కేసు నమోదు చేసి సాంకేతికత ఆధారంగా దర్యాప్తు చేపట్టారు. సీసీ ఫుటేజ్‌లు ఆధారంగా నిందితుడు నార్తరాజుపాలెంకు చెందిన పాత నేరస్థుడు వెంకయ్యగా గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. నిందితుడిని విచారించగా కోటమిట్టకు చెందిన షేక్ షఫికి విగ్రహం విక్రయించినట్లు వెల్లడించారు. దీంతో పోలీసులు షఫిని అదుపులోకి తీసుకుని చోరీ సొత్తు స్వాధీనం చేసుకుని నిందితులిద్దరిని అరెస్ట్ చేశారు. స్వాధీనం చేసుకున్న సొత్తు విలువ రూ.లక్ష వరకు ఉంటుంది. వెంకయ్యపై చీరాల రైల్వే పోలీసుస్టేషన్‌లో, ఒంగోలు తాలుకా పోలీసు స్టేషన్‌లో దొంగతనం కేసులున్నాయని ఇన్‌స్పెక్టర్ చెప్పారు. ఈ కేసులో ప్రతిభ కనబరిచిన సంతపేట సీఐ వైవి సోమయ్య ఇతర సిబ్బందిని టౌన్ ఇన్చార్జి డిఎస్పి గిరిధర్, రూరల్ డిఎస్పి శ్రీనివాసరావులు అభినందించారు.

20-11P□g7exHMNWJQE.qxd:20-11P□g7exHMNWJQE.qxd 1/1/02 7:12 AM Page 1



# రైతుకు వెన్నుదన్నుగా నిలుస్తాం

**● ధాన్యం సేకరించిన గంటలలోనే రైతుల ఖాతాలో సొమ్ము జమ ● ముదినేపల్లిలో మంత్రి నాదెండ్ల మనోహర్**


ముదినేపల్లి/ ఏలూరు, నవంబరు 19 ప్రభాత వార్త: తమది రైతు ప్రభుత్వమని విత్తనం నుండి విక్రయం వరకు అన్ని విధాలా రైతు వెన్నంటి ఉండి భరోసా కల్పిస్తున్నామని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ, జిల్లా ఇంచార్జ్ మంత్రి నాదెండ్ల మనోహర్ చెప్పారు. ముదినేపల్లిలో పచ్చని పొలాల మధ్య పండగ వాతావరణంలో బుధవారం జరిగిన అన్నదాతా సుఖీభవ.. పీఎం కిసాన్ పథకం రెండవ విడత కార్యక్రమంలో స్థానిక శాసనసభ్యులు డా. కామినేని శ్రీనివాస్, జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వితో కలిసి నమూనా చెక్కును మంత్రి రైతులకు అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి నాదెండ్ల మనోహర్ మాట్లాడుతూ ఏలూరు జిల్లాలో అన్నదాతా సుఖీభవ, పిఎం కిసాన్ పథకం రెండవ విడతలో 1,60,968 మంది రైతుల ఖాతాలకు రూ. 106.23 కోట్లు జమచేశామన్నారు. అన్నదాతా సుఖీభవ, పిఎం కిసాన్ పథకంలో సంవత్సరానికి రూ.20 వేలు మూడు విడతలుగా అందించడం జరుగుతుందని, దీనిలో రూ.14 వేలు రాష్ట్ర ప్రభుత్వం అందిస్తుందని, 6 వేలు కేంద్ర ప్రభుత్వం అందిస్తుందన్నారు. వ్యవసాయాన్ని మరింత లాభసాటిగా చేసేందుకు ఉద్యానవన పంటలను ప్రోత్సహిస్తున్నామన్నారు. మొంథా తుపాన్ కారణంగా జిల్లాలో జరిగిన పంట నష్టాలను కేంద్ర బృందం పరిశీలించింది, నష్టపోయిన ప్రతీ రైతును ఆదుకుంటామన్నారు. రైతులు తమ ధాన్యాన్ని అమ్మేందుకు వాట్సాప్ ద్వారా తమ దగ్గరలోని రైస్ మిల్లులు తెలుసుకోవడం, రైతుకు అనువైన మిల్లులో అమ్మడం వంటి వెసులుబాటు కల్పించామన్నారు. ప్రస్తుత వ్యవసాయ సీజన్లల్లో రాష్ట్రంలోని 4 వేల రైతు సేవా కేంద్రాలు, ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా 51 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని, ఇందుకు 16 వేల మందిని సిబ్బందిని వినియోగిస్తున్నామన్నారు. గత వ్యవసాయ సీజన్లో రైతులకు 50 వేల టార్పాలిన్లు 50 శాతం సబ్సిడీపై అందించామని,




ప్రస్తుతం రైతులకు పూర్తి సబ్సిడీతో టార్పాలిన్లు అందిస్తున్నామని, వీటిలో కౌలు రైతులకు ప్రాధాన్యత ఇస్తామన్నారు. సాగులో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను ముందుగానే తెలుసుకుని వాటిని పరిష్కరిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో పౌరసరఫరాల శాఖ మేనేజింగ్ డైరెక్టర్ ఢిల్లీరావు, జాయింట్ కలెక్టర్ డా. అభిషేక్ గౌడ, జిల్లా వ్యవసాయాధికారి హబీబ్ భాష, పౌర సరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ మూర్తి, ఉద్యానవన శాఖాధికారి షాజా నాయక్, రైతు సంఘాల నాయకులు, ప్రభృతులు పాల్గొన్నారు.

# రైతు సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

**● మంత్రి ఆనం రామనారాయణరెడ్డి**



ఆత్మకూరు (నెల్లూరు), నవంబరు 19 ప్రభాతవార్త: ఆత్మకూరులో స్థానిక వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ఆరికట్ల జనార్ధన్ నాయుడు ఆధ్వర్యంలో జిల్లా వ్యవసాయాధికారి ఎం.సత్యవతి అధ్యక్షతన జిల్లాస్థాయి అన్నదాత సుఖీభవ, పిఎం కిసాన్2025-26 సంవత్సరానికి సంబంధించి 2వ విడత నగదు పంపిణీ కార్యక్రమాన్ని పండుగ వాతావరణంలో బుధవారం స్థానిక శ్రీధర్‌గార్డెన్స్ కళ్యాణమండపంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రాష్ట్ర దేవాదాయ శా మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, నెల్లూరు ఎంపి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి ఆనం రామనారాయణరెడ్డిమాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా 46.22లక్షల మంది రైతులకు 3,077 కోట్లు రూపాయలు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు జమచేశారని, జిల్లా స్థాయిలో 1,95,866మంది రైతులకు రూ.130.20 కోట్లు, ఆత్మకూరు నియోజకవర్గంలో 34,223 మంది రైతులకు రూ.22.95 కోట్లు మంది లబ్ధిపొందారన్నారు. తమది రైతు పక్షపాత ప్రభుత్వమని రైతులకు అన్ని విధాల అండగా ఉంటూ ఎన్నికల హామీ మేరకు 2వ విడత కూడా అన్నదాత సుఖీభవ నిధులను సిఎం జమ చేశారన్నారు. రైతు సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్న సిఎం చంద్రబాబు నాయుడుకు మనమందరం తోడుగా ఉండాలన్నారు. సోమశిల హైలెవల్ కెనాల్, ఆత్మకూరులో ఇంజనీరింగ్ కళాశాల ఏరత్పాటుకు ఎంపి వేమిరెడ్డితో కలిసి కృషా చేస్తానన్నారు. ఈరెండు ప్రధాన సమస్యలపై సిఎం చంద్రబాబు నాయుడు హామీ ఇచ్చారని సిఎం దృష్టికి తెసుకెళ్ళి వీటి సాధనకు కృషి చేస్తామన్నారు. సోమశిల హైలెవల్ కెనాల్ పూర్తయితే మర్రిపాడు వరకు సోమశిల జలాలతో ఆ ప్రాంతమంతా సస్యశ్యామలమవుతుందన్నారు. ఈ కాలువ ద్వారా 90వేల మంది జనాభాకు తాగునీరు, 65వేల ఎకరాలకు సాగునీరు అందుతుందన్నారు.
ఎంపి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ఆర్ధికపరిస్థితి అంతంత మాత్రంగా ఉన్నప్పటికీ సంక్షేమం, అభివృద్ధి పథకాలను సిఎం చంద్రబాబు నాయుడు సమర్ధవంతంగా అమలు చేస్తున్నారన్నారు. ఒక్కో రైతుకు 7వేలు ఇవ్వడం శుభపరిణామమన్నారు. సూపర్‌సిక్స్‌లో ఇచ్చిన హామీలను అమలు చేస్తూ అభివృద్ధి, సంక్షేమం దిశగా రాష్ట్రాన్ని ముఖ్యమంత్రి ముందుకు నడిపిస్తున్నారన్నారు. తొలుత అన్నదాత సుఖీభవ, పిఎం కిసాన్ మెగా చెక్కును ప్రజాప్రతినిధులు, అధికారులు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మండల, డివిజన్ స్థాయి అధికారులు, ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.



# సంక్షేమంలో ఏపి నంబర్ వన్

తోటపల్లి గూడూరు (నెల్లూరు), నవంబరు 19 ప్రభాతవార్త: సర్వేపల్లి నియోజకవర్గం తోటపల్లి గూడూరు మండల పరిషత్ కార్యాలయంలో అన్నదాత సుఖీభవ - పీఎం కిసాన్ రెండో విడత నిధుల పంపిణీ కార్యక్రమాన్ని శాసనసభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెండో విడతలో కేంద్రం రూ.2 వేలు, రాష్ట్రం రూ.5 వేలు గా రైతుల ఖాతాల్లోకి రూ. 3135 కోట్లు జమవుతున్నాయని తెలిపారు. సర్వేపల్లి నియోజకవర్గంలో 28 వేల మంది రైతులకు రూ. 19.57 కోట్లు అందుతున్నాయని చెప్పారు. కూటమి ప్రభుత్వం రైతులకు ఏడాదికి రూ.20 వేల ఆర్థిక సహాయం అందిస్తోందని, గత ప్రభుత్వంలో మూడు విడతల్లో ఇచ్చిన రూ.13,500 కంటే ఎక్కువగా రెండు విడతల్లోనే రూ.14 వేలు ఇచ్చామని గుర్తు చేశారు. మరో రూ.6 వేలను మూడో విడతలో ఇవ్వబోతున్నట్లు వెల్లడించారు. అలాగే రాష్ట్ర స్థాయిలో మునుపటి ప్రభుత్వంతో పోల్చితే కూటమి పాలనలో నాలుగేళ్లకు అదనంగా రూ.12,088 కోట్లు రైతులకు అందుతాయని పేర్కొన్నారు. సంక్షేమంలో ఏపీ దేశంలో అగ్రగామి వృద్ధులు, వితంతువులకు ఇవ్వబడుతున్న రూ.4 వేల పింఛన్ దేశంలో ఎక్కడా లేదని, ఎన్టీఆర్ భరోసా కింద ఏపీ ఏటా రూ.33 వేల కోట్లు ఖర్చు చేస్తోందని తెలిపారు. ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం, ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లు, తల్లికి వందనం పథకాన్ని ప్రతి బిడ్డకు విస్తరించడం వంటి కార్యక్రమాలు కూటమి ప్రభుత్వ హైలైట్స్‌గా పేర్కొన్నారు. వైసీపీ నేతలు చేస్తున్న విమర్శలు అసత్యాలని, ప్రజలు అన్నీ గమనిస్తున్నారని సోమిరెడ్డి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అన్ని శాఖల అధికారులు నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# రాజధాని రైతులతో ప్రతినెలా సమావేశం

**● సిఆర్‌డిఏ కమిషనర్ కె.కన్నబాబు**

విజయవాడ, నవంబరు 19 ప్రభాతవార్త ప్రతినిధి: అమరావతి రాజధాని పరిధిలో రైతాంగ సమస్యల పరిష్కారానికి ప్రతినెలా మూడో శనివారం రైతుల జెఎసితో సమావేశం నిర్వహిస్తామని సీఆర్డీఏ కమిషనర్ కె,కన్నబాబు తెలిపారు. రాజధాని సమగ్ర ప్లాను అమలు, నోటిఫై చేసిన డ్రాఫ్ట్ ప్లాను, గైడ్‌లైన్స్ అంశాలను వివరించేందుకు సిఆర్‌డిఏ కార్యాలయంలో రైతు ప్రతినిధులతో ఆయన సమావేశం నిర్వహించారు. ప్రస్తుతం అమరావతి బ్లూప్లాను, రోడ్లు, కాలువలు, రిజర్వాయర్లు, రోడ్ల వెంట గ్రీనరీ, నడక, సైకిల ట్రాక్, విద్యుత్ లైన్లు, మంచినీటి పైపులైన్లు వంటివి ఎలా ఉంటాయి. వాటిని ఎలా వినియోగిస్తామనే అంశాలను అధికారులు, కమిషనర్ రైతులకు వివరించారు. అనంతరం రైతులు జెఎసి తరుపున సమర్పించిన 14 డిమాండ్లను లేవనెత్తారు. గ్రామ కంఠాలు, అబ్బురాజుపాలెం, దొండపాడు, బోరుపాలెం గ్రామాల పరిధిలో సుమారు 150 ఎకరాలకు సంబంధించిన జరీబు భూముల అంశంతోపాటు ఫ్లోర్‌స్పేస్ ఇండెక్స్(ఎఫ్ఎస్ఐ) పెంపుదల అంశాలను ప్రస్తావించారు. దీనిపై కమిషనర్ మాట్లాడుతూ కొన్నిటిని పరిష్కరించామని, గ్రామ కంఠాలు, జరీబు భూముల అంశాల సమస్యలు పరిష్కరించాలని కోరారు. దీనిపై కమిషనర్ మాట్లాడుతూ త్రీమెన్ కమిటీ ఇటీవల దీనిపై సమావేశం అయిందని, కొన్ని అంశాలు పెండింగ్‌లో ఉన్నాయని వివరించారు. ఈనెల 21, 22 తేదీల్లో మరోసారి సమావేశం అవుతుందని, అప్పుడు కొన్ని సమస్యలు పరిష్కారమయ్యే అవకాశం ఉందని తెలిపారు. ఆ సమావేశానికి అవసరమైతే జెఎసి ప్రతినిధులను ఆహ్వానిస్తామని తెలిపారు. దీంతోపాటు ప్రతి నెలా మూడో శనివారం రైతుల జెఎసితో సమావేశం అవుతామని, అన్ని సమస్యలూ పరిష్కరిస్తామని చెప్పారు. అయితే గ్రీవెన్స్ పెడుతున్నారని, రైతులు ఇచ్చిన వినతిపత్రాలు చెత్తబుట్టలో వేస్తున్నారని పట్టించుకోవడం లేదని జెఎసి సభ్యులు తెలిపారు. దీనికి కమిషనర్ మాట్లాడుతూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామని, స్వయంగా తానే గ్రామాల్లోకి వచ్చి రైతుల వద్ద సమస్యలు తెలుసుకున్నాని, అటువంటప్పుడు పరిష్కారం చేయడానికి ఇబ్బందులు ఏమి ఉంటాయని ప్రశ్నించారు. ఫ్లోర్ స్పేస్ ఇండెక్స్ ప్రస్తుతం 2.8 ఇచ్చారని, దీన్ని 5కు పెంచాలని రైతులు కోరారు. కనీసం 3.5 అన్నా ఇవ్వాలని కోరారు. దీనికి కమిషనర్ కన్నబాబు మాట్లాడుతూ ఫ్లోర్ స్పేస్ ఇండెక్స్ పెంచితే ఇబ్బందులు పడతారని, బిల్డర్లతో సమస్యలు వస్తాయని తెలిపారు. వాటికి సంబంధించిన సమగ్ర సమాచారం తరువాత సమావేశంలో వివరిస్తానని అన్నారు. రాజధానిని గుర్తిస్తూ గెజిట్ ఇచ్చే అంశం ఇంతకాలం ఎందుకు పెండింగ్లో ఉందని రైతులు అడిగారు. దీనికి కమిషనర్ స్పందిస్తూ ఇప్పటి వరకూ దేశంలో ఏ రాజధానికి గెజిట్ లేదని అమరావతికి అవసరం ఏముందని అన్నారు. హైదరాబాద్ నగరానికి కూడా గెజిట్ లేదని చెప్పారు. దీనిపై రైతులు మాట్లాడుతూ విభజన చట్టంలోనే హైదరాబాద్ పది సంవత్సరాలు రాజధానిగా ఉంటుందని పేర్కొన్నారని, అందువల్లే గెజిట్ అని అడిగామని తెలిపారు. ఇదే అంశంపై తాము కేంద్ర హోమ్‌మంత్రిత్వ శాఖ దృష్టికి తీసుకెళితే గెజిట్ ఇచ్చేందుకు అంగీకరించారని, అయితే న్యాయ విభాగం అధికారులు కొన్ని అభ్యంతరాలు లేవనెత్తారని తెలిపారు. వాటిని కూడా క్లియర్ చేస్తున్నామని, డిసెంబర్లో జరిగే పార్లమెంటు సమావేశాల్లో అమరావతికి సంబంధించిన బిల్లు పెట్టే అవకాశం ఉందని కమిషనర్ రైతులకు తెలిపారు. గ్రామాల్లో నుండి రోడ్లు వేసేందుకు తీసుకున్న ప్లానులో కొన్నిచోట్ల కొద్దిస్థలాన్ని వదిలేస్తున్నారని తెలిపారు. వాటిని దుకాణాలు నిర్మించుకుని వినియోగించుకునేలా ప్లాను చేస్తున్నామని కమిషనర్ రైతులకు తెలిపారు. ప్రస్తుతం రైతులకు ఇచ్చిన ప్లాట్లకు సంబంధించి సరిహద్దు రాళ్లు కనిపించడం లేదని, ఆందోళనలో ఉన్నారని రైతులు తెలపగా పనులు జరుగుతున్న నేపథ్యంలో పగ్‌మార్కు చూపిస్తామని అక్కడ నుండి దెవలపర్ అభివృద్ధి చేసిన తరువాత రైతులకు ఇచ్చే సమయంలో రాళ్లు వేసి ఇస్తామని కమిషనర్ అన్నారు. ఇప్పుడు సరిహద్దు రాళ్లు పెట్టినా మెరకతోలాల్సి ఉంటుందని, అనంతరం కనిపించకుండా పోయే అవకాశం ఉన్న నేపథ్యంలో లేఅవుట్లు అభివృద్ధి తరువాత సరిహద్దు రాళ్లను పెట్టి ఇస్తామని కమిషనర్ వివరించారు. ఈ సమావేశంలో అదనపు కమిషనర్ భార్గవతేజ హాజరయ్యారు.



# రైతులకు అండగా సహకార బ్యాంకులు నిలవాలి

బుచ్చి (నెల్లూరు), నవంబరు 19, ప్రభాతవార్త: సహకార బ్యాంకులు రైతులకు అండగా నిలవాలని కోవూరు శాసనసభ్యురాలు వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి చెప్పారు. బుచ్చిరెడ్డిపాళెం పట్టణంలోని వవ్వేరు కో ఆపరేటివ్ బ్యాంకులో నిర్వహించిన 72వ అఖిలభారత సహకార వారోత్సవాలలో ఆమె ముఖ్య అతిధిగా పాల్గొన్నారు. ఈ సందర్బంగా ఆమె మాట్లాడుతు కో ఆపరేటివ్ బ్యాంకింగ్ రంగంలో రాష్ట్రంలో బుచ్చిరెడ్డిపాళెంలోని వవ్వేరు బ్యాంకు అగ్రస్దానంలో ఉందని ఆమె ప్రశంసించారు. గత ప్రభుత్వ పాలనలో వవ్వేరు బ్యాంకు నిర్వహణ అస్తవ్యస్తంగా మార్చి వేశారని. ప్రస్తుతం ఈ బ్యాంకు అభివృద్దిని కాంక్షించి దొడ్ల విజయలక్ష్మిని బ్యాంకు చైర్మన్ చేయడం జరిగిందని ఆమె తెలిపారు. వవ్వేరు బ్యాంకు 145 కోట్లా 27 లక్షలు టర్నోవర్ సాధించడం అభినందనీయమని అన్నారు. ధాన్యం అరబెట్టుకునే కల్లాలు, నిల్వ చేసుకునే గోదాములు లేక రైతులు నష్టపోతున్నారని రైతుల ప్రయెజనాలను దృష్టిలో ఉంచుకొని కల్లాలు, గోదాములు నిర్మించేందుకు సహకార బ్యాంకులు ముందుకు రావాలని ఎమ్మెల్యే సూచించారు. ఈ కార్యక్రమంలో భాగంగా అందరి చేత ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కో ఆపరేటివ్ అధికారి గుర్రప్ప, మున్సిపల్ చైర్‌పర్సన్ మోర్ల సుప్రజా మురళీ, సీనియర్ నాయకులు కోడూరు కమలాకర్‌రెడ్డి, కళ్యాణ్‌రెడ్డి, జిల్లా సహకార ఆడిటర్ అధికారి కాటసాని తిరుపతిరెడ్డి, విభాగేయ సహకార కోశాదికారి పోలిశెట్టి రాజశేఖర్, ఎంపిపి మన్నెపల్లి శ్రీనివాసులు, నగర అద్యక్షులు గుత్తా శ్రీనివాసులు, గౌరవాద్యక్షులు టంగుటూరు మల్లికార్జునరెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ యరటపల్లి శివకుమార్‌రెడ్డి, వైస్ చైర్‌పర్సన్ పఠాన్ నస్రీన్, బ్యాంకు సిఇఒ మన్నారపు శ్రీనివాసులు, బుచ్చిరెడ్డిపాళెం రూరల్ బ్యాంకు చైర్మన్ సురేష్‌రెడ్డి, కౌన్సిలర్లు కోటంరెడ్డి లలితారెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, రేబాల నీటి సంఘం అద్యక్షులు రమణారెడ్డి, అగ్రికల్చర్ ఏడి అనిత, నాయకులు వింజం రామానాయుడు, దొడ్ల కోదండరామిరెడ్డి, మైనార్టీ నాయకులు పఠాన్ మహబూబాషా, నారసింహారెడ్డి, బత్తల హరికృష్ణా, కౌన్సిలర్ రాచూరు సత్యనారాయణ, సీనియర్ నాయకులు మొగళ్లూరు వెంకట శేషయ్య, బిజెపి నాయకులు చేవూరు వినయ్‌నారాయణ, కాసా శ్రీనివాసులు, రూరల్ బ్యాంకు డైరక్టర్ మాచవరం శ్రీనివాసులు, వవ్వేరు బ్యాంకు డైరక్టర్ మద్దిసాని మాల్యాద్రి, కోవూరు పద్మ, బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.

# పన్నుల రాబడి అదుర్స్

## అక్టోబరు నెలాఖరుకు

## రూ.82,983.17 కోట్లు



విజయవాడ, నవంబరు 19 పభాతవార్త ప్రతినిధి: రాష్ట్రంలో 2025-26 ఆర్థిక సంవత్సరంలో పన్నుల రాబడి అంచనాలకు అనుగుణంగా ఉంది. గడిచిన ఏడు నెల్లో పన్నుల ద్వారా ఆదాయంగా ఆశించిన స్థాయిలోనే ఉండటమూ కాకుండా ఆ మొత్తంలో సగం మేర ఖజానా కు చేరింది. ఈ ఆర్థిక సంవత్సరం మొత్తం మీద రాష్ట్ర పన్నుల రాబడి రూ.1,66,573.09 కోట్లుగా అంచనా వేశారు. అక్టోబరు నెలాఖరుకు రూ.82,983.17 కోట్ల వచ్చింది. ఏడు నెలల్లో సగం రాబడి సాధించింది. బడ్జెట్ అంచనాలతో పోలిస్తే జీఎస్టీ వసూళ్ళలో 52.49%, అమ్మకపు పన్నులో 49.10%, కేంద్ర పన్నుల్లో వాటా 56% సాధించింది. మొత్తం మీద రాష్ట్ర రెవిన్యూ రాబడి రూ.91,638 కోట్లకు చేరింది. ఇది ఏడాది మొత్తం అంచనాల్లో 42.04%.

### అప్పులు రూ.67,283,53 కోట్లు

ఈ ఆర్థిక సంవత్సరం మొత్తం మీద రూ.79,926.89 కోట్ల నికర అప్పు తీసుకుంటామని బడ్జెట్ అంచనాల్లో పేర్కొన్నారు. ఏడు నెల్లో రూ.67,289.53 కోట్ల నికర రుణం కాగ్ లెక్కల్లో చూపించారు. ఇందులో రూ.37,178.69 కోట్ల నికర ప్రజా రుణం, మరో రూ.30,104.83 కోట్ల నికర ప్రజా ఖాతా మొత్తాలు వినియోగించుకున్నట్లు వివరించారు.

### పన్నుల రాబడికి తోడు పన్నేతర రాబడి

కేంద్రం నుంచి వచ్చిన గ్రాంట్లు కలిపి మొత్తం కలిపి మొత్తం రూ.91,638.98 కోట్ల రెవిన్యూ రాబడి ఈ ఏడు నెలల్లో సాధించారు. అప్పులు తదితర మూలధన వసూళ్ళు కూడా కలిపి మీద ఏడు నెలల్లో రూ.1,58,960 కోట్లు ఖజానాకు చేరాయి.

### ఆస్తుల సృష్టికి రూ.13,942.50 కోట్లు

ఏడు నెలల్లో రాష్ట్రం ఆస్తుల సృష్టికి ఉపయోగపడే ఖర్చు రూ.13,942.50 కోట్లు చేసింది. ఇది బడ్జెట్ అంచనాల్లో దాదాపు 35% రెవిన్యూ ఖర్చులను రూ.1,39,444.97 కోట్లుగా పేర్కొంది. రెవిన్యూ రాబడితో పోలిస్తే ఖర్చు ఎక్కువగా ఉంది. రెవిన్యూ లోటు బడ్జెట్ అంచనాల్లో ఏడు నెలలకు 144.05% ఉంది. ఏడాది అంచనాలతో పోలిస్తే రెవిన్యూ లోటు ఇప్పటికే 44% అధికంగా ఉంది.

# విదేశాల్లో మైనింగ్ కార్యకలాపాలు

విజయవాడ, నవంబరు 19 ప్రభాతవార్త ప్రతినిధి: విదేశాల్లో మైనింగ్ కార్యకలాపాలు చేపట్టేందుకు ఏపీ ఖనిజ అభివృద్ధి సంస్థ(ఏపీఎండీసీ) ఆలోచన చేస్తున్నది. ఇందులో భాగంగా ఆఫ్రికన్ దేశాల్లో గనులు దక్కించుకోవాలనే దిశలో ప్రణాళికలు సిద్ధం చేసింది. తద్వారా తవ్వకాలు చేసి సంస్థకు అదనపు రాబడి పెంచుకోవాలని భావిస్తోంది. సంస్థకు దశాబ్దాల తరబడి మంగంపేట ముగ్గురాయి తవ్వకాల్లో అనుభవం ఉంది. చీమకుర్తిలో గ్రానైట్ లీజులను కూడా నిర్వహిస్తోంది. కొంతకాలంగా మధ్యప్రదేశ్‌లోని సులియారీలో బొగ్గు గనుల్లో తవ్వకాలు ఆరంభించింది. ఈ అనుభవంతోనే విదేశాల్లో లీజులు తీసుకోవాలని భావిస్తోంది. మన రాష్ట్ర పరిధిలోని బొగ్గు గనులకు ప్రభుత్వ రంగ సంస్థ టెండర్లు వేసి, పోటీలో నిలవాలని సీఎం చంద్రబాబు ఇటీవల సూచించారు. దీంతో

### ఎపి ఖనిజ అభివృద్ధి సంస్థ ఆలోచన

ఏలూరు జిల్లాలోని చింతలపూడి, సోమవరం బొగ్గు బ్లాక్‌లకు టెండర్లు వేసేందుకు అధికారులు సిద్ధం అవుతున్నారు. సోమవరం బ్లాక్‌లో సగటున జి13 రకం బొగ్గు లభిస్తుంది. ఇది 38.08 చదరపు కిలోమీటర్ల మేర విస్తరించి ఉంది. చింతలపూడి బ్లాక్‌లో సగటున జి12 రకం బొగ్గు లభిస్తుంది. బ్లాక్ 12.04 చదరపు కిలోమీటర్ల మేర ఉంది. సోమవరం, చింతలపూడి బొగ్గు బ్లాక్‌ల్లో భూగర్భ మైనింగ్ చేయాలని భావిస్తోంది. అలా చేస్తే గనక సంస్థకు గిట్టుబాటు కాదని కొందరు నిపుణులు అంటున్నారు. దీనికి బదులుగా ప్రత్యేక పద్ధతిలో భూమి లోపలి నుంచి మీథేన్ గ్యాస్ ఉత్పత్తి చేయవచ్చని సూచిస్తున్నారు. అయితే ఈ బ్లాక్‌లకు టెండర్లు దాఖలు చేసేందుకు డిసెంబరు 24 వరకు గడువు ఉంది. ఆ లోపు అధ్యయనం చేసి బిడ్లు వేసేందుకు ఏపీఎండీసీ సిద్ధమవుతుంది. జాతీయ ఖనిజాభివృద్ధి సంస్థ (ఎన్ఎండీసీ) ఇప్పటికే వివిధ దేశాల్లో మైనింగ్ కార్యకలాపాలు ఆరంభించింది. అదే విధంగా ఏపీఎండీసీ కూడా ప్రణాళిక సిద్ధం చేసుకుంటోంది. ఆఫ్రికాలో లభించే ఇనుప ఖనిజం, బొగ్గుతో పాటు పలు ముఖ్య ఖనిజాల గనులు తీసుకోవాలనుకుంటోంది. ఇందుకు ఏదైనా ప్రైవేటు సంస్థతో కలిసి జాయింట్ వెంచర్‌గా ప్రాజెక్టులు చేపట్టాలని చూస్తోంది. ఏ దేశాల్లో ఏ గనులు దక్కించుకుంటే రాబడి వచ్చే అవకాశం ఉందో అధ్యయనం చేయాలంటూ సలహా సంస్థ కేపీఎంజీని ఆదేశించింది. ఈ మేరకు కసరత్తు మొదలైంది. త్వరలో దీనిపై ముందడుగు పడే అవకాశం ఉందని ఏపీఎండీసీ వర్గాలు తెలిపాయి.

# 15మంది మావోలకు రిమాండ్

## రాజమండ్రి సెంట్రల్ జైలుకు తరలింపు

తాడేపల్లిగూడెం, నవంబరు 19 ప్రభాతవార్త: ఏలూరు గ్రీన్ సిటీలో పట్టుబడిన 15 మంది మావోయిస్టులకు జిల్లా కోర్టు 14రోజులు రిమాండ్ విధించింది. మావోయిస్టులను రాజమండ్రి సెంట్రల్ జైలుకు తరలించాలని ఆదేశించింది. విజయవాడలో పట్టుబడిన 24 మంది మావోయిస్టులకు కూడా కోర్టు రిమాండ్ విధించింది. మరో నలుగురు మావోయిస్టులకు వయో పరిమితి నిర్ధారించాలని కోర్టు ఆదేశించింది. తొలుత ఏలూరులో అరెస్టు చేసిన మావోయిస్టులను విజయవాడలో జరిగిన ప్రెస్ మీట్ కు పోలీసులు తరలించారు. అనంతరం మావోయిస్టులను విజయవాడ నుండి ఏలూరు మహిళా పోలీస్ స్టేషన్‌కు తరలించారు. మహిళా పోలీస్ స్టేషన్‌లోనే అరెస్ట్ అయిన మావోయిస్టులకు మెడికల్ టెస్టులు చేశారు. అనంతరం 15 మంది మావోయిస్టులను ఏలూరు జిల్లా కోర్టులో హాజరుపరిచారు.

# ఎన్‌కౌంటర్లపై న్యాయ విచారణ జరపాలి

విజయవాడ, నవంబరు 19 ప్రభాతవార్త ప్రతినిధి: అల్లూరి సీతారామరాజు జిల్లా మారేడుమిల్లి ఏజెన్సీలో నిన్న, ఈరోజు జరిగిన వరుస ఎన్‌కౌంటర్లపై న్యాయ విచారణ జరపాలని సిపిఐ(యం) రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. దీనికి సంబంధించి బుధవారం సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు ఓ ప్రకటనను విడుదల చేశారు. మావోయిస్టులను ముందుగానే నిర్బంధించి, అరెస్టు చేసి కోర్టు ముందు ఉంచే అవకాశం ఉన్నప్పటికీ పోలీసులు అన్యాయంగా బూటకపు ఎన్‌కౌంటర్ చేశారని వార్తలు వచ్చాయని తెలిపారు. చట్ట విరుద్ధమైన భూటకపు ఎన్‌కౌంటర్లను సిపిఐ(యం) ఖండిస్తున్నదన్నారు. విజయవాడ, ఏలూరు, కాకినాడ వంటి నగరాల్లో పోలీసులు దాడులు చేసి 50 మందికి పైగా మావోయిస్టులు, వారి అనుయాయులను నిర్బంధించారని, వివిధ చోట్ల నిర్బంధించబడిన వీరిని వెంటనే సంబంధిత న్యాయ స్థానాల ముందుంచాలని సిపిఐ(యం) కోరుతున్నదన్నారు. అమాయక గిరిజనులపై వేధింపులను, నిర్బంధాన్ని వెంటనే నిలిపివేయాలని, సిపిఐ(యం) డిమాండ్ చేస్తున్నదని వి.శ్రీనివాసరావు పేర్కొన్నారు.

# రాపిడో పేరుతో తిరుపతిలో శ్రీకాకుళం భక్తుడి దోపిడీ

తిరుపతి, నవంబరు 19 ప్రభాతవార్త ప్రతినిధి: తిరుపతి నగరంలో నేరస్తులు కొత్త పంథాలో దోపిడీకి పాల్పడుతున్నారు. నగరంలో ఆటోకోసం నిరీక్షిస్తున్న శ్రీకాకుళంజిల్లాకు చెందిన ఓ భక్తుడిని రాపిడో పేరుతో ద్విచక్ర వాహనదారుడు మోసం చేసి ఆపై ముళ్ళచెట్లలోకి తీసుకెళ్ళి మెడలోని బంగారుగోలుసును లాక్కెళ్ళాడు. ఈ సంఘటన బుధవారం ఉదయం జరిగింది. అలిపిరి పోలీసుల కథనం మేరకు... శ్రీకాకుళం జిల్లాకు చెందిన శ్రీధర్ బళ్ళారిలోని ఓ ప్రైవేట్ సంస్థలో పనిచేస్తున్నాడు. కుటుంబం నెల్లూరు నగరం వైఎస్ఆర్ కాలనీలో ఉంటుంది. కుటుంబసభ్యులతో కలిసి మంగళవారం తిరుమలకు వచ్చాడు. మంగళవారం సాయంత్రం శ్రీవారి దర్శనానంతరం బుధవారం ఉదయం తిరుపతికి చేరారు. తిరుగుప్రయాణంలో కుటుంబసభ్యులు నెల్లూరుకు వెళ్ళగా శ్రీధర్ బళ్ళారి వెళ్ళేందుకు రైల్వేస్టేషన్‌కు వెళ్లాలని ఆర్టీసి బస్టాండ్ సమీపంలో వేచివున్నాడు. అప్పటికే రాపిడో పేరుతో అక్కడకు వచ్చిన యువకుడు అతనిని ఎక్కించుకుని మంగళం ఉపాధ్యాయనగర్ వైపు వెళ్ళాడు. అప్పటికే అక్కడ ఉన్న కొందరు మద్యం సేవిస్తూ శ్రీధర్‌పై దాడి చేశారు. అతని మెడలోని బంగారు చైను లాక్కెళ్ళారు. గట్టిగా బాధితుడు కేకలు వేయడంతో స్థానికులు గమికూడారు. సమాచారం పోలీసులుకు చేరడంతో అలిపిరి పోలీసులు వచ్చేలోపు కొందరు పరారయ్యారు. ఒకరు పట్టుబడ్డాడు. అతనిని పోలీసులు అదుపులోకి తీసుకుని మిగిలిన వారికోసం గాలింపు చేపట్టారు. బాధితుడు శ్రీధర్ ఫిర్యాదుతో మహేశ్, వివేక్, జాఫర్, అఖిల్, ప్రభుదాస్, చందు అనుమానితులపై కేసు నమోదు చేశారు. నిందితుల కోసం ఎస్ఐ లోకేశ్ సిబ్బందితో సిసికెమెరాల పుటేజీ ఆధారంగా విచారణ చేస్తున్నారు. తిరుపతిలో కొత్తరకం దోపిడీ జరగడంతో యాత్రికులు, పోలీసులు కొంత అలర్ట్ అయ్యారు.



# దుర్గమ్మ ఆలయంలో భవానీ దీక్షల విరమణ

**● ముమ్మర ఏర్పాట్లు... ● ఇఓ పరిశీలన**

ఇంద్రకీలాద్రి, నవంబరు 19 ప్రభాతవార్త: దుర్గమ్మవారి ఆలయంలో జరగబోయే భవానీ దీక్షల విరమణల కోసం ఆలయంతో పాటు ఆలయ పరిసరాలు, స్నానాల ఘాట్లు, క్యూలైన్లు, లడ్డూ ప్రసాదాల కౌంటర్లు, కేశఖండన శాలలు, ట్రాఫిక్ నియంత్రణ తదితరాల కోసం ఆలయ ఇఓ వికె శీనా నాయక్, డిసిపి గుణ్ణం రామకృష్ణ, ఇంజనీరింగ్ అధికారులతో కలిసి పరిశీలించారు. వెస్ట్ ఎసిపి దుర్గారావు, సిఐ గురుప్రసాద్, పోలీస్ బృందంతో కలసి పరిశీలన చేసిన అనంతరం ఇఓ మాట్లాడుతూ మరోమారు కలెక్టర్, విజయవాడ సిపి లతో కలిసి పరిశీలన చేస్తామన్నారు.

### వేదోక్తంగా కార్తీకమాస పూజలు



దుర్గమ్మవారి ఆలయంలో బుధవారం కార్తీకమాస పూజలు వేదోక్తంగా నిర్వహించారు. బిల్వార్చన వేదోక్తంగా చేశారు. ఇఓ, చైర్మన్లు కార్యక్రమంలో పాల్గొనగా వేదపండితులు అర్చనలు చేశారు. చతుర్వేద స్వస్తి, పంచ హారతులు, మహానివేదనలు గావించారు. సహస్ర దీపకాంతులతో శ్రీ స్వామి అమ్మవార్లు భక్తులను ఊంజల్ సేవలందుకుని అనుగ్రహించారు. పవిత్ర కార్తీకమాసం సందర్భంగా సహస్ర లింగార్చన సేవలో పాల్గొనాలని భక్తులకు ఇఓ వికె శీనా నాయక్, చైర్మన్ బొర్రా రాధాకృష్ణలు తెలిపారు. అర్చకస్వాములు వేదమంత్ర పఠనాలతో శ్రీ స్వామివారికి సేవలు నిర్వహించి ధూప, దీప నైవేద్యాలు సమర్పించారు. సాయంసంధ్యాకాలంలో శ్రీ స్వామి అమ్మవార్లు ఊంజల్‌పై భక్తుల సేవలందుకుని అనుగ్రహించారు. ఈ సందర్భంగా చతుర్వేద పఠనాలు పండితులు చేశారు. దుర్గమ్మవారిని ఎంపి కేశినేని చిన్ని బుధవారం దర్శించుకున్నారు.

20-11pg10.qxd:20-11pg10.qxd 1/1/02 7:03 AM Page 1





## ఫిడే వరల్డ్ కప్‌లో అర్జున్ ఓటమి

**న్యూఢిల్లీ:** ఫిడే ప్రపంచ కప్ 2025లో ఎరిగైసి అర్జున్ క్వార్టర్స్‌లోనే ఓడిపోయాడు. దీంతో ఈ టోర్నమెంట్‌లో భారత్ ప్రచారం ముగిసింది. గోవాలో బుధవారం జరిగిన క్వార్టర్ ఫైనల్ టైబ్రేక్‌లో గ్రాండ్ మాస్టర్ అర్జున్ చైనా గ్రాండ్ మాస్టర్ వీ యి చేతిలో పరాజయం చెంది టోర్నీ నుండి నిష్క్రమించాడు. క్వార్టర్‌ఫైనల్ దశలో పోటీలో మిగిలి ఉన్న ఏకైక భారతీయుడు అర్జున్ రెండు క్లాసికల్ గేమ్‌లను డ్రా చేసుకున్న తర్వాత, టైబ్రేక్ లో ఎదురీత తప్పలేదు. ఎల్లప్పుడూ క్లిష్టమైన పోటీగా ఉన్న టైబ్రేక్‌లో తెలంగాణలోని వరంగల్‌కు చెందిన 22 ఏళ్ల అర్జున్ మొదటి టైబ్రేక్ గేమ్‌లో బ్లాక్‌తో ఫ్రెంచ్ డిఫెన్స్ కోసం వెళ్లాడు. అయితే మధ్య గేమ్‌లో ఈ భారత ఆటగాడు ఇబ్బందుల్లో ఉన్నట్లు అనిపించింది. కానీ 27వ ఎత్తుగడలో వీ చేసిన పొరపాటు సురక్షితమైన ఎత్తుగడను ఎంచుకోవడం, అర్జున్ తిరిగి ఆటలోకి అడుగుపెట్టడానికి వీలు కల్పించింది. తద్వారా 66 ఎత్తుగడల తర్వాత ఆట డ్రాగా ముగిసింది. ఇక 2023 ఎడిషన్‌లో క్వార్టర్‌ఫైనల్స్‌లో టైబ్రేక్‌లో ఆర్ ప్రజ్ఞానంద చేతిలో ఓడిపోయిన అర్జున్, రెండో గేమ్‌లో వైట్‌తో విజయం సాధించాలంటే వీ పెట్రోవ్ డిఫెన్స్‌ను బద్దలు కొట్టాల్సి వచ్చింది. అయితే, వీ 28వ ఎత్తుగడ ద్వారా విజయ ప్రయోజనాన్ని పొందారు. కానీ వీ చివరికి 79 ఎత్తుగడల తర్వాత తన సి బంటును రాణిగా ప్రమోట్ చేసి, అర్జున్‌ను ఇరుకున పెట్టడం ద్వారా భారత్ ఆశలను తుడిచిపెట్టాడు.



## టోక్యో డెఫ్లింపిక్స్‌లో అభినవ్, ప్రాంజలికి స్వర్ణం

**న్యూఢిల్లీ:** టోక్యో డెఫ్లింపిక్స్ 2025, ఎయిర్ పిస్టల్ మిక్స్‌డ్ టీమ్ విభాగంలో భారత్ షూటర్లు అభినవ్ దేశ్వాల్, ప్రాంజలి ప్రశాంత్ ధుమల్ స్వర్ణం సాధించారు. అలాగే 50 మీటర్ల రైఫిల్ ప్రోన్ ఈవెంట్‌లో కుషాగ్ర సింగ్ రజావత్ కాంస్య పతకం గెలుచుకున్నాడు. బుధవారం టోక్యోలో జరిగిన 25వ డెఫ్లింపిక్స్‌లో 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ ఈవెంట్‌లో ఈ భారత జంట చైనీస్ తైపీకి చెందిన యాజు కావో-మింగ్‌జుయి హ్సుపై 16-6 తేడాతో ఆధిపత్యం చెలాయించింది. ఇప్పటివరకు, టోక్యోలో భారత షూటర్లు మాత్రమే పతకాలు సాధించారు, మొత్తం 11 పతకాలు గెలుచుకున్నారు. అభినవ్ మరియు ప్రాంజలి స్వర్ణ పతక పోటీ ప్రారంభం నుండి తమ ఆధిపత్య స్థానాన్ని నిలబెట్టుకున్నారు. దీంతో అభినవ్ 287, ప్రాంజలి 282 పాయింట్లతో క్వాలిఫికేషన్‌లో అగ్రస్థానంలో నిలిచారు. 50 మీటర్ల రైఫిల్ ప్రోన్‌లో, కుషాగ్రా 224.3 పాయింట్లతో కాంస్య పతకాన్ని గెలుచుకున్నాడు.

## వరల్డ్ కప్‌కు స్పెయిన్ అర్హత



**న్యూఢిల్లీ:** టర్కీతో 2-2తో డ్రా అయిన తర్వాత స్పెయిన్ 2026 ఫిఫా ప్రపంచ కప్‌కు అర్హత సాధించింది. ఈ ప్రపంచ కప్‌తో స్పెయిన్ టోర్నమెంట్‌లో 17వ సారి పాల్గొంటుంది. 1978లో ప్రారంభమైన అర్హత పరంపరను కొనసాగిస్తోంది. అయితే 2010లో మాత్రమే టైటిల్ వచ్చింది. సెవిల్లెలో టర్కీతో జరిగిన 2-2 డ్రా తర్వాత స్పెయిన్ 2026 ప్రపంచ కప్‌లో తన స్థానాన్ని ఖాయం చేసుకుంది. యూరోపియన్ ఛాంపియన్ నాల్గవ నిమిషంలోనే డాని ఓల్మో ద్వారా తొలి ఆధిక్యంలోకి వెళ్లింది. కానీ గ్రూప్‌ను కైవసం చేసుకోవడానికి ఏడు గోల్స్ విజయం అవసరమైన టర్కీ, 42వ నిమిషంలో డెనిజ్ గుల్ ద్వారా స్కోరును సమం చేయగలిగింది. 54వ నిమిషంలో సలీహ్ ఓజ్కాన్ బాక్స్ చేసిన గోల్‌తో టర్కీ ఘంగుతింది. క్వాలిఫయర్‌లో స్పెయిన్ ఓయార్జాబల్ ఎనిమిది నిమిషాల తర్వాత మ్యాచ్‌ను సమం చేశాడు. లామినే యమల్, రోడ్రి, డాని కార్వాజల్, పెడ్రి, డీన్ హుయిజ్సెన్ వంటి కీలక ఆటగాళ్లు లేకపోయినా స్పెయిన్ ఉత్సాహంగా ప్రారంభమైంది. నాల్గవ నిమిషంలో మార్క్ కుకురెల్లా తక్కువ క్రాస్ ఇచ్చిన తర్వాత అది ఆధిక్యంలోకి వచ్చింది. దాన్ని ఫాబియన్ రూయిజ్ డమ్మీ చేయగా, ఓల్మో డిఫెండర్‌ను దాటి బంతిని నెట్‌లోకి వెళ్ళేలా చేశాడు. విరామం తర్వాత, విన్సెంజో మోంటెల్లా నాయకత్వంలోని టర్కీ ఆత్మవిశ్వాసం పెంచుకుని 55వ నిమిషంలో ఆధిక్యంలోకి వెళ్లింది. ఓజ్కాన్ బాక్స్ అంచు నుండి ఖచ్చితమైన తక్కువ ముగింపుతో గోల్ చేశాడు. క్లిష్టమైన జట్టు ఎత్తుగడను అధిగమించి టర్కీకి 2-1 ఆధిక్యాన్ని అందించాడు. అయితే టర్కిష్ డిఫెండర్ గోల్ లైన్ నుండి క్లియరెన్స్ పొందడంతో స్పెయిన్ ఓయర్జాబల్ ద్వారా స్కోరును సమం చేసింది.

## భారత్‌తో మూడో వన్డేలో దక్షిణాఫ్రికా భారీ స్కోర్





**న్యూఢిల్లీ:** భారత్‌తో మూడో అనధికారిక వన్డేలో దక్షిణాఫ్రికా జట్టు భారీ స్కోరు సాధించింది. ఓపెనర్లు శతక్కొట్టడంతో నిర్ణీత 50 ఓవర్లలో ఏకంగా 325 పరుగులు చేసింది. కాగా రెండు అనధికారిక టెస్టులు, మూమూడు వన్డేలు నిమిత్తం దక్షిణాఫ్రికా భారత్‌లో పర్యటిస్తోంది. ఇందులో భాగంగా ఇరు జట్ల మధ్య రాజ్‌కోట్ వేదికగా బుధవారం నామమాత్రపు మూడో వన్డేలో దక్షిణాఫ్రికా బ్యాటింగ్‌తో అదరగొట్టింది. ఈ మ్యాచ్‌లో టాస్ గెలిచిన భారత్ ప్రొటీస్ టీమ్‌ను తొలుత బ్యాటింగ్‌కు అహ్వానించింది. ఓపెనర్లు లువాన్ డ్రి ప్రిటోరియస్, రివాల్డో మూన్‌సామీ చెలరేగారు. ప్రిటోరియస్ 98 బంతుల్లో 9 ఫోర్లు, 6 సిక్సర్ల సాయంతో ఏకంగా 123 పరుగులు చేయగా, మూన్‌సామీ 130 బంతులు ఎదుర్కొన్ని 13 ఫోర్లు, 2 సిక్సర్లు బాది 107 పరుగులు సాధించాడు. విధ్వంసకర బ్యాటింగ్‌తో చెలరేగిన ఈ ఓపెనింగ్ జోడీని భారత్ పేసర్ ప్రసిద్ కృష్ణ విడదీశాడు. దీంతో దక్షిణాఫ్రికా ఇన్నింగ్స్ నెమ్మదించింది. మిగిలిన వాళ్లంతా పెవిలియన్‌కు క్యూ కట్టారు. రుబిన్ హెర్మాన్ (11), సినెతెంబ కెషిలె (1), కెప్టెన్ మార్క్వెస్ అకెర్మాన్ (16) పూర్తిగా విఫలం కాగా, డియాన్ ఫక్షరెస్టర్ 20, డిలానో పాట్‌గిటర్ 30 (నాటౌట్) ఫర్వాలేదనిపించాడు. డిజోర్న్ ఫార్చ్యూన 2 పరుగులతో అజేయంగా నిలిచాడు. ఫలితంగా దక్షిణాఫ్రికా నిర్ణీత 50 ఓవర్లలో 6 వికెట్లు నష్టానికి 325 పరుగుల భారీ స్కోరు సాధించింది. భారత్ బౌలర్లలో పేసర్లు ప్రసిద్ కృష్ణ, ఖలీల్ అహ్మద్, హర్షిత్ రాణా తలా రెండేసి వికెట్లు కూల్చారు.

# దక్షిణాఫ్రికాతో టెస్ట్.. కీలక సమరం

### టీం ఇండియా బి అలర్ట్

### మళ్లీ ఈ 3 తప్పులు చేస్తే సిరీస్ ఖతం





**న్యూఢిల్లీ:** భారత్, దక్షిణాఫ్రికా మధ్య రెండో టెస్ట్ మ్యాచ్ గౌహతిలోని బర్సపర క్రికెట్ స్టేడియంలో జరుగుతుంది. ఈ టెస్ట్ మ్యాచ్ నవంబర్ 22న ప్రారంభమవుతుంది. కోల్‌కతాలోని ఈడెన్ గార్డెన్స్‌లో జరిగిన తొలి టెస్ట్‌లో దక్షిణాఫ్రికా విజయం సాధించింది. పర్యాటకులు భారత్‌ను 30 పరుగుల తేడాతో ఓడించారు. ప్రస్తుతం దక్షిణాఫ్రికా సిరీస్ లో 1-0తో ఆధిక్యంలో ఉంది. భారత్‌తోజరిగే గౌహతి టెస్ట్ లో దక్షిణాఫ్రికా గెలిస్తే, వారు సిరీస్‌ను క్లీన్ స్వీప్ చేస్తారు. భారత్ క్లీన్ స్వీప్‌ను నివారించాలనుకుంటే, గౌహతి టెస్ట్‌లో గతంలో చేసిన ఈ మూడు తప్పులను ఇప్పుడు సరిదిద్దుకుని దాన్నుండి తప్పించుకోవాలి. కోల్‌కతా టెస్ట్‌లో భారత జట్టు నిర్లక్ష్యంగా బ్యాటింగ్‌చేసింది. గౌహతిటెస్ట్‌లో కూడా భారత్ అదే బాటలోనడుస్తే, దానిపరిణామాలను తీవ్రంగా ఎదుర్కో వలసి ఉంటుంది. రెండోటెస్ట్ గెలవాలంటే,గౌహతిలో టీమిండియా బాధ్యతాయుతంగా, తెలివిగా బ్యాటింగ్ చేయాల్సి ఉంటుంది. మరోపక్క కొన్ని సంవత్సరాలుగా భారత జట్టు స్పిన్‌తో ఇబ్బందిపడుతోంది. 2024లో న్యూజిలాండ్ భారత్ లో పర్యటించినప్పుడు, వారి స్పిన్నర్లు గణనీయమైన ఇబ్బందులను కలిగించారు. ఇప్పుడు, దక్షిణాఫ్రికా స్పిన్నర్లు కూడా భారతదేశానికి పెద్ద తలనొప్పిగా మారుతున్నారు. భారత పరిస్థితులలో, ముఖ్యంగా టెస్ట్ మ్యాచ్‌లలో స్పిన్నర్లు కీలక పాత్ర పోషిస్తారు. అందువల్ల, గౌహతిలో స్పిన్‌ను అర్థం చేసుకుని టీమిండియా ఆడాల్సి ఉంటుంది. లేకపోతే, కోల్ కతా టెస్ట్‌లాగా, వారుఇక్కడ కూడా గణనీయమైన ఇబ్బందులను ఎదుర్కొంటారు. ఇక గౌహతి టెస్ట్‌లో దక్షిణాఫ్రికా బ్యాట్స్‌మెన్‌ను భారత జట్టు తక్కువ అంచనా వేయాల్సిన అవసరం లేదు. దక్షిణాఫ్రికాలో ఎప్పుడైనా ఆటను మలుపు తిప్పగల సమర్థులైన బ్యాట్స్‌మెన్ ఉన్నారు. కోల్‌కతా టెస్ట్ రెండో ఇన్నింగ్స్‌లో టెంబా బావుమా అర్ధశతకం సాధించాడు. దక్షిణాఫ్రికా మ్యాచ్ విన్నింగ్ ఇన్నింగ్స్‌లో అతని 55 పరుగుల ఇన్నింగ్స్ కీలక పాత్ర పోషించింది. ఇప్పుడు దక్షిణాఫ్రికాతో జరిగే ఈ మ్యాచ్‌లో ఇవే తప్పులు పునరావృతం కాకుండా చూసుకుంటే భారత్ క్లీన్‌స్వీప్ నుండి తప్పించుకోగలుగుతుంది.

## ఆస్ట్రేలియన్ ఓపెన్.. రౌండ్ 16లో ప్రణయ్, శ్రీకాంత్

### తొలి రౌండ్ మ్యాచ్‌లో తరుణ్, ఆయుష్





**న్యూఢిల్లీ:** ఆస్ట్రేలియన్ ఓపెన్ 2025 లో భారత్ షట్లర్లు దూసుకుపోతున్నారు. హెచ్‌ఎస్ ప్రణయ్, కిదాంబి శ్రీకాంత్ 16వ రౌండ్‌కు చేరుకోగా, యువ ఆటగాళ్లు ఆయుష్ శెట్టి, తరుణ్ మన్నెపల్లి కూడా వారి వారి మొదటి రౌండ్ మ్యాచ్‌లలో విజయాలు నమోదు చేశారు. బుధవారం ముగ్గురు ఆటగాళ్ళు 16వ రౌండ్‌కు చేరుకున్నారు. అనుభవజ్ఞులైన షట్లర్లు ప్రణయ్, శ్రీకాంత్ తమ తొలి రౌండ్ మ్యాచ్‌లలో చిన్న ప్రత్యర్థులపై మూడు గేమ్‌ల పోరాట విజయాలను నమోదు చేశారు. ప్రణయ్ ఈ మ్యాచ్‌లో అద్భుత ఆరంభాన్ని సాధించాడు. ఇండోనేషియాకు చెందిన యోహానెస్ మార్సెలినో చేతిలో 6-21 తేడాతో నిరాశపరిచే స్కోరుతో మొదటి గేమ్‌ను కోల్పోయాడు. కానీ ఆ తర్వాత, అనుభవజ్ఞుడైన షట్లర్ శక్తివంతమైన పునరాగమనం చేసి, తదుపరి రెండు గేమ్‌లను 21-12, 21-17 తేడాతో గెలిచి, మ్యాచ్‌ను కైవసం చేసుకుని ప్రీక్వార్టర్ ఫైనల్స్‌కు చేరుకున్నాడు. ప్రపంచ 20వ ర్యాంక్ క్రీడాకారుడిని చిత్తు చేసిన కిదాంబి దాదాపు నెల రోజుల తర్వాత బిడబ్ల్యూఎఫ్ సర్క్యూట్‌లోకి తిరిగి వచ్చి ప్రచారాన్ని అద్భుతంగా ప్రారంభించాడు, ప్రపంచ 20వ ర్యాంకర్, చైనీస్ తైపీకి చెందిన చియా హావో లీని మూడు గేమ్‌లలో 21-19, 10-21, 21-15 తేడాతో ఓడించాడు. అలాగే యువ ఆటగాళ్లు ఆయుష్, తరుణ్ కూడా రౌండ్ ఆఫ్ 16లో తమ తొలి రౌండ్ మ్యాచ్‌ల్లో విజయాన్ని నమోదు చేశారు. మరోవైపు కిరణ్ జార్జ్ ధైర్యంగా పోరాడి, గత వారం ఫైనలిస్ట్ జపాన్‌కు చెందిన కెంటా నిషిమోటో చేతిలో 21-11, 22-24, 17-21 తేడాతో ఓడిపోయింది. అతడు మొదటి గేమ్‌ను సులభంగా గెలిచి, రెండవ గేమ్‌లో 17-14తో ఆధిక్యంలోకి వచ్చినా, తరువాత వరుసగా నాలుగు పాయింట్లు కోల్పోయి ఆటను వదులుకున్నాడు.

# పడిలేచిన పసిడిధరలు..

### వెండిధరలూ అదే దారి..



**ముంబయి, నవంబరు 19:** బంగారం ధరలు కొనుగోలుదారులకు మళ్లీ షాక్ ఇచ్చాయి. ధరలు తగ్గినట్టే తగ్గి మరోసారి భారీగాపెరిగాయి. ముందురోజు మార్కెట్‌లో ధర భారీగా దిగివచ్చిన విషయం తెలిసిందే. తాజాగా బుధవారం మళ్లీ పెరిగింది. డిమాండ్ బలంగా ఉండడంతో దేశ రాజధాని ఢిల్లీ నగరంలో ధర పెరిగినట్లుగా ఆల్ ఇండియా సరాఫా అసోసియేషన్ వెల్లడించింది. 24 క్యారెట్ల బంగారంపై రూ.1500 పెరిగి తులానికి రూ.1,27,300కి చేరుకుంది. అదే సమయంలో 22 క్యారెట్ల గోల్డ్ ధర రూ.1500 పెరిగి తులానికి రూ.1,26,700కి చేరుకుంది. వెండి ధర సైతం భారీగానే పెరిగింది. రూ.4వేలు పెరిగి కిలోకు రూ.1.60లక్షలకు ఎగిసింది. దాంతో మూడురోజుల తర్వాత ధరలు బులియన్ మార్కెట్‌లో ధరల తగ్గుదలకు బ్రేక్ పడినట్లయ్యింది. యుఎస్ లేబర్ మార్కెట్‌లో బలహీనమైన సంకేతాలు వడ్డీ రేట్ల తగ్గింపు ఆశలను సజీవంగా ఉంచాయని హెచ్‌డిఎఫ్‌సి సెక్యూరిటీస్ సీనియర్ విశ్లేషకులు సౌమిల్ గాంధీ తెలిపారు. ప్రపంచవ్యాప్తంగా స్పాట్ గోల్డ్ వరుసగా రెండో సెషన్‌లో పెరిగాయి. ఔన్స్‌కు 1.14 శాతం పెరిగి 4,114.01 డాలర్లకు చేరుకుంది. ఔన్స్‌కు వెండి ధర 3.09 శాతం 52.26 డాలర్లకు పెరిగింది. బుధవారం రాత్రి ఫెడరల్ ఓపెన్ మార్కెట్ కమిటీ (ఎఫ్‌ఓఎంసి) అక్టోబర్ సమావేశం వివరాలు వెల్లడికానుండగా పెట్టుబడిదారులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారని దాంతో స్పాట్ గోల్డ్ 4,084 డాలర్ల కంటే ఎక్కువగా ట్రేడ్ అవుతోందని మిరాయ్ అసెట్ షేర్‌ఖాన్ కమోడిటీస్ హెడ్ ప్రవీణ్ సింగ్ తెలిపారు. కోటక్ సెక్యూరిటీస్‌లోని కమోడిటీస్ రీసెర్చ్, ఏవీపీ విశ్లేషకుడు కైనాత్ చైన్వాలా మాట్లాడుతూ బంగారం కనిష్ట స్థాయి నుంచి కోలుకుని ఔన్స్‌కు 4,065 కంటే ఎక్కువగా ముగిసిందని తెలిపారు. ఇదిలా ఉండగా హైదరాబాద్‌లో బంగారం ధరలను పరిశీలిస్తే 24 క్యారెట్ల గోల్డ్ రూ.1,24,860 ఉండగా 22 క్యారెట్ల గోల్డ్ రూ.1,14,450 పలుకుతున్నది. ఇక కిలో వెండి రూ.1.76లక్షల వద్ద ట్రేడవుతున్నది.


# లాభాల్లోకి మళ్లిన సెన్సెక్స్, నిఫ్టీ

**ముంబయి, నవంబరు 19:** దేశీయ స్టాక్ మార్కెట్లు నష్టాల నుంచి గట్టెక్కాయి. ఐటీ, ఫైనాన్షియల్ షేర్లు రాణించడంతో మార్కెట్లు లాభాల్లో ముగిశాయి. క్రితం సెషన్‌తో పోలిస్తే సెన్సెక్స్ 84,643.78 పాయింట్ల వద్ద స్వల్ప నష్టాల్లో మొదలైంది. ఆ తర్వాత మార్కెట్లు కోలుకున్నాయి. ముడి చమురు ధరలు తగ్గడంతో పాటు బలమైన కొనుగోళ్లతో మార్కెట్లు లాభపడ్డాయి. ఇంట్రాడేలో 84,525.98 కనిష్టాన్ని తాకిన సెన్సెక్స్ గరిష్టంగా 85,236.77 పాయింట్ల వరకు పెరిగింది. చివరకు 513.45 పాయింట్ల లాభంతో 85,186.47 వద్ద ముగిసింది. ఇక నిఫ్టీ 142.60 పాయింట్లు పెరిగి 26,052.65 వద్ద స్థిరపడింది.



బిఎస్ఇ మిడ్‌క్యాప్ 0.3శాతం పెరగ్గా స్మాల్‌క్యాప్ ఇండెక్స్ 0.4శాతం పడిపోయింది. నిఫ్టీ బ్యాంక్ వరుసగా మూడవ సెషన్‌లో కొత్తగా 59,264.25 పాయింట్ల వద్ద రికార్డు స్థాయికి చేరుకుంది. 0.54శాతం లాభాలతో 59,216.05 వద్ద ముగిసింది. ఐటీ ఇండెక్స్ 3శాతం, పిఎస్‌యూ బ్యాంక్ ఇండెక్స్ 1.2శాతం పెరిగింది. మీడియా ఇండెక్స్ 0.3శాతం, రియాలిటీ ఇండెక్స్ 0.4శాతం తగ్గాయి. నిఫ్టీలో అత్యధికంగా లాభపడిన వాటిలో హెచ్‌సిఎల్ టెక్నాలజీస్, మాక్స్ హెల్త్‌కేర్, ఇన్ఫోసిస్, విప్రో, టీసీఎస్ ఉండగా.. టీఎంపీవీ, కోల్ ఇండియా, మారుతి సుజుకి, అదానీ పోర్ట్స్, బజాజ్ ఫైనాన్స్ నష్టపోయాయి. వెస్ట్రన్ రైల్వేస్ నుంచి ఆర్డర్ సాధించినా జీఆర్ ఇన్ఫ్రాప్రాజెక్ట్స్ షేర్లు 2శాతం పడిపోయాయి. ఇన్ఫోసిస్ షేర్లు బైబ్యాక్ ఆఫర్ కంటే ముందు 4శాతం పెరగ్గా.. హిందూస్తాన్ యూనిలీవర్ షేర్లు దాదాపు 2శాతం వృద్ధిని నమోదు చేశాయి. బయోకాన్ షేర్ ధర 3శాతం తగ్గగా సెబీ హెచ్చరిక లేఖతో నేషనల్ సెక్యూరిటీస్ డిపాజిటరీ షేర్ ధర 1.2శాతం పడిపోగా కెనడా విస్తరణ నేపథ్యంలో హెచ్‌సీఎల్ టెక్నాలజీ షేర్లు 4శాతం పెరిగాయి. భారత్ ఫోర్జ్, ఎం అండ్ ఎం ఫైనాన్షియల్, ఎంసిఎక్స్ ఇండియా, హీరో మోటోకార్ప్, ఫెడరల్ బ్యాంక్, టైటాన్ కంపెనీ, ఎస్‌బీఐ, బీహెచ్ఈఎల్ వంటి 120కి పైగా స్టాక్‌లు బీఎస్ఇలో 52 వారాల గరిష్టాన్ని తాకాయి.

## పాపులర్‌ప్లాన్ వ్యాలిడిటీ తగ్గించిన బిఎస్ఎన్ఎల్




**న్యూఢిల్లీ, నవంబరు 19:** ప్రభుత్వ రంగ టెలికాం సంస్థ భారత్ సంచార్ నిగమ్ లిమిటెడ్ తన ప్రీపెయిడ్ వినియోగదారులకు షాక్ ఇచ్చింది. ఎలాంటి ప్రకటన లేకుండా నిశ్శబ్దంగా తన పాపులర్ ప్లాన్లలో ఒకటైన రూ.107 ప్యాక్ కాలపరిమితిని తగ్గించింది. ప్రైవేట్ టెలికాం సంస్థల బాటలోనే బిఎస్ఎన్ఎల్ కూడా పయనించడంపై కస్టమర్లు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. రూ.107 ప్లాన్‌పై గతంలో లభించిన 28 రోజుల వ్యాలిడిటీని ఇప్పుడు 22 రోజులకు కుదించారు. వాస్తవానికి, కొన్నేళ్ల క్రితం వరకు ఇదే ప్లాన్‌కు 35 రోజుల వ్యాలిడిటీ ఉండేది. దశలవారీగా వ్యాలిడిటీని తగ్గిస్తూ రావడంతో, ధర పెంచకపోయినా వినియోగదారులపై పరోక్షంగా భారం మోపినట్లయ్యింది. ప్లాన్ ధరను మార్చకుండా వ్యాలిడిటీని తగ్గించడం కూడా ఒకరకమైన టారిఫ్ పెంపు అవుతుందని టెక్ నిపుణులు విశ్లేషిస్తున్నారు. ప్రస్తుత మార్పు దాదాపు 20 శాతానికి పైగా టారిఫ్ పెంపుతో సమానమని వారు అభిప్రాయపడుతున్నారు. బీఎస్ఎన్ఎల్ తీసుకున్న ఈ నిర్ణయంపై సోషల్ మీడియాలోనూ వినియోగదారులు విమర్శలు గుప్పిస్తున్నారు. తక్షణమే పాత వ్యాలిడిటీని పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తున్నారు.



## సీక్వెంట్ సైంటిఫిక్‌లో వియాష్ లైఫ్‌సైన్సెస్ విలీనం

**ముంబయి, నవంబరు 19:** ప్రముఖ జంతు ఔషధాల తయారీ సంస్థ సీక్వెంట్ సైంటిఫిక్‌లో, బల్క్ డ్రగ్స్, యాక్టివ్ ఫార్మా ఇన్‌గ్రేడియంట్స్ (ఎపిఐ) ఉత్పత్తిలో ప్రత్యేకత కలిగిన వియాష్ లైఫ్‌సైన్సెస్ విలీనం అవుతున్నాయి. ఈ విలీన ప్రతిపాదనకు జాతీయ కంపెనీ లా ట్రిబ్యునల్ తన తుది ఆమోదముద్ర వేసింది. ఈ ఆమోదంతో ఏడాది కాలంగా కొనసాగుతున్న విలీన ప్రక్రియ దాదాపుగా పూర్తయినట్లే. ఇకపై రెండు కంపెనీల కార్యకలాపాలను పూర్తిగా ఏకీకృతం చేయడంపై యాజమాన్యం దృష్టి సారించనుంది. సీక్వెంట్ సైంటిఫిక్‌లో వియాష్ లైఫ్‌సైన్సెస్ విలీనాన్ని గతేడాది సెప్టెంబరులో ప్రకటించిన విషయం తెలిసిందే. అప్పటి నుంచి ఇరు సంస్థల యాజమాన్యాలు వ్యాపార కార్యకలాపాలను సమన్వయం చేసేందుకు కృషి చేస్తున్నాయి. ఈ విలీనం వెనుక స్పష్టమైన వ్యూహాత్మక ప్రణాళిక ఉంది. జంతు ఔషధాల ఫార్ములేషన్లలో సీక్వెంట్ సైంటిఫిక్‌కు ప్రపంచవ్యాప్తంగా మంచి పేరుంది.

మరోవైపు, ఆ ఫార్ములేషన్లకు అవసరమైన కీలక ముడిపదార్థాలైన ఏపీఐలు, బల్క్ డ్రగ్స్‌ను తయారు చేయడంలో వియాష్ లైఫ్‌సైన్సెస్‌కు అపారమైన అనుభవం, ఉత్పత్తి సామర్థ్యం ఉన్నాయి. ఈ రెండు సంస్థలు కలవడం ద్వారా ముడిపదార్థాల నుంచి తుది ఉత్పత్తి వరకు పూర్తి సరఫరా గొలుసు (సప్లై చైన్)పై పట్టు సాధించవచ్చు. ఇది ఉత్పత్తి వ్యయాన్ని తగ్గించడమే కాకుండా, నాణ్యతపై మరింత నియంత్రణకు అవకాశం కల్పిస్తుంది. పరిశోధనఅభివృద్ధి, ఉత్పత్తి, మార్కెటింగ్ వంటి కీలక విభాగాల్లో ఇప్పటికే కొంతమేర ప్రక్రియను సాధించినట్లు సీక్వెంట్ సైంటిఫిక్ యాజమాన్యం ఇటీవల వెల్లడించింది. ఆదాయాలు, లాభాల పరంగా చూస్తే ఈ విలీనం సంస్థను ఆర్థికంగా మరింత బలోపేతం చేయనుంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం రెండో త్రైమాసికం (జూలైసెప్టెంబర్) ఆర్థిక ఫలితాలు ఈ విషయాన్ని స్పష్టం చేస్తున్నాయి. ఈ త్రైమాసికంలో రూ.424 కోట్ల ఏకీకృత టర్నోవర్‌ను నమోదు చేసింది.

పన్నుల తర్వాత నికర లాభం రూ.19.6 కోట్లుగా ఉంది. గతేడాది ఇదే కాలంతో పోలిస్తే వియాష్ లైఫ్‌సైన్సెస్ సంస్థ రూ.428 కోట్ల టర్నోవర్‌తో పాటు, రూ.53.3 కోట్ల నికర లాభాన్ని ఆర్జించింది. రెండు సంస్థల ఆర్థిక ఫలితాలను కలిపి చూస్తే, విలీన సంస్థ రెండో త్రైమాసికంలో మొత్తం రూ.852 కోట్ల టర్నోవర్‌ను, రూ.189 కోట్ల ఎబిటా (వడ్డీ, పన్నులు, తరుగుదలకు ముందు ఆదాయం)ను నమోదు చేసింది. ఎబిటా మార్జిన్ 22.2శాతంగా ఉండటం సంస్థ కార్యకలాపాల సామర్థ్యానికి, అధిక లాభదాయకతకు సూచికగా నిలుస్తుంది.

# కృత్రిమ మేధలో గూగుల్ జెమిని3 రిలీజ్!




**కాలిఫోర్నియా, నవంబరు 19:** ప్రస్తుతం ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ కొత్త పుంతలు తొక్కుతున్న తరుణంలో టెక్ దిగ్గజం గూగుల్ జనరేటివ్ ఎఐ మోడల్, జెమిని3ని మోడల్‌ని లాంచ్ చేసింది. జెమిని 2.5 స్థానంలో భర్తీ చేయనున్నది. ఇదే ఇప్పటి వరకు తమ మోస్ట్ ఇంటలిజెంట్ మోడల్ అని కంపెనీ చెబుతోంది. కంపెనీ ప్రతినిధులు జెమిని 3 అనేక కీలక పరిశ్రమ బెంచ్‌మార్క్‌లను అగ్రస్థానంలో నిలిపిందని, దాని సామర్థ్యాలను నిరూపించాయని చెప్పారు. గూగుల్ సిఇఒ సుందర్ పిచాయ్ కంపెనీ మోస్ట్‌టాలెంట్ మోడల్‌గా అభివర్ణించారు. కొత్త ఎఐ మోడల్‌ను సైబర్ దాడుల నుంచి కాపాడేలా రూపొందించినట్లు చెప్పింది. గూగుల్ సెర్చ్ ఇంజిన్‌లో వస్తున్న ఎఐ మోడ్‌తో కొత్త ఎఐ మోడల్‌ను ఇంటిగ్రేట్ చేసినట్లు చెప్పింది. గూగుల్ చీఫ్ ఎఐ ఆర్కిటెక్ట్ వ్లోగ్ మాట్లాడుతూ కంపెనీ ఇప్పుడు గతంలో కంటే వేగంగా మోడల్స్‌ను విడుదల చేస్తుందన్నారు. ఈ సారి గూగుల్ జెమిని3ని తన సెర్చ్ ఇంజిన్‌లో తొలిసారిగా విడుదలతో పాటు ఏకకాలంలో అనుసంధానించినట్లుగా పేర్కొంది. గతంలో అప్‌డేట్ చేసేందుకు వారాలు, నెలలు పట్టేది. ఏఐ మోడ్‌ని ఉపయోగించి గూగుల్ ప్రీమియం సబ్‌స్క్రిప్షన్ వినియోగదారులు జెమిని 3ని వినియోగించుకోవచ్చు. ఈ మోడల్ సంప్రదాయ వెబ్ లింక్స్‌కు బదులుగా సంక్లిష్టమైన ప్రశ్నలకు ఎఐ జెనరేటెడ్ సమాధానాలు ఇస్తుంది. ఇక గూగుల్ కొత్త ఫీచర్స్‌ను తీసుకు వచ్చింది. గూగుల్ జెమిని ఏజెంట్ అనే కొత్త ఫీచర్‌ను ప్రవేశపెట్టింది. ఇది ఈమెల్ ఇన్‌బాక్స్ నుంచి టూర్ ప్లాన్ వరకు మల్టి పుల్ టాస్క్‌ల వరకు ఆటోమేటిక్‌గా పనులు పూర్తి చేస్తుంది. అలాగే, గూగుల్ కొత్తగా జెమిని యాప్‌ను పునరుద్ధరించింది. ఇందులో ఎఐ ఇప్పుడు టెక్స్ట్ సమాధానాలు ఇవ్వడంతో పాటు వెబ్‌సైట్‌లాంటి ఇంటర్‌ఫేస్‌లో డిస్‌ప్లే విజువల్, ఇంటరాక్టివ్ ఎలిమింట్స్‌ను ప్రదర్శిస్తుంది. బిజినెస్ యూజర్ల కోసం 'యాంటీగ్రావిటీ' ప్లాట్‌ఫామ్‌ని అభివృద్ధి చేసింది. ఈ ప్లాట్‌ఫామ్ ఎఐ ఏజెంట్లకు వారి సొంత కోడ్‌ను ప్లాన్ చేసుకునే, రాసి ఇచ్చేసామర్థ్యాన్ని ఇస్తుంది. జెమిని 3 డెవలపర్‌ల కోసం అనేక కొత్త కోడింగ్ ఫీచర్స్‌ను సైతం జోడిస్తుంది.

## చిల్లరకోసం బ్యాంకుముందు క్యూలు కట్టిన ట్రేడర్లు!

**మెహసానా, గుజరాత్, నవంబరు 19:** బ్యాంకుముందు జనం బారులు తీరారు. 2016లో నోట్లరద్దు సందర్భంగా పాత నోట్లను మార్చుకోవడానికి దేశవ్యాప్తంగా బ్యాంకుల ముందు కస్టమర్లు బారులు తీరిన దృశ్యాలను తలపించేలా ఆ బ్యాంకు ముందు జనాలు క్యూకట్టారు. అది గుజరాత్ లోని మెహసానాలో గల అర్బన్ కోఆపరేటివ్ బ్యాంక్. ఇంతకూ ఆ బ్యాంకు దగ్గర జనం చిల్లర కోసమే. ఆర్‌బిఐ ఆదేశాల మేరకు గుజరాత్ రాష్ట్రం మెహసానాలోని అర్బన్ కోఆపరేటివ్ బ్యాంక్ ఒక ప్రత్యేక శిబిరాన్ని ఏర్పాటు చేసింది. స్థానికంగా నెలకొన్న చిల్లర కొరతను తీర్చాలన్నది ఆశిబిరం ఉద్దేశం. ఆ శిబిరంలో బ్యాంకు సిబ్బంది కొత్తగా ముద్రించిన రూ.10 నోట్లు, నాణేలను మార్పిడి చేసింది. పెద్ద కరెన్సీ ఇచ్చి రూ.10, రూ.20 నోట్లు కాయిన్‌లతోపాటు, రూ.5, రూ.2, రూ.1 కాయిన్‌లు తీసుకోవడం కోసం జనం భారీగా తరలివచ్చారు. ఈ ఒక్కరోజు శిబిరంలో బ్యాంకు సిబ్బంది రూ.14 లక్షల విలువైన రూ.10, 20 నోట్లు.. రూ.3 లక్షల విలువైన రూ.1, 2, 5 నాణేలను బ్యాంక్ అధికారులు మార్పిడి చేశారు. ఉదయం పది గంటల మొదలైన ఈ డ్రైవ్ సాయంత్రం వరకు కొనసాగింది. రోజూవారీ ఖర్చులకు, వ్యాపార ఖర్చులకు చిల్లర లేదని చిరు వ్యాపారులు, స్థానికులు తమ వద్ద ఉన్న పెద్ద నోట్లు ఇచ్చి చిల్లర తీసుకున్నారు.

Printed and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 1 -187, Kushalpuram, Srikakulam Dist. PIN: 532005 Ph. 270684, 271144, 9848387562 Fax : 08942–271146, RNI No. AP TEL/2004/13708 Editor :*Damerla Sai Baba *Responsible for selection of News under the PRB Act. Regd.: No.J/RNP/VM111 Air Surcharge: Delhi : 40 Ps.




## అత్యంత వైభవంగా రుద్రాభిషేకం, లక్ష బిళ్వార్చన, కుంకుమార్చన

అనకాపల్లి, నవంబర్ 19, ప్రభాతవార్త

శ్రీ సర్వకామకాంబ సమేత భోగలింగేశ్వర స్వామి దేవస్థానంలో మాస శివరాత్రి సందర్భంగా గణపతి పూజ, పుణ్యాహ వచనం,గోపూజ పంచాంగయ ప్రాసన మహాన్యాస రుద్రాభిషేకం, లక్ష బిల్వార్చన, లక్ష కుంకుమార్చన, శాంతి కళ్యాణం, రుద్ర హెూమం సహస్ర జ్యోతిర్లింగార్చన స్వామివారి కళ్యాణం భక్తుల సమక్షంలో అత్యంత వైభవంగా 10వ పేజీలో

# మారేడుమిల్లి అడవుల్లో మరో ఎన్‌కౌంటర్

## రెండవ ఎన్‌కౌంటర్‌లో ఏడుగురు మావోలు హతం







రంపచోడవరం, నవంబర్ 19, ప్రభాతవార్త

మారేడుమిల్లి అడవలలో మరోసారి తుపాకీ తూటాలు పేలాయి. వరుసగా రెండవ రోజు బుధవారం జరిగిన ఎన్కౌంటర్లో ఏడుగురు మావోయిస్టులు మృతి చెందారు. మంగళవారం బుధవారం జరిగిన రెండు ఎన్కౌంటర్లలో 13 మంది మావోయిస్టులు హతమయ్యారు. దీంతో ఇక్కడ ఏజెన్సీ ప్రాంతం అంతటా ఉద్రృత వాతావరణం నెలకొంది. ఆదివాసీల గ్రామాలలో

## దేదీప్యమానంగా అనంతపద్మనాభస్వామి

# కొండమెట్ల కోటి దీపోత్సవం



### ఉదయం నుండి పద్మనాభం పోటెత్తిన భక్తులు -అనంతుని నామంతో పరవశించిని పద్మనాభం

పద్మనాభం, నవంబర్ 19, ప్రభాతవార్త

శివ,కేశవలకి ఆలవాలమైన పద్మనాభం పుణ్యక్షేత్రంలో అనంతపద్మనాభస్వామి కొండ మెట్ల కోటి దీపోత్సవంను భక్తులు బుధవారం రాత్రి దేదీప్యమానంగా నిర్వహించారు. ఈ సందర్భంగా లక్షలాది మంది భక్తులు ఉదయం నుండి పద్మనాభం పోటెత్తారు. దీంతో పద్మనాభం పరిసర ప్రాంతాలు అనంతుని నామంతో మార్మోగాయి. అలాగే కొండపైన ఉన్న అనంతుని ఆలయం, కొండ దిగువన ఉన్న

# రైతుకు అండగా కూటమి ప్రభుత్వం

## అన్నదాత సుఖీభవ రెండో విడత పెట్టుబడి సాయాన్ని అందించిన గంటా



భీమిలి, నవంబర్ 19, ప్రభాతవార్త:

ప్రభుత్వం అందించే పెట్టుబడి సాయంతో రైతాంగానికి ఊరట లభిస్తోందని భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని తాటితూరు గ్రామంలో అన్నదాత సుఖీభవ - పీఎం కిసాన్ పథకం రెండో విడత సాయాన్ని బుధవారం అందజేసిన అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో 46.85 లక్షల మంది రైతు సోదరులకు రూ.7 వేలు చొప్పున రూ. 3,135 కోట్లు.. భీమిలి రూరల్, పద్మనాభం, ఆనందపురం మండలాల్లో 12 వేల మందికి రూ.8 కోట్లు నేరుగా ఖాతాల్లోకి జమ చేశామని వివరించారు. ఏడాదికి రూ.20 వేల చొప్పున మూడు విడతలుగా రాష్ట్రం 70 శాతం, కేంద్రం 30 శాతం ఈ సొమ్మును అందజేస్తోందని తెలిపారు. రైతే రాజు.. దేశానికి వెన్నెముక అని రైతు గురించి చెబుతారని, దురదృష్టవశాత్తు తను పండించే పంటకు ధరను నిర్ణయించుకోలేని నిస్సహాయ స్థితిలో ఉన్నాడని ఆవేదన వ్యక్తం చేశారు. ఒక కన్నుతో నేలను మరో కన్నుతో ఆకాశాన్ని చూస్తూ.. అప్పుల్లో పుట్టి, అప్పుల్లో పెరిగి, అప్పుల్లో చనిపోయేవాడే రైతు అనే నిర్వేదం యావత్ రైతాంగంలో ఉందన్నారు. రైతుకు భరోసాగా 10వ పేజీలో

## మేయర్, జీవీఎంసీ కమిషనర్‌ను కలిసిన ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్

### పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులపై చర్చ


10లో

## 21 నుంచి ఘనంగా మార్గశిర మాసోత్సవాలు

### మాసోత్సవాల్లో సాధారణ భక్తులకు పెద్దపీట -విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించిన ఈఓ కె.శోభారాణి



విశాఖపట్నం, నవంబర్ 19, ప్రభాతవార్త:

పాత నగరం బురుజుపేటలో కొలువై ఉన్న శ్రీ కనక మహాలక్ష్మి అమ్మవారి ఆలయ సన్నిధిలో స్వస్తిశ్రీ చాంద్రమాన శ్రీ విశ్వావసు నామ సంవత్సర మార్గశిర శుద్ధ పాడ్యమి అనగా ఈ నెల 21 నుంచి బహుళ అమావాస్య డిసెంబర్ 19వ తేదీ వరకు మార్గశిర మాసోత్సవాలను సంప్రదాయ రీతిలో ఘనంగా నిర్వహించుచున్నామని ఆలయ ఈవో కె.శోభారాణి తెలిపారు. సాధారణ భక్తులకు పెద్దపీట వేస్తూ సకల ఏర్పాట్లు చేశామని పేర్కొన్నారు. రేపటి నుంచి ప్రారంభం కానున్న మార్గశిర మాసోత్సవాల నిర్వహణకు సంబంధించిన వివరాలను బుధవారం అన్న ప్రసాద భవనంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె వెల్లడించారు. జిల్లా కలెక్టర్, పోలీసు కమిషనర్ సూచనల మేరకు పలు సంస్కరణలు కూడా చేశామని, భక్తులకు అనువైన విధంగా ఏర్పాట్లు చేశామని పేర్కొన్నారు. దర్శనాలకు సంబంధించిన సమాచారం, ఇతర వివరాలు ప్రజలకు తెలిసేలా లైవ్ లింకు ద్వారా ప్రత్యక్ష ప్రసారం చేసేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఆలయ ప్రసాద కౌంటర్ సమీపంలోని సంపును మార్చామని, ఆర్చ్ గేట్‌ను కొంచెం ముందుకు 10వ పేజీలో

## శివాలయంలో రాష్ట్ర టీడీపీ అధ్యక్షులు పల్లా ప్రత్యేక పూజలు



అగనంపూడి ప్రభాతవార్త

అగనంపూడి శివాలయంలో మాస శివరాత్రి సందర్భంగా రాష్ట్ర టిడిపి అధ్యక్షులు గాజువాక ఎమ్మెల్యే పల్లా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రం అభివృద్ధి చెందాలని, అందరు బాగుండాలని కోరుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కమిటీ ప్రతినిధులు గెద్దాడ అప్పలరాజు, గొట్యాడ లోవరాజు, నూకరాజు, శంకర, కొల్లుపాక అప్పారావు, టిడిపి అధ్యక్షులు కర్రి దసంధ్ర తదితరులు పాల్గొన్నారు.

## శ్రీశైలం మల్లికార్జున స్వామిని దర్శించుకున్న అవంతి కుటుంబం


10లో

## టాటానగర్ ఎక్స్ ప్రెస్‌కు తృటిలో తప్పిన పెను ప్రమాదం

### పెందుర్తిలోని రైల్వే పనుల్లోని ఒరిగిన విద్యుత్ స్తంభం చాకచక్యంగా రైలు ఆపడంతో తప్పిన ప్రమాదం



10లో

## 'స్మార్ట్' వెండింగ్ జోన్లను సిద్ధం చేయాలి


### అధికారులను ఆదేశించిన జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్



విశాఖపట్నం, నవంబర్ 19, ప్రభాతవార్త:

అర్హులుగా గుర్తించిన వీధివిక్రయదారుల కొరకు ఏర్పాటు చేయనున్న స్మార్ట్ వెండింగ్ జోన్లను అన్ని సదుపాయాలతో సిద్ధం చేయాలని జీవీఎంసీ అధికారులను జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ ఆదేశించారు. బుధవారం ఆయన జీవీఎంసీ ప్రధాన ఇంజనీరు పివివి సత్యనారాయణ రాజు, జోనల్ కమిషనర్లు కె.కనకమహాలక్ష్మి ,ఎం.మల్లయ్య నాయుడులతో కలిసి జోన్ 2 లో ఎండాడ త్రిబుల్ ఆర్ సెంటర్ సమీపంలో, జోన్ 4 లో సెంట్రల్ పార్క్ కు రోడ్డు ముఖంగా తూర్పు, పడమర, దక్షిణ భాగంలో ఉన్న ప్రతిపాదించిన స్మార్ట్ వెండింగ్ జోన్ల స్థలాలను స్వయంగా పరిశీలించారు. ఈ పరిశీలనలో కమిషనర్ మాట్లాడుతూ నగరంలో 21 స్మార్ట్ వెండింగ్ జోన్ల ఏర్పాటుకు నిర్ణయం తీసుకోవడమైనదని అందులో భాగంగా మొదటి ఫేజ్ లో ముందుగా జోన్ 2,4,6 లో మూడు వెండింగ్ జోన్లను బెనిఫిషియరీ కంట్రిబ్యూషన్ తో ,పి పి పి మోడ్యుల్ లో ఏర్పాటు చేస్తున్నామన్నారు. వీధి విక్రయిదారుల జీవన ప్రమాణాలను మెరుగుపరిచేందుకు , వారిని ఆర్థికంగా బలోపేతం చేసేందుకు , ఆధునిక పద్ధతిలో ప్రజల సౌకర్యార్థం ఈ వెండింగ్ జోన్లను నగరంలో ఏర్పాటు చేయడం జరుగుతున్నది అన్నారు. ఆయా స్థలాలను పరిశీలిస్తూ ఏర్పాటు చేయనున్న స్మార్ట్ వెండింగ్ జోన్లలో అవసరమైన సదుపాయాలతో (ఫ్యాన్‌లు, లైట్లు మొదలైనవి కూడిన పోర్టబుల్ కంటెయినర్లుగా ఏర్పాటు, దుకాణాలకు అవసరమైన పరికరాలు, ఉపకరణాలను నడపడానికి తగిన విధంగా ప్రాంతం మొత్తం విద్యుదీకరణ చేయడం. పరిసరాలు ఆకర్షణీయంగా కనిపించేలా ఆహ్లాదకరమైన, సుందరీకరమైన లైటింగ్ ఏర్పాటు, మొత్తం వెండింగ్ జోన్ సోలార్ శక్తితో నడిచే విధంగా రూపకల్పన చేయడం - తద్వారా కార్బన్ ఫుట్‌ప్రింట్ తగ్గింపు, వెండింగ్ జోన్ల భద్రత కోసం సీసీ టీవీ పర్యవేక్షణ వ్యవస్థ ఏర్పాటు,ప్రతి వెండింగ్ జోన్‌కు ప్రత్యేకంగా సెంట్రల్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ ద్వారా శుభ్రత, రోజువారీ శానిటేషన్, భద్రత మరియు వైఫై, ప్లే జోన్‌లు వంటి సౌకర్యాల నిర్వహణ, 10వ పేజీలో

# విశాఖలో మరో హత్య




### బిచ్చగాళ్ళ మధ్య ఆధిపత్య పోరు..! -మద్యం మత్తులో రూ.150ల కోసం బిచ్చగాళ్ళ మధ్య గొడవ -నిద్రిస్తున్న సమయంలో వ్యక్తి తలపై కర్రతో దాడి చేసి హత్య

(విశాఖ క్రైమ్ - ప్రభాతవార్త)

మూడు పూట్ల దాతలు అందజేసిన ఆహార పొట్లాలను తీసుకొని కడుపు నింపుకొని బిక్షాటన చేసి జీవించే వాళ్ళు.. కడుపు నిండిన తర్వాత ఫ్లై ఓవర్, బీచ్‌లోనీ విగ్రహాల కింద తల దాచుకుని నిద్రించేవాళ్లు.. వారు జీవించేది ఎలా ఉన్నప్పటికీ వారిలో కూడా ఆధిపత్య పోరు కొనసాగుతుంది. రూ.150లు కోసం జరిగిన చిన్నపాటి గొడవలో వారిలో ఓ బిచ్చగాడు ఆధిపత్యం ప్రదర్శించగా అది తట్టుకోలేని మరో బిచ్చగాడు కిరాతకుడిగా మారాడు. నిద్రిస్తున్న సమయంలో ఆధిపత్యం ప్రదర్శించిన బిచ్చగాడును కర్రతో దాడి చేసి హత్య చేశాడు. ఈ ఘటన విశాఖ నగరంలోని ఫోర్త్ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో బుధవారం జరిగింది. వివరాల్లోకి వెళితే తాడి చిరంజీవి, లక్ష్మణ రెడ్డి, హేమంత్ అనే ముగ్గురు బిచ్చగాళ్లు బుధవారం మధ్యాహ్నం చిరంజీవి, లక్ష్మారెడ్డిలు మద్యం సేవించిన తర్వాత వారి మధ్య రూ.150లు కోసం గొడవ జరిగింది. అనంతరం డైమండ్ పార్క్ తెలుగు తల్లి ఫ్లై ఓవర్ బ్రిడ్జి కింద దాతలు అందించిన భోజనం చేశారు. తర్వాత డైమండ్ పార్క్ లో బెంచ్ మీద నిద్రిస్తున్న చిరంజీవి తలపై లక్ష్మణరావు కర్రతో దాడి చేసి పరారయ్యాడు.. స్థానికులు గుర్తించి తీవ్రంగా గాయపడిన చిరంజీవిని కేజీహెచ్ కు తరలించారు. చికిత్స పొందుతూ చిరంజీవి సాయంత్రం 6 గంటలకు సమయంలో మృతి చెందాడు.. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు దాడికి గల కారణాలపై విచారించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మార్చురీకి తరలించారు. పరారైన నిందితుడిని అదుపులోనికి తీసుకున్నారు.. మృతి చెందిన చిరంజీవిపై మూడు ప్రాపర్టీ కేసులు ఉన్నట్టు పోలీసులు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు..

## ప్రభుత్వ వైద్య కాలేజీలు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కోటి సంతకాల సేకరణ

గాజువాక,నవంబర్ 19,ప్రభాతవార్త



జీవీఎంసీ 75వ వార్డు పెదగంట్యాడ ఎస్సీ షాపింగ్ కాంప్లెక్స్ ఆవరణ వద్ద ప్రభుత్వ వైద్య కాలేజీల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ కోటిసంతకాల కార్యక్రమాన్ని నిర్వహించారు. 75వ వార్డ్ వైకాపా అధ్యక్షులు గొందేసి శ్రీనివాస్ రెడ్డి (బుజ్జి)ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి మారేడుపూడి పరదేశి పాల్గొని మాట్లాడుతూ గత వైకాపా ప్రభుత్వం తెచ్చిన మెడికల్ కాలేజీల్ని ప్రభుత్వ ఆధీనంలో కొనసాగే విధంగా చేసిన జరుగు బలహీన వర్గాలకి పిల్లలకి ఉద్యోగ అవకాశాలు రావాలంటే ప్రభుత్వ ఆధీనంలో మెడికల్ కాలేజీలు కొనసాగాలన్నారు. స్టీల్ ప్లాంట్ విషయంలో ముఖ్య మంత్రి చంద్రబాబునాయుడు ఉద్యోగుల్ని అవమానపరచడం దారుణమని అన్నారు. విశాఖ స్టీల్ ప్లాంట్ ఉత్పత్తి కొరకు లాభాల కోసం ప్రతి ఒక్కరు కష్టపడి పనిచేయడం వల్లే 45 సంవత్సరాలు ప్లాంట్ అనేక లాభాలు సంపాదించిందని అన్నారు. అధినంద్రబాబునుర్గిపించారనెంనారు. కూటమి ప్రభుత్వం పై ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారని, అందుకే స్వచ్ఛందంగా సంతకాల సేకరణ లో పాల్గొంటున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో గంట్యాడ గోవిందరాజు, గొందేసి వెంకటరమణరెడ్డి, కాకినాడ పెంటారావు, మారిటిపూడి రాములు, ఎరబిల్లి శంకర్రావు, పైడికొండ, పాల్గొన్నారు.

## దేదీప్యమానంగా అనంతపద్మనాభస్వామి

9వ పేజీ తరువాయి ..



కుంతీ మాధవస్వామి, నారాయణేశ్వర ఆలయాలు భక్తులతో కిక్కిరిసిపోయాయి. అయితే పూర్వం సాంప్రదాయ ప్రకారం శ్రీదేవి, భూదేవి సమేతుడైన అనంతుడిని కుంతీమాధవ స్వామి ఆలయం నుండి పలు సాంస్కృతిక కార్యక్రమాలతో తోడ్కొని అనంతుని గిరి తొలి పావంచా వద్ద కొబ్బరి ఆకులు, పూలమాలలతో అందంగా అలంకరించిన పందిరిలో వేంచేయించారు. అక్కడ సీతారామాంజనేయస్వామి అర్చక బృందం స్వామివారికి ప్రత్యేకపూజలు చేసారు. అనంతరం సుముహూర్త ప్రకారం ఐదున్నర గంటలకు భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు స్వామివారి పాదాల చెంత తొలికార్తీక దీపంను వెలిగించారు. అనంతరం గుడిపై జేగంట మోగిన వెంటనే అప్పటి వరకు మెట్లపై వేచిఉన్న భక్తులు ఒక్కసారిగా దీపాలు వెలిగించారు. ఈ దీపకాంతులు ఆకాశాన్ని అంటాయి. ఈ దీపకాంతులు భక్తులలో ఆధ్యాత్మికతను పెంపొందించాయి. అలాగే సినీ హీరో బెల్లంకొండ శ్రీనివాస్ స్వామివారిని దర్శించుకున్నారు. ముందస్తుగా ప్రణాళిక ప్రకారం ఆలయ ఈఓ రాజు, ఆర్‌డిఓ సంగీత మాధుర్, పోలీసులు చర్యలు తీసుకోవడంతో దీపోత్సవం ప్రశాంతంగా ముగిసింది. ఎంపీపీ రాంబాబు, నాయకులు దాము, రమణ, పాల్గొన్నారు.

## 21 నుంచి ఘనంగా..

9వ పేజీ తరువాయి ..

జరిపామని, ఆశీర్వచనం మండపం విషయంలో కూడా మార్పులు చేశామని వివరించారు. ఆలయ సమీపంలో సీసీ రోడ్లు వేయించామని, గోతులు పూడ్చామని, డ్రెయిన్లను శుభ్రం చేయించామని తెలిపారు. సాధారణ భక్తులకు అసౌకర్యం కలగకుండా ప్రత్యేక క్యూ లైన్లను ఏర్పాటు చేశామని, వీఐపీల లైన్ సాధారణ భక్తుల లైన్లో కలవకుండా వెనుక నుంచి మరొక లైన్ వేస్తున్నామని స్పష్టం చేశారు. ఉత్సవాల నిర్వహణకు సంబంధించిన ఏర్పాట్లన్నీ ఇప్పటికే పూర్తయ్యాయని, వైదిక పూజా క్రతువుల అనంతరం (శుక్రవారం) 21వ తేదీ ఉదయం 8.40 గంటలకు మార్గశిర మాసోత్సవాలు సంప్రదాయబద్ధంగా ప్రారంభమవుతాయని తెలిపారు. రాజకీయ, అధికార ప్రముఖులు భాగస్వామ్యం కానున్నారని పేర్కొన్నారు. డిసెంబర్ 7వ తేదీ ఆదివారం సాయంత్రం 6.30 గంటల నుంచి వేదసభ, అర్చక సదస్సు జరుగుతాయన్నారు. డిసెంబర్ 13వ తేదీ శనివారం సాయంత్రం 4 గంటల నుంచి రథయాత్ర ప్రారంభమవుతుందని వివరించారు. డిసెంబర్ 18వ తేదీ గురువారం మధ్యాహ్నం 12 గంటల నుంచి మహా అన్నదానం అదేరోజు సాయంత్రం 4 గంటలకు సహస్ర ఘటాభిషేకం తదితర వైదిక కార్యక్రమాలు జరుగుతాయని పేర్కొన్నారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని వారికి ఎటువంటి అసౌకర్యం కలగకుండా తగిన విధంగా అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. చలువ పందిళ్లు వేయడంతో పాటు, భక్తులకు మంచి నీటి సదుపాయం కూడా కల్పిస్తున్నామన్నారు. భక్తులు దేవస్థానం సిబ్బంది, వాలంటీర్లకు సహకరించి అమ్మవారిని ప్రశాంత వాతావరణంలో దర్శించుకోవాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం ఉత్సవాలకు సంబంధించిన పోస్టర్ను అధికారులతో కలిసి ఆవిష్కరించారు. సమావేశంలో సమాచార పౌర సంబంధాల శాఖ డీడీ కె. సదారావు, దేవస్థానం ఈఈ వెంకట రమణ, ఏఈవో రాజేంద్రకుమార్, ఆలయ కమిటీ సభ్యులు, వైదిక కమిటీ సభ్యులు, పురోహితులు తదితరులు పాల్గొన్నారు.

## టాటానగర్ ఎక్స్ ప్రెస్‌కు ..

విశాఖపట్నం, నవంబర్ 19 ప్రభాతవార్త

పెందుర్తి వద్ద టాటానగర్ ఎక్స్ ప్రెస్‌కు పెను ప్రమాదం తప్పింది. రైల్వే గ్యాంగ్ రైలు రోడ్డు పనులు చేస్తుండగా విద్యుత్ వైర్లతో కలిగిన విద్యుత్ స్తంభ పక్కకి ఒరిగిపోయింది. అదే రోడ్లో టాటానగర్ ఎక్స్ ప్రెస్ పెందుర్తి దాటుతుంది అయితే టాటా నగర్ ఎక్స్ప్రెస్ లోకో పైలట్ ఈ ప్రమాదాన్ని ముందుగా గమనించి రైలును ఆపేశారు. దీంతో రైలు బండిలో ఉన్న ప్రయాణికులంతా క్షేమంగా ఉన్నారు. దీన్ని గమనించిన రైల్వే అధికారులు హుటా కొట్టిన ఆ విద్యుత్ స్తంభాన్ని పునరుద్ధరించారు. దీంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.

## శ్రీశైలం మల్లికార్జున స్వామిని దర్శించుకున్న అవంతి కుటుంబం

విశాఖపట్నం, నవంబర్ 19 ప్రభాతవార్త

కార్తీకమాసం సందర్భంగా శ్రీశైలం మల్లికార్జున స్వామిని మాజీ మంత్రి అవంతి శ్రీనివాసరావు కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. అనంతరం ఆలయ అర్చకులు ఆశీర్వచనం చేశారు. లోకంలో అన్ని ప్రాణులు సుఖ సంతోషాలతో ఉండాలని ఆయన ఆకాంక్షించారు.

## సైబర్ మోసాల ద్వారా కొల్లగొట్టిన డబ్బును క్రిప్టో కరెన్సీగా మార్చి సైబర్ నేరగాళ్లకు అందించిన వ్యక్తి అరెస్ట్

(విశాఖ క్రైమ్ - ప్రభాతవార్త)



పెట్రేగిపోతున్న సైబర్ మోసాలకు సకాలంలో చెక్ పెట్టే విధంగా భారత ప్రభుత్వం, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వాలు తీసుకువచ్చిన 1930/ నేషనల్ సైబర్ క్రైమ్ పోర్టల్ రిపోర్టింగ్ పోర్టల్‌లో మోసపోయిన బాధితుడు సకాలంలో ఫిర్యాదు చేయడం ద్వారా తాము పోగొట్టుకున్న డబ్బులను హోల్డ్ చేసి కోర్టు ఆర్డర్ ద్వారా సైబర్ పోలీస్ వారు వెనక్కి తీసుకొచ్చి ప్రయత్నం చేస్తున్నారు, అయితే దీనిని అధిగమించేందుకు సైబర్ నేరగాళ్లు రోజుకొక కొత్త ఎత్తులను వేస్తున్నారు. అది ఎలా అంటే బాధితుని దగ్గర నుంచి మోసం చేసిన డబ్బులని మొదటి లేయర్ అకౌంట్ ద్వారానే విత్డ్రా చేపించి అక్కడ నుంచి సైబర్ నేరగాళ్లు వారికి క్రిప్టో కరెన్సీ (యు ఎస్ డి టి) రూపంలో డిపాజిట్ చేస్తున్నారు. ఇలా చేయించడం ద్వారా 1930/ఎన్సీఆర్పి పోర్టల్ లో సకాలంలో పిర్యాదు చేసినప్పటికీ బాధితుడు పోగొట్టుకున్న అమౌంట్ హోల్డ్ కావడం జరగట్లేదు. సైబర్ నేరగాళ్ళు ఎన్ని ఎత్తులు వేస్తున్నప్పటికీ వారిని అరికట్టే విషయంలో సైబర్ క్రైమ్ పోలీసులు మరొక ఎత్తు పైనే ఉంటారని విశాఖపట్నం సైబర్ క్రైమ్ పోలీసులు నిరూపించారు. డిజిటల్ అరెస్ట్, క్రిప్టో ట్రేడింగ్, ఇన్వెస్ట్మెంట్ ఫ్రాడ్, టాస్క్ బేస్డ్ పార్ట్ టైం జాబ్స్, వాట్సప్ ఇంపర్సనన్సన్ స్కామ్ భాదితుల నుంచి సైబర్ మోసం ద్వారా కొల్లగొట్టిన డబ్బులను మ్యూల్ అకౌంట్ల ద్వారా విత్డ్రా చేసి, వాటిని సైబర్ నేరగాళ్లకు క్రిప్టో కరెన్సీగా మార్చి అందించిన వ్యక్తిని తాజాగా విశాఖ సిటీ సైబర్ క్రైమ్ పోలీసులు అరెస్ట్ చేశారు. తెలంగాణ రాష్టం, జగిత్యాల జిల్లా, గొల్లపల్లిలో ఉన్నట్లు నిర్ధారించుకొని సాంకేతిక సహాయంతో ముద్దాయిలని చాకచక్యంగా పట్టుకొని రిమాండ్‌కి తరలించగా న్యాయమూర్తి 15 రోజులు జుడీష్యల్ రిమాండ్ విధించారు.

### మోసం ఎలా జరిగింది?

విశాఖపట్నంకి చెందిన ఒక బాధితుడికి ఈ ఏడాది జులై 5వ తేదీన ఒక ఫోన్ నెంబర్ నుంచి వాట్సాప్ సందేశం వచ్చింది, అది తన స్నేహితుడు ది అని నమ్మించి ప్రస్తుతం డబ్బులు అవసరం ఉన్నాయి అని చెప్పి ఒక మూడు అకౌంట్లో లో కోటి రూపాయలు బదిలీ చేయించుకున్నారు తర్వాత ఫోన్ చేసి నిర్ధారణ చేయగా అది వారు కాదని తెలిసి బాధితుడు తాను మోసపోయినట్టు గుర్తించిన వెంటనే, నేషనల్ సైబర్ క్రైమ్ పోటల్‌లో ఫిర్యాదు నమోదు చేసారు. దర్యాప్తు- సాంకేతిక ఆధారాల సేకరణ ఫిర్యాదు నమోదు చేసిన వెంటనే విశాఖపట్నం పోలీస్ కమిషనర్, అదనపు జిల్లా మేజిస్ట్రేట్ డా.శంఖబ్రత బాగ్చి ఆదేశాల మేరకు సైబర్ క్రైమ్ పోలీసులు కేసు నమోదు చేసుకున్న వెంటనే సిటీ సైబర్ క్రైమ్ పోలీసులు సాంకేతిక దిశగా దర్యాప్తు ప్రారంభించారు. మొదటిగా బ్యాంక్ ట్రాన్సాక్షన్లు, యూపీఐ పేమెంట్ లింకులు, వాట్సాప్ అకౌంట్స్ ఐపి లాగ్స్ విశ్లేషించారు. ఈ ప్రక్రియలో అనేక లేయర్లు గుండా డబ్బు తిరిగి తిరిగి చివరికి జగిత్యాల జిల్లాకి చెందిన లక్కకుల మనోజ్ ఖాతాల్లోకి చేరినట్లు తేలింది. ముద్దాయి అయిన లక్కకుల మనోజ్ బినాన్స్ యాప్ ద్వారా యూఎస్ డిటి (టేతర్) ట్రేడింగ్ చేస్తున్న సమయంలో అతనికి వివిధ సోషల్ మీడియా యాప్ ద్వారా పరిచయమై వ్యక్తులతో, పి2పి ట్రాన్సాక్షన్ చేసేవారు. అతని సూచనల మేరకు అధిక కమిషన్ ఆశతో యూఎస్డిటిలను పంపడం ప్రారంభించాడు. దానికోసం అతను వాళ్ళ స్నేహితుడు శ్రీధర్ అలియాస్ సిద్ధూ, రాకేశ్ ఇలా పదుల సంఖ్యలో అనేక బ్యాంకు అకౌంటులు తెరిచి బినాన్స్ పేరు మీద సైబర్ నేరగాళ్ల నుంచి అధిక కమిషన్ కోసం ఫ్రాడ్ అమౌంట్‌ని యుఎస్‌డిటి రూపంలో సైబర్ నెరగళ్ళకి అందించేవారు. మొత్తం సుమారు 8 కోట్ల వరకు అతని అకౌంట్లో డబ్బులు పడగా దాన్ని యూఎస్ డిటి కొనుగోలు చేసి దాన్ని క్రిప్టో కరెన్సీలోకి మార్చి సైబర్ నేరగాలకికి చేర్చడం జరిగింది. ఈ నేరంలో ముద్దాయిని అరెస్ట్ చేయడం జరిగింది ప్రధాన ముద్దాయి దుబాయ్‌లో ఉన్నారని తెలియడం జరిగింది వాళ్ల కోసం ఎల్‌ఓసి జారీ చేయడం జరుగుతుంది. ముద్దాయిలు వినియోగిస్తున్న సదరు అక్కౌంట్స్‌కి పరిశీలించగ వారు ఎక్కువగా డిజిటల్ అరెస్ట్, ట్రేడింగ్, టాస్క్ బేస్డ్ పార్ట్ టైమ్ జాబ్స్, ఇన్వెస్టయిమెంట్ ఫ్రాడ్ వంటి సైబర్ నెరలకి వినియోగిస్తున్నట్లు నిర్ధారణ అయింది. ప్రధాన ముద్దాయి కోసం లోతయిన దహర్యాప్తు చేస్తునట్లు సైబర్ క్రైమ్ పోలీసులు తెలిపారు.

### పోలీసుల హెచ్చరిక..

ఆన్లైన్ , ఆఫ్లైన్ టాస్క్ బేస్డ్ ఇన్వెస్ట్మెంట్ , టాస్క్ బేస్డ్ పార్ట్ టైమ్ జాబ్, వంటి స్కామ్ లలో మీకు తక్కువ డబ్బుల పెట్టుబడికి ఎక్కువ లాభాలు వస్తాయని ప్రజలకు ఆశ చూపించి లక్షల రూపాయలు కొల్లగొట్టడం జరుగుతుందనీ సైబర్ క్రైమ్ పోలీసులు తెలిపారు. అందువలన ప్రజలెవరు కూడా ఆన్లైన్ టాస్క్ బేస్డ్ పార్ట్ టైమ్ జాబ్స్ జోలికి వెళ్ళకుండా ఉండాలని మనవి చేశారు. ఎవరైనా నిర్వహిస్తున్న వారికి సహకరించిన, వారి పై చట్ట ప్రకారం తగు చర్యలు తీసుకుంటామని తెలియజేశారు. సైబర్ క్రైమ్ పిర్యాదుల కొరకు సైబర్ క్రైమ్ రిపోర్టింగ్ పోర్టల్ www.cybercrime.gov.in, లేదా టోల్ ఫ్రీ నెంబర్: 1930 లేదా శ్రీ కమిషనర్ ఆఫ్ పోలీస్: 7995095799 వారికి కాల్ చేసి ఫిర్యాదు చేయగలరని తెలిపారు.

## మేయర్, జీవీఎంసీ కమిషనర్‌ను కలిసిన ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్

(ప్రభాతవార్త-విశాఖపట్నం)

దక్షిణ నియోజకవర్గం పరిధిలోని పెండింగ్‌లో వున్న వివిధ అభివృద్ధి పనులను చేపట్టాలని మేయర్ పీలా శ్రీనివాస్, జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్‌లను బుధవారం ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ కలిశారు. నియోజకవర్గ పరిధిలో పెండింగ్‌లో వున్న అభివృద్ధి పనులు, సమస్యలపై వీరితో చర్చించారు. పెండింగ్ పనులు త్వరగా ప్రారంభించాలని, నూతన అభివృద్ధి పనులకు నిధులు మంజూరయ్యేలా చూడాలని ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ కోరారు.

## అత్యంత వైభవంగా రుద్రాభిషేకం..

9వ పేజీ తరువాయి ..

నిర్వహించారు. వేద పండితులు చంద్రమౌళి ప్రభాకర సత్యనారాయణ శర్మ, ఎలమంచిలి శ్రీనివాస శర్మ, కొత్తలంక పల్లం దాను శర్మ, దేవస్థానం అర్చకులు పేరూరు చిన్నస్వామి, పేరూరి సాత్విక్ శర్మ, పేరూరు సూర్యనారాయణ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో భక్తులు హాజర్ అయినట్లు దేవస్థానం చైర్మన్ కాంట్రాక్టర్ గులిమి సత్యనారాయణ తెలిపారు. పట్టణ ప్రముఖులు, వివిధ పార్టీలకు చెందిన నాయకులు స్వామి వారిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో ధర్మకర్తలు యలమంచిలి బంగారు రాజా, మల్ల సూరిబాబు, మద్దాల నారాయణరావు, పెంటకోట గణేష్, కొట్ల హరి, దూలం సత్యవతి పాల్గొన్నారు.

## డ్రైవింగ్ ట్రైనింగ్ సెంటర్ ఏర్పాటుకు 20లోగా దరఖాస్తు చేసుకోండి

మాధవధార, నవంబర్ 19 ప్రభాతవార్త



ప్రధానమంత్రి కౌసల్ వికాస్ యోజన కార్యక్రమంలో భాగంగా డ్రైవింగ్ ట్రైనింగ్ సెంటర్ ఏర్పాటుకు ఈ నెల 20వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని జిల్లా రవాణా శాఖాధికారి ఆర్ సి హెచ్ శ్రీనివాస్ తెలిపారు. నైపుణ్యంతో కూడిన డ్రైవింగ్ స్కిల్స్ అభివృద్ధి చేయడంలో భాగంగా కేంద్ర ప్రభుత్వ ఆర్థిక సహాయంతో డ్రైవింగ్ ట్రైనింగ్ సెంటర్లు ఏర్పాటు చేయడమే దీని ఉద్దేశ్యమన్నారు. ఇందులో భాగంగా 10 లక్షల జనాభాకు ఒక డ్రైవింగ్ ట్రైనింగ్ సెంటర్ ఏర్పాటు మంజూరు చేశారన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు డీపీఆర్ నకలును, ఇతర ఆధార ధ్రువీకరణలను స్థానిక జిల్లా రవాణాధికారి కార్యాలయంలో అందజేయాలని కోరారు. ఎన్జీఓ, ట్రస్ట్, కోపరేటివ్ సొసైటీ, తయారీదారుడు ఫార్మ్ అయి ఉండాలన్నారు. ఎన్జీఓ అయితే తప్పనిసరిగా దర్పణ్ పోర్టల్లో రిజిస్టర్ అయి ఉండాలని, మూడు సంవత్సరాల ఆడిట్ రిపోర్ట్స్, టర్న్ ఓవర్ సర్టిఫికెట్స్ సమర్పించాలన్నారు. ఇటువంటి సంస్థకు సొంతంగా లేదా కనీసం పదేళ్ల లీజు కలిగిన రెండు ఎకరాల స్థలం, సిమ్యూలేటర్, ట్రైనింగ్ వాహనాలు, వర్క్ షాప్, క్లాస్ రూమ్స్, ఇంటర్నెట్ తదితర సదుపాయాలు ఉండాలన్నారు. ధరఖాస్తులను జిల్లా కలెక్టర్కు నివేదించి, వారి ఆమోదంతో మంజూరు ఉంటుందన్నారు. మరిన్ని వివరాలకొరకు 9281607042 సంప్రదించాలని కోరారు.

## మారేడుమిల్లి అడవుల్లో మరో ఎన్‌కౌంటర్

9వ పేజీ తరువాయి ..

భయాందోళనలు నెలకొన్నాయి. మంగళవారం ఎన్కౌంటర్ జరిగిన నాలుగు కిలోమీటర్ల దూరంలో గుజ్జు మామిడి వలస వద్ద బుధవారం ఉదయం మావోలు పోలీసులు మధ్య ఎదురు కాల్పులు జరిగాయి. ఉదయం 5 నుండి 6 గంటల మధ్యన ఎదురుకాల్పులు జరిగినట్లు అల్లూరి జిల్లా ఎస్పీ అమిద్ బర్దర్ వెల్లడించారు. ఎన్కౌంటర్లో రాష్ట్ర పోలీసులతో పాటు సిఆర్పిఎఫ్ బలగాల పాల్గొన్నట్లు చెప్పారు. మరణించిన వారిలో నలుగురు పురుషులు ముగ్గురు మహిళలు ఉన్నట్లు తెలియజేశారు. ఏవోబి ఇన్చార్జ్ జోగారావు కమ్యూనికేషన్ చీఫ్ టెక్ శంకర్, ప్రొటెక్షన్ టీం కమాండర్ జ్యోతి, సురేష్, లోకేష్, శైను, అనిత, షమ్మీ గా గుర్తించారు. మంగళవారం నాటి ఎన్కౌంటర్ నుండి తప్పించుకున్న మావోయిస్టుల కోసం పోలీస్ బలగాలు అటవీ ప్రాంతాన్ని జల్లెడ పడుతున్నాయి. ఈ క్రమంలో బుధవారం ఉదయం కాల్పులు జరిగాయి. ఈ ఎన్కౌంటర్లో కేంద్ర కమిటీ సభ్యుడు నంబాల కేశవరావు ప్రొడక్షన్ టీం కమాండర్ డివిజనల్ కమిటీ సభ్యురాలు జ్యోతి హతమైనట్లు తెలిసింది. మావోయిస్టు చీఫ్ దేవ్ జీ ఎన్కౌంటర్ నుండి తప్పించుకున్నట్లు పోలీసు ఉన్నతాధికారులు వెల్లడించారు. గాలింపు చర్యలు కొనసాగుతున్నట్లు చెప్పారు. మంగళవారం నాటి ఎన్కౌంటర్లో ప్రాణాలు కోల్పోయిన ఆరుగురు మావోయిస్టుల మృతదేహాలు రంపచోడవరం ఆస్పత్రి మార్చురీలో ఉండగానే మరొక ఎన్కౌంటర్ జరగడం మరొక ఏడు మృతదేహాలు ఇక్కడకు తీసుకుని రావడం జరిగింది. దీంతో దేశవ్యాప్తంగా ఉన్న మీడియా అంతా రంపచోడవరం వైపు పరుగులు తీసింది జాతీయ మీడియా ప్రతినిధులందరూ రెండు ఎన్కౌంటర్లో కవరేజ్ కోసం ఏజెన్సీ ప్రాంతానికి వాలిపోయారు. పోలీసులు భద్రత కోసం ఏజెన్సీకి అదనపు బలగాలను రప్పించారు. గతంలో ఎన్నడూ లేని విధంగా మారేడుమిల్లి సమీపంలోని భారీ ఎన్కౌంటర్ జరగడంతో ఆ గ్రామస్తులు ఉలిక్కిపడ్డారు. ఏం జరుగుతుందో అర్థం కాని పరిస్థితుల్లో ఉన్నారు. కొంత సమయానికి ఎన్కౌంటర్ వివరాలు తెలిసి భయాందోళనకు గురయ్యారు. మారేడుమిల్లి చింతూరు మధ్య ఉన్న కదలికలపై పోలీసులు నిఘా పెంచారు. వాహనాలను తనిఖీ చేస్తున్నారు.

## 'స్మార్ట్' వెండింగ్ జోన్లను సిద్ధం చేయాలి..

9వ పేజీ తరువాయి ..

ప్రతి ప్రాంతంలో మరుగుదొడ్లు (టాయిలెట్లు) ఏర్పాటు, ప్రతి దుకాణానికి ప్లంబింగ్ మరియు తాగునీటి సరఫరా, వినియోగదారుల కోసం వాష్‌బేలు, చేతులు కడుక్కోవడానికి వాష్ బేసిన్లు,వినియోగదారులు సేదతీరడానికి ప్రత్యేకంగా సీటింగ్ జోన్‌లు మరియు నిర్ణీత ప్రదేశాలు తదితర సదుపాయాలతో, గాలి, వెలుతురు కలిగిన విధంగా స్మార్ట్ వెండింగ్ జోన్లు ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేస్తూ ప్రణాళికలను రూపొం దించడం జరుగుతున్నదని, ఇది వీధి విక్రయిదారులకు, ప్రజలకు సౌకర్యవంతంగా ఉంటాయని కమిషనర్ తెలిపారు. ఆయా వెండింగ్ జోన్ల స్థలాలకు సంబంధించి ప్రతిపాదించిన నమూనాలను ఆర్కిటెక్ట్ వంశీకృష్ణ కమిషనర్‌కు వివరించగా, కమిషనర్ పరిశీలించి అన్ని మౌలిక సదుపాయాల రూపకల్పనతో పూర్తి నివేదికను సిద్ధం చేసి కార్యాచరణ చేపట్టాలని ప్రధాన ఇంజనీర్ పివివి సత్యనారాయణ రాజుకు కమిషనర్ ఆదేశించారు. పర్యవేక్షక ఇంజనీర్ శాంతిరాజ్, డిసిపి హరిదాస్, ఏసీపీలు శాస్త్రి, ఝాన్సీ లక్ష్మి, ఉప కార్య నిర్వహణ అధికారి వెంకటేశ్వర రావు, ఏపీడీలు శ్రీరామ్, పద్మావతి, తదితరులు పాల్గొన్నారు.

## 21న జిల్లాలో పిటిషన్ల కమిటీ పర్యటన

విశాఖపట్నం, నవంబర్ 19, ప్రభాతవార్త

పిటిషన్లపై శాసన సభ కమిటీ సమావేశం ఈ నెల 21వ తేది ఉదయం 11.00 గంటలకు విశాఖపట్నం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించబడుతుందని శాసన సభ సెక్రటరీ జనరల్ ప్రసన్న కుమార్ సూర్యదేవర ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశంలో చిత్తూరు శాసన సభ్యులు గురజాల జగన్ మోహన్ కమిటీకి సమర్పించిన "సమగ్ర భూసర్వే (కంప్రెహెన్సివే ల్యాండ్ రి-సర్వే)" పిటిషన్‌పై చర్చ జరుగనుందని పేర్కొన్నరు.

## జీవీఎంసీ రెవెన్యూ వసూళ్లపై దృష్టి సారించండి : జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్

విశాఖపట్నం, నవంబర్ 19, ప్రభాతవార్త



మహా విశాఖపట్నం నగరపాలక సంస్థ పరిధిలోని ఆస్తి, ఖాళీ జాగా పన్నుల వసూలుపై ప్రత్యేక దృష్టి సారించి పన్నుల వసూళ్లను వేగవంతం చేయాలని జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ జీవీఎంసీ రెవెన్యూ అధికారులను ఆదేశించారు. బుధవారం ఆయన జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలోని సమావేశ మందిరంలో జీవీఎంసీ అదనపు కమిషనర్ డి.వి. రమణమూర్తి, డిసి (ఆర్) ఎస్. శ్రీనివాసరావు, జోనల్ కమిషనర్లు, రెవెన్యూ అధికారులతో సమీక్ష నిర్వహించారు. జీవీఎంసీ కమిషనర్ మాట్లాడుతూ మరో 4 నెలల్లో జీవీఎంసీ ఆర్థిక సంవత్సరం ముగుస్తున్నందున ఆస్తి, ఖాళీ జాగా పన్నులతో పాటు పాత బకాయిలను, నీటి చార్జీలను వసూళ్లపై ప్రత్యేక దృష్టి సారించి పన్నులను వసూలు చేయాలని ఆదేశించారు. కొన్ని జోనల్లో తక్కువగా పన్నుల వసూళ్ల చేస్తున్నారని వాటిపై దృష్టి సారించి పాత బకాయిలను కలిపి పనుల వసూళ్లను చేయాలన్నారు. నూతనంగా నియమితులైన రెవెన్యూ ఆఫీసర్లు వారి విధులు పట్ల అంకిత భావంతో పనిచేయాలని ఎటువంటి అవినీతికి పాల్పడరాదని తెలిపారు. పన్నుల వసూళ్లకు సంబంధించి ప్రభుత్వ, ప్రైవేటు ఆస్తుల పూర్తి సమాచారం కలిగి ఉండాలన్నారు. ప్రతిరోజు రెవిన్యూ ఇన్స్పెక్టర్లు సచివాలయ అడ్మిన్ కార్యదర్శులతో సమీక్షించి రోజుకో సచివాలయం పరిధిలోని ఇండ్లను సందర్శించి ఆస్తి, ఖాళీ జాగా పన్నులను వసూలు చేయాలన్నారు.

## ఘనంగా భారతరత్న...ఉక్కు మహిళ...మాజీ ప్రధాని ఇందిరాగాంధీ జయంతి వేడుకలు

గాజువాక,నవంబర్ 19,ప్రభాతవార్త



గాజువాక శాఖ గ్రంథాలయంలో 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా బుధవారం భారత మొట్టమొదటి మహిళ ప్రధాని ఇందిరాగాంధీ జయంతి వేడుకలు గ్రంథాలయ అధికారిని బత్తిన సూర్యకళ అధ్వర్యంలో ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగ విచ్చేసిన సాహిత్య సుధా వ్యవస్థాపకులు అద్దంకి రాఘవాచార్యులు జ్యోతి ప్రజ్వలన చేసి ఇందిరా గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా రాఘవాచారి మాట్లాడుతూ ఇందిర గాంధీ భారతదేశాన్ని తండ్రి వలె 16 సంవత్సరాలు పాలించారని, ఆమె పాలనలో 20 సూత్రాలు ప్రవేశపెట్టారన్నారు. బ్యాంకులను విలీనం చేశారని ఆమె దేశానికి చేసిన సేవలను ప్రశంసించారు. గురువారం వారోత్సవాల ముగింపు సభ గెలుపొందిన విద్యార్థులకు బహుమతి ప్రధానోత్సవం పెద్దల చేతుల మీదుగా నిర్వహించబడును గ్రంథాలయ అధికారిణి బత్తిన సూర్యకళ తెలిపారు. ఈ కార్యక్రమంలో జడ్పీ హైస్కూల్ టీచర్స్, స్వామి వివ్య నికేతన్ స్కూల్ టీచర్స్ గ్రంథాలయ పాఠకులు, పాఠశాల విద్యార్థులను సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## రైతుకు అండగా కూటమి ప్రభుత్వం



9వ పేజీ తరువాయి ..

ఉండాలని సీఎం చంద్రబాబు నాయుడు వారి సంక్షేమం కోసం అనేక పథకాలను అమలు చేస్తున్నారని పేర్కొన్నారు. దళారులు, మిల్లర్ల బారిన పడకుండా రైతు పండించిన పంటకు గిట్టుబాటు ధర కల్పించాలని ఆలోచనతో ప్రభుత్వమే ధాన్యాన్ని కొనుగోలు చేస్తోందన్నారు. లోటు బడ్జెట్‌లో ఉన్నప్పటికీ అభివృద్ధిని, సంక్షేమాన్ని సమన్వయం చేసుకుంటూ ఆంధ్రప్రదేశ్ ను అగ్రస్థానంలో నిలబెడుతున్నామన్నారు. రైతులకు పెట్టుబడి సాయం అందించడంలో.. రూ.2 వేల పెన్షన్‌ను రూ.3 వేలకు పెంచడంలో.. కుటుంబంలో పిల్లలందరికీ అమ్మఒడి లబ్ధిని వర్తింపజేయడంలో.. జగన్మోహన్ రెడ్డి ప్రజలను దారుణంగా మోసం చేశారని విమర్శించారు. అనంత పద్మనాభస్వామి ఘాట్ రోడ్డును, రెడ్డిపల్లి మెయిన్ రోడ్డును వైసీపీ ప్రభుత్వం పట్టించుకోలేదని.. మళ్లీ తాను అధికారంలోకి వచ్చిన తర్వాతే పూర్తి చేశానన్నారు. భీమిలి నియోజకవర్గంలోని 7 ఇనాం గ్రామాల్లో రైతులకు అన్నదాత సుఖీభవ పెట్టుబడి సాయాన్ని వర్తించేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్‌కు సూచించారు. తాటితూరు కాజ్‌వేను తొందర్లోనే పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేందిర ప్రసాద్ మాట్లాడుతూ విత్తనాలు, ఎరువులు, పొలం దున్నుకునే పనులకు ప్రభుత్వమిచ్చే పెట్టుబడి సాయం ఎంతగానో ఉపయోగపడుతుందని చెప్పారు. ధాన్యాన్ని సేకరించిన 24 నుంచి 72 గంటల్లో రైతుల ఖాతాల్లోకి నగదు జమ చేస్తామని ఆయన తెలిపారు. పొలంబడి పేరుతో కొత్త సాగు విధానాలు తెలియజేస్తున్నామని పేర్కొన్నారు. అనంతరం తాటితూరు రైతు సేవా కేంద్రంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే గంటా ప్రారంభించారు. అలాగే రబీ సీజన్ కోసం రైతులకు విత్తనాలను అందజేశారు. జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్, జిల్లా వ్యవసాయాధికారి అప్పలస్వామి, అసిస్టెంట్ డైరక్టర్ విజయ్ కుమార్, జిల్లా సహకార శాఖాధికారి ప్రవీణ, పౌర సరఫరాల శాఖాధికారి భాస్కర రావు, భీమిలి జెడ్పీటీసీ గాడు వెంకట ప్పడు, కూటమి నాయకులు చిక్కాల విజయ్‌బాబు, సరగడ అప్పారావు, తాత్రాజు అప్పారావు, ఎన్.శ్రీధర్ పాల్గొన్నారు.


## CLASSIFIEDS

వార్త VAARTHA CLASSIFIEDS

### CHANGE OF NAME

★ I, (OPRADISTA JYOTEE) W/O (BALLA HARA GOPAL) born on (27/08/1966) have changed my name to (BALLA JYOTHI) vide affidavit dated (18/11/2025) at (VISAKHAPATNAM). for all purpose. (Ro.No.30768)

★ నేను, యల్లబిల్లి సూకరాజు, యల్లబిల్లి ప్రవల్లి తండ్రిని. ఆమె సరైన పేరు యల్లబిల్లి ప్రవల్లి అని ఇక్కడ ప్రకటిస్తున్నాను. ఆధార్‌లో తప్పుగా ప్రవల్లి సంగమిత్రా యల్లబిల్లి అని ఉంది. సరైన పేరు: యల్లబిల్లి ప్రవల్లి. Sd/- Y. సూకరాజు. (Ro.No.30776)

★ I, Yandrapati Gnana Sundara Raju S/o Yandrapati Prabhakara Rao, previously called Yendrapati Gnana Sundar Raj R/o G-5, Prathima Paradise Isle, Krishna Nagar, Beach Road, Maharanipeta, Vizag now changed my name from Yendrapati Gnana Sundar Raj to Yandrapati Gnana Sundara Raju. Henceforth I will be called as Yandrapati Gnana Sundara Raju for all purposes. (Ro.No.30950)

### SITUATION VACANT

★ Female Personal Assistant for an author Required. Involves manuscript work and documentation. whatsapp 6304751936. (Ro.No.30787)

### గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగినరీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో "వార్త" దినపత్రికకు ఏ విధమైన సంబంధం లేదు.



ఇండియన్ బ్యాంక్ — పెందుర్తి శాఖ

డో.నెం.13-3, లక్ష్మీ నరసాయమ్మ వీధి, సుజాత నగర్, పెందుర్తి - 530051, ఫోన్.0891- 2549504

### స్థిరాస్తుల అమ్మకానికి అమ్మకం ప్రకటన

"APPENDIX- IV-A" (రూలు 6(2) & 8(6)కు నిబంధన చూడండి)

సెక్యూరిటీ ఇంటరస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 లోని రూలు 6(2) & 8(6) నిబంధనలతో చదువబడు సెక్యూరిటైజేషన్ & రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్టు 2002 క్రింద స్థిరాస్తుల అమ్మకానికి ఇ-వేలం ప్రకటన.

ఈ విధంగా సాధారణంగా ప్రజలకు మరియు ఋణగ్రహీత(లు) మరియు హామీదారు(లు)కు నోటీసులు ఇవ్వడమైనది. క్రింద వివరించిన స్థిరాస్తి సెక్యూర్డు క్రెడిటార్, తనఖా పెట్టిన వీటిని ఇండియన్ బ్యాంక్, పెందుర్తి శాఖ యొక్క అధీకృత అధికారి స్వాధీనతలోనికి తీసుకున్నారు. అమ్మకం "ఎక్కడ ఎలా ఉన్నది అక్కడ అలాగే మరియు అక్కడ ఏమున్నదో అదే" పద్ధతిపై ది.24-12-2025న అమ్మబడుతుంది. ఇండియన్ బ్యాంక్, పెందుర్తి శాఖకు బకాయి మొత్తం ది.16-11-2025 నాటికి రూ.29,19,394/- (అక్షరాల ఇరవై తొమ్మిది లక్షల పంతొమ్మిది వేల మూడు వందల తొంభై నాలుగు రూపాయలు మాత్రము) మరియు తేది.17.11.2025 నుండి తదుపరి జమకూడు వడ్డీ, ఖర్చులు, ఇతర ఛార్జీలు మొ॥నవి. ఋణగ్రహీత : శ్రీ జనపాల వెంకట రామకృష్ణ, తండ్రి : అర్జునరావు, డి.నెం.2-129/9/4, సాయిబుల వీధి, పుల్లగాలిపాలెం గ్రామం, పెందుర్తి, విశాఖపట్నం - 531173. సహ-దరఖాస్తుదారు : శ్రీమతి నలుపు జ్యోతి, భర్త: శ్రీ జె. వెంకట రామకృష్ణ, డి.నెం.2-129/9/4, సాయిబుల వీధి, పుల్లగాలిపాలెం గ్రామం, పెందుర్తి, విశాఖపట్నం - 531173.

ఇ-వేలం ద్వారా అమ్మకానికి ప్రతిపాదించబడిన ఆస్తుల యొక్క నిర్దిష్ట వివరములు దిగువన పేర్కొనబడినవి

| ఆస్తి యొక్క పూర్తి వివరణ : | రిజర్వు ధర | ధరావత్తు | ఈ - వేలము తేది మరియు సమయం | ఆస్తిపై ఎన్‌కంబ్రెన్స్ |
|---|---|---|---|---|
| విశాఖపట్నం జిల్లా, పెందుర్తి ఎస్‌ఆర్‌ఓ పరిధిలో, విశాఖపట్నం, జివిఎమ్‌సి పరిధిలో, పూలగాలిపాలెం గ్రామం, ఎస్.నెం.108/10 లోని 120.00 చ॥గ॥లు లేదా 100.335 చ॥మీ॥ల స్థల విస్తీర్ణంలో 702 చ॥అ॥ల విస్తీర్ణంతో గల ఆర్‌సిసి స్లాబ్‌డ్ నివాస ఇల్లు యావత్తు ఆస్తి. హద్దులు: తూర్పు : లోకానం పద్మావతి గారి స్థలం, దక్షిణం: మేడిశెట్టి పెదటాటా గారి స్థలం, పడమర : మేడిశెట్టి కనకరాజు & ఇతరుల స్థలం, ఉత్తరం : 30 అ॥ల రోడ్డు. ఆస్తి ఐడి నెం.: IDIB3266298058 | రూ. 31,13,100/- (అక్షరాల ముప్పై ఒక్క లక్షల పదమూడు వేల ఒక వంద రూపాయలు మాత్రమే) | రూ. 3,11,310/- (అక్షరాల మూడు లక్షల పదకొండు వేల మూడు వందల పది రూపాయలు మాత్రమే) | 24-12-2025 సమయం : ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 4 గం॥ల వరకు బిడ్ పెంపుదల మొత్తం: రూ.10,000/- (అక్షరాల పదివేల రూపాయలు) | లేదు |

ఇ-వేలంలో పాల్గొనడానికి ఇఎమ్‌డి మొత్తాన్ని చెల్లించడానికి చివరి తేది మరియు సమయం : ది.23.12.2025 & సాయంత్రం గం.5 :00 ని॥లకు

వేలం బిడ్ ఫారం మరియు నియమనిబంధన వివరములను మా ఇ-వేలం సర్వీస్ ప్రొవైడర్ M/s PSB Alliance వారి వెబ్‌సైట్ (www.baanknet.com) నందు ఆన్‌లైన్ బిడ్‌లో పాల్గొనుటకు చూడవలసినదిగా బిడ్డర్స్‌కు సలహాసీయటమైనది. ఇ-వేలం పూర్తి విధానం సాంకేతిక సహాయం కొరకు M/s PSB Alliance హెల్ప్‌డెస్క్ నెం. 08291220220 మరియు సర్వీసు ప్రొవైడర్‌లో లభించు ఇతర హెల్ప్‌లైన్ నెంబర్‌లను సంప్రదించండి. M/s PSB Alliance, రిజిస్ట్రేషన్ స్టేటస్ కోసం దయచేసి support.baanknet@psballiance.com మరియు ధరావత్తు స్టేటస్ కోసం దయచేసి support.baanknet@psballiance.com సంప్రదించవచ్చును. ఆస్తి వివరాలు మరియు ఆస్తి ఫొటోగ్రాఫ్ మరియు వేలం నిబంధనలు మరియు షరతుల కోసం దయచేసి https://baanknet.comను సంప్రదించండి. మరియు ఈ పోర్టల్‌కు సంబంధించిన వివరణలకోసం హెల్ప్‌లైన్ నెంబర్ 08291220220 నందు సంప్రదించండి. https://baanknet.com లో వెబ్‌సైట్‌లోని ఆస్తికోసం చూస్తున్నప్పుడు పైన పేర్కొన్న ఆస్తి ఐడి నెంబర్‌ను ఉపయోగించి బిడ్డర్లు చూడగలరు.

గమనిక : ఆస్తిని రిజిస్ట్రేషన్ చేసుకొనుటకు వర్తించే స్టాంపు డ్యూటీ, బదిలీ ఛార్జీలు, ఫీజు వగైరాలు మరియు చట్టపరమైన/నాన్ స్టాట్యూవరి బకాయిలు, పన్నులు, రేట్లు, ఎస్సెస్‌మెంట్ ఛార్జీలు, ఫీజులు వగైరాలు కొనుగోలు దారే భరించవలెను.

ప్రదేశం : పెందుర్తి
తేది : 17-11-2025

సం/- అధీకృత అధికారి, ఇండియన్ బ్యాంక్



ఫారం నెం-14 (రెగ్యులేషన్-33(2) చూడుము)

భారత ప్రభుత్వం - ఆర్థిక మంత్రిత్వ శాఖ - ఫైనాన్షియల్ సర్వీసెస్ శాఖ
డెట్స్ రికవరీ ట్రిబ్యునల్ రికవరీ ఆఫీసర్-I వారి కార్యాలయం
31-31-21, నారాయణ భవనము, సాయిబాబా వీధి, దాబాగార్డెన్స్, విశాఖపట్నం-530 020

### డిమాండ్ నోటీసు

(అప్పులు & దివాలా చట్టం 1993 యొక్క రికవరీ సెక్షన్ 25 నుండి 28 వరకు నోటీసు మరియు ఆదాయపు పన్ను చట్టం 1961లోని రెండవ షెడ్యూల్‌లోని రూల్ 2 ప్రకారం నోటీసు)

ఆర్‌సి/453/2024 తేది.01.11.2025

స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, SME సెంటర్, కలక్టరేట్ కాంపౌండ్, మహారాణిపేట, విశాఖపట్నం
వర్సెస్
మెస్సర్స్ సాయి ఎంటర్‌ప్రైజెస్ మరియు మరొకరు

టు
(సిడి-1) మెస్సర్స్ సాయి ఎంటర్‌ప్రైజెస్, ప్రాతినిధ్యం వహిస్తున్న ప్రొప్రయిటర్: శ్రీమతి జబ్బా సుమహిత, డి.నెం.8-4-30, పార్కు, అశోక్‌నగర్, పాతగాజువాక, విశాఖపట్నం-530026.
(సిడి-2) శ్రీమతి జబ్బా సుమహిత, ప్రొప్రయిటర్: మెస్సర్స్ సాయి ఎంటర్‌ప్రైజెస్, డి.నెం.8-4-30, పార్కు, అశోక్‌నగర్, పాతగాజువాక, విశాఖపట్నం-530026.

1. గౌరవనీయులైన ప్రిసైడింగ్ అధికారి, డెట్స్ రికవరీ ట్రిబ్యునల్, విశాఖపట్నం వారు ఓ.ఎ.నెం.590/2021లో ఆమోదించిన ఉత్తర్వుల ప్రకారం జారీ చేసిన రికవరీ సర్టిఫికెట్ ప్రకారం బకాయి రూ.51,82,691.77 పై (అక్షరాల యాభై ఒక లక్షల ఎనభై రెండు వేల ఆరు వందల తొంభై ఒక రూపాయల డెబ్బై ఏడు పైసలు మాత్రమే) అనగా వార్షికంగా @ 11% చొప్పున పెండెంటలైట్ మరియు భవిష్య వడ్డీ నెలవారీ వడ్డీ మరియు ఖర్చుతో కలిపి తేది:10.08.2021 నుండి నెలవారీ వడ్డీలు మరియు ఖర్చులు మీరు చెల్లించవలెను. (ఉమ్మడిగా మరియు విడిగా/పూర్తిగా/కొంతమేర)
2. నోటీసు అందిన 15 రోజులలోపు పై మొత్తాన్ని చెల్లించవలసిందిగా మీరు ఇందుమూలంగా నిర్దేశించబడ్డారు, లేని పక్షంలో బ్యాంకులు మరియు ఆర్థిక సంస్థల చట్టం 1993 మరియు దాని క్రింద వున్న నిబంధనల ప్రకారం ఋణాల రికవరీని రికవరీ చేయాలి.
3. తదుపరి విచారణ తేదీలో లేదా ముందు మీ ఆస్తుల వివరాలను అఫిడవిట్‌పై ప్రకటించవలసిందిగా మీరు ఇందుమూలంగా ఆదేశించబడ్డారు
4. పైన పేర్కొన్న మొత్తానికి అదనంగా మీరు చెల్లించవలసి వుంటుంది.
ఎ) అమలు ప్రక్రియ యొక్క ఈ నోటీసు తర్వాత వెంటనే ప్రారంభమయ్యే కాలానికి చెల్లించాల్సిన వడ్డీ;
బి) ఈ నోటీసు యొక్క సేవకు సంబంధించి అన్ని ఖర్చులు, ఛార్జీలు మరియు ఖర్చులు మరియు సర్టిఫికెట్ మొత్తాన్ని రికవరీ చేయడానికి తీసుకోవలసిన ఇతర ప్రక్రియ.
5. దిగువ పునరుత్పత్తి చేయబడిన ఆదాయపు పన్ను చట్టం, 1961 లోని రెండవ షెడ్యూల్‌లోని రూల్ 16పై దృష్టి సారించబడినది.
16(1) రూల్ 2 ప్రకారం డిఫాల్టర్‌పై నోటీసు అందజేయబడినప్పుడు, డిఫాల్టర్ లేదా ఆసక్తి ఉన్న అతని ప్రతినిధి రికవరీ అనుమతితో ఆశించే అతనికి సంబంధించిన ఏదైనా ఆస్తిని తనఖా పెట్టడానికి, ఛార్జ్ చేయడానికి, లీజుకు ఇవ్వడానికి లేదా డీల్ చేయడానికి సమర్థుడు కాదు. అధికారి, లేదా ఏదైనా సివిల్ కోర్టు డబ్బు చెల్లింపు కోసం డిక్రీని అమలు చేయడంలో అటువంటి ఆస్తికి వ్యతిరేకంగా ఎటువంటి ప్రక్రియలను జారీ చేయదు.
16(2) ఈ షెడ్యూల్ ప్రకారం అటాచ్‌మెంట్ చేయబడినప్పుడు, అటాచ్ చేసిన ఆస్తి యొక్క ఏదైనా ప్రైవేట్ బదిలీ లేదా డెలివరీ లేదా అందులో ఏదైనా వడ్డీ మరియు అటువంటి అటాచ్‌మెంట్‌కు విరుద్ధంగా ఏదైనా రుణం, డివిడెండ్ లేదా ఇతర డబ్బులను డిఫాల్టర్‌కు చెల్లించడం చెల్లదు. అటాచ్‌మెంట్ కింద అమలు చేయగల అన్ని క్లెయిమ్‌లకు వ్యతిరేకంగా.
(నా స్వహస్తంతో మరియు ట్రిబ్యునల్, విశాఖపట్నం ముద్రికతో 1వ రోజు నవంబర్, 2025న జారీచేయబడినది).

సం/- (అవసరాల అనిల్)
రికవరీ ఆఫీసర్
డెట్స్ రికవరీ ట్రిబ్యునల్, విశాఖపట్నం



ఫారం నెం-14 (రెగ్యులేషన్-33(2) చూడుము)

భారత ప్రభుత్వం - ఆర్థిక మంత్రిత్వ శాఖ - ఫైనాన్షియల్ సర్వీసెస్ శాఖ
డెట్స్ రికవరీ ట్రిబ్యునల్ రికవరీ ఆఫీసర్-I వారి కార్యాలయం
31-31-21, నారాయణ భవనము, సాయిబాబా వీధి, దాబాగార్డెన్స్, విశాఖపట్నం-530 020

### డిమాండ్ నోటీసు

(అప్పులు & దివాలా చట్టం 1993 యొక్క రికవరీ సెక్షన్ 25 నుండి 28 వరకు నోటీసు మరియు ఆదాయపు పన్ను చట్టం 1961లోని రెండవ షెడ్యూల్‌లోని రూల్ 2 ప్రకారం నోటీసు)

ఆర్‌సి/467/2024 తేది.01.11.2025

స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, SME సెంటర్, మహారాణిపేట, విశాఖపట్నం
వర్సెస్
మెస్సర్స్ ఒడిషా స్వీట్ స్పాట్ మరియు మరొకరు

టు
(సిడి-1) మెస్సర్స్ ఒడిషా స్వీట్ స్పాట్, ప్రాతినిధ్యం వహిస్తున్న ప్రొప్రయిటర్: సింహాద్రి కృష్ణవేణి, డి.నెం.14-36-112/2, ప్లాటు నెం.56, కె.ఎల్.రావు నగర్, సాయిబాబ గుడి ఎదురుగా, వార్డు నెం.63, బి.సి.రోడ్డు, గాజువాక, విశాఖపట్నం.
(సిడి-2) సింహాద్రి కృష్ణవేణి, ప్రొప్రయిటర్: మెస్సర్స్ ఒడిషా స్వీట్ స్పాట్, డి.నెం.27-2-34/1, సీతారామ్‌నగర్, గాజువాక, శ్రీనగర్, విశాఖపట్నం.

1. గౌరవనీయులైన ప్రిసైడింగ్ అధికారి, డెట్స్ రికవరీ ట్రిబ్యునల్, విశాఖపట్నం వారు ఓ.ఎ.నెం.17/2021లో ఆమోదించిన ఉత్తర్వుల ప్రకారం జారీ చేసిన రికవరీ సర్టిఫికెట్ ప్రకారం బకాయి రూ.51,78,643.11 పై (అక్షరాల యాభై ఒక లక్షల డెబ్బై ఎనిమిది వేల ఆరు వందల నలభై మూడు రూపాయల పదకొండు పైసలు మాత్రమే) అనగా వార్షికంగా @ 11.65% చొప్పున పెండెంటలైట్ మరియు భవిష్య వడ్డీ నెలవారీ వడ్డీ మరియు ఖర్చుతో కలిపి తేది:08.01.2021 నుండి నెలవారీ వడ్డీలు మరియు ఖర్చులు మీరు చెల్లించవలెను. (ఉమ్మడిగా మరియు విడిగా/పూర్తిగా/కొంతమేర)
2. నోటీసు అందిన 15 రోజులలోపు పై మొత్తాన్ని చెల్లించవలసిందిగా మీరు ఇందుమూలంగా నిర్దేశించబడ్డారు, లేని పక్షంలో బ్యాంకులు మరియు ఆర్థిక సంస్థల చట్టం 1993 మరియు దాని క్రింద వున్న నిబంధనల ప్రకారం ఋణాల రికవరీని రికవరీ చేయాలి.
3. తదుపరి విచారణ తేదీలో లేదా ముందు మీ ఆస్తుల వివరాలను అఫిడవిట్‌పై ప్రకటించవలసిందిగా మీరు ఇందుమూలంగా ఆదేశించబడ్డారు
4. పైన పేర్కొన్న మొత్తానికి అదనంగా మీరు చెల్లించవలసి వుంటుంది.
ఎ) అమలు ప్రక్రియ యొక్క ఈ నోటీసు తర్వాత వెంటనే ప్రారంభమయ్యే కాలానికి చెల్లించాల్సిన వడ్డీ;
బి) ఈ నోటీసు యొక్క సేవకు సంబంధించి అన్ని ఖర్చులు, ఛార్జీలు మరియు ఖర్చులు మరియు సర్టిఫికెట్ మొత్తాన్ని రికవరీ చేయడానికి తీసుకోవలసిన ఇతర ప్రక్రియ.
5. దిగువ పునరుత్పత్తి చేయబడిన ఆదాయపు పన్ను చట్టం, 1961 లోని రెండవ షెడ్యూల్‌లోని రూల్ 16పై దృష్టి సారించబడినది.
16(1) రూల్ 2 ప్రకారం డిఫాల్టర్‌పై నోటీసు అందజేయబడినప్పుడు, డిఫాల్టర్ లేదా ఆసక్తి ఉన్న అతని ప్రతినిధి రికవరీ అనుమతితో ఆశించే అతనికి సంబంధించిన ఏదైనా ఆస్తిని తనఖా పెట్టడానికి, ఛార్జ్ చేయడానికి, లీజుకు ఇవ్వడానికి లేదా డీల్ చేయడానికి సమర్థుడు కాదు. అధికారి, లేదా ఏదైనా సివిల్ కోర్టు డబ్బు చెల్లింపు కోసం డిక్రీని అమలు చేయడంలో అటువంటి ఆస్తికి వ్యతిరేకంగా ఎటువంటి ప్రక్రియలను జారీ చేయదు.
16(2) ఈ షెడ్యూల్ ప్రకారం అటాచ్‌మెంట్ చేయబడినప్పుడు, అటాచ్ చేసిన ఆస్తి యొక్క ఏదైనా ప్రైవేట్ బదిలీ లేదా డెలివరీ లేదా అందులో ఏదైనా వడ్డీ మరియు అటువంటి అటాచ్‌మెంట్‌కు విరుద్ధంగా ఏదైనా రుణం, డివిడెండ్ లేదా ఇతర డబ్బులను డిఫాల్టర్‌కు చెల్లించడం చెల్లదు. అటాచ్‌మెంట్ కింద అమలు చేయగల అన్ని క్లెయిమ్‌లకు వ్యతిరేకంగా.
(నా స్వహస్తంతో మరియు ట్రిబ్యునల్, విశాఖపట్నం ముద్రికతో 1వ రోజు నవంబర్, 2025న జారీచేయబడినది).

సం/- (అవసరాల అనిల్)
రికవరీ ఆఫీసర్
డెట్స్ రికవరీ ట్రిబ్యునల్, విశాఖపట్నం

## కూటమి ప్రభుత్వం....రైతుల పక్షపాతి : గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాస్



గాజువాక,నవంబర్ 19,ప్రభాతవార్త

పెదగంట్యాడ మండలం తహసీల్దార్ కార్యాలయంలో వ్యవసాయ శాఖ అధికారుల ఆధ్వర్యంలో అన్నదాత సుఖీభవ- పియం కిసాన్ పథకం కార్యక్రమం నిర్వహించారు. బుధవారం నిర్వహించిన ఈ కార్యక్రమంలో రైతులకు ఒక్కొక్కరికి ఏడు వేల రూపాయల చొప్పున గాజువాకలో మొత్తం 493 మందికి 34,54,00 రూపాయల చెక్కు ను టిడిపి రాష్ట్ర అధ్యక్షులు గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు, బిజెపి ఇంచార్జి రాష్ట్ర మీడియా పేనలిస్ట్ కరణంరెడ్డి నరసింగరావులు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పల్లా శ్రీనివాస్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం రైతుల పక్షపాతి అని అన్నారు. రాష్ట్రంలో 47 లక్షల మంది రైతులకు 3135 కోట్ల రూపాయలు నేరుగా రైతుల ఖాతాల్లో జమ చేశామని అన్నారు. ఎన్నికల హామీ ప్రకారం ప్రతి రైతుకు సంవత్సరానికి 20 వేల రూపాయల చొప్పున ఆర్థిక సహాయం చేస్తున్నామని తెలిపారు. ఇందులో కేంద్ర ప్రభుత్వం వాటా 6 వేలు కాగా, మిగిలిన-4 వేల రూపాయలు రాష్ట్ర ప్రభుత్వం తరపున ఇస్తున్నామని అన్నారు. బిజెపి తరపున నరసింగరావు మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోదీ 2019 ఫిబ్రవరి 24వ తేదీన యుపిలో పియం కిసాన్ సమ్మాన్ యోజన పథకాన్ని ప్రారంభించారని అన్నారు. ప్రతి రైతుకు సంవత్సరానికి 6 వేల రూపాయల చొప్పున కేంద్ర ప్రభుత్వం తరపున ఆర్థిక సహాయం అందిస్తున్నామని అన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ గురువారం మధ్యాహ్నం కోయంబత్తూరులో 18 వేల కోట్ల రూపాయలు 9 కోట్ల మంది రైతుల ఖాతాల్లో నేరుగా బటన్ నొక్కి జమ చేశారని తెలిపారు. ఆ కార్యక్రమాన్ని లైవ్‌లో వీక్షించామని తెలిపారు. పియం కిసాన్ క్రెడిట్ కార్డ్ ద్వారా రైతులకు అవసరమైన రుణాలను బ్యాంకు ద్వారా రైతులకు అందజేస్తున్నామని తెలిపారు. ఎరువులు పనిముట్లు యంత్రాలు ట్రాక్టర్లు కొనుగోలు చేసి దపదపాలుగా రుణం తిరిగి తీర్చుకునే సదుపాయం ప్రధాని మోదీ కల్పించారని అన్నారు. ఈ కార్యక్రమంలో పెదగంట్యాడ మండలం తహసీల్దార్ అమల, వ్యవసాయ శాఖ అధికారులు, నాయకులు డిసిసిబి చైర్మన్ కోన తాతారావు ,వరలక్ష్మి, అనిత, పెంటారావు, వంశీ, పరదేశి తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ వరాహ లక్ష్మీ నరసింహ స్వామిని దర్శించుకున్న రాష్ట్ర సమాచార కమిషనర్

సింహాచలం, నవంబర్ 19,ప్రభాతవార్త



ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సమాచార కమిషన్ రాష్ట్ర సమా చార కమిషనర్ చావలి సునీల్ బుధవారం ఉదయం సింహాచలంలోని ప్రసిద్ధ శ్రీ వరాహ లక్ష్మీ నరసింహ స్వామి వారిని దర్శించుకున్నారు. ఆలయానికి విచ్చేసిన కమిషనర్‌కి ఆలయ పర్యవేక్షణ అధికారి కె.వెంకటేశ్వర రావు ఘన స్వాగతం పలికారు. ముందుగా స్వామి వారి దివ్యమైన కప్ప స్తంభ అలింగనం చేసుకున్నారు. తదుపరి స్వామి వారి దర్శనం చేసుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. దర్శనానంతరం ఆలయ పండితులు శ్రీ చావలి సునీల్ వేద ఆశీర్వచనం ఇచ్చి, శేష వస్త్రంతో సత్కరించారు. ఆలయ పర్యవేక్షణ అధికారి స్వామివారి ప్రసాదాలను వారికి అందజేశారు.

## మహిళల శక్తి మహోన్నతం



సింహాచలం, నవంబర్ 19,ప్రభాతవార్త

ప్రపంచ వ్యాప్తంగా మహిళాశక్తి మహోన్నతమైనదని ప్రముఖ రచయిత డా.దేవులపల్లి పద్మజ అన్నారు. మహిళలు నేడు వంటింటికే పరిమితం కాకుండా పురుషులతో సమానంగా రాణిస్తున్నారని అన్నారు. స్త్రీలు నూన్యత భావం విడనాడి ఆత్మ ఆత్మస్థైర్యంతో ముందుకు సాగిపోవాలని హితవు పలికారు. 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు సందర్భంగా బుధవారం అడివివరం శాఖ గ్రంథాలయంలో నిర్వహించిన ఇందిరా గాంధీ జయంతి కార్యక్రమంలో పాల్గొని ప్రసంగించారు. తొలుత ఇందిర గాంధీ చిత్ర పటానికి పూలమాల వేసి జ్యోతి ప్రజ్వలన గావించి నివాళులర్పించారు. మంచి నడత, ఉన్నత వ్యక్తిత్వం, మేధా సంపత్తి, వెరసి ఉక్కు మహిళగా, దేశానికి తొలి మహిళా ప్రధానిగా పేరు ప్రఖ్యాతలు గడించిన ఇందిరా గాంధీ, అందరికీ ఆదర్శనీయమన్నారు. లైబ్రేరియన్ ఎన్‌వి నరసింహం అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో వాణి విద్యా విహార్ కరెస్పాండెంటు అపర్ణ, అంగన్వాడీ టీచర్ వెంకట లక్ష్మి, సిహెచ్‌ఎస్ ఎన్ రాజు, ఎల్‌జి పోలిమెర్స్ విశ్రాంత ఉద్యోగి పి.త్రినాథ రావు, ఎల్లమ్మ, న్యాయవాది కె.రామకృష్ణ, మూర్తి, వర్మ తదితరులు పాల్గొన్నారు.

## జీవీఎంసీ కమీషనర్‌ను కలిసిన కార్పొరేటర్ గుడివాడ అనూషలతీష్

గాజువాక,నవంబర్ 19,ప్రభాతవార్త :



జీవీఎంసీ 68వ వార్డు కార్పొరేటర్ గుడివాడ అనుష రాష్ట్ర వైకాపా సంయుక్త కార్యదర్శి గుడివాడ లతీష్‌తో కలిసి జీవీఎంసీ కమిషనర్ కేతన్ గర్గ్ ఐఏఎస్‌ను బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. వార్డ్ అభివృద్ధికి సంబంధించిన పలు కీలక అంశాలను వివరిస్తూ, క్రింది పనుల కోసం ఆమోదం, అనుమతులు ఇవ్వాలని కమిషనర్‌ను కోరుతూ వినతిపత్రం అందజేశారు. రోడ్లు, డ్రెయినేజ్ అభివృద్ధి పనులు, పార్కులు,ఓపెన్ జిమ్‌ల ఏర్పాటు, కమ్యూనిటీ హాల్స్ నిర్మాణం, బాక్స్ క్రికెట్ గ్రౌండ్ ఏర్పాటు, అక్కిరెడ్డిపాలెం - నాతయ్యపాలెం మధ్య క్రాస్‌ఓవర్ బ్రిడ్జ్ నిర్మాణం లపై జీవీఎంసీ కమీషనర్ దృష్టికి తీసుకెళ్లామని తెలిపారు. ఈ సందర్భంగా కమిషనర్ కేతన్ గర్గ్ క్రాస్‌ఓవర్ బ్రిడ్జ్ ప్రతిపాదనపై జిల్లా కలెక్టర్‌తో పాటు నేషనల్ హైవే అధికారులతో సమగ్రంగా చర్చించి త్వరితగతిన సమన్వయ పరిష్కరించి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారని గుడివాడ అనూష లతీష్ తెలిపారు.

## ప్రభుత్వ భూమిలో నిర్మించిన రోడ్డు తొలగింపు

ఆనందపురం, నవంబర్ 19, ప్రభాతవార్త:



ఆనందపురం మండలంలోని పందలపాకలో ప్రభుత్వ భూమిలో కొంతమంది రియల్ ఎస్టేట్ వ్యాపారులు నిర్మించిన రోడ్డుని రెవెన్యూ అధికారులు బుధవారం యంత్రాలతో తొలగించారు. పందలపాకలో కొంతమంది రియల్ ఎస్టేట్ వ్యాపారులు కొనుగోలు చేసిన భూమికి మార్గం లేకపోవడంతో ఆ భూమికి ముందు భాగంలో సర్వే నంబరు 52-1లో ఉన్న వాగు పోరంబోకును ఆక్రమించి రోడ్డు నిర్మించారు. అదే రూట్ లో ఉన్న కొంతమంది ప్రైవేట్ వ్యక్తుల స్థలాలను కూడా ఆక్రమించి రోడ్డుని తమ స్థలం వరకు నిర్మించారు. దీంతో పందలపాక గ్రామస్తులతో పాటు బాధితులు ఫిర్యాదు చేయడంతో అధికారులు విచారణ జరిపి ప్రభుత్వ భూమి ఆక్రమణలు గుర్తించి గుర్తించా రు. వీఆర్వో రమేష్, సిబ్బంది యంత్రాలతో ఆక్రమణ నిర్మించిన రోడ్డుని తొలగించారు. కానీ ఆక్రమణ దారులపై చర్యలు తీసుకోకపోవడం పట్ల స్థానికులు పలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. అక్కడ హెచ్చరిక బోర్డుని ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

## విజయవంతంగా కేర్‌లో 'గుండె మార్పిడి'


ఆరిలోవ, నవంబర్ 19, ప్రభాతవార్త



ఆరిలోవ హెల్త్ సిటీ ప్రాంగణంలో ఉన్న కేర్ ఆసుపత్రిలో అతి ప్రమాదకరమైన వ్యాధిరోగంతో బాధపడు తూ ప్రాణాపాయ స్థితిలో ఉన్న రోగికి విజయవంతంగా గుండె మార్పిడి చేసి రికార్డు నెలకొల్పారు. విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి కేర్ వైద్యులు వివరాలు వెల్లడించారు. 54 ఏళ్ళ వయస్సున్న వ్యాపారవేత్త హృద్రో గం సమస్యతో మూడు నెలల క్రితం కేర్ ఆస్పత్రి వైద్యులను సంప్రదించారు. కేర్ కార్డియాలజీ విభాగం వైద్యులు వైద్యం అందించిన, రోగ తీవ్రత ఎక్కువగా ఉండటం వలన ఫలితం లేకపోయింది. రోగి ఆహారం తీసుకోవాలన్న, నడవాలన్నా మాట్లాడాలన్నా తీవ్రమైన ఆయాసంతో బాధపడుతూ ప్రాణాపాయ స్థితికి చేరుకున్నారు. గుండె మార్పిడి ఒక్కటే రోగి కోలుకోడానికి ప్రత్యమ్నాయం కావడంతో దాతల కోసం కేర్ వైద్యులు జీవనధాన్‌ని సంప్రదించారు. శ్రీకాకుళం ఆసుపత్రిలో దాత ఉండటంతో గత నెల 26 తేదీన విశాఖ ట్రాఫిక్ పోలీసుల సహకారంతో నిర్దేశించిన స్వల్ప సమయంలో శ్రీకాకుళం నుండి విశాఖపట్నంకు దాత గుండెను చేర్చారు. అనంతరం సంక్లిష్టమైన ఆ గుండె మార్పిడి ప్రక్రియ డాక్టర్ ఎల్ విజయ్ మార్గదర్శకత్వం వహించగా, సీనియర్ కార్డియాలజిస్ట్ డా.సివి రావు నేతృత్వంలో నెఫ్రాలజిస్ట్ డాక్టర్ వేణుగోపాల్, అనస్థీషియ విభాగాల నిపుణుల సహకారంతో విజయవంతంగా జరిపినట్లు వైద్య బృందం తెలిపారు. శస్త్ర చికిత్స జరిపిన 11 రోజుల అనంతరం రోగి పూర్తిగా కోలుకున్నాడని వైద్యులు తెలిపారు. జీవనధాన్ కోఆర్డినేటర్ డాక్టర్ రాంబాబు మాట్లాడుతూ ప్రాణ రక్షణ కార్యక్రమంలో కేర్ ఆస్పత్రి, పోలీస్‌శాఖ చూపిన సేవాభావం అభినందనీయమన్నారు. ట్రాఫిక్ అడిషనల్ డీసీపీ కే.ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ అవయవ దానా వాహనానికి అడ్డంకి లేకుండా తగు చర్యలు తీసుకున్నామని, రోగి కోలుకోవడం ఆనందంగా ఉందన్నారు. కేర్ సీఓఓ సుజిత్ రెడ్డి మాట్లాడుతూ... అత్యంత క్లిష్టమైన శస్త్ర చికిత్సల కోసం దూర ప్రాంతాల్లో ఉన్న మెట్రో నగరాలకు వెళ్ళవలసిన అవసరం లేదని, తమ ఆసుపత్రిలో అధునిక సౌకర్యాలు, నిష్ణాతులైన వైద్యులు ఉన్నారన్నారు. ఈ సమావేశంలో డా.ఎల్.విజయ్, డాక్టర్ సివి రావు, డాక్టర్ కిరణ్ బాబు, వేణుగోపాల్ పాల్గొని వివరాలు వెల్లడించారు.

## ఆర్ఎంపిల వైద్య శిబిరానికి భక్తులు నుండి విశేష స్పందన

పద్మనాభం, నవంబరు 19, ప్రభాతవార్త



పద్మనాభంలో బుధవారం జరిగిన అనంతపద్మనాభ స్వామి కొండమెట్ల కోటి దీపోత్సవంలో మండల ఆర్.ఎం.పి వైద్య సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి భక్తులు నుండి విశేష స్పందన లభించింది. సుమారు వెయ్యి మందికి ఉచిత వైద్య చికిత్సలు చేసి అవసరమైన మందులను ఉచితంగా అందజేసినారు. ఆరు సంవత్సరాల నుండి ఈ దీపోత్సవంలో బాగస్వాములు భక్తులకు విశేష వైద్య సేవలను అందిస్తున్నట్లు సంఘ అధ్యక్షుడు ఆర్.అప్పారావు అన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యులు ప్రసాద్, సత్యనారాయణ, పాల్గొన్నారు.

## 10వ వార్డులో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన



ఆరిలోవ, నవంబర్ 19, ప్రభాతవార్త

తూర్పు నియోజకవర్గం స్థానిక పదో వార్డ్ వివేకా నంద నగర్‌లో బుధవారం పలు అభివృద్ధి కార్యక్రమా లకు వార్డు కార్పొరేటర్ మద్దిల రామలక్ష్మి రాజశేఖర్ ఆధ్వర్యంలో శంకుస్థాపన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా స్థానిక శాసనసభ్యులు వెలగపూడి రామకృష్ణ బాబు హాజరై పూజా కార్యక్రమాలతో కాలువలు, సిసి రోడ్లుకు శంకుస్థాపన చేశారు. జీవీఎంసీ నిధులతో సుమారు 30 లక్షలతో సిసి రోడ్లు, కాలువలు నిర్మాణం చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వార్డ్ అధ్యక్షులు గాడు అప్పలనాయుడు, కార్యదర్శి వేమల వెంకట్రావు, క్లస్టర్ ఇంచార్జ్ మద్దిల రాజేష్, కందూరు కొండమ్మ, కిల్లంపల్లి రమణి తదితరులు పాల్గొన్నారు.

## 3డీ కాంక్రీట్ ప్రింటెడ్ మిలిటరీ ఇన్సిగ్నియా ప్రవేశ ద్వారం ఆవిష్కరణ

ఆరిలోవ, నవంబర్ 19, ప్రభాతవార్త

భారతదేశ సైనిక వారసత్వానికి, డిజిటల్ నిర్మాణ రంగ భవిష్యత్తుకు అద్భుతమైన నివాళిగా, హైదరాబాద్‌కు చెందిన డీప్‌టెక్ సంస్థ అయిన సింప్లిఫోర్జ్ సంస్థ, ఐఐటీ హైదరాబాద్‌తో కలిసి దేశంలోనే మొట్టమొదటి, అతిపెద్ద మిలిటరీ ఇన్సిగ్నియా ప్రవేశ ద్వారాన్ని(ఆర్చ్) అభివృద్ధి చేసింది. ఈ అద్భుతమైన నిర్మాణం కేవలం ప్రవేశ ద్వారం మాత్రమే కాదు, ఇదొక గొప్ప సందేశం. రక్షణ రంగ నిర్మాణాలలో కొత్త ఆవిష్కరణలకు ఇది చాలా ముఖ్యమైన మెట్టు. పులి బొమ్మతో (టైగర్ థీమ్) ఉన్న ఈ ప్రవేశ ద్వారం కంటోన్మెంట్ లోపల ఉండే ఇండోర్ స్పోర్ట్స్ అరేనాలోకి దారి తీస్తుంది. ఈ ప్రాజెక్టును కల్నల్ అఖిల్ సింగ్ చారక్ దార్శనికతతో రూపొందించారు. దీని నిర్మాణం, డిజైన్ అభివృద్ధిని ఐఐటీ హైదరాబాద్‌లోని ప్రొఫెసర్ కె.వి.ఎల్.సుబ్రమణియం (హెచ్‌ఏజీ), సింప్లిఫోర్జ్ కంపెనీ భాగస్వామ్యంతో చేపట్టారు. ఫైజాన్ చౌదరి (ఫౌండర్ అండ్ సీఓఓ, సింప్లిఫోర్జ్) ఈ ప్రాజెక్టుకు అభివృద్ధి భాగస్వామిగా వ్యవహరించారు. స్వదేశీ సాంకేతికత, అందరి సహకారం ద్వారా మన భారత రక్షణ రంగం నిర్మాణాలలో ఎలాంటి అద్భుతాలు చేయగలదో చెప్పే ఒక భవిష్యత్తు నిదర్శనం.

## ఇందిరమ్మ జీవితం మహిళలకు స్ఫూర్తిదాయకం

ఆనందపురం, నవంబర్ 18, ప్రభాతవార్త



భారతదేశ మాజీ ప్రధాని స్వర్గీయ ఇందిరా గాంధీ జీవితం మహిళలకు స్ఫూర్తిదాయకమని పలువురు వక్తలు చెప్పారు. జాతీయ గ్రంధాలయ వారోత్సవాలలో భాగంగా బుధవారం మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక సర్పంచ్ చందక లక్ష్మి ఇందిరాగాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇందిరమ్మ ఎన్నో అటుపోటులను ఎదుర్కొని ఉన్నత స్థానాలకు చేరుకున్నారని ఆమెను నేటి మహిళలు స్ఫూర్తిగా తీసుకోవాలని కోరారు. అనంతరం మహిళలు హక్కులపై చర్చా వేదికను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో లైబ్రేరియన్ బి వి ఎస్ అప్పారావు, ఉపసర్పంచ్ బంటుపల్లి రమణమ్మ, భీమిలి మార్కెట్ కమిటీ డైరెక్టర్ కుప్ప రామలక్ష్మి, వీఆర్వో అప్పారావు, పంచాయితీ కార్యదర్శి రఘునాథబాబు, ఉపాధ్యాయులు ప్రవీణ, వరలక్ష్మి, పి. పైడిరాజు విద్యార్థులు పాల్గొన్నారు.

## తహశీల్దారు ఆనందరావు, రైతులు రాము, అప్పన్న విరివిగా ప్రసాదాలు పంపిణీ



పద్మనాభం, నవంబరు 19, ప్రభాతవార్త

పద్మనాభంలో బుధవారం జరిగిన అనంత పద్మనాభస్వామి దీపోత్సవంలో బాగంగా ఎంపీపీ రాంబాబు, తహశీల్దారు కె.ఆనందరావు, రైతులు కనకల రాము, బుగత అప్పన్న భక్తులకు విరివిగా ప్రసాదాలు పంపిణీ చేసారు. పద్మనాభం సంత బయలు వద్ద రెవిన్యూ అధికారులు చక్రపొంగలి, పులిహోర, వాటర్ బాటిల్, మజ్జిగలను సుమారు ఐదు వేల మందిఇ, సచివాలయం వద్ద ఎంపీపీ రాంబాబు ఆధ్వర్యంలో రెండు వేల మందికి, అలాగే కొండపై రాము, అప్పన్న సుమారు మూడు వేల మందికి ప్రసాదాలు పంపిణీ చేసారు.

## రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి



ఆనందపురం, నవంబర్ 18, ప్రభాతవార్త:

ఆనందపురం మండలంలోని సొంట్యాం గ్రామానికి సమీపంలో జాతీయ రహదారి సర్వీసు రోడ్డులో బుధవారం తెల్లవారు జామున జరిగిన ప్రమాదంలో ఓ మహిళ మృతి చెందగా ఆటో డ్రైవర్ కు తీవ్ర గాయాలయ్యాయి. ఆనందపురం మండలం ముచర్ల గ్రామానికి చెందిన షినగం లక్ష్మి (50) పువ్వులు, కూరగాయల వ్యాపారం చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటోంది. కాగా బుధవారం తెల్లవారు జామున ఆమె పువ్వులు కొనుగోలు నిమిత్తం ఆటో పై ఆనందపురం మార్కెట్ కు వెళ్ళింది. అక్కడ నుంచి బయలుదేరి ఆటోలో గోపాలపట్నం వెళ్తున్నారు. ఆ ఆటో సొంట్యాం గ్రామం సమీపంలో గల పెట్రోల్ బంక్ వద్ద చేరుకునే సరికి రోడ్డు పక్కన ఆగిఉన్న లారీని బలంగా ఢీకొట్టింది. దీంతో లక్ష్మి తలకు బలమైన గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందింది. ఆటోను నడుపుతున్న అప్పలరాజుకు బలమైన గాయాలు కావడంతో చికిత్స నిమిత్తం అస్పత్రికి తరలించారు. మృతురాలు భర్త సన్యాసి ఇచ్చిన ఫిర్యాదు మేరకు శవాన్ని పోస్టుమార్టం నిమిత్తం భీమిలి ప్రభుత్వ అస్పత్రికి తరలించారు. కేసుని సిఐ వాసునాయుడు ఆధ్వర్యంలో ఎస్ఐ సంతోష్ కేసుని దర్యాప్తు చేస్తున్నారు.

## 13 మంది వ్యక్తులకు బైండ్ ఓవర్

(విశాఖ క్రైమ్ - ప్రభాతవార్త)



పెందుర్తి పోలీస్ స్టేషన్ పరిధిలో ఈనెల 14వ తేదీన చింతగట్ల గ్రామంలో రెండు వర్గాల మధ్య తగాదా చోటుచేసుకుంది. భవిష్యత్తులో ఇటువంటి సంఘటనలు జరగకుండా, పెందుర్తి ఇన్స్పెక్టర్ కె.వి సతీష్ కుమార్ , ప్రజా శాంతి భద్రతలు కాపాడుటకు రెండు పార్టీలకు చెందిన మొత్తం 13 మంది వ్యక్తులను పెందుర్తి మండల ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్ ఎదుట హాజరు పరిచారు. ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్ సదరు వ్యక్తులను 6 నెలలపాటు మంచి ప్రవర్తనతో ఉండాలి అనే నిబంధనతో బైండ్ ఓవర్ చేశారు. నిబంధనలు ఉల్లంఘించిన పక్షంలో ప్రతి ఒక్కరు రూ.3 లక్షలు ప్రభుత్వం ఖాతాలో జమ చేయవలసి ఉంటుందనీ బైండ్ ఓవర్ విధించిన వారికి తెలియజేశారు.. పెందుర్తి పోలీస్ వర్గం పరిధిలోని ప్రతి గ్రామంలో ప్రజలు కలిసిమెలిసి, శాంతియుతంగా, సత్ప్రవర్తనతో ఉండాలని విజ్ఞప్తి చేశారు. ఎవరైనా వివాదాలు, అల్లర్లు లేదా ప్రజా శాంతిని భంగం చేసే చర్యలకు పాల్పడిన పక్షంలో, వారిపై ఇదే విధంగా బైండ్ ఓవర్, చట్టపరమైన చర్యలు కఠినంగా తీసుకోబడతాయనీ సిఐ సతీష్ కుమార్ హెచ్చరించారు.

## నగరంలో స్మార్ట్ వెండింగ్ జోన్ల ఏర్పాటుకు కార్యాచరణ చేపట్టండి : జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్



విశాఖపట్నం ,నవంబర్ 19 ప్రభాతవార్త

అర్హులుగా గుర్తించిన వీధివిక్రయదారుల కొరకు ఏర్పాటు చేయనున్న స్మార్ట్ వెండింగ్ జోన్లను అన్ని సదుపాయాలతో సిద్ధం చేయాలని జీవీఎంసీ అధికారులను జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ ఆదేశించారు. బుధవారం ఆయన జీవీఎంసీ ప్రధాన ఇంజనీరు పివివి సత్యనారాయణ రాజు, జోనల్ కమిషనర్లు కె.కనకమహాలక్ష్మి ,ఎం.మల్లయ్య నాయుడులతో కలిసి జోన్ 2లో ఎండాడ ట్రిబుల్ ఆర్ సెంటర్ సమీపంలో, జోన్ 4లో సెంట్రల్ పార్క్ కు రోడ్డు ముఖంగా తూర్పు, పడమర, దక్షిణ భాగంలో ఉన్న ప్రతిపాదించిన స్మార్ట్ వెండింగ్ జోన్ల స్థలాలను స్వయంగా పరిశీలించారు. ఈ పరిశీలనలో కమిషనర్ మాట్లాడుతూ నగరంలో 21 స్మార్ట్ వెండింగ్ జోన్ల ఏర్పాటుకు నిర్ణయం తీసుకోవడమైనదని అందులో భాగంగా మొదటి ఫేజ్‌లో ముందుగా జోన్ 2,4,6 లో మూడు వెండింగ్ జోన్లను బెనిఫిషియరీ కంట్రిబ్యూషన్‌తో పి పి పి మోడ్యుల్‌లో ఏర్పాటు చేస్తున్నామన్నారు. వీధి విక్రయిదారుల జీవన ప్రమాణాలను మెరుగుపరిచేందుకు, వారిని ఆర్థికంగా బలోపేతం చేసేందుకు, ఆధునిక పద్ధతిలో ప్రజల సౌకర్యార్థం ఈ వెండింగ్ జోన్లను నగరంలో ఏర్పాటు చేయడం జరుగుతున్నది అన్నారు. ఆయా స్థలాలను పరిశీలిస్తూ ఏర్పాటు చేయనున్న స్మార్ట్ వెండింగ్ జోన్లలో అవసరమైన సదుపాయాలతో (ఫ్యాన్‌లు, లైట్లు మొదలైనవి కూడిన పోర్టబుల్ కంటెయినర్లుగా ఏర్పాటు, దుకాణాలకు అవసరమైన పరికరాలు, ఉపకరణాలను నడపడానికి తగిన విధంగా ప్రాంతం మొత్తం విద్యుదీకరణ చేయడం. పరిసరాలు ఆకర్షణీయంగా కనిపించేలా ఆహ్లాదకరమైన , సుందరీకరమైన లైటింగ్ ఏర్పాటు, మొత్తం వెండింగ్ జోన్ సోలార్ శక్తితో నడిచే విధంగా రూపకల్పన చేయడం - తద్వారా కార్బన్ ఫుట్‌ప్రింట్ తగ్గింపు, వెండింగ్ జోన్ల భద్రత కోసం సీసీ టీవీ పర్యవేక్షణ వ్యవస్థ ఏర్పాటు,ప్రతి వెండింగ్ జోన్‌కు ప్రత్యేకంగా సెంట్రల్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ ద్వారా శుభ్రత, రోజువారీ శానిటేషన్, భద్రత మరియు వైఫై, ప్లే జోన్‌లు వంటి సౌకర్యాల నిర్వహణ, ప్రతి ప్రాంతంలో మరుగుదొడ్లు (టాయిలెట్లు) ఏర్పాటు, ప్రతి దుకాణానికి ప్లంబింగ్ మరియు తాగునీటి సరఫరా, వినియోగదారుల కోసం వాష్‌బేలు మరియు చేతులు కడుక్కోవడానికి వాష్ బేసిన్లు,వినియోగదారులు సేదతీరడానికి ప్రత్యేకంగా సీటింగ్ జోన్‌లు మరియు నిర్ణీత ప్రదేశాలు తదితర సదుపాయాలతో, గాలి, వెలుతురు కలిగిన విధంగా స్మార్ట్ వెండింగ్ జోన్లు ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేస్తూ ప్రణాళికలను రూపొందించడం జరుగుతున్నదని,ఇది వీధి విక్రయిదారులకు, ప్రజలకు సౌకర్యవంతంగా ఉంటాయని కమిషనర్ తెలిపారు. ఆయా వెండింగ్ జోన్ల స్థలాలకు సంబంధించి ప్రతిపాదించిన నమూనాలను ఆర్కిటెక్ట్ వంశీకృష్ణ కమిషనర్ కు వివరించగా, కమిషనర్ పరిశీలించి అన్ని మౌలిక సదుపాయాల రూపకల్పనతో పూర్తి నివేదికను సిద్ధం చేసి కార్యాచరణ చేపట్టాలని ప్రధాన ఇంజనీర్ పి వి వి సత్యనారాయణ రాజుకు కమిషనర్ ఆదేశించారు. పర్యవేక్షక ఇంజనీర్ శాంతిరాజ్ ,డిసిపి హరిదాస్ ,ఏసీపీలు శాస్త్రి, ఝాన్సీ లక్ష్మి, ఉప కార్య నిర్వహణ అధికారి వెంకటేశ్వరరావు,ఏపీడీలు శ్రీరామ్, పద్మావతి, తదితరులు పాల్గొన్నారు.

## బాలుడు అదృశ్యం



(విశాఖ క్రైమ్ - ప్రభాతవార్త)

పీఎంపాలెం పోలీస్ స్టేషన్ పరిధిలో పదహారేళ్ల బాలుడు అదృశ్యమయ్యాడు. స్థానిక రేవల్లపాలెంలోని ప్రశాంత రెసిడెన్సీకి చెందిన వై.మౌలిక్ (16), శ్రీ విశ్వ జూనియర్ కాలేజీలో ఇంటర్ ఫస్ట్ ఇయర్ చదువుతున్నాడు. బుధవారం ఉదయం 9 గంటల సమయంలో ఎవరికి చెప్పకుండా ఇంటి నుండి బయటకు వెళ్లిపోయి తిరిగి రాలేదు. దీంతో తల్లిదండ్రులు బాలుడు కోసం అనేచోట్ల వెతికినప్పటికీ ఆచూకీ తెలియక పోవడంతో బాలుడి తల్లి శిరీష రాణి పీఎంపాలెం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు సీఐ బాలకృష్ణ నేతృత్వంలోని పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. విద్యార్థి ఇంటి నుంచి వెళ్లే సమయానికి అతడు నీలం రంగు ప్యాంట్, తెలుపు రంగు టీ-షర్ట్ ధరించి ఉన్నట్లు ఉన్నాడు. బాలుడు ఆచూకీ ఎవరికైనా తెలిస్తే వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలని పోలీసులు విజ్ఞప్తి చేశారు.

## ఘనంగా జగద్గురుపీఠం

### 55వ వ్యవస్థాపక దినోత్సవం!



(విశాఖపట్నం - ప్రభాతవార్త)

భౌగోళికంగా ఆధ్యాత్మిక, యోగపరమైన కార్యక్రమాలను నిర్వహించడంతో పాటు సామాన్య మహిళలకు స్వయం ఉపాధి కల్పించడానికి వృత్తి విద్యలలో ఉచితంగా శిక్షణ మివ్వడం కూడా జరుగుతుందని ది వరల్డ్ టీచర్ ట్రస్ట్ (జగద్గురు పీఠం) జాతీయ సలహా మండలి సభ్యులు సి.హెచ్.యస్.యన్.రాజు (మచిలీపట్నం) పేర్కొన్నారు. జగద్గురు పీఠం 55వ వ్యవస్థాపక దినోత్సవాన్ని పురస్కారించుకొని తాటిచెట్లపాలెంలో గల మాస్టర్ ఇ.కె.సంస్కృతి సదన్ ప్రాంగణంలో నిర్వహించబడిన సభకు ఆయన అధ్యక్షత వహించారు. 1971 సం నవంబర్ 18న కులపతి ఎక్కిరాల కృష్ణమాచార్య (మాస్టర్ ఇ.కె) విశాఖపట్టణం ప్రధాన కేంద్రంగా స్థాపించారని, ఆయన రచించిన పలు గ్రంథాలు వేలాదిమందికి ప్రచోదనం కలిగిస్తున్నాయన్నారు. సంస్కృతి సదన్‌లో ఇంతవరకు 2020 మందికి పైగా వృత్తి విద్యలలో మహిళలకు ఉచితంగా తమసంస్థ శిక్షణ మివ్వడం జరిగిందని సి.హెచ్.యస్.యన్.రాజు వివరించారు. జగద్గురుపీఠం ద్వారా ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాల్లో రోజుకు సగటున మూడు వేల మందికి హెూమియో వైద్యసేవలు అందు తున్నాయని రాజు తెలిపారు. మాస్టర్ ఇ.కె విదేశాలలో ఏడు పర్యాయాలు, మాస్టర్ పార్వతీకుమార్ 65 సార్లు పర్యటించి వేలాదిమందికి మార్గదర్శకులుగా నిలిచారన్నారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ధనిష్ఠా ఫౌండేషన్ మేనేజింగ్ ట్రస్టీ కె.చంద్రశేఖర గురుప్రసాద్ మాట్లాడుతూ మాస్టర్ ఇ.కె అలాగే మాస్టర్ పార్వతీకుమార్ ప్రాక్పశ్చిమ ఆధ్యాత్మిక సమన్వయానికి చేసిన కృషి ఫలితంగా విదేశాలలో అనేక బృందాలు యోగ జీవనాన్ని సాగిస్తున్నార న్నారు. వ్యక్తులను సంస్కరించడం, స్వధర్మాన్ని ఆచరిస్తూ, నిస్వార్థ సేవకు సమర్పణ చెందడం జగద్గురుపీఠం కార్యక్రమాలలో ముఖ్యమైనవని ఆయన చెప్పారు. ట్రస్ట్ డైరెక్టర్ ఆఫ్ సర్వీసెస్ చింతలపాటి సత్యదేవ్ ప్రసంగిస్తూ పార్వతీ కుమార్ సదాశయాల మేరకు గత 25 సంవత్సరాలుగా సంస్కృతి సదన్‌లో ధనిష్ఠా ఫౌండేషన్ సహకారంతో అనేక సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. ఈ ఉత్సవ కార్యక్రమాల్లో భాగంగా వృత్తి విద్యలలో శిక్షణ పొందిన 20 మంది మహిళలకు ధృవ పత్రాలను, 25 మంది మహిళలకు కుట్టు మిషన్లను, అతిధులు బహూకరించారు. జగద్గురుపీఠం విజయనగరం ప్రాంతీయ గణపతి బి.శ్రీనివాసరావు, ఎస్.వి.సత్య నారాయణ, ట్రస్ట్ డైరెక్టర్ బి.ఉషారాణి, దాట్ల రాధ, రవికుమార్, సి.హెచ్. శ్రీనివాసరాజు పాల్గొన్నారు.

## నాట్య కళాకారిణి సుపర్ణ దత్ సత్కారం



విశాఖపట్నం నవంబర్ 19 ప్రభాతవార్త

డిజిటల్ వేదిక ఖ్యాల్ 50 వేడుకల్లో నగరానికి చెందిన ప్రముఖ కూచిపూడి కళాకారిణి సుపర్ణ దత్‌ను ఘనంగా సత్కరించారు. ఖ్యాల్ 50 ఆధ్వర్యంలో వివిధ కళా రంగాలకు నిర్వహించిన పోటీలలో ప్రతి రంగంలో ఎంపికైన 10 మంది ప్రతిభావంతులతో గ్రాండ్ ఫినాలే వేడుకను ఇటీవల ముంబాయి నెస్కో హాల్-5, గోరేగావ్ వద్ద నిర్వహించారు. ఈ వేడుకలో విశాఖ పట్నం వాసి కూచిపూడి నర్తకి సుపర్ణ దత్ నృత్య రంగంలో గ్రాండ్ ఫినాలే మొదటి పదిమందిలో చోటు దక్కించుకున్నారు. ఆమెకు ఈ వేడుకలో నగదు పురస్కారం, జ్ఞాపికను అందచేసి గౌరవించారు. దేశవ్యాప్తంగా 50 ఏళ్ళు పైబడిన కళాకారులలోని ప్రతిభను అభిరుచులను గుర్తించి వారిని ప్రోత్సహించుటకు నృత్యం, సంగీతం, యోగా, కథనాలు, వంట చేయడం, పాడటం వంటి వివిధ రంగాలలో ఎంపికలు నిర్వహిస్తున్నట్టు ఖ్యాల్ ప్రతినిధులు వెల్లడించారు. ఈ సందర్భంగా సుపర్ణ దత్ మాట్లాడుతూ, ఈ ఖ్యాల్ వేడుకలో పాల్గొనటం గొప్ప అదృష్టంగా భావిస్తున్నాను అన్నారు. దేశ వ్యాప్తంగా నిర్వహించిన ఈ ఎంపికలలో తాను మొదటి 10 మందిలో నిలవటం ఎంతో గర్వంగా ఉంది అన్నారు. ఈ గ్రాండ్ ఫినాలే వేడుక సందర్భంగా అనేక మందితో పరిచయం కలగటం ఎంతో బావుంది అని చెప్పారు. సీనియర్ల ప్రతిభను గుర్తించి, వారికి అన్ని విధాల సహాయ సహకారాలు అందించి, జాగ్రత్తలు చెపుతున్న ఖ్యాల్ యాప్ నిర్వాహకులు అభినందనీయులు అన్నారు. గ్రాండ్ ఫినాలే వేదిక పైన నగదు పురస్కారం మరియు జ్ఞాపికతో తనను సత్కరించినందుకు ధన్యావాదాలు తెలియచేసారు.

## ఆత్మవిశ్వాసం...సానుకూల దృక్పథాలతో అద్భుత విజయాలు సాధ్యం

గాజువాక, నవంబర్ 19, ప్రభాతవార్త



ఆత్మవిశ్వాసం, ఆత్మ గౌరవం, సానుకూల దృక్పథాలతో మహిళలు అద్భుత విజయాలు సాధించవచ్చని సెయింట్ ఆన్స్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సిస్టర్ ప్రేమకుమారి అన్నారు. మల్కాపురం శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా బుధవారం ఏర్పాటుచేసిన మహిళా దినోత్సవ సదస్సులో ఆమె ముఖ్యఅతిథిగా ప్రసంగిస్తూ - ప్రతి మహిళ అవకాశాలను అందిపుచ్చుకోవాలని, నైపుణ్యాలను మెరుగుపరుచుకోవాలని అన్నారు. సమావేశంలో సెయింట్ ఆన్స్ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ సిస్టర్ క్యాస్లిన్, జాతీయ సేవా పథకం జిల్లా నోడల్ అధికారి ఇ.పి.ఎస్. భాగ్యలక్ష్మి, సీనియర్ ప్రోగ్రామ్ అధికారి వై.అనసూయ దేవి, సామాజిక కార్యకర్త ముస్తారి బేగం, ప్రముఖ అధ్యాపకులు డాక్టర్ అంబేద్కర్ రాజు, స్థానిక ఉపాధ్యాయినిలు, గ్రంథాలయాధికారి వి.అజయ్ కుమార్ ప్రసంగించారు. అంతకుముందు భారతరత్న,మాజీ ప్రధాని ఇందిరా గాంధీ జయంతి సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాలలను వేసి, అంజలి ఘటించారు. కార్యక్రమంలో భాగంగా మహిళా ఉపాధ్యాయులను, సామాజిక కార్యకర్తలను ఘనంగా సన్మానించారు.

## స్వామి వార్ల విగ్రహాలకు పల్లకి సేవ


ఆనందపురం, నవంబర్ 18, ప్రభాతవార్త:



శ్రీ రాధా మదన మోహన్, శ్రీ భక్తి వేదాంత స్వామి ప్రభు పాదుల వారి విగ్రహాలకు హరే కృష్ణ వైకుంఠం ప్రాంగణంలో బుధవారం సంకీర్తనలతో పల్లకి సేవ నిర్వహించారు. విగ్రహాలను ప్రాంగణంలో ఊరేగించి భక్తులతో కీర్తనలు ఆలపించారు. హరే కృష్ణ మూవ్ మెంట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న లక్ష దీపోత్సవం కార్యక్రమంలో భాగంగా ఐదో రోజు పలు కార్యక్రమాలు నిర్వహించారు. హరే కృష్ణ మూవ్ మెంట్ ప్రెసిడెంట్ నిష్కించిన భక్తదాస అధ్వర్యంలో తులసి పూజ, సంధ్య హారతి, సంకీర్తన ప్రవచనం, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

## గుర్తు తెలియని వ్యక్తి మృతి

(విశాఖ క్రైమ్ - ప్రభాతవార్త)



పెందుర్తి పోలీస్ స్టేషన్ పరిధిలోని ప్రహల్లాదపురం ప్రాంతంలో సుమారు 75 ఏళ్ల గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు.. మంగళవారం స్పృహలేని స్థితిలో పడి ఉన్నట్లు పోలీసులకు సమాచారం అందింది. వెంటనే స్పందించిన పోలీసు సిబ్బంది అతన్ని 108 అంబులెన్స్ ద్వారా కేజీహెచ్‌కు తరలించి చికిత్స అందించారు. ఈ మేరకు బుధవారం సాయంత్రం అతను మరణించినట్లు కేజీహెచ్ వైద్యులు వెల్లడించారు.. మృతి చెందిన వ్యక్తి ఆనవాలు బట్టి మృతుని వివరాలు తెలిసినవారు పెందుర్తి పోలీసులకు సమాచారం అందించాలని తెలిపారు.

## వైభవంగా కాలబైరవ స్వామికి పంచామృతాభిషేకాలు



గాజువాక,నవంబర్ 19,ప్రభాతవార్త

జీవీఎంసీ 87వ వార్డు పరిధిలో అమావాస్య పర్వదిన సందర్భంగా సాయంత్రం 6గం నుంచి కణితి కాలనీ, కాళింగ వీధి గాంధీ బొమ్మ వద్ద ప్రతిష్ఠించిన శ్రీ శ్రీ శ్రీ పంచ ముఖ శివాలయంలో కాలబైరవ స్వామి పూజ, హెూమం పంచామృతతో అభిషేకాలు, అదేవిదంగా భక్తులు శ్రీ శ్రీ శ్రీ కాలబైరవ స్వామి వారికి ఎంతో ప్రీతి అయినా గుమ్మడికాయ దీపం పెట్టి స్వామి వారి పూజ కార్యక్రమాలు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా జరిగింది. ఈ పూజ ప్రతి అమావాస్య రోజునా ఆలయం వద్ద నిర్వహించటం జరుగుతుందని ఆలయ అభివృద్ధి కమిటి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో భక్తులు ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

Main tab page 1.0_Main tab page 1.0.qxd 11/19/2025 11:15 PM Page 1






## ప్రభుత్వ ఆర్ ఐ.టి.ఐలో ఉచిత స్వల్ప కాలిక కోర్సులు శిక్షణకు దరఖాస్తు ఆహ్వానం ప్రిన్సిపల్ ఉమా శంకర్

**అరకులోయ, నవంబర్ 19, ప్రభాతవార్త**

అరకులోయ ప్రభుత్వ ఆర్ఐటిఐలో ఏ పీ ఎస్ ఎస్ డి సి లో భాగంగా స్వల్ప కాలిక కోర్సు ను ఉచితంగా నిర్వహిస్తున్నామని, శిక్షణ పొందుటకు డిసెంబర్ 1వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపల్ ఉమా శంకర్ తెలియజేశారు. బుధవారం విలేకరులతో ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ఆర్ ఐ టి ఐ లో స్వల్ప కాలిక కోర్సుల ఉచిత శిక్షణకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. ఆర్ ఐ టి ఐ లో ఫీల్డ్ టెక్నీషియన్ కంప్యూటింగ్, పెరిఫెరల్స్ అలాగే ఏ డబ్ల్యు ఎస్ తో క్లౌడ్ కంప్యూటింగ్ వంటి స్వల్పకాలిక కోర్సులకు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు ఆయన తెలిపారు. ఈ కోర్సులు కాల వ్యవది మూడు నెలలు అని, 16 సంవత్సరాల పై బడి, 10 వ తరగతి చదివినవారు దరఖాస్తు చేసుకోవచ్చునన్నారు. అర్హులైన ఆసక్తి కలిగిన వారు 9491057527/9441997117 అనే నెంబర్లను సంప్రదించాలని ఆర్ ఐ టి ఐ ప్రిన్సిపల్ ఉమాశంకర్ తెలిపారు.

## బాలికొన్నత ఆశ్రమ పాఠశాలలో ఆకస్మిక తనిఖీలు

**రాజవొమ్మంగి, నవంబరు 19, ప్రభాతవార్త**



సింగంపల్లి గిరిజన సంక్షేమ బాలికొన్నత ఆశ్రమ పాఠశాలను మండల గిరిజన సంక్షేమ సహాయాధికారి కృష్ణమోహన్ బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టోర్ రూమ్ లో ప్రతీ నిత్యావసర వస్తువులను పరిశీలించారు. కూరగాయలు, పప్పులలో నాణ్యత లేకపోతే వెంటనే తిప్పి పంపాలన్నారు. విద్యార్థినుల ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకొన్నారు. మరుగుదొడ్లను చూసారు. ఏ ఒక్కరికి అనారోగ్యం ఉన్నా నిర్లక్ష్యం చేయవద్దని హెచ్. యం. సుబ్రమణ్యేశ్వరి, వెల్ఫేర్ ఆఫీసర్ కుమారిలకు సూచించారు. భోజనాలను పరిశీలించారు. మెనూ ఖచ్చితంగా అమలు చేయాలన్నారు. కాచి చల్లార్చిన నీటిని విద్యార్థినులు త్రాగడానికి ఇవ్వాలన్నారు. పదో తరగతి విద్యార్థినుల సామర్థ్యాలను పరిశీలించారు. పాఠశాలలో రికార్డులను తనిఖీ చేసి ఉపాధ్యాయులకు తగు సూచనలను చేశారు. ఈ కార్యక్రమంలో ఏ. టి. డబ్ల్యూ ఓ కృష్ణమోహన్, హెచ్. యం సుబ్రమణ్యేశ్వరి, వెల్ఫేర్ ఆఫీసర్ కుమారి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. రాజవొమ్మంగి గిరిజన సంక్షేమ బాలురు ఆశ్రమోన్నత పాఠశాలను తనిఖీ చేశారు. భోజనాలను పరిశీలించారు. ఇన్‌ఛార్జి హెచ్. యం జంపా రాంబాబు, వెల్ఫేర్ ఆఫీసర్ కోపూరి రాజబాబు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## జాతీయ రహదారిపై దాన్యం ఆరబెడితే చట్టపరంగాచర్యలు: ఎస్.ఐ శివకుమార్

**రాజవొమ్మంగి, నవంబరు 19, ప్రభాతవార్త**



రాజవొమ్మంగి పోలీస్ స్టేషన్ పరిధిలో గల జాతీయ రహదారిపై అనుకొని ఉన్న గ్రామాల్లో రైతులు పండిన పంటలను ఆరబెడితే చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని రాజవొమ్మంగి ఎస్. ఐ శివకుమార్ తెలిపారు. పంటలు ఆరబెట్టడం, ధాన్యం బస్తాలు రోడ్డుపై ఉంచడం వల్ల వాహనదారులు రోడ్డు ప్రమాదాలకు గురవుతున్నారన్నారు. బిఎస్ఎన్ వాహన చట్టప్రకారం చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఎస్ఐ తెలిపారు.

## రాష్ట్ర స్థాయి పోటీలకు గిరిజన విద్యార్థి ఎంపిక

**రాజవొమ్మంగి, నవంబరు 19, ప్రభాతవార్త**



రాష్ట్రస్థాయి ఆటల పోటీలకు బోర్నగూడెం గిరిజన ఆశ్రమోన్నత పాఠశాలలో తొమ్మిదోతరగతి చదువుతున్న తానారి దుర్గాప్రసాద్ ఎంపికైనట్లు హెచ్. యం. రమేష్ బాబు తెలిపారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో జరిగిన అండర్ 14 పోటీల్లో దుర్గాప్రసాద్ పాల్గొని రాష్ట్ర స్థాయి ఎంపిక జరిగిందన్నారు. ఈ నెల 20 తేదీన నెల్లూరి జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో దుర్గాప్రసాద్ ఆడనున్నారు. బుధవారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో పి. డి ధర్మరాజు, విద్యార్థి దుర్గాప్రసాద్ ను హెచ్. యం రమేష్ బాబు, ఉపాధ్యాయులు అభినందించారు. విశాఖపట్నం లో బిర్స ముండా జయంతి సందర్భంగా నిర్వహించిన ఆటలు పోటీలో తొమ్మిదో తరగతి చదువుతున్న మర్రి కామేష్ జిల్లా స్థాయి ఆటలు పోటీల్లో పాల్గొన్నట్లు రమేష్ బాబు తెలిపారు. ఈకార్యక్రమంలో హెచ్. యం రమేష్ బాబు, ఉపాధ్యాయులు బోడారపు కృష్ణ, దుంపా వరప్రసాద్, విజయబాబు, బాలరాజు, రాజబాబు, రమేష్ పాల్గొన్నారు.

## అస్మిత ఖేలో ఇండియా వెయిట్ లిఫ్టింగ్ పోటీలతో మహిళలకు ప్రోత్సాహం: చైర్మన్ దొన్నుదొర

**అరకులోయ, నవంబర్ 19, ప్రభాతవార్త**




దేశంలో క్రీడలలో మహిళల భాగస్వామ్యాన్ని ప్రోత్సహించాలన్నదే అస్మిత ఖేలో ఇండియా వెయిట్ లిఫ్టింగ్ పోటీల ఉద్దేశ్యమని తెలుగుదేశం పార్టీ అరకులోయ నియోజకవర్గం ఇన్చార్జి , ఏపీఎస్ఆర్టీసీ విజయనగరం జోన్ చైర్మన్ సియ్యారి దొన్నుదొర అన్నారు. బుధవారం స్థానిక స్పోర్ట్స్ స్కూల్ ప్రాంగణం లో ప్రిన్సిపల్ పి ఎస్ ఎన్ మూర్తి అధ్యక్షతన జరిగిన బాలికల జిల్లా స్థాయి అస్మిత ఖేలో ఇండియా వెయిట్ లిఫ్టింగ్ పోటీలను చైర్మన్ దొన్నుదొర ప్రారంభించారు. ఈ సందర్భంగా చైర్మన్ దొన్నుదొర మాట్లాడుతూ క్రీడల్లో మహిళా భాగస్వామ్యాన్ని ప్రోత్సహించడానికి, అలాగే వారికి మద్దతు ఇవ్వడానికి ఈ పోటీలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల జడ్పిటిసి సభ్యురాలు శెట్టి రోషిణి, విజయనగరం వెయిట్ లిఫ్టింగ్ అసోసియేషన్ సెక్రెటరీ సల్లా రాము, ఏ ఎం సి చైర్మన్ బోరి బోరి లక్ష్మి, టిడిపి అరకులోయ మండల అధ్యక్షులు లోకోయి మహదేవ్ , డుంబ్రిగుడ మండల అధ్యక్షులు కే ఆనంద్, టి డి పి అరకులోయ మండల ప్రధాన కార్యదర్శి రాజు, నాయకులు బాబురావు, చందూ పాడి, అనంతగిరి ఈ ఎం ఆర్ సి ప్రిన్సిపల్ ఏ సన్యాసినాయుడు, కోచ్ లు, ఉపాధ్యాయులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## గిరిజన విద్యార్థినులకు కిట్లు పంపిణీ

**రాజవొమ్మంగి, నవంబరు 19, ప్రభాతవార్త**



జడ్డంగి గిరిజన సంక్షేమ బాలికోన్నత ఆశ్రమ పాఠశాలలో బుధవారం ప్రధానోపాధ్యాయులు వారాతి శైలజ 182 మంది విద్యార్థినులకు కాస్మోస్టిక్స్ వస్తువుల కిట్లను పంపిణీ చేశారు. సబ్బులు, పౌడర్స్, రిబ్బన్లు, బ్రష్, పేస్టు, కొబ్బరి నూనె ఇలా 10 రకాల వస్తువుల కిట్లు ఐ.టి.డి.ఏ నుండి రాగా వాటిని పంపిణీ చేయడం జరిగింది. ముందుగా మొదటి మహిళా ప్రధానమంత్రి స్వర్గీయ ఇందిరాగాంధీ పుట్టినరోజు సందర్భం గాహెచ్. యం శైలజ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందిరాగాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులను అర్పించారు. నాలుగు పర్యాయాలుగా ప్రధాని గా ఇందిరాగాంధీ పనిచేశారని, ఆమెకు ఉక్కు మనిషి అనే పేరు కూడా ఉందని విద్యార్థినులకు అవగాహనను కల్పించారు. ఈకార్యక్రమంలో హెచ్. యం. వారాతి శైలజ, వెల్ఫేర్ ఆఫీసర్ కారం సత్యనారాయణమ్మ, ఉపాధ్యాయులు బి. లక్ష్మమ్మ, కె. రూతు వినయ, సత్యవతి, వెంకటరత్నం, ఆశ, హైమా, శ్రీదేవి, దుర్గాదేవి, విద్యార్థినులు పాల్గొన్నారు.

# గిరిజన రైతు సంక్షేమానికి కూటమి ప్రభుత్వ సమగ్ర దృష్టి

**- 2025-26 కాఫీ కొనుగోలు ధరలను ప్రకటించిన జిసిసి చైర్మన్ కిడారి శ్రావణ్ కుమార్**




**పాడేరు, నవంబర్ 19, ప్రభాతవార్త**

అల్లూరి సీతారామ రాజు జిల్లా రాజ్యంలో రైతు, ముఖ్యంగా గిరిజన రైతు అభివృద్ధిని ముఖ్యం చేస్తూ కూటమి ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలు ప్రజల్లో విశ్వాసం పెంచుతున్నాయి. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు విజన్, డిప్యూటీ ముఖ్య మంత్రి పవన్ కళ్యాణ్ ప్రజాప్రతినిధిత్వం, విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ ఆధునిక పరిపాలనా దృక్పథం, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సంధ్యారాణి కట్టుబాటు ఈ మొత్తం నాయకత్వం కలిసి గిరిజన ప్రాంతాల్లో సమగ్ర అభివృద్ధికి దారితీస్తోంది. ఈ దిశగా గిరిజన రైతుల బలహీనతలను పరిగణనలోకి తీసుకుని, గిరిజన సహకార సంస్ (జిసిసి) 202526 కాఫీ సీజన్‌కు కొనుగోలు ధరలను అధికారికంగా ప్రకటించింది. అటవీ ప్రాంతాల్లో కాఫీ సాగు మీద ఆధారపడిన వేలాది గిరిజన కుటుంబాలకు ఈ నిర్ణయం పెద్ద ఊరటనిచ్చింది. జిసిసిచైర్మన్ కిడారి శ్రావణ్ కుమార్ మాట్లాడుతూ "సీఎం చంద్రబాబు స్పష్టమైన మార్గదర్శకత్వంలో మరియు డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ రైతు పక్షపాత దృష్టితోనే ఈ కొనుగోలు ధరలను నిర్ణయించగలిగాం. గిరిజన రైతుల కోసం గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సంధ్యారాణి నిరంతరం పర్యవేక్షిస్తున్నారు. ఈ ప్రభుత్వం మాటలు కాదు చర్యలతో రైతుకు న్యాయం చేస్తోంది" అన్నారు. 202526 కాఫీ కొనుగోలు ధరలు (జిసిసి): అరబికా పార్చ్‌మెంట్ – రూ. 450/ కిలోకు అరబికా చెర్రీ – రూ. 270/ కిలోకు రోబస్టా చెర్రీ – రూ. 170/ కిలోకు కూటమి ప్రభుత్వం ఏర్పాటు చేసిన తర్వాత గిరిజన ప్రాంతాల్లో పారదర్శక వ్యవసాయ విధానాల అమలు వేగవంతమైంది. మధ్యవర్తుల జోక్యాన్ని తగ్గించడం, రైతుకు నేరుగా లాభం చేరేలా వ్యవస్థను బలోపేతం చేయడం ఇవి అన్నీ సీఎం చంద్రబాబు పాలనలో సాధ్యమవుతున్నాయని ప్రజలు భావిస్తున్నారు. డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ రైతు అనుసంధానం, మంత్రి లోకేష్, డిజిటలైజేషన్ చర్యలు, మంత్రి సంధ్యారాణి గిరిజనాభివృద్ధి పై నిబద్ధ తఇవి అన్నీ కలిసి గిరిజన రైతుల జీవితంలో సానుకూల మార్పులు తీసుకొస్తున్నాయి. ఈ నేపథ్యంలో జిసిసి తీసుకున్న కాఫీ కొనుగోలు నిర్ణయం గిరిజన రైతుల స్థిరత్వం, భరోసా కోసం కూటమి ప్రభుత్వ నిబద్ధతకు ప్రత్యక్ష నిదర్శనంగా నిలుస్తుంది. గిరిజన రైతులు ఏజెన్సీ ప్రాంతాల్లో నేరుగా జిసిసి కేంద్రాల్లో తమ కాఫీని విక్రయించడం ద్వారా మధ్యవర్తుల దోపిడీ పూర్తిగా తగ్గుతుందని అధికారులు తెలిపారు. గిరిజన రైతుల ఆదాయం పెంచడం, సరైన ధరకు పంట కొనుగోలు చేయడం, మార్కెట్ లో స్థిరత్వం ఇవ్వడం ఇవి కూటమి ప్రభుత్వ గిరిజనాభివృద్ధి పట్ల ఉన్న నిజమైన నిబద్ధతకు నిదర్శనం అని వ్యవసాయ నిపుణులు అభిప్రాయపడుతున్నారు.కాఫీ కొనుగోలు మరియు ఇతర వివరాల కోసం రైతులు తమ సంబంధిత జే సి సి కేంద్రాలను సంప్రదించవచ్చు.

## ఆపరేషన్ సంబవ్ కొనసాగుతుంది

**- అల్లూరి జిల్లా ఎస్పీ అమిత్ బర్దర్**

**రంపచోడవరం, నవంబర్ 19, ప్రభాతవార్త**



మారేడుమిల్లి అడవులలో బుధవారం జరిగిన ఎన్కౌంటర్ వివరాలను అల్లూరి జిల్లా ఎస్పీ అమిత్ బర్దర్ రంపచోడవరం పోలీస్ స్టేషన్ వద్ద ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వెల్లడించారు. మంగళవారం నాటి కాల్పుల సంఘటన తర్వాత పోలీసులు గాలింపు కొనసాగిందని అన్నారు. బుధవారం నాడు ఉదయం ఐదు నుండి ఆరు గంటల మధ్యలో మరొక ఎన్కౌంటర్ జరిగిందని సంఘటన స్థలం వద్ద ఏడు మృతదేహాలు లభ్యం అయ్యాయని చెప్పారు. నలుగురు పురుషులు ముగ్గురు మహిళలు మృతి చెందినట్లు చెప్పారు. ఎన్కౌంటర్లో మరణించిన పేర్లు ఏవోబి ఇన్చార్జ్ జోగారావు కమ్యూనికేషన్ చీఫ్ టెక్ శంకర్, ప్రొడక్షన్ టీం కమాండర్ జ్యోతి, సురేష్ లోకేష్ శైలు అనిత సమ్మెగా గుర్తించారు. ఏఓబిలో ఇప్పుడు పోలీసులు చేపట్టిన మావోల ఏరువేతకు ఆపరేషన్ సంబవ్ గా నామకరణం చేశారు. ఆపరేషన్ సంబవ్ కొనసాగిస్తున్నట్లు వ్యవహరిస్తున్నట్లు ఎస్పి వెల్లడించారు. మంగళ బుధవారం జరిగిన రెండు ఎన్కౌంటర్లలో 13 మంది మావోయిస్టులను మట్టు పెట్టినట్లు ఎస్పీ తెలిపారు. ఎదురుకాల్పులలో స్థానిక పోలీసులకు పూర్తి సహకారం అందించిన కేంద్ర బలగాలకు అల్లూరు జిల్లా ఎస్పీ అమిత్ బర్దర్ అభినందనలు తెలియజేశారు. ఎన్కౌంటర్లో మృతి చెందిన మావోయిస్టు కీలక నేత టెక్ శంకర్ పై 20 లక్షల రివార్డు ఉన్నట్లు వెల్లడించారు. ఇతర రాష్ట్రాలలో సైతం టెక్ శంకర్ పై రివార్డు లు ఉన్నట్లు చెప్పారు. రెండు ఎన్కౌంటర్ల ద్వారా పోలీస్ బలగాలు భారీ విజయాన్ని నమోదు చేశామని తెలిపారు.

## నిత్య అప్రమత్తతతోనే అనారోగ్యాలకు దూరం..!

**- జిల్లా అదనపు వైద్య ఆరోగ్యశాఖాధికారి టి. ప్రతాప్**

**కొయ్యూరు నవంబర్ 20 ప్రభాతవార్త**



నిత్యం పరిసరాల పరిశుభ్రత, వ్యాధుల వ్యాప్తి అంశాలపై అప్రమత్తంగా ఉన్నప్పుడే అనూహ్యంగా ప్రభలే వ్యాధులను నియంత్రించవచ్చునని జిల్లా అదనపు వైద్య ఆరోగ్యశాఖాధికారి టి ప్రతాప్ అభిప్రాయపడ్డారు. ఆయన మండల కేంద్రం లోని రాజేంద్రపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని రాజేంద్రపాలెం బాలికల గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలను సందర్శించారు. ఆశ్రమ పాఠశాలలోని విద్యార్థులు అస్వస్థతకు గురైన విషయంపై హెచ్ఎం గోపాల్ తోను, డిప్యూటీ వార్డెన్ తోను చర్చించి తగు సూచనలు చేశారు. ముందుగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించిన ఆయన వైద్యాధికారిణి డా. స్నేహలత ని సంఘటనకు సంబంధించిన వివరాలు అడిగి తెలుసుకుని ఆమెతో కలిసి జిటి డబ్ల్యూ గర్ల్స్ హాస్టల్ ని, కేజీబీవీని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వసతి గృహాలలో నిర్వాహకులకు ముందుగా అప్రమత్తత అవసరమని అభిప్రాయపడుతూ, వైద్యాధికారులు, సిబ్బంది అందుబాటులో ఉండాలని సూచించారు. కార్యక్రమంలో సిహెచ్ఓ ఎల్.ప్రశాంత్ కుమార్ పాల్గొన్నారు.

## గిరిజన పూజారులకు శిక్షణాతరగతులు అభినందనీయం..!

**- కొయ్యూరు సీఐ శ్రీనివాస్**

**కొయ్యూరు, నవంబర్ 19, ప్రభాతవార్త**




గిరిజన గ్రామాల్లోని పూజారులకు శిక్షణ తరగతులు నిర్వహించడం అభినందనీయమని కొయ్యూరు సీఐ శ్రీనివాసరావు, ఏపీ ట్రైకర్ డైరెక్టర్ కృష్ణారావు పేర్కొన్నారు. వికాస తరంగిణి, దానధర్మ చారిటబుల్ ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించనున్న ఉచిత శిక్షణా తరగతుల దరఖాస్తును సీఐ శ్రీనివాసరావు బిజెపి నేత కృష్ణారావుతో కలిసి ఆవిష్కరించారు. వికాస తరంగిణి దానధర్మ ఆధ్వర్యంలో పది రోజుల పాటు శిక్షణ తరగతుల ఏర్పాటుకు స్థానిక ధార్మిక సంస్థల సేవా ప్రతినిధి డివిడి ప్రసాద్ దరఖాస్తులను స్వీకరించి హైదరాబాద్ చిన్న జీయర్ స్వామి ఆశ్రమానికి శిక్షణకై పూజారులను తరలించే ఏర్పాట్లు చేస్తుండటం అభినందనీయమన్నారు. ఈ శిక్షణ తరగతులను గిరిజన ప్రాంత పూజారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ధార్మిక సంస్థల సేవా ప్రతినిధి డివిడి ప్రసాద్ తో పాటు బిజెపి మండల ప్రధాన కార్యదర్శి పద్మరాజు, గిరిజన మోర్చా జిల్లా అధ్యక్షుడు అరిమెల రాజు, మహిళానేత కాకర ఉష, పలువురు గిరిజన పూజారులు పాల్గొన్నారు.

## పరిమితికి మించి ప్రయాణం ప్రమాదాలకు కారణం..

**గూడెం కొత్తవీధి, నవంబర్ 19, ప్రభాతవార్త**



మండల కేంద్రం లో వాహనాల ప్రమాదాల గురించి ఆటో డ్రైవర్లు జాగ్రత్త వహించాలంటూ గూడెం కొత్తవీధి సి.ఐ సుధాకర్ అవగాహన కల్పించారు. పరిమితికి మించి ప్రయాణికులను ఆటోల్లో ఎక్కించవద్దని, రోడ్డు ప్రమాదాలపై ప్రయాణికులు, ఆటో డ్రైవర్లుకు బుధవారం అవగాహన కల్పించారు. వాహనాల్లో ఎక్కువమంది ఎక్కడం వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయని తెలిపారు. ఇకపై విస్తృతంగా తనిఖీలు చేపడతామని,నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## రెండో విడత అన్నదాత సుఖీభవ రైతులకు అందజేసిన కూటమి ప్రభుత్వం: టిడిపి మండల అధ్యక్షులు పోత్తూరు కొండలరావు

**గూడెం కొత్తవీధి,నవంబర్ 19, ప్రభాతవార్త**



మండలంలోని రైతులకు కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ హామీలో భాగంగా బుధవారం కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న పీఎం కిసాన్ 2000/, అన్నదాత సుఖీభవ 5000 /మొత్తం కలిపి రైతుల ఖాతలలో 7000 రూపాయలు రెండో విడతగా నిధులు విడుదల చేసి రైతు ఖాతాల్లో జమ చేయడం శుభపరిమానమని టిడిపి మండల అధ్యక్షులు పోత్తూరు కొండలరావు అన్నారు .రైతుల ఖాతాలో 7000 రూపాయలు జమ అయిందా,లేదా అని సరిచూసుకోవాలని,లేనియెడల రైతు సేవ కేంద్రాలలోని అధికారులకు తెలియజేయాలని ఆయన రైతులకు తెలిపారు.

## జీ.కే వీధిలో జనాభా లెక్కలు 2027

**:ప్రీటెస్ట్ పరిశీలకేంద్ర డిప్యూటీ రిజిస్ట్రార్ జనరల్ (మ్యాప్) డా. వి.వి.ఎల్.ఎన్.శర్మ పర్యటన**

**గూడెం కొత్తవీధి,నవంబర్ 19, ప్రభాతవార్త**



వచ్చే ఏడాది 2027 జనాభా లెక్కల కోసం జరుగుతున్న ముందస్తు పరీక్ష కార్యక్రమాన్ని కేంద్ర హోం వ్యవహారాల మంత్రిత్వ శాఖలోని ఉన్నతాధికారి డాక్టర్ వి.వి.ఎల్.ఎన్.శర్మ క్షేత్రస్థాయిలో పర్యవేక్షించారు. డిప్యూటీ రిజిస్ట్రార్ గూడెం కొత్త వీధి మండలంలోని నూతిబంద గ్రామానికి విచ్చేశారు.ప్రజలు,సిబ్బందితో డాక్టర్ శర్మ గ్రామంలో పర్యటించి ప్రీ టెస్ట్‌లో పాల్గొంటున్న స్థానిక ప్రజలు, గణనదారులు మరియు పర్యవేక్షకులతో నేరుగా మాట్లాడారు.ఈ సందర్భంగా జనాభా లెక్కల ప్రశ్నపత్రం గణన పద్ధతులు మరియు క్షేత్రస్థాయిలో ఎదురయ్యే సవాళ్లను గురించి సిబ్బంది నుండి అభిప్రాయాలను తీసుకున్నారు.ఈ సంభాషణ ద్వారా ప్రీటెస్ట్‌లో గుర్తించిన లోపాలను ప్రధాన లెక్కల కార్యక్రమం ముందు సరిదిద్దడానికి వీలు కలుగుతుంది.మ్యాప్‌ల ధృవీకరణపై ప్రధాన దృష్టి మధ్యాహ్నం సమయంలో పూర్తిగా సాంకేతిక అంశాలపై కేంద్రీకృతం చేశారు.



డాక్టర్ శర్మ పాడేరు ఆర్ డి ఓ,ఏడీ సర్వే అధికారులు,మండల సర్వేయర్లు మరియు గ్రామ సర్వేయర్లతో కలిసి సమావేశమయ్యారు.సమావేశంలో జనాభా లెక్కల కోసం రూపొందించిన భౌగోళిక మ్యాప్‌లు గుర్తించిన రెవెన్యూ గ్రామ సరిహద్దులను నిశితంగా పరిశీలించారు. ఏ ఒక్క ప్రాంతం కూడా లెక్కించ బడడానికి (వదలకుండా) ఉండేలా, జనాభా నివసించే ప్రాంతాలు మ్యాప్‌లలో సరిగ్గా నమోదయ్యాయో లేదో ధృవీకరించుకున్నారు.జనాభా లెక్కల యొక్క ఖచ్చితత్వం మరియు పరిపాలనా యూనిట్లతో డేటాను అనుసంధానించడానికి మ్యాపింగ్ ప్రక్రియ అత్యంత కీలకమని డాక్టర్ శర్మ అన్నారు. ఈ కార్యక్రమంలో సెన్సెస్ బృందం మరియు జీ.కే వీధి తాసిల్దార్ అన్నాజీ రావు, పలువురు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## అక్రమంగా రవాణా చేస్తున్న 120 కేజీల గంజాయి పట్టివేత

**- ఇద్దరు వ్యక్తులు అరెస్టు**

**చింతూరు, నవంబర్ 19 ప్రభాతవార్త**



ఒరిస్సా నుండి ఆంధ్రప్రదేశ్ కు బొలెరో వాహనంలో తవుడు బస్తాల కింద పెట్టి అక్రమంగా తరలిస్తున్న 120 కేజీల గంజాయి ని బుధవారం చింతూరు పోలీసులకు పట్టు బడింది. ఎర్రంపేట లోని ఒరిస్సా(మోటు) రోడ్ జంక్షన్ లో చింతూరు సి ఐ గోపాలకృష్ణ, ఎస్ ఐ రమేష్ ఆధ్వర్యంలో పోలీసులు వాహనాల తనిఖీ చేస్తుండగా ఈ వాహనం పట్టుబడింది. 120 కేజీల గంజాయితోపాటు, బొలెరో వాహనాన్ని, స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు. ఈ కేసులో బిశ్వజిత్ మండల్, సుధీప్ హల్దార్లను పోలీసులు అరెస్ట్ చేశారు. ఒరిస్సా లోని మల్కనగిరి జిల్లా 71 క్యాంపుకు చెందినవారిగా పోలీసులు తెలిపారు. పట్టుబడిన గంజాయి విలువ సుమారు ఆరు లక్షల రూపాయలు ఉంటుందని తెలిపారు. నిందితులపై కేసు నమోదు చేసి రిమాండ్ కు తరలించారు.

## టీడీపీ నాయకుడు చోంపి రామర్శించిన రాష్ట్ర జీసీసీ చైర్మన్ కిడారి శ్రావణ్ కుమార్

**పాడేరు,నవంబర్18, ప్రభాతవార్త**



హుకుంపేట మండలం రంగశిల పంచాయతీ సిమిలీగూడ గ్రామనికి చెందిన తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు చోంపి అప్పలస్వామి బైక్ యాక్సిడెంట్ లో స్వర్గస్తులైన విషయం తెలుసుకున్న రాష్ట్ర జీసీసీ చైర్మన్, మాజీ మంత్రి, టీడీపీ అరకు పార్లమెంట్ అధ్యక్షులు కిడారి శ్రావణ్ కుమార్ అప్పలస్వామి స్వగ్రామం సిమిలీగూడ గ్రామంలో చేరుకొని చోంపి అప్పలస్వామి పార్దివాదేహన్ని పూలమాల వేసి ఘన నివాళి అర్పించిన అనంతరం చోంపి అప్పలస్వామి కుటుంబాన్ని పరామర్శించి పార్టీ అండగా ఉంటుందని ఏ సమస్య ఉన్న తమ దృష్టికి తీసుకురావాలని ధైర్యంగా ఉండాలని రాష్ట్ర జీసీసీ చైర్మన్ కిడారి శ్రావణ్ కుమార్ భరోసా ఇచ్చారు ఈ కార్యక్రమంలో రాష్ట్ర మాజీ ఎస్సి ఎస్టీ కమిషన్ మెంబర్ సివేరి అబ్రహం, మాజీ జడ్పీటీసీ సాగర సుబ్బారావు, దారెలా సర్పంచ్ పాంగి పాండురంగ స్వామి, క్లస్టర్ ఇంచార్జి రూడి త్రినాధ్,టీడీపీ నాయకులు మురళి, భాస్కర్ రావు,మత్యారాజు,స్వామి పాల్గొన్నారు

## పాడేరు జిల్లా ఆస్పత్రిని సందర్శించిన సాధికారత మంత్రిత్వ శాఖ డిప్యూటీ సెక్రటరీ జస్బీర్ సింగ్

**పాడేరు,నవంబర్19, ప్రభాతవార్త**



భారత ప్రభుత్వ సామాజిక న్యాయం మరియు సాధికారత మంత్రిత్వ శాఖ డిప్యూటీ సెక్రటరీ జస్బీర్ సింగ్ బుదవారం పాడేరు ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి ప్రాంగణంలో గల ఖిది ఎబిలిటీ పీపుల్ సంస్థఖి అధ్వర్యంలో నిర్వహించబడుచున్న దివ్యాంగుల పునరావాస కేంద్రం ను సందర్శించారు. సంస్థ ద్వారా చేపడుతున్న కార్యక్రమాల వివరములను నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. దివ్యాంగులకు ఉపకరణము పంపిణీ చేసారు. ప్రభుత్వం ద్వారా అమలు చేయబడుచున్న వివిధ సంక్షేమ కార్యక్రమాలపై ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో సంబంధిత ప్రభుత్వ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. అనంతరం భవిత కేంద్ర సందర్శించి విద్యార్థులతో ముచ్చటించారు. మహిళా శిశు సంక్షేమ శాఖ అధ్వర్యంలో నిర్వహించబడుచున్న బాల సదనంను సందర్శించి వివరములు అయన అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో విభిన్న ప్రతిభావంతులు, హిజ్రాలు మరియు వయో వృద్ధుల సంక్షేమ శాఖ సహాయ సంచాలకులు కె. కవిత, ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి పర్యవేక్షకులు డా. హేమలత, మహిళా శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్ జా..న్సి రామ్ పడాల్ తదితరులు పాల్గొన్నారు.

Main tab page 7_2_Main tab page 7_2.qxd 11/19/2025 11:14 PM Page 1






# మారబోతున్న ఆ.. గ్రామాల నిర్వాసితుల చిరునామాలు.!

- యుద్ధ ప్రాతిపదికన కొనసాగుతున్న గృహ నిర్మాణాలు..







**నక్కపల్లి, ప్రభాతవార్త**

పుట్టిన ఊరిలో శాశ్వతంగా నివాసం ఉంటాం.. ఒకవేళ బ్రతకడానికి ఏదైనా ప్రాంతానికి వెళ్తే తప్ప ఎప్పటికైనా మన ఊరు మన ఊరే అనే సాంప్రదాయం.. నిత్యం వింటాం.. కానీ పి సి పి ఐ ఆర్ కోసం ఏపీఐఐసి భూసేకరణ లో భాగంగా భూములు, ఇల్లు కోల్పోయిన నిర్వాసితులకు ప్రభుత్వం ప్రత్యేకంగా ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ ద్వారా కళ లో కూడా ఊహించని ప్రాంతంలో ఇండ్ల స్థలం కేటాయించి అక్కడ గృహాలు నిర్మించుకునేటట్లు ఆ గ్రామాల నిర్వాసితులకు దారులు చూపించారు. ఈ నిర్వాసితులు ఇప్పటివరకు వారి వారి గ్రామాల్లో వారి ఆధార్ నమోద నుబట్టి అక్కడ వారి చిరునామా ఉంది. మరి కొద్ది నెలల్లో భూములు ,ఇల్లు కోల్పోయిన నిర్వాసితుల చిరునామా మారబోతుంది. మండలంలోని తీరప్రాంతాలను ఆనుకొని పలు పరిశ్రమలు రానున్న సంగతి తెలిసిందే.! ఈ మేరకు మండలంలోని బుచ్చిరాజుపేట(92), రాజయ్యపేట( 108),చందనాడ(129), వేంపాడు(195), డిఎల్ పురం(21) ,గ్రామాలకు చెందిన భూములు, ఇల్లు కోల్పోయిన నిర్వాసితులు ఈ చిరునామా మారే జాబితాలో కనిపించబోతున్నారు. వీరి కోసం ప్రభుత్వం మండలంలోని పెద్ద బోదిగల్లం సమీపంలో 152 ఎకరాలను సిద్ధం చేసింది. 152 ఎకరాల్లో లేఅవుట్ ఏర్పాటుచేసి 1250 ప్లాట్లు సిద్ధం చేశారు. అందుకు సంబంధించి సెప్టెంబర్ 31వ తేదీన ఆయా గ్రామాల సమీపంలో లాటరీ ద్వారా ప్లాట్లు కేటాయించారు. ఆ కేటాయించిన ప్లాట్లు సుమారు 745 మంది నిర్వాసితులను గుర్తించారు. ఆ ఇంటి యజమానితో పాటు పెళ్లి కాని కుమార్తె, కుమారులకు ఏర్పాటు చేసిన లేఔట్ లో ఇండ్ల స్థలాలను కేటాయించారు. ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ ద్వారా నిర్వాసితులుగా గుర్తించబడిన ఈ 745 మంది కుటుంబాలకు ఎనిమిది లక్షల 98000 ప్యాకేజీ రూపంలో సొమ్మును వారి వారి ఖాతాల్లో జమ చేశారు. నక్కపల్లి జాతీయ రహదారి నుంచి1.50 కిలోమీటర్ల దూరంలో ఈ లేఅవుట్ కు చేరుకునేందుకు అవకాశం ఉంది. ఈ నిర్వాసితుల కోసం ఏర్పాటు చేసిన ఈ లేఔట్ లో వారికి అవసరమైన రహదారులు, డ్రైనేజీ సౌకర్యాలను ఇప్పటికే ఏర్పాటు చేశారు. 745 మంది లబ్ధిదారుల్లో వేగవంతంగా గృహాలు నిర్మించుకోవాలని ఆశతో పది రోజుల క్రితం ఊహించని విధంగా నేరుగా లేఔట్ లోని వేదమంత్రాలు నడుమ జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్ తోపాటు డివిజన్ స్థాయి అధికారులు వివి రమణ ల చేతుల మీదుగా శంకుస్థాపన కార్యక్రమాలు నిర్వహించారు. ఆ సందర్భంలో జిల్లా కలెక్టర్ మార్చి 2026 లోగా గృహాలు నిర్మించుకోవాలని గృహ నిర్మాణాల కోసం ముందుకొచ్చిన నిర్వాసితులకు సూచించారు. ఆ సందర్భంలో నిర్వాసితులతో ముచ్చటగా మాట్లాడుతున్న సమయంలో ఇప్పటివరకు మీరు నివసించిన మీ గ్రామాలను విడిచి నూతనంగా నిర్మించుకోబోతున్న ఈ పెద్ద బోధిగల్లం గ్రామానికి దగ్గరలోకి వస్తున్నారు.. బాధగా ఉన్నప్పటికీ ప్రభుత్వం అన్ని సౌకర్యాలను వేగవంతంగా ఈ లేఔట్ ను సిద్ధం చేయడం జరుగుతుందని, వారితో మాట్లాడారు. ఐదు సెంట్లు ఇండ్ల స్థలంతో పాటు కాపు, వాడబలిజ, యాదవ కులాలకు సంబంధించిన కమ్యూనిటీ హాల్స్ 200 కే ఎల్ కలిగిన మంచినీటి ట్యాంకు, రేషన్ డిపోలు ,పంచాయతీ కార్యాలయం, గ్రంథాలయం, అంగన్వాడీ సెంటర్, ప్రైమరీ స్కూల్, ప్లే గ్రౌండ్, పిహెచ్సి, పశువుల ఆసుపత్రి, షాపింగ్ కాంప్లెక్స్, చుట్టూ కాంపౌండ్ వాల్, ఆర్చ్, గేట్, డంపింగ్ పార్క్ ఈ విధంగా అన్ని సౌకర్యాలు ఒక విధంగా చెప్పాలంటే ఒక గేట్ అండ్ కమ్యూనిటీకి ఎటువంటి సౌకర్యాలు ఉంటే అటువంటి సౌకర్యాలు అన్ని ఈ లే ఔట్ లో ఏర్పాటు జరుగుతుందని, వారికి పూర్తిస్థాయిలో వివరించారు. ఈ విధంగా నిర్వాసితుల కోసం ఏర్పాటు చేసే ఐదు సెంట్లు ఇండ్ల నిర్మాణాలు విషయమై నిర్వాసితులు కొన్ని ఉచితంగా సరఫరా చేయాలని కోరారు. సబ్సిడీ పైన అవకాశం మేరకు సరఫరా చేసేందుకు కృషి చేస్తామని, అవసరమైతే మెటీరియల్ తీసుకొచ్చి ట్రాన్స్పోర్ట్ ఏర్పాటు చేస్తామని, వేగవంతంగా గృహాలు నిర్మించుకోవాలని శంకుస్థాపన విషయంలో కలెక్టర్ వారితో మాట్లాడారు. ఇన్ని సౌకర్యాలతో కలిగిన ఈ లేఔట్ లో గృహాలు నిర్మించుకునే ఆ ఐదు గ్రామాల నిర్వాసితుల పూర్తిస్థాయి చిరునామా మరికొన్ని నెలల్లో మారిపోతుంది 745 మందిని నిర్వాసితులు ఇక్కడ కేటాయించిన 152 ఎకరాల్లో గృహాలను నిర్మించుకుంటారో.. లేక కొంతమంది నిర్మించుకుంటారో.. మిగతా 525 మంది ఏ గ్రామాల నుంచి వస్తారో వేచి చూడాల్సిందే.!

### నిర్వాసితుల సమస్యలు పూర్తిస్థాయిలో పరిష్కరిస్తాం..! ఆర్డీవో "వివి రమణ"..

మండలంలోని పెద్ద బోధిగల్లం సమీపంలో నిర్మిస్తున్న లేఔట్ లో నిర్వాసితులు పలు సమస్యలను దృష్టికి తీసుకొచ్చారని ,ఆ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వ నిబంధనలు మేరకు ప్రయత్నిస్తామని, ఇప్పటికే జిల్లా కలెక్టర్ పరిశీలిస్తున్నారని ఆర్డీవో వివి రమణ చెప్పారు. కేటాయించిన లేఔట్ లో గృహాలు నిర్మించుకునేందుకు ముందుకు వచ్చిన ప్రతి ఒక్కరిని ఈ సందర్భంగా ఆయన అభినందించారు.

## బల్క్ డ్రగ్స్ ఉద్యమానికి వామపక్ష మహిళా సంఘాల మద్దతు.!

- 67వ రోజుకు చేరిన దీక్షలు

**నక్కపల్లి, ప్రభాతవార్త**





బల్క్ డ్రగ్స్ పార్క్ వ్యతిరేక ఉద్యమానికి వామపక్ష పార్టీలకు చెందిన మహిళా సంఘం నాయకులు మద్దతు తెలియజేశారు . ఈ సందర్భంగా ఎంఎఫ్ఐ డబ్ల్యు రాష్ట్ర కార్యదర్శి అత్తిలి వనజ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దుర్గాభవాని, ఏఐడీ రాష్ట్ర అధ్యక్షులు కే. శ్రీదేవిలు మాట్లాడుతూ మత్స్యకారులు చేస్తున్న న్యాయ పోరాటానికి మహిళా సంఘాలు పూర్తి మద్దతు తెలియజేస్తున్నా యని, రాజయ్యపేట మత్స్యకారులు చేస్తున్న పోరాటానికి అండదంటగా ఉంటుందని, మత్స్యకారుల పట్ల అన్యాయమైన కేసులు పెడితే మహిళా సంఘాలుగా రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన చేస్తామని వారు శిబిరం వద్ద మద్దతు తెలుపుతూ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎన్ ఎఫ్ ఐ డబ్ల్యూ రాష్ట్ర అధ్యక్షులు అత్తిలి విమల , అనకాపల్లి జిల్లా కార్యదర్శి పరమేశ్వరి, అనకాపల్లి జిల్లా అధ్యక్షులు సుబ్బలక్ష్మి, ఏఐ డీడబ్ల్యూఏ రాష్ట్ర సహాయ కార్యదర్శి సత్యవతి, రమణి, అనకాపల్లి జిల్లా కార్యదర్శి వరలక్ష్మి, అధ్యక్షులు మణికిరణ్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు క్రీడా పోటీలు.!

**నక్కపల్లి, ప్రభాతవార్త**



మండలం లోని చినదొడ్డిగల్లు నక్కపల్లి శాఖ గ్రంధాలయాల్లో బుధవారం గ్రంథాలయ అధికారులు కే జనార్ధన్ జి గోవిందరావుల ఆధ్వర్యంలో 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు పురస్కరించుకొని స్థానిక పాఠశాలల విద్యార్థులకు పలు రకాల పోటీలు, వ్యాయామ ఉపాధ్యాయులు డా. షహ నాజ్ పరివేక్షణలో పోటీలు హోరాహోరీగా జరిగాయి. ఈ సందర్భంగా డా. షహనాజ్ మాట్లాడుతూ విద్యార్థి దశ నుండే క్రీడల పట్ల ఆసక్తి కలిగి రాణిస్తే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందన్నారు . క్రీడల పట్ల మానసి ఉల్లాసం తో పాటు మనసు ఉత్తేజ పరుస్తుందని, క్రీడలు పట్ల శ్రద్ధ చూపాలని విద్యార్థులకు సూచించారు. నక్కపల్లి గ్రంథాలయంలో మాజీ ప్రధాని స్వర్గీయ ఇందిరా గాంధీ జయంతి కార్యక్రమాన్ని నిర్వహించి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. హై స్కూల్ ప్రధానోపాధ్యాయులు వి. బాలాజీ తోపాటు ఆంగ్ల ఉపాధ్యాయుడు వై. వెంకటరమణ, తెలుగు ఉపాధ్యాయులు శర్మ, ఎన్. సాంబశివరావు, ఎం ప్రసాద్, సిబ్బంది రమణమ్మ, కనకరాజు పాఠశాల విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## ఆరోగ్యవంతమైన గ్రామాలే మన లక్ష్యం: ఎంపీడీవో "చైతన్య"

**నక్కపల్లి, ప్రభాతవార్త**





మండలంలోని ప్రతి గ్రామం ఆరోగ్యవంతమైన గ్రామంగా కనిపించాలంటే పరిశుభ్రత పర్యావరణం పై ప్రతి ఒక్కరూ బాధ్యతగా తీసుకొని ప్రజలను చైతన్యవంతులు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఎంపీడీవో చైతన్య పిలుపునిచ్చారు .బుధవారం మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో రెండు రోజులు పాటు పంచాయతీరాజ్ రూరల్ డెవలప్మెంట్ సౌజన్యంలో పరిశుభ్రత పర్యావరణంపై సర్పంచులు, ఉప సర్పంచులు, కార్యదర్శులకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామాలను ఏ విధంగా పరిశుభ్రంగా ఉంచాలి అనే విషయంపై రిసోర్స్ పర్సన్స్ శిక్షణ ఇచ్చారు. పరిశుభ్రత పర్యావరణం పై ఇంటింటికి ఏ విధంగా అవగాహన కల్పించాలి, ప్రజలను ఏ విధంగా చైతన్యవంతులు చేయాలి. ఈ కార్యక్రమంలో వారిని భాగస్వాములు చేసే విషయంలో ఏ విధంగా పని చేయాలి, అనే విషయంపై పూర్తిస్థాయిలో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఏవో దేముడు నాయుడు, సీతారామరాజు, డిప్యూటీ ఎంపీడీవో కే. చలపతిరావు, కార్యదర్శులు నరసింహారాజు, పివిపి రాజశేఖర్, ముజ్జి శ్రీనివాసరావు, సర్పంగరావు, చిన్నమనాయుడు, సత్యం, సీనియర్ అసిస్టెంట్ జ్యోతి తదితరులు ఉన్నారు.

## రైతులు సంక్షేమమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం: అందుకూరి ప్రసాద్

**ఎలమంచిలి, నవంబర్ 19, ప్రభాతవార్త**



అన్నదాత సుఖీభవ నిధులు నిధులు విడుదల సందర్భంగా తెలుగుదేశం పార్టీ నాయకులు ఇన్చార్జి అందుకూరి ప్రసాద్, మాజీ సర్పంచ్ వేగి రాము, ఎంపీటీసీ అల్లవరపు బాబ్జి ఆధ్వర్యంలో రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అందుకూరి ప్రసాద్ మాట్లాడుతూ రైతులు సంక్షేమమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పని చేస్తుందని, ఇచ్చిన మాట ప్రకారం అన్నదాత సుఖీభవ రెండో విడత నిధులు రైతులు ఖాతాల్లో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చరవతో నేడు విడుదల చేయడం జరిగిందని అన్నారు. రైతులు అన్నదాత సుఖీభవ పథకం కింద ఏడాదికి 20వేల రూపాయలను వారి ఖాతాల్లో వేయడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని, దీనిలోని భాగంగా కేంద్ర ప్రభుత్వం ఇచ్చే 2000 రాష్ట్ర ప్రభుత్వం దానికి కలిపి 5000 కలిపి మొత్తం 7000 రూపాయలు ఈరోజు రైతులు అకౌంట్లో జమ చేయడం జరిగిందన్నారు. గత ఆగస్టు నెలలో 7,000 రైతులకు జమ చేయడం జరిగిందని ఇప్పుడు 7000తో కలిపి 14000 రూపాయలు అయిందని మిగిలిన 6000 రూపాయలు కూడా త్వరలోనే జమ చేయడం జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో రైతులు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## అనధికారిక ఇసుక ర్యాంపులు..

### - స్వాధీనం చేసుకున్న రెవెన్యూ అధికారులు.. స్పందించని మైన్స్ అధికారులు..

**ఎలమంచిలి, నవంబర్ 19, ప్రభాతవార్త**

వార్తకు స్పందనగా అనధికారిక ఇసుక ర్యాంపులపై తాసిల్దార్ వరహాలరావు స్పందించి ఇసుక ర్యాంపులను సీజ్ చేశారు. సీజ్ చేసిన ఇసుక ర్యాంపులకు సమాచారాన్ని మైన్స్ అధికారులకు చేరవేశారు. రెండు రోజులు గడుస్తున్న మైన్స్ అధికారులు ఇప్పటికీ ఇసుక ర్యాంపులపై ఎటువంటి చర్యలు తీసుకోకపోవడం విశేషం. గత రెండు రోజులుగా రెవెన్యూ సిబ్బందిని ఇసుక ర్యాంపు వద్ద బందోబస్తు ఏర్పాటు చేసినట్లు తాసిల్దార్ వరహాల రావు తెలియజేశారు. తక్షణమే మైన్స్ అధికారులు స్పందించి సీజ్ చేసిన ఇసుక ర్యాంపు నిర్వహిస్తున్న వారిపై చర్యలు చేపట్టాలి.



## టెట్ పరీక్ష నుంచి ఉపాధ్యాయులను మినహాయించాలి: యుటిఎఫ్


**నక్కపల్లి, ప్రభాతవార్త**



పెందుర్తి మండలంలో గల అన్ని హై స్కూల్స్ లో యుటిఎఫ్ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని జిల్లా కార్యదర్శి చుక్క సత్యం ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి టి ఆర్ అంబేద్కర్ మాట్లాడుతూ సెప్టెంబర్ ఒకటో తేదీన సుప్రీంకోర్టు జారీ చేసిన తీర్పు ప్రకారం ఐదు సంవత్సరాల తర్వాత పదవీ విరమణ చేసేటటువంటి ఉపాధ్యాయులందరూ రెండు సంవత్సరాలలోపు తప్పనిసరిగా టీచర్ ఎలిజిబిలిటీ టెస్ట్ పాస్ అవ్వాలని,లేని యెడల అటువంటి ఉపాధ్యాయులు విధుల నుంచి తొలగించబడతారని చెప్పి పేర్కొనడం జరిగిందన్నారు. సుప్రీంకోర్టు తీర్పు పట్ల ఉపాధ్యాయుల్లో తీవ్ర గందరగోళ పరిస్థితులు నెలకున్నాయని చెప్పారు. ఈ సందర్భంగా విద్యాహక్కు చట్టంలో సెక్షన్ 23ను పార్లమెంట్లో చట్ట సవరణ చేసి 2010కి ముందు నియమితులైనటువంటి ఉపాధ్యాయులను టెట్ పరీక్ష నుంచి మినహాయించాలని, యుటిఎఫ్ ఆధ్వర్యంలో డిసెంబర్ తొమ్మిదో తేదీన భీమిలి డివిజన్లోనూ,10వ తేదీన పెందుర్తి డివిజన్లో పెందుర్తి జంక్షన్ నుండి తాసిల్దార్ కార్యాలయం వరకు నిరసన ర్యాలీ చేపట్టనున్నామని దీనికి ఉపాధ్యాయులు పెద్ద సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఉపాధ్యాయులకు తక్షణమే 29 ఐ. ఆర్ ను ప్రకటించి 12 వ పిఆర్సి కమిషన్ నియమించాలని, ఉపాధ్యాయులకు కేవలం బోధనకు మాత్రమే పరిమితం చేయాలని డిమాండ్ చేసారు.ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి చుక్క సత్యం, పూర్వ సహాధ్యక్షురాలు రొంగలి ఉమాదేవి, జిల్లా కార్యదర్శి వంగ రామలక్ష్మి, సీనియర్ నాయకులు తమ్మారావు,బెనర్జీ తదితరులు పాల్గొన్నారు.

## గుడివాడ అమర్నాథ్‌ను కలిసిన రాష్ట్ర వైకాపా నేత "వీసం"

**నక్కపల్లి, ప్రభాతవార్త**






వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు, మాజీ మంత్రి గుడివాడ అమర్నాథ్ ను వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వీసం రామకృష్ణ బుధవారం రాత్రి మర్యాదపూర్వకంగా కలిశారు. విశాఖపట్నం నుంచి పాయకరావుపేట వెళ్తున్న గుడివాడ అమర్నాథ్ నక్కపల్లి వద్ద కొంత సేపు ఆగి రామకృష్ణ నాయకత్వంలో పార్టీ కార్యకర్తలతో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా పోరాడాల్సిన అవసరం ఎంతైనా ఉందని, అందుకు ప్రతి కార్యకర్త సిద్ధంగా ఉండాలని అమర్నాథ్ కార్యకర్తలకు ఈ సందర్భంగా సూచించారు. అనంతరం రామకృష్ణ నాయకత్వంలో అమర్నాథను సత్కరించారు. రామకృష్ణ తో పాటు అమర్నాథ్ ను కలిసిన వారిలో మాజీ శాసనసభ్యులు, నియోజకవర్గ ఇన్చార్జ్ కంబాల జోగులు, ఉప సర్పంచ్ వీసం అచ్చి రాజు, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు తల్లా భార్గవ్, ఎల్లేటి సత్యనారాయణ, వీసం శ్రీను, ముద్ద శ్రీను ,అల్లాడ బాబ్జి, అల్లాడ కొండబాబు, రాజయ్యపేట సూరిబాబు తోపాటు పలువురు ఉన్నారు.

## బస్ స్టాప్ ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యేకు వినతిపత్రం సమర్పించిన సోమలింగపాలెం గ్రామస్తులు

**ఎలమంచిలి, నవంబర్ 19, ప్రభాతవార్త**



పట్టణంలోని జిల్లా పరిషత్ ఎమ్మెల్యే కార్యాలయంలో జనవాణి కార్యక్రమంలో భాగంగా సోమలింగపాలెం కట్టుపాలెం జంపపాలం గ్రామస్తులు మహిళలు, గాజువాక బైపాస్ రోడ్డు వద్ద సోమలింగపాలెం జంక్షన్ వద్ద ఆర్టీసీ బస్సులు రిక్వెస్ట్ బస్ స్టాప్ ను ఏర్పాటు చేయాలని కర్రీ ఝాన్సీ ఆధ్వర్యంలోఎమ్మెల్యే సుందరపు విజయకుమార్కు వినతిపత్రం సమర్పించారు. ఈ గ్రామాల నుండి ప్రజలు ఆర్టీసీ బస్సు లోని ప్రయాణం చేయాలంటే ఎలమంచిలి వచ్చి లేదా నారాయణపురం జంక్షన్ కు వెళ్లి బస్సు ఎక్కవలసిన పరిస్థితి నెలకొందని ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లారు. దీంతో ఎమ్మెల్యే అధికారులతో మాట్లాడి అక్కడ బస్సులు ఆగేలా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జనసేన పట్టణ పార్టీ అధ్యక్షుడు బొద్దపు శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

## నియోజకవర్గ అభివృద్ధి ధ్యేయంగా పనిచేస్తున్న ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్...

**ఎలమంచిలి, నవంబర్ 19, ప్రభాతవార్త**



ఎమ్మెల్యేగా పదవి చేపట్టినప్పటి నుండి సుందరపు విజయ్ కుమార్ నియోజకవర్గం అభివృద్ధి చేయంగా పనిచేస్తున్నారని, మున్సిపాలిటీలో ఇప్పటికే ఎన్నో అభివృద్ధి పనులను చేపట్టారని జనసేన నాయకులు కర్రీ ఝాన్సీ, ఊటకూటి రమేష్ నాయుడు, కొటారు శ్రీనివాసరావు, లవుడు లోవరాజు, గుర్రాల శేఖర్ అన్నారు. పట్టణములోని జనసేన కార్యాలయంలో బుధవారం నాయకులు మాట్లాడుతూ లేనిపోని నిందలు అపోహలను సృష్టించి ఎమ్మెల్యే ప్రతిష్టను దిగజార్చడానికి కొందరు ప్రయత్నిస్తున్నారంటూ వారు ఎమ్మెల్యే చేస్తున్న అభివృద్ధి పనులు కనబడటం లేదా అని ప్రశ్నిస్తున్నారు. మున్సిపాలిటీ పరిధిలోని ఎన్నో సంవత్సరాలుగా యానాద్రి కాలవ వలన పట్టణ ప్రజలు ఎన్నో ఇబ్బందులు గురవుతున్నారు వీటిని దృష్టిలో ఉంచుకొని పదవి చేపట్టిన వెంటనే ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్ సుమారు 7 కోట్ల రూపాయల వ్యయంతో యానాద్రి కాలువ ఆధునీకరణ పనులను చేపట్టారని, రైల్వే స్టేషన్ రోడ్డు మధ్యలో విద్యుత్తులైట్లను అమర్చారని, మున్సిపాలిటీ పరిధిలోని 11 ఎస్టీపీలు, ఆర్టీసీ కాంప్లెక్స్ కు లగ్జరీ సర్వీస్ ఎక్స్ప్రెస్ బస్సులు కాంప్లెక్స్ వద్దకు రప్పించడం, నగరంలో ఉన్న సమస్యల మీద ప్రతి బుధవారం జనవాణి కార్యక్రమం నిర్వహించడం సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించడం లేదా అధికారుల ద్వారా ఆ సమస్యలను పూర్తిగా పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటున్నారని,ఇలా ఎలమంచిలి మున్సిపాలిటీలోని అనేక అభివృద్ధి పనులను చేపట్టారని అభివృద్ధి చేస్తున్న ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్ పై లేనిపోని ఆరోపణలను సృష్టించి ఏమి ఆనందపడతారని, అభివృద్ధి చేస్తున్న నాయకుడిని ఇబ్బంది పెట్టడం ఎంతవరకు సమంజసం అని అన్నారు. మా నాయకుడు సుందరపు విజయ్ కుమార్ ఎమ్మెల్యే పదవి చేపట్టిన తర్వాత ఎలమంచిలి మున్సిపాలిటీ నియోజకవర్గ అభివృద్ధి ప్రధమ జయంగా పనిచేస్తున్నారని ఇది చూసి ఓర్వలేక కొందరు లేనిపోని సృష్టించి ఇబ్బంది పెట్టాలని చూడడం అలాంటి చర్యలు చేపట్టే వారిని ఎప్పటికీ క్షమించమని అన్నారు. అనకాపల్లి జిల్లాలోనే ఎలమంచిలి నియోజకవర్గ అభివృద్ధిలో ముందు ఉంటుందని ఇప్పటికే నిరూపణ అయిందని ఇలాంటి సమయంలో ఇలా తెలివి తక్కువ విధానముతో మా నాయకుడిని ఇబ్బంది పెట్టాలనేది మీ భ్రమ మాత్రమేనని అన్నారు. ఇప్పటికైనా జనసేన అధినాయకత్వం ఈ విషయంపై పూర్తిస్థాయిలో విచారణ చేపట్టి తప్పుడు విషయాలను సృష్టించే వారిపై కఠినంగా వ్యవహరించాలని వీరు కోరారు.

## అయ్యప్ప స్వాములకు బిక్ష ఏర్పాటు.!

**నక్కపల్లి, ప్రభాతవార్త**





పట్టణంలోని అయ్యాప్ప, శివ భక్తులకు బుధవారం టిడిపి నేత కొప్పిశెట్టి వెంకటేష్, దాట్ల జగన్నాధం రాజ్ దంపతులు బిక్ష ఏర్పాటు చేసారు. భక్తుల తరపున వెంకటేష్ దంపతులని సత్కరించారు. గడచిన వారం రోజుల నుంచి పలువురు దాతల సహకారంతో బిక్ష కార్యక్రమం కొనసాగుతోంది. కార్యక్రమంలో శ్రీపాద ప్రణవ్, డివి రామా రావు,ఆచంట రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు. సుమారు 100మంది భక్తులకు అన్న సమారాధన ఏర్పాటు చేశారు.

## ఘనంగా మహిళా దినోత్సవం.!

**నక్కపల్లి, ప్రభాతవార్త**



భగవాన్ సత్య సాయి బాబా శత జయంతి ఉత్సవాల్లో భాగంగా మండలంలోని నక్కపల్లి ,వేంపాడు,నెల్లిపూడి, డిఎల్ పురం గ్రామాల భజన మండల ఆధ్వర్యంలో మహిళా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. నక్కపల్లి పట్టణంలో ఉదయకాల సమయంలో ఓంకారం, సుప్రభాతం, నగర సంకీర్తనతో పలు కార్యక్రమాలు నిర్వహించి అనంతరం కొత్త తాళ్లరాజు ఏర్పాటుచేసిన భజన మందిరంలో మహిళల లలిత సహస్ర పారాయణం కార్యక్రమం ఘనంగా బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా భజన మండలి సభ్యులు చేతుల మీదుగా పేద మహిళలకు వృద్ధులకు చీరలు పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా భజన మండల సభ్యులు మాట్లాడుతూ నక్కపల్లి భజన మండలి ఆధ్వర్యంలో గురువారం బాలల దినోత్సవం, శుక్రవారం యువజన దినోత్సవం, శనివారం సేవా దినోత్సవం, నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. 23వ తేదీన బాబా పుట్టినరోజు సందర్భంగా నక్కపల్లి సుబ్బిరామిరెడ్డి కళ్యాణమండపం ఆవరణలో పెద్ద ఎత్తున అన్న సమరాధన కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని భక్తులు, ప్రజలు సహకరించాలని కోరారు.

## లారీ బైక్‌ను ఢీ కొట్టిన ప్రమాదంలో ఇద్దరికీ తీవ్ర గాయాలు..

**ఎలమంచిలి, నవంబర్ 19, ప్రభాతవార్త**



ఎలమంచిలి జాతీయ రహదారి రేగుపాలెం జంక్షన్ సమీపంలో లారీ బైక్ ను ఢీ కొట్టిన ప్రమాదంలో ఇద్దరికీ తీవ్ర గాయాలు అయినట్లు రూరల్ ఎస్సై ఉపేంద్ర తెలిపారు. రూరల్ ఎస్సై ఉపేంద్ర తెలిపిన వివరాలు ప్రకారం బుధవారం రాత్రి సుమారు 9:30 గంటల ప్రాంతంలో తుని నుండి అనకాపల్లి వైపు వెళ్తున్న బైక్ ను లారీ ఢీ కొట్టినట్లు స్థానికులు తెలిపారని, బైక్ మీద ప్రయాణిస్తున్న ఇద్దరు తీవ్ర గాయాలు అవడంతో వీరిని నేషనల్ హైవే అంబులెన్స్ లోని అనకాపల్లి ఎన్టీఆర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు. దర్యాప్తు చేసిన తర్వాత పూర్తి వివరాలు వెల్లడిస్తామని తెలిపారు.

Main tab page 8_Main tab page 8.qxd 11/19/2025 11:15 PM Page 1



## అభ్యుదయ సైకిల్ ర్యాలీకి అనూహ్య స్పందన

అనకాపల్లి, నవంబర్ 19, ప్రభాతవార్త



విశాఖపట్నం రేంజ్ పరిధిలో"సే నో టూ డ్రగ్స్" సందేశంతో కొనసాగుతున్న అభ్యుదయ సైకిల్ ర్యాలీ పరవాడ, అచ్యుతాపురం, మునగపాక మండలాల్లో నిర్వహించారు. పరవాడ, మునగపాక, అచ్యుతాపురం మండలాల్లో వరుసగా నిర్వహించిన అవగాహన కార్యక్రమాలకు విద్యార్థులు, యువత, ఉపాధ్యాయులు, వ్యాపారవేత్తలు, ప్రజల నుండి విస్తృత స్పందన లభించింది. పరవాడ లో జరిగిన కార్యక్రమంలో డీఎస్పీ వి.విష్ణు స్వరూప్, ఇన్స్పెక్టర్ ఆర్. మల్లికార్జునరావు, ఇంటర్మీడియేట్ జూనియర్ కాలేజ్ ప్రిన్సిపాల్, ఫార్మా ప్రతినిధులు, ట్రేడర్స్ అసోసియేషన్ సభ్యులు, పాల్గొన్నారు. ర్యాలీ సైక్లిస్టులు, ముఖ్యంగా మనోజ్ మరియు విద్యార్థులు, డ్రగ్స్ వలన కలిగే దుష్ప్రభావాలను ప్రజలకు వివరించారు. గ్నాన్ కాలేజ్ విద్యార్థులు ప్రదర్శించిన నాటికలు ప్రజలను ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో "డ్రగ్-ఫ్రీ సొసైటీకి సంకేతంగా బెలూన్స్" ను ఆవిష్కరించారు. అందరూ కలిసి"డ్రగ్స్ కు దూరంగా – సమాజం కోసం ముందుకు" అనే ప్రతిజ్ఞ చేశారు. మునగపాక మండలంలో విద్యార్థులు, ప్రజల నుంచి భారీ స్పందన కనిపించింది. ఈ సందర్భంగా విద్యార్థులు, ఉపాధ్యాయులు, స్థానిక ప్రజలు ఘన స్వాగతం పలికారు. సీఐ ఎస్.ధనుంజయరావు, ఎస్ఐ పి.ప్రసాదరావు ఆధ్వర్యంలో జరిగిన ఈ ర్యాలీ నాగులపల్లి–ఒంపోలు–మునగపాక–తిమ్మరాజుపేట గ్రామాల మీదుగా డీజే వాహనాలతో నినాదాలు చేస్తూ కొనసాగింది. మునగపాకలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎల్ ఈడీ స్క్రీన్ ద్వారా డ్రగ్స్ హానికర ప్రభావాలపై వీడియోలు ప్రదర్శించారు. అనంతరం పాంప్లెట్లు పంపిణీచేశారు. అచ్యుతాపురం పోలీస్ స్టేషన్ మైదానంలో ఇన్స్పెక్టర్ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో మండల అధికారులు, ప్రభుత్వ వైద్యులు, విద్యార్థులు పాల్గొని మాదకద్రవ్యాల వల్ల యువతపై పడే ప్రభావాలను వివరించారు. యువత డ్రగ్స్ కు పూర్తిగా దూరంగా ఉండాలని పిలుపునిచ్చారు. ఈ ర్యాలీలో ఎలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్, రాష్ట్ర రహదారుల అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ ప్రగడ నాగేశ్వరరావు, ర్యాలీకి అభినందనలు తెలియజేసి, మాదకద్రవ్యాల నిర్మూలనలో పోలీసు శాఖ చేస్తున్న కృషిని అభినందించారు.

## దేశాభివృద్ధిలో మహిళల పాత్ర అనే అంశంపై అవగాహన

నర్సీపట్నం,నవంబర్ 19,ప్రభాతవార్త



నర్సీపట్నం శాఖ గ్రంథాలయంలో స్వర్గీయ ఇందిరాగాంధీ జయంతిని పురస్కరించుకొని దేశాభివృద్ధిలో మహిళల పాత్ర అనే అంశంపై మహిళలతో అవగాహన సదస్సు ను గ్రంథాలయాధికారి పి.దమయంతి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమమునకు ముఖ్య అతిథిగా రూరల్ సీఐ ఎల్.రేవతమ్మ హాజరై ముందుగా మాజీ ప్రధాని ఇందిరాగాంధీ చిత్రపటానికి పూల మాలలు వేసి జ్యోతి ప్రజ్వలన చేశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ఇందిరమ్మ జీవితం ఎంతో ఆదర్శమన్నారు. యుక్త వయసులోనే యువత ఉన్నతంగా ఎదగడానికి కృషి చేయాలన్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ బి.వి. పద్మావతి మాట్లాడుతూ మహిళ సర్వత అభివద్ధి చెందితేనే సమాజం అభివృద్ధి చెందుతుందన్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల(బాలికలు) ప్రిన్సిపల్ ఎ.శోభమాట్లాడుతూ భారతదేశ మహిళా ప్రధాని ఇందిరాగాంధీ స్త్రీ శక్తికి నిదర్శనమని, అన్ని రంగాలలో రాణించగలుగుతున్నారంటే ఇందిరాగాంధీ జీవితమే వారికి ఆదర్శమన్నారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల (బాలికల) హిందీ ఉపాధ్యాయురాలు ఎం.రాఘవకుమారి మాట్లాడుతూ మహిళల అభివృద్ధికి రాజ్యాంగంలో ఎన్నో అవకాశాలు కల్పించబడ్డాయన్నారు. మహిళా పోలీస్ సిహెచ్. భవాని మాట్లాడుతూ సామాజిక మాధ్యమాలను వినియోగించుకొని మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని పేర్కొన్నారు. పోటీ పరీక్షలకు సిద్ధపడుతున్న కుమారి కావ్య మాట్లాడుతూ సమాజ అభివృద్ధి పథంలో స్త్రీ శక్తి ఎంత విలువైనదో ఉదాహరణలతో వివరించింది. గ్రంథాలయాధికారి పి.దమయంతి దంపతులను ఘనంగా సన్మానించారు. అనంతరం మధ్యాహ్నం మూడు గంటలకు జూనియర్ కళాశాలకు చెందిన విద్యార్థినులకు రంగుపల్లి పోటీలు నిర్వహించారు.

## ఉల్లాసంగా.. ఉత్సాహంగా వన మహోత్సవం

రాజవొమ్మంగి, నవంబరు 19, ప్రభాతవార్త



రాజవొమ్మంగి గిరిజన సంక్షేమ గురుకుల బాలికోన్నత పాఠశాలలో ప్రిన్సిపాల్ సత్యవేణి అధ్యక్షతన వన మహోత్సవ కార్యక్రమం ఘనంగా జరిగింది. ముందుగా ఉసిరి చెట్టు వద్ద పూజలను చేసారు. మానవ మనుగడకు వనాలు ఆవశ్యకతను ప్రిన్సిపాల్ సత్యవేణి అవగాహన కల్పించారు. అనంతరం విద్యార్థినులు గిరిజన నృత్యాలను ప్రదర్శించారు. ఉల్లాసంగా ఉత్సాహంగా జరిగింది. మండలస్థాయి అధికారులు వనమహోత్సవంలో పాల్గొన్నారు. ఆత్మీయవిందు జరిగింది.



ఈకార్యక్రమంలో ప్రిన్సిపాల్ సత్యవేణి, ఎంపిపి గోము వెంకటలక్ష్మి, దాట్ల వెంకటేష్ రాజు, ఎంపిటిసి కనిగిరి గంగాధర్, జనసేన పార్టీ మండల అధ్యక్షులు బొదిరెడ్డి త్రిమూర్తులు, కొచ్చా లోకేష్, విద్యాకమిటీ చైర్మన్ యం. ఇ. ఓ లు కె.వి. వి. సత్యనారాయణదొర, టి. సూరయ్య రెడ్డి, తహసీల్దారు అల్లు సత్యనారాయణ, ఎంపిడిఒ లోకుల యాదగిరేశ్వరరావు, ఏకలవ్య ప్రిన్సిపాల్ కృష్ణారావు, ఏ. పి. ఆర్ కాలేజి ప్రిన్సిపాల్ పీటర్, ఉపాధ్యాయులు, ఉద్యోగులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

## గిరి కైలాస క్షేత్రంలో ఘనంగా కార్తీక దీపోత్సవం

పాడేరు,నవంబర్19, ప్రభాతవార్త





గిరి కైలాస క్షేత్రం శ్రీ ఉమా నీల కంఠేశ్వర స్వామి వారి సమేత శ్రీ రాజరాజేశ్వరి అమ్మవారి దేవాలయంలో బుధవారం రాత్రి కార్తీక దీపోత్సవం ఘనంగా నిర్వహించారు. భక్తులు కుసుమ 108 మట్టి శివలింగాలు తయారు చేయగా జ్యోతులతో అలంకరణ.ఆకర్షణీయంగా ఏర్పాటు చేసారు.శివలింగ ఆకారంలో దివ్వ జ్యోతులు వెలిగించి ప్రత్యేక పూజలు మహిళలు నిర్వహించారు.ఈ కార్యక్రమం ఆలయ ధర్మ కర్త మండలి సభ్యులు సి హెచ్ రమాదేవి పర్యవేక్షణలో జరుగగా ఆలయ ప్రధాన కార్యదర్శి ఉప్పల వెంకటరత్నం,ఆలయ ఉపాధ్యక్షులు కొట్టగుళ్లి రామారావు, ఆధ్యాత్మిక బృందసభ్యులు బాలన్న మాస్టర్,బాబూరావు పోతురాజు,గాయత్రి తదితరులు పాల్గొన్నారు.

## అరకు పార్లమెంట్ కార్యదర్శి పాటి చలపతిరావుకు ఘన సన్మానం

ఏటపాక, నవంబర్ 19, ప్రభాతవార్త



మండల పరిధిలోని వోడవరం గ్రామం లో యలమోలు గోపి కరి శ్రీనివాస్ ఆధ్వర్యంలో అరకు పార్లమెంట్ కార్యదర్శి పాటి చలపతి రావు కు తెలుగుదేశం పార్టీ నాయకు లు కార్యకర్తలు రైతులు గ్రామస్తులు సన్మానం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...కష్టపడి పని చేసిన కార్యకర్త లను నాయకులను పార్టీ గుర్తించి తగిన పదవులు ఇస్తుంది అని అన్నారు. చలపతి రావు కు ఈ పదవి దక్కడం వల్లన ఏటపాక మండలం లో తెలుగుదేశం పార్టీ మరింత బలోపేతం దిశగా పయనిస్తుంది అని నాయకులు గ్రామస్తులు కొనియాడారు. ఈ సందర్భంగా పాటి చలపతి రావు మాట్లాడుతూ ...నా పై ఇంత నమ్మకం ఉంచి నాకు ఇంత ఉన్నతమైన బాధ్యతను ఇచ్చిన తెలుగుదేశం పార్టీకి నారా చంద్రబాబు నాయుడు కి నారా లోకేష్ కి ఎంఎల్ఏ మిరియాల శిరీష కి నా హృదయపూర్వక ధన్యవాదాలు అని అన్నారు. వోడవరం గ్రామం నుండి మీరు అందరూ నాకు ఆహ్వానం పంపి నాకు ఇంత ఘన సన్మానం చెయ్యడం చాలా సంతోషం అని మీ అందరి అభిమానం ప్రేమ పొందడం నా పూర్వ జన్మ సుకృతం గా భావిస్తాను అని అన్నారు .మీకు ఏ సమస్య బాధ వచ్చిన మీ అందరికీ అండగా ఉండి పార్టీని బలోపేతం చేసే దిశగా మీ అందరి సలహాలు సూచనలతో ముందుకు వెళతామని తెలియజేసుకుంటున్నాను అని అన్నారు. ఈ కార్యక్రమం లో మాజీనేని సూర్యనారాయణ కొట్టయ్య రామారావు నరేష్ కర రవి ఏఘారి మంగయ్య పుల్లయ్య చౌదరి కొండయ్య గుండాల రమేష్ దుద్దుకూరి శ్రీనివాసరావు రాజు అరవింద్ మాదినేని సాయి కర్రి బుజ్జోడు తదితరులు పాల్గొన్నారు.

# రైతులు పండించే పంటలకు పెట్టుబడి సాయం..

**- జిల్లాలో 1,44,222 మంది గిరిజన రైతులకు రెండవ విడతగా రూ.7 వేలు చొప్పున రూ.101,14,04,000 ల జమ: జిల్లా కలెక్టర్ ఎ.ఎస్.దినేష్ కుమార్**

పాడేరు,నవంబర్19, ప్రభాతవార్త



రైతులు పండించే పంటలకు పెట్టుబడి సాయం అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం అన్నదాత సుఖీభవ పి యం. కిసాన్ పథకాన్ని అమలు చేస్తోందని జిల్లా కలెక్టర్ ఎ.ఎస్.దినేష్ కుమార్ అన్నారు. బుధవారం వ్యవసాయ శాఖ నిర్వహించిన అన్నదాత సుఖీభవ పి.యం.కిసాన్ పథకాన్ని సూపర్ సిక్స్ హామీలను నెరవేర్చడంలో భాగంగ అన్నదాత సుఖీభవపిఎం కిసాన్‌ఖ పథకానికి నేడు రాష్ట్రంలోని 46.86 లక్షల మంది రైతుల ఖాతాల్లో రూ. 6,310 కోట్లు జమ వర్చువల్ కడప జిల్లా కమలాపురం నియోజకవర్గంలో ప్రారంభోత్సవం జరిగింది. ఈ కార్యక్రమానికి అల్లూరి సీతారామరాజ జిల్లా పాడేరు కాఫీ హౌస్ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ ఎ.ఎస్.దినేష్ కుమార్, జిసిసి చైర్మన్ కిడారి శ్రావణ్ తదితరులు తిలకించారు. ముందుగా వ్యవసాయ శాఖ ఏర్పాటు చేసిన వివిధ వ్యవసాయ ఉత్పత్తుల స్టాల్స్ ను పరిశీలించి నఅనంతరం కలెక్టర్ మాట్లాడుతూ అన్నదాత సుఖీభవ పి యం. కిసాన్ పథకం కింద ప్రతి రైతుకూ రూ.20 వేలు ఆర్థిక సాయాన్ని అందజేయడం జరుగుతుందన్నారు. ఈరోజు 2025 26లో రెండవ విడతగా రూ.7 వేలు చొప్పు ప్రతి రైతు బ్యాంకు ఖాతాలో జమ చేయడం జరుగుతుందన్నారు. జిల్లాలోని పాడేరు, అరకులోయ, రంపచోడవరం అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలోని 22 మండలాల్లో 1 లక్షా 44 వేల 222 మంది గిరిజన రైతులకు ఒకొక్కరికి రూ.7 వేలు చొప్పున అన్నదాత సుఖీభవ ఆర్థిక సాయం జమ చేయడం జరుగుతుందన్నారు. అరకులోయ అసెంబ్లీ స్థానంలో అరకులో య, అనంతగిరి, డుంబ్రిగుడ, హుకుం పేట, పెదబయలు, ముంచంగపుట్టు మండలాల్లో 56,404 మందికి, పాడేరు నియోజకవర్గంలో పాడేరు, జి.మాడుగుల, చింతపల్లి, జీకేవీధి, కొయ్యూరు మండలాల్లో 48,473 మందికి, రంపచోడ వరం పరిధిలోని రంపచోడవరం, అడ్డతీ గల, రాజవొమ్మంగి, వై.రామవరం, వీఆర్.పురం, దేవిపట్నం, గంగవరం, కూనవరం, ఎటపాక, చింతూరు, మారేడుమల్లి మండలాల్లో 40,270 మంది రైతులకు అన్నదాత సుఖీభవ ఆర్థిక సాయం జమచేయడం జరిగిందన్నారు. అన్నదాత సుఖీభవ కార్యక్రమం రాష్ట్ర కేంద్ర ప్రభుత్వాలు సంయుక్తంగా నిర్వహిస్తారు. రైతులకు అండగా నిలవాలనే లక్ష్యంతో ఈ పథకం ప్రభుత్వం అందిస్తుందన్నారు. జిల్లాలో 3 నియోజకవర్గలల్లో ఈరోజు ఈ కార్యక్రమం రాష్ట్ర పండగవాతావరణంలో జరుగుతుందన్నారు. ప్రభుత్వం రైతులకు ఆర్థికంగా అండగా నిలవాలనే లక్ష్యంతో 3 విడతలుగా ఈ పథకం లబ్ది దారులకు అందజేయడం జరుగుతుందన్నారు. పథకం డబ్బులు జమకాని లబ్దిదారులు ఆందోళనకి చెందవలసిన అవసరం లేదని, 155251 టోల్ ఫ్రీ నెంబర్ కి తెలియ జేయాలని, కొందరికి ఆధార్ నెంబర్ నమోదు సమస్యలు ఉన్నందువలన డబ్బులు జామచేయడం జరగలేదని సంబంధిత లబ్దిదారులు సచివాలయంలో సరిచేసుకోవాలని అలా చేసిన వెంటనే మీ ఖాతాలో జమచేయడం జరుగుతుందన్నారు. సంబంధిత అధికారులు సత్వర చర్యలు చేపట్టి రానున్న వారం రోజుల్లో పరిష్కరించాలన్నారు. ఉద్యాన పంటలకు ప్రాధకన్యత నివ్వడం జరుగుతుందని , రైతులు గ్రూపులుగా ఏర్పడాలన్నారు. గ్రూపులో ఉన్న రైతులకు అధిక ఆదాయం రావడానికి అవకాశం ఉందన్నారు. అల్లూరి సీతారామరాజు జిల్లా (ఐటిడిఏ) ని ఆర్గానిక్ జిల్లాగా తీర్చిదిద్దాలన్నారు. ఆర్గానిక్ జిల్లాగా మార్చడానికి అన్ని విధాలా కృషి చేయడం జరుగుతుం దన్నారు. ప్రతీ లబ్దిదారునికి 3 విడతలుగా ఆర్థిక సహాయం అందిస్తుందని అందులో మొదటి విడతగా ఈరోజు ప్రతీ లబ్దిదారునికి 7వేలు జమ చేయడం జరుగుతుందని, లబ్ది దారులు ఈ డబ్బును సక్రమంగా వినియోగించు కోవాలన్నారు. రైతులు గ్రూప్ లుగా ఏర్పడితే మంచి ఫలితాలు వస్తాయాన్నారు. మాజీ ఎమ్మెల్యే ఈశ్వరి, ఎ ఎం సి చైర్మన్ మత్సయల మంగతల్లి, జిసిసి చైర్మన్ కిడారి శ్రావణ్, ట్రైకార్ డైరెక్టర్ కె కృష్ణా రావు, జి సి సి డైరెక్టర్ బొర్రా నాగరాజు మాట్లాడుతూ ఎన్నికలకి ముందు కూటమి ప్రభుత్వం ఇచ్చిన సూపర్ సిక్స్ ప్రతీ హామీ లబ్దిదారులకు అందజేయడం జరుగుతుందని. పేద, బడుగు బలహీన వర్గాలకు అండగా ముఖ్యమంత్రి నిల్చి అర్హులైన లబ్దిదారులకు ప్రతీ పథకం అందజేస్తున్నారన్నారు. రైతు ఉంటేనే మనకి సంతోషం, ఆనందం, ఆరోగ్యంగా జీవిస్తున్నాం అందుకే రైతే రాజు అన్నారు. రైతులు గ్రూప్ గా ఏర్పడితే పండించే పంటకు మంచి రేటు వస్తుందన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగులేకున్నా ఇచ్చిన మాట ప్రకారం పథకాలు అందిస్తున్న ఘనత మన ముఖ్యమంత్రివర్యులదే అన్నారు. కార్యక్రమంలో అతిధులు రైతులను సన్మానించి అన్నదాత సుఖీభవ పియం. కిసాన్ పథకం రూ. 101,14,04,000/ విలువగల చెక్కును లబ్దిదారులకు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి ఎస్.బి.ఎస్. నంద్ అన్నదాత సుఖీభవ పియం. కిసాన్ పథకం వివరాలను జిల్లా లబ్దిదా రులకు వివరించారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాడేరు మార్కెటింగ్ డైరెక్టర్ సుబ్బలక్ష్మి, పాడేరు ప్రాథమిక వ్యవసాయ కో ఆపరేటివ్ చైర్మన్ దక్కోడి వెంకట రమణ, లగిసపల్లి సర్పంచ్ పార్వతమ్మ, పాడేరు ఎంపిపి నాగరత్నం ,మాజీ ఎంపిపి బొర్రా విజయరాణి, ఎంపీటీసీ గూడెపు ఉషారాణి, వివిధ మండలాల నుండి లబ్దిదారులు, వ్యవసాయ అధికారులు సిబ్బంది ఉన్నారు.

## దాన్యాన్ని దళారులకు అమ్మి. మోసపోవద్దు..

**- సొసైటీ చైర్మన్ ముప్పన కేశవ్**

రాజవొమ్మంగి, నవంబరు 19, ప్రభాతవార్త



దాన్యాన్ని దళారులకు అమ్మి మోసపోవద్దని రాజవొమ్మంగి సొసైటీ చైర్మన్ ముప్పన కేశవ్ అన్నారు. బుధవారం రాజవొమ్మంగి సొసైటీలో ప్రభుత్వ దాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈసందర్భంగా కేశవ్ మాట్లాడుతూ మండలంలో 7,003 ఎకరాల్లో వరి సాగు జరుగగా 13, 654 మెట్రిక్ టన్నుల దాన్యం దిగుబడికి వస్తుందని అంచనాగా వెల్లడించారు. రాజవొమ్మంగి, జడ్డంగి, లబ్బర్తి, శరభవరం, దూసర పాము, కొమరాపురంలో ఒకే రోజున ప్రభుత్వ దాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించారని అన్నారు. మాజీ సర్పంచ్ చీడిపల్లి అప్పారావు మాట్లాడుతూ దాన్యం అమ్మిన 24 గం. లోపు నగదు రైతు ఖాతాలో జమఅవుతాదన్నారు. ఏ. గ్రేడ్ రకం 100 కిలోలు రూ. 2,389లు, 75 కిలోలు రూ. 1,792లు, సాధారణ రకం 100 కిలోలు రూ. 2,369లు, 75 కిలోలు రూ. 1,777 లు అని ఏ. ఇ ఓ భవాని అన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గం తెలుగు మహిళా అధ్యక్షురాలు ముప్పన సావిత్రి, చీడిపల్లి అప్పారావు, షేక్ బాబ్జీ, మాకిరెడ్డి లోవరాజు, జనసేన పార్టీ మండల అధ్యక్షుడు బొదిరెడ్డి త్రిమూర్తులు, జనసేన యువజన అధ్యక్షులు కొచ్చా లోకేష్, వైస్సార్సీపీ నేతలు కనిగిరి దుర్గాప్రసాద్, కనిగిరి వీరబాబు, నాగులపల్లి కుశరాజు, గొల్లపల్లి ముసిలి, సొసైటీ గోపాల కృష్ణ, అప్పారావు, నాగేంద్ర, ధాన్యం సచివాలయం అగ్రికల్చర్ రోలుపల్లి సాయి కిరణ్ రెడ్డి ఉన్నారు. జడ్డంగి రైతు సేవా కేంద్రంలో ప్రభుత్వ దాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంబించారు. కార్యక్రమంలో సర్పంచ్ కొంగర మురళీ కృష్ణ, గణజాల తాతారావు, వాసంశెట్టి గంగాధర్, కోపూరి రత్నం, చెక్కా పండు, ముర్ల వీరబాబు, దొంగర శ్రీనివాస్, సచివాలయ అగ్రికల్చర్ అసిస్టెంట్స్ శ్రీను, రాజేశ్వరి, నవీన్ కుమార్, సత్యనారాయణ, పాల్గొన్నారు.

## కప్పలగొందిలో శ్రమదానంతో వుడెన్ బ్రిడ్జి నిర్మాణం

**- గ్రామ పెద్ద జగన్ ఆధ్వర్యంలో పనులు**

అరకు రూరల్, నవంబర్ 19, ప్రభాతవార్త



అరకులోయ మండలంలో వంతెన లేక వాగు దాటుతూ ఇబ్బందులు పడుతున్న గిరిజనులు, వంతెన కోసం దశాబ్దాలు పాటు నిరీక్షించి విసిగి చెంది, చివరికి శ్రమదానంతో వుడెన్ బ్రిడ్జి ను నిర్మించుకుంటున్నారు. వివరాల్లోకి వెళితే... అరకులోయ మండలంలోని సిరగాం పంచాయతీ పరిధి లోకి వచ్చే కప్పలగొంది గ్రామ సమీపంలో ఉన్న వాగు మండలంలోని సిరగాం, చొంపి, మాడగడ మూడు పంచాయతీలను కలపడమే కాకుండా, సమీప మండలమైన డుంబ్రిగుడ మండలంను కూడా కలుపుతుంది. అయితే వాగుపై వంతెన లేకపోవడంతో ఆయా గ్రామాల గిరిజనులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దీనికి తోడు ఇటీవల మొంథా తుఫాన్ కారణంగా వాగు పొంగి ప్రవహించడంతో గిరిజనులు ఇబ్బందులు రెట్టింపు అయ్యాయి. దీంతో కప్పలగుంది గ్రామానికి చెందిన యువత గ్రామ పెద్ద జగన్ ఆధ్వర్యంలో శ్రమదానంతో పెద్దపెద్ద రాటలు, చెక్కలను తీసుకువెళ్లి వాగుపై వుడెన్ బ్రిడ్జి ను నిర్మిస్తున్నారు. గ్రామానికి చెందిన యువత శర వేగంగా ఉడెన్ బ్రిడ్జి ను తయారు చేస్తూ అందరికీ ఆదర్శంగా నిలిచారు.

## 2025-26 సంవత్సరంలో కాఫీ కొనుగోలు ధరలు జిసిసి నిర్ధారణ

పాడేరు, నవంబర్ 19, ప్రభాతవార్త



గిరిజన కాఫీ రైతుల వద్ద నుండి సేకరిస్తున్న కాఫీ కొనుగోలు ధరను 202526 సంవత్సరమునకు నిర్ణయించేందుకు గాను బుదవారం అపెక్స్ కమిటీ సమావేశం విశాఖపట్నం గిరిజన సహకార సంస్థ కేంద్ర కార్యాలయంలో ట్రైబల్ వెల్ఫేర్ డైరెక్టర్ అద్యక్షతన ఏర్పాటు చేసారు. గత సంవత్సరం కాఫీ కొనుగోలు ధరలు అరెబికా పార్చ్ మెంట్ రకానికి రూ.400/ కిలో కు, అరెబికా చెర్రీ రకానికి రూ. 250/ కిలో కు మరియు రోబస్టా చెర్రీ కాఫీ రకానికి రూ.160/ కిలో కు చొప్పున ఉండగా, అంతర్జాతీయ కాఫీ ధరలను దృష్టిలో పెట్టుకుని ఈ సంవత్సరం (202526) కాఫీ కొనుగోలు ధరలను ధరలు అరెబికా పార్చ్ మెంట్ రకానికి రూ.450/ కిలో కు, అరెబికా చెర్రీ రకానికి రూ. 270/ కిలో కు మరియు రోబస్టా చెర్రీ కాఫీ రకానికి రూ.170/ కిలో కు చొప్పున నిర్ణయించదం జరిగిందన్నారు. ఈ సందర్భంగా గిరిజన సహకార సంస్థ వైస్ చైర్మన్ మరియు మేనేజింగ్ డైరెక్టర్ కల్పన కుమారి మాట్లాడుతూ, గిరిజన కాఫీ రైతుల సంక్షేమం కోసం ధరలను పెంచడము జరిగినదని, పెంచిన కాఫీ కొనుగోలు ధరల గురించి పాడేరు ఏజెన్సీ లోని గిరిజన కాఫీ రైతులందరికి విస్తృత అవగాహన కల్పించాలని జి.సి.సి. సిబ్బందిని ఎండీ ఆదేశించారు. అలాగే ప్రకటించిన కాఫీ ధరల కంటే తక్కువ ధరకు విక్రయించి నష్టపోవద్దని కాఫీ రైతులకు విజ్ఞప్తి చేశారు. కాఫీ సేకరణకు సంబంధించి ఏజెన్సీ లోని మారుమూల పల్లె ప్రాంతాలకు కుడా జి.సి.సి. సిబ్బంది వెళ్లి రైతు ఇంటి ముంగిటనే ఎలక్ట్రానిక్ కాటా ద్వారా ఖచ్చితమైన తూకంతో సేకరించడము జరుగుతుందని, అలాగే కాఫీ సేకరణకు సంబంధించిన నగదును రైతు బ్యాంకు ఖాతాలోకి నేరుగా 24 గంటలలోగా జమ చేయడం జరుగుతుందని ఆమె తెలియజేశారు. అలాగే కాఫీ కొనుగోలు మరియు ఫిర్యాధుల కొరకు జి.సి.సి. ప్రధానకార్యాలయము నందు సంప్రదించవలసిన ఫోన్ నెంబర్: 7013070990 ను ఏర్పాటు చేసామన్నారు. ఈ కార్యక్రమములో జి.సి.సి. వైస్ చైర్మన్ మరియు మేనేజింగ్ డైరెక్టర్ కల్పనా కుమారి, గిరిజన సంక్షేమ శాఖ డైరెక్టర్ శఎస్.భార్గవి, పాడేరు ఐ.టి.డి.ఎ ప్రాజెక్ట్ ఆఫీసర్,. తిరుమాణి శ్రీపూజ, కాఫీ బోర్డు అఫ్ ఇండియా, బెంగళూరు డాక్టర్ ప్రదీప్ బాబు (మార్కెటింగ్ ఇంటలిజెన్స్ యూనిట్) కాఫీ జనరల్ మేనేజర్ యం.వి.వి.యస్. ఉమాదేవి, కాఫీ సీనియర్ మేనేజర్ డాక్టర్ టి. శ్రీనివాసరావు అపెక్స్ కమిటీ మీటింగ్ లో పాల్గొన్నారు.

## పోరుబాయి రిజర్వాయర్ లో వ్యక్తి గల్లంతు !

మోతుగూడెం, ప్రభాతవార్త



మోతుగూడెం పోలీస్ స్టేషన్ పరిధిలోని ఫోర్ బై సమీపం లోని పవర్ కెనాల్ వద్ద ముగ్గురు యువకులు ఈతకు దిగగా ఇద్దరూ యువకులు బయటపడ్డారు. ప్రవాహవేగానికి ఒక యువకుడు గనిశెట్టి.జగదేశ్వరరావు (25) గల్లంతయ్యాడు. గల్లంతైన యువకుడు విశాఖ జిల్లా ఎలమంచిలి లోని నారాయణపురం గ్రామానికి చెందిన వాడని పోలీసులు తెలిపారు.విహార యాత్రకోసం స్నేహితులతో కలిసి మోతుగూడెంనకు సమిపాన పోరుబాయి కెనాలు వద్ద గల్లంతు కావటంతో పోలీసులకు సమాచారం అందించారు. స్పందించిన పోలీసులు సంఘటన జరిగిన ప్రదేశంలో స్నేహితులు మరియు పోలీసులు ఎంత వెతికినా కనపడక పోవడంతో మోతుగూడెం సబ్ ఇన్స్పెక్టర్ సాదిక్ కేసు నమోదు చేసి గాలింపు చర్యలు చేపట్టారు.

## రైతులకు చెక్కులు అందించిన ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి

రంపచోడవరం, నవంబర్ 19 : ప్రభాతవార్త




ఏజెన్సీ లో గిరిజన రైతులు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశపెట్టిన వివిధ రకాలైన పథకాలు సద్వినియోగ పరచుకొని ఆర్థికంగా అభివృద్ధి చెందాలని రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి స్మరణ్ రాజ్ పేర్కొన్నారు. బుధవారం రంపచోడవరం మండలం పందిరి మామిడి కృషి విజ్ఞాన కేంద్రం సమావేశపు హాలులో అన్నదాత పి ఎం కిసాన్ సుఖీభవ పథకం ద్వారా రైతులకు చెక్కు పంపిణీ కార్యక్రమానికి రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి స్మరణ్ రాజ్, రాష్ట్ర ఎస్టి కమిషన్ డైరెక్టర్ గొర్లె సునీత ముఖ్య అతిథులుగా హాజరైనారు. ఈ సందర్భంగా రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి స్మరణ్ రాజ్ మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ పథకం ద్వారా ఒక్కొక్క రైతుకు రెండో విడతలో 7వేల రూపాయలు రైతుల బ్యాంకు ఖాతాలో జమ చేయడం జరుగుతుందని ఆయన అన్నారు. రైతులు పండించిన ఉత్పత్తులు గిట్టుబాటు ధర వచ్చే విధంగా కృషి చేయడం జరుగుతుందని ఆయన అన్నారు. జీడిపిక్కలు, పసుపు, జాఫ్రా, కొండచిపుర్లు తదితరు ఉత్పత్తులకు గిట్టుబాటు ధర కోసం కృషి చేయడం జరుగుతుందని ఆయన అన్నారు. రైతులు పండించిన ధాన్యం ప్రభుత్వం ఏర్పాటుచేసిన రైతు సేవా కేంద్రాలలో అమ్మే విధంగా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయడం జరిగిందని ఆయన అన్నారు. రాష్ట్ర ఎస్టి కమిషన్ డైరెక్టర్ గొర్లె దెబోరా సునీత మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు రైతులు అభివృద్ధి చెందే విధంగా వివిధ రకాలైన పథకాలు ప్రవేశపెట్టడం జరిగిందని ఆమె అన్నారు. ప్రవేశపెట్టిన పథకాలు సద్వినియోగ పరచుకొని రైతులు ఆర్థికంగా అభివృద్ధి చెందాలని ఆమె అన్నారు. మన గిరిజన ప్రాంతంలో రైతులు పండించిన పంటలు కోతులు పాడుచేయుచున్నయని కోతులు నివారించే విధంగా నావంతు కృషి చేయడం జరుగుతుందని ఆమె అన్నారు. ఏజెన్సీలో ప్రతి రైతు ఆర్థికంగా అభివృద్ధి చెంది మీ మీ కుటుంబాలు ఆర్థికంగా ఎదగాలని రైతులను ఆమె కోరారు. ముందుగా ఈ కార్యక్రమానికి జ్యోతి ప్రజ్వలన చేసీ కార్యక్రమాన్ని ప్రారంభించారు.అనంతరం అన్నదాత సుఖీభవ,పీఎం కిసాన్ చెక్కును రైతులకు అందజేయడం జరిగింది అదేవిధంగా కృషి విజ్ఞాన కేంద్రం ద్వారా వచ్చిన రైతులకు ఒక్కొక్క కొబ్బరి మొక్క రైతులకు ముఖ్య అతిధుల చేతుల మీదుగా అందజేయడం జరిగింది.

## సమాజానికి మార్గదర్శి గురువు... బదిలీపై "ఆ నలుగురు"

**- ఘనంగా ఉపాధ్యాయులకు వీడ్కోలు..**

ఎటపాక: నవంబర్ 19, ప్రభాతవార్త



గురువు సమాజానికి మార్గదర్శి అని, ప్రపంచంలో ఉన్నతమైన వృత్తని ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసరావు అన్నారు. ఎటపాక మండల పరిధిలోని గౌరీదేవిపేట జడ్పీ ఉన్నత పాఠశాల నుంచి ఇటీవల బదిలీపై వెళ్లిన నలుగురు ఉపాధ్యాయులకు సన్మాన కార్యక్రమం ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసరావు ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చదువు జీవితంలో వెలుగులు నింపుతోందని, భవిష్యత్తు ఉజ్వలంగా ఉండాలంటే కష్టపడి చదవాలని గుర్తుచేశారు. ఉపాధ్యాయులుకు వృత్తి పరంగా బదిలీలు సహజమన్నారు. అంకిత భావంతో పనిచేస్తే సంతృప్తి ఉంటుందని, ఆ దిశగా పనిచేస్తే గుర్తింపు వస్తుందన్నారు. ఐదేళ్ల పని చేసి వెళ్ళడం వల్ల ఎక్కువ అనుబంధం ఉంటుందని, అది సహజమన్నారు. ఉపాధ్యాయుడు నిరంతరం విద్యార్ధి అని, అటువంటి సిద్ధపాటు కలిగి ఉంటారన్నారు. అనంతరం బదిలీపై వెళ్ళిన ఉపాధ్యాయులు శ్రీశైలం గణితం, శేఖర్ ఆంగ్లం, వినోద్ తెలుగు, రవి (హిందీ ) పుష్పగుచ్ఛాలు అందజేసి, శాలువాతో సత్కరించారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు పాఠశాలలో అనుభవాన్ని గుర్తుచేసుకుంటూ భావోద్వేగానికి లోనయ్యారు. ఈ కార్యక్రమంలో స్వరాజ్యలక్ష్మీ, లక్ష్మీ, విద్యార్థులు పాల్గొన్నారు.

## రాజవొమ్మంగి శివాలయంలో లక్షపత్రి పూజ..

రాజవొమ్మంగి, నవంబర్ 19, ప్రభాతవార్త



రాజవొమ్మంగి శ్రీ రాజరాజేశ్వరీ సమేత రామలింగేశ్వర స్వామి వారి ఆలయంలో బుధవారం లక్ష బిల్వ పత్రాలతో పూజలను చేశారు. రాజవొమ్మంగి సర్పంచ్ రమణి దంపతులు, తెదేపా మండల అధ్యక్షులు గొల్లపూడి పెద్దిరాజు దంపతులు, గ్రామస్తులు ఐక్యంగా బుధవారం లక్షపత్రి పూజ, రుద్రాభిషేకం, రుద్ర హోమం, కుంకుమ పూజలు ఘనంగా వేదంపండితులు చేయించారు. ఈ కార్యక్రమంలో మండల నలుమూలల నుంచి అనేక మంది భక్తులు, ప్రజాప్రతినిధులు హాజరైయ్యారు. వీరి సమక్షంలో లక్షపత్రి పూజలు అభిషేకాలు, హోమాలు, వేదపండితులు ఘనంగా జరిపించారు. మధ్యాహ్నం వన సమారాధన ఏర్పాటు చేశారు.

## జాతీయ ఉత్తమ ప్రదర్శన అవార్డు పొందిన ఆదికవి నన్నయ భట్టు కళాకారులకు అభినందన

గరివిడి నవంబర్,19 ప్రభాత వార్త



జాతీయ స్థాయిలో ఉత్తమ ప్రదర్శన అవార్డు పొందిన ఆదికవి నన్నయ భట్టు పౌరాణిక నాటకము కళాకారులకు విజయనగరం గురజాడ అప్పారావు గృహంలో పలువురు అభినందించారు. ఈ మేరకు కళాకారులకు దుస్సాలువతో సత్కరించి వారి ప్రతిభను కొనియాడారు. జిల్లా కీర్తిని జాతీయస్థాయిలో ఇనుమడింప జేయడం పట్ల వారు ప్రశంసలు కురిపించారు. బి.సత్యానంద్ ఆర్గనైజర్, వి.విజయ కుమార్ దర్శకత్వంలో విజయనగరం శ్యామలాంబ ఫైన్ ఆర్ట్స్ సంస్థ కళాకారులు ప్రదర్శించిన ఆదికవి నన్నయ భట్టు పౌరాణిక పద్య నాటకం తెనాలిలో జరిగిన జాతీయ స్థాయి పద్య నాటకం పోటీల్లో ఉత్తమ ప్రదర్శనగా నిలిచి ప్రథమ బహుమతి అవార్డు అందుకుంది. గరివిడికి చెందిన కళా కారులు యజ్ఞపురపు సత్యం, వివిఎస్ఎస్ గుప్త,ఇతర ప్రాంతాల కళాకారులకి పలువురు సత్కరించారు.

## పి ఫోర్ ద్వారా పేదల అభ్యున్నతి సాధ్యం:ఎంపీడీవో ఐ.సురేష్

చీపురుపల్లి నవంబర్ 19 ప్రభాతవార్త



రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న పి ఫోర్ కార్యక్రమం ద్వారా పేదల అభ్యున్నతి సాధ్యపడుతుందంటూ చీపురుపల్లి ఎంపీడీవో ఐ సురేష్ అన్నారు. బుధవారం నాడు చీపురుపల్లి మండల పరిషత్ ప్రాంగణంలో గల పి ఫోర్ కార్యాలయాన్ని ఆయన సందర్శించి రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఈ కార్యక్రమం ద్వారా అర్హులైన పేదలకు ఉజ్వల భవిష్యత్తు లభిస్తుందని, ప్రత్యేకించి దత్తతను తీసుకోవడానికి పలు కంపెనీలు ముందుకు వస్తున్నాయని ఆయన వివరించారు. పి ఫోర్ కార్యాలయ సిబ్బందితోపాటు మండల పరిషత్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## సహకార వారోత్సవాలను సద్వినియోగం చేసుకోవాలి : పీఏసీఎస్ చైర్మన్ జీవన్ నాయుడు

శృంగవరపుకోట,నవంబర్19,ప్రభాతవార్త



అఖిల భారత సహకార 72వ వారోత్సవాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఎస్.కోట పీఏసీఎస్ చైర్మన్ జీవన్ నాయుడు తెలిపారు. బుధవారం ఎస్.కోటలో ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘ కార్యాలయంలో సహకార వారోత్సవాలను ఘనంగా నిర్వహించారు. పీఏసీఎస్ చైర్మన్ జీవన్ నాయుడు పాల్గొని ముందుగా జాతీయ జెండాను ఎగురవేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రైతులకు అన్ని విధాలుగా సంఘం సహాయ సహకారాలు అందిస్తుందని ఆదేవిధంగా తీసుకున్న రుణాలు కూడా రైతులు సక్రమంగా చెల్లించాలని అప్పుడే సంఘం అభివృద్ధి చెందుతున్నారు. సంఘం అభివృద్ధికి రైతులు దరూ సహకరించాలని ఆయన తెలిపారు. సంఘం డైరెక్టర్లు, కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ఇందిరాగాంధీకి ఘన నివాళి

రామభద్రపురం, నవంబర్19,ప్రభాతవార్త



58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా శాఖా గ్రంథాలయం రామభద్రపురంలో మన భారత దేశ మొట్టమొదటి మహిళా ప్రధానమంత్రి ఇందిరా గాంధీ జయంతి, మహిళా దినోత్సవం సందర్భంగా మన భరతమాత, ఇందిరాగాంధీ, సరోజినీ నాయుడు పూలమాలలు వేసి నివాళులు అర్పించడం జరిగింది. మహిళా దినోత్సవం సందర్భంగా విద్యార్థినిలకు కోకో, మ్యూజికల్ చైర్ వంటి ఆటలను ఆడించడం జరిగింది. పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతి ప్రధానం 20వ తేదీ గురువారం రోజు జరుగుతుందని లైబ్రేరియన్ తెలియజేయడమైనది.

## అన్నదాత సుఖీభవ పీఎం కిసాన్ రెండో విడత పంపిణీ

బొబ్బిలి నవంబరు 19 ప్రభాతవార్త

కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అందజేసిన అన్నదాత సుఖీభవ పీఎం కిసాన్ రెండో విడత పంపిణీ కార్యక్రమంలో భాగంగా మండలంలో మెట్టవలస గ్రామంలో మాజీ మంత్రి చైర్మన్ ఫారెస్ట్ డెవలప్మెంట్ ఆఫ్ ఆంధ్ర ప్రదేశ్ ఆర్.వి.సుజయకృష్ణ రంగారావు చేతుల మీదుగా చెక్కును విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ 35వేల రైతులు లబ్ది పొందుతున్నారని వ్యవసాయం లాభసాటిగా సాగేందుకు అన్ని విధాల ఈ సొమ్ము సహకరిస్తుందని అన్నారు గత ప్రభుత్వంలో వ్యవసాయం పూర్తిగా విస్మరించారన్నారు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రైతులకు సాగు నిరంతరంకు పోలవరం ప్రాజెక్టు డప్పే శాతం పూర్తి చేశారని అన్నారు అనంతపురం జిల్లా నీరందించడంతో పాటు వ్యవసాయం చర్యలు చేపట్టిందన్నారు సేంద్రియ వ్యవసాయం ద్వారా ప్రజల ఆరోగ్యాన్ని కాపాడవచ్చు అని దీనిని ప్రతి ఒక్కరూ ఆచరించాలని అన్నారు ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పువ్వల మాధవరావు వ్యవసాయ అధికారులు ఏడి. ఏవో మజ్జి శ్యాంసుందర్ ఏఈఓ నారాయణరావు తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## ఇనాం రైతులను ఆదుకోండి : జెసికి దేశం నాయకుల వినతి..

చీపురుపల్లి,నవంబరు 19 ప్రభాతవార్త



చీపురుపల్లి మండలంలో ఇనాం భూములను సాగు చేసుకుంటూ జీవనోపాధి కొనసాగిస్తున్న రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని విజయనగరం జిల్లా జాయింట్ కలెక్టర్ సేతు మాధవను చీపురుపల్లి తెలుగుదేశం పార్టీ నాయకులు బుధవారం నాడు వినతి పత్రాన్ని అందజేశారు. రాష్ట్ర ప్రభుత్వం రైతుల కోసం అమలు చేస్తున్న అన్నదాత సుఖీభవ పథకం ద్వారా ఇనామ్ దారులకు రావలసిన రాయితీలు రావట్లేదంటూ దీని కారణంగా రైతులు నష్టపోతున్నారంటూ తెలుగుదేశం పార్టీ నాయకులు జెసికి వివరించారు. ఈ మేరకు చీపురుపల్లి శాసనసభ్యులు కిమిడి కళా వెంకట్రావు కలిసి రైతులు మొరపెట్టుకోవడంతో జేసీతో సంప్రదించాలని సూచించడంతో తెలుగుదేశం పార్టీ నాయకులు మాజీ ఆర్ఈసీఎస్ చైర్మన్ దన్నాన రామచంద్రుడు, సేనాపతి శ్రీనివాసరావు, గొర్లె లక్ష్మణ ఇజ్జిరోతు రాంబాబు, తదితరులు జాయింట్ కలెక్టర్ ను కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. ఉన్నత అధికారులకు నివేదికను సమర్పించి సమస్యను పరిష్కరిస్తానని ఈ సందర్భంగా జెసి వివరించారు.

## సీఎం సహాయ నిధిని సద్వినియోగం చేసుకోవాలి: ఏపీ మార్క్ఫెడ్ చైర్మన్ కర్రోతు బంగార్రాజు

నెల్లిమర్ల నవంబర్ 19 ప్రభాతవార్త



సీఎం సహాయ నిధి నుంచి మంజూరైన సొమ్మును లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని ఏపీ మార్క్ఫెడ్ చైర్మన్ కర్రోతు బంగారు రాజు అన్నారు. నెల్లిమర్ల మండలం, కొత్తపేట గ్రామానికి చెందిన గొర్లె శోభ మంజూరైనకి రూ 90,266ల చెక్కును, భోగాపురం మండలం చేపల కంచేరు గ్రామానికి చెందిన ఉప్పాడ సాత్విక్ కి మంజూరైన రూ.60,000ల చెక్కును మొత్తం రూ. 1,50,266 బంగారు రాజు తన నివాసం వద్ద లబ్ధిదారులకు బుధవారం అందజేశారు. నెల్లిమర్ల మండల ప్రధాన కార్యదర్శి గురాన చక్రి, జిల్లా రెల్లిక సాధికార సమితి కన్వీనర్ నీలాపు అప్పలరామి రెడ్డి ,టిడిపి గ్రామ అధ్యక్షులు ఎల్లాజి తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్రస్థాయి హాకీ పోటీలకు 20 మంది బొప్పడాం విద్యార్థులు

నెల్లిమర్ల, నవంబర్ 19, ప్రభాతవార్త



మండలంలోని బొప్పడాం ఉన్నత పాఠశాలకు చెందిన 20 మంది విద్యార్థులు రాష్ట్రస్థాయి అండర్ 14, అండర్ 17, అండర్ 19 హాకీ పోటీలకు ఎంపికయ్యారని ఆ పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయుడు యర్ర సూర్యారావు చెప్పారు. అండర్14 విభాగంలో అంబల్ల సాయి మోక్షిత, తిరుమరెడ్డి లలిత, ఈదరాసి రామలక్ష్మి, చందక పూర్ణ చంద్ర రావు, ఉప్పు మనోహర్, తాళ్లపూడి లోకేశ్ అండర్ 17 విభాగం కలిశెట్టి జ్యోష్ణ, అంబల్ల పవిత్ర, రెడ్డి ప్రత్యూష, దుర్గాసి యామిని పున్నాన చరణ్, లెంక అఖిల్, అమర తేజ స్వరూప్, చింతపల్లి హర్ష వర్దన్, పతివాడ యశ్వంత్ కుమార్ అండర్ 19 విభాగంలో కలిశెట్టి భాను ప్రసాద్, పంచాది దినేష్, పున్నాన అజయ్, కొప్పల మహేంద్ర, దన్నాన మణికంఠ రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్టు ఆయన తెలిపారు. పాఠశాలలో బుధవారం జరిగిన కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు ఎం.ఈశ్వరరావు, తల్లిదండ్రుల కమిటీ చైర్మన్ చందక స్వామి నాయుడు, సర్పంచ్ అంబల్ల కిరణ్ కుమార్, గ్రామ పెద్దలు అభినందించారు. అండర్ 14 విభాగం పోటీలు నెల్లూరు జిల్లా చంద్రగిరి లోను అండర్ 17 విభాగం పోటీలు శ్రీ సిటీ సింహపురి విశ్వవిద్యాలయం నెల్లూరు జిల్లాలోను, అండర్ 19 విభాగం పోటీలు అనకాపల్లి జిల్లా నక్కపల్లిలోను జరుగుతాయని తెలిపారు.

## సీతారాములను దర్శించుకున్న ఎం.పి కలిశెట్టి

నెల్లిమర్ల, నవంబర్ 19,ప్రభాతవార్త



ప్రసిద్ధ పుణ్యక్షేత్రం రామతీర్థం రామస్వామి వారి దేవస్థానాన్ని విజయనగరం ఎం.పీ కలిశెట్టి అప్పలనాయుడు బుధవారం సందర్శించారు. సీతారాములను దర్శించుకుని ప్రత్యేక పూజలు అర్చనలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీ అప్పలనాయుడుని అర్చక స్వాములు ఆశీర్వదించారు. అంతకుముందు మర్యాదపూర్వకంగా పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో ఎంపీ అప్పలనాయుడు వెంట టిడిపి నాయకుడు గేదెల రాజారావు తదితరులు ఉన్నారు.

## ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తిగా నిషేధించాలి

దత్తిరాజేరు నవంబర్ 19 ప్రభాతవార్త



ప్లాస్టిక్ భూతాన్ని పూర్తిగా నిషేధించాలని ఎంపీపీ సింహాద్రి అప్పలనాయుడు అన్నారు మండల పరిషత్ కార్యాలయంలో థీమ్5 పచ్చదనం మరియు పరిశుభ్రమైన గ్రామం పై ఎంపీడీవో కిషోర్ కుమార్ ఆధ్వర్యంలో సర్పంచులకు ఉప సర్పంచ్లకు శిక్షణ కార్యక్రమాన్ని బుధవారంనిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎంపీపీ హాజరయ్యారు ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో పచ్చదనం పరిశుభ్రత మరింత మెరుగు కోసం తీసుకోవలసిన చర్యలలో సర్పంచుల పాత్ర ఎంతో కీలకమైనదని ఇలాంటి శిక్షణ ద్వారా మరింత మెరుగైన ఫలితాలు గ్రామాల్లో సాధించే అవకాశం ఉందని ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తిగా నిషేధించే చర్యలు ప్రభుత్వం తీసుకోవాలని అన్నారు మూడు రోజుల శిక్షణ పొంది గ్రామాలు అభివృద్ధి దిశలో దీనికి దూసుకు వెళ్లె విధంగా సర్పంచ్ ఉప సర్పంచులు పాత్ర కీలక మన్నారు ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యులు వైదా రాజేశ్వరి పాల్గొన్నారు.

## రైతు సంక్షేమమే కూటమి సర్కారు ధ్యేయం

### అన్నదాత, పిఎమ్ కిసాన్ పథకం చెక్కులు పంపిణీ సభలో ఎమ్మెల్యే కిమిడి


గరివిడి నవంబర్,19 ప్రభాతవార్త



రైతు సంక్షేమమే కూటమి సర్కారు ధ్యేయమని చీపురుపల్లి శాసన సభ్యులు కిమిడి కళా వెంకటరావు అన్నారు. అన్నదాత సుఖీభవ, పి.ఎం.కిసాన్ పథకం చెక్కుల పంపిణీ కార్యక్రమం శ్రీరాంనగర్,శ్రీరాం జూనియర్ కళాశాలలో అట్టహాసంగా జరిగింది. చీపురుపల్లి నియోజకవర్గ పరిధిలో గల చీపురుపల్లి, గుర్ల, గరివిడి, మెరకముడిదాం మండలాల్లో 36916 మంది రైతులకుఅన్నదాత సుఖీభవ, పి.ఎం.కిసాన్ పథకాలకి సంభందించి 23.91 కోట్ల రూపాయల చెక్కులను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆయన ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడులు రైతులకు రెండో విడత అందించే అన్నదాత సుఖీభవ, పిఎం కిసాన్ ప్రారంభ కార్యక్రమం స్క్రీన్‌లో ప్రత్యక్షంగా వీక్షించారు. పౌర సరఫరాల జె డి, గరివిడి మండల తహశీల్దార్ చింత బంగార్రాజు, ఎంపిడిఓ ఎం.బాల సుబ్రహ్మణ్యం, చీపురుపల్లి సబ్ డివిజన్ ఏడి కోటేశ్వరరావు, గరివిడి మండల వ్యవసాయ అధికారి పక్కి ప్రసాద రావు, టిడిపి రాష్ట్ర కార్యదర్శి కిమిడి రామ్ మల్లిక్ నాయుడు, మాజీ ఎంపిపి పైల బలరాం,మండల టిడిపి అధ్యక్షుడు ఎస్. సురేష్, ఉపాధ్యక్షుడు లెంక చిరంజీవి రావు, చీపురుపల్లి ఏఎంసి చైర్మన్ రేగాన రామారావు, డైరెక్టర్ గొట్టిముక్కల సత్తిరాజు, పట్టణ టిడిపి అధ్యక్షుడు తూట శ్రీను,చీపురుపల్లి మండల టీడీపీ అధ్యక్షుడు రౌతు కామునాయుడు, నియోజకవర్గ దేశం నాయకులు, పాల్గొన్నారు

## గ్రామాల్లో మద్యం అమ్మిన వారిపై కేసు నమోదు

దత్తరాజేరు నవంబర్ 19 ప్రభాత వార్త



ప్రభుత్వ అనుమతులు లేకుండాగ్రామాల్లో బెల్ట్ షాపులు ద్వారా మద్యం అమ్మినట్లయితే వారిపై కేసు నమోదు చేస్తామని ఎక్సైజ్ సీఐ జనార్ధన్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో బెల్ట్ షాపులు కేసులో పట్టుబడిన పదిమంది వ్యక్తులను బుధవారంతాసిల్దార్ ఎదుట హాజరు పరిచి బిఎన్ఎస్ఎస్ 129 చట్టంప్రకారం పదిమంది వారి వద్ద నుండి ఒక సంవత్సరం కాల పరిమితికి రెండు లక్షల రూపాయలకు బాండులను సమర్పించి బైండోవర్ కేసులు నమోదు చేయడం జరిగిందన్నారు ఎవరైనా బెల్ట్ షాపులు నిర్వహించిన లేదా బెల్ట్ షాపు వేలం పాటలు వేసిన కఠిన చర్యలు తప్పవని శ్రీ జనార్ధన హెచ్చరించారు గ్రామాల్లో బెల్ట్ షాపులు లేదా నాటు సారా ఆన వాళ్ళు ఉంటే వెంటనే మాకు తెలియజేయాలని ఫిర్యాదు చేసిన వ్యక్తుల పేర్లు గోప్యంగాఉంచడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్సైలు పి నరేంద్ర పి శాంత లక్ష్మి హెచ్సీలు లోకాభి రామ్ పిబిఎస్వీఆర్ రాజు జూనియర్ అసిస్టెంట్ అనిల్ పాల్గొన్నారు.

## అన్నదాతల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం : డిసిసిబి చైర్మన్" కిమిడి నాగార్జున"

గజపతినగరం, నవంబర్ 19 (ప్రభాతవార్త)



అన్నదాతల సంక్షేమమే ధ్యేయముగా కూటమి ప్రభుత్వం పనిచేస్తుందని డిసిసిబి చైర్మన్ కిమిడి నాగార్జున అన్నారు. అన్నదాత సుఖీభవబిపీఎం కిషన్ రెండో విడత చెక్కులు పంపిణీ కార్యక్రమం స్థానిక శ్రీ కన్వెన్షన్‌లో జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన నాగార్జున రైతులకు చెక్కులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రైతన్న పక్షపాతిగా ప్రభుత్వం నిరంతరం పనిచేస్తుందన్నారు. గత వైకాపా ప్రభుత్వం 13వేల 500 మత్రమే అందజేయగా, ప్రస్తుత తమ ప్రభుత్వం రూ.20వేలు రైతులకు అందజేస్తుందన్నారు. మాజీ మంత్రి, జనసేన పిఎసి సభ్యురాలు పడాల అరుణ, ఏఎంసీ చైర్మన్ పివివి గోపాలరాజు, మాజీ ఎంపీపీలు కొండపల్లి కొండలరావు, గంట్యాడ శ్రీదేవి, కొండపల్లి భాస్కరరావు, రాపాక అచ్చం నాయుడు, పాల్గొన్నారు.

## ఉపాధి పనులను తనిఖీ చేసిన పిడి శారదా దేవి

దత్తిరాజేరు నవంబర్ 19 ప్రభాతవార్త



జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనులను జిల్లా ప్రాజెక్ట్ డైరెక్టర్ శారదా దేవి మండలంలోని గుచ్చిమి గ్రామంలో జరుగుతున్న ఫారం పాండ్ పనులను బుధవారం తనిఖీ చేశారు వేతనదారులకు ఎంత వేతనం వస్తుందని ఫీల్డ్ అసిస్టెంట్‌ని అడిగి తెలుసుకున్నారు ఆ పని ఉపయోగాలు గురించి వివరించాలని క్షేత్ర సహాయకుడు చెప్పాలన్నారు కలెక్టర్ ఆదేశాల మేరకు మండలానికి వెయ్యి మంది వేతన దారులతో పనిచేపించాలని ఉపాధి ఏపీఓకి తెలిపారు. గ్రామానికి 40 నుంచి 50 మంది వేతన దారులతో ఖచ్చితంగా పనులు జరిగేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఏపీవో సాంకేతిక సహాయకులు ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

## కారు ఢీకొని వ్యక్తి మృతి

కురుపాం నవంబర్19 ప్రభాతవార్త.

కురుపాం మండలం,గుమ్మ గ్రామానికి చెందిన గౌడు హరిప్రసాద్ కారు ఢీకొని మృతి చెందాడు. బుధవారం అయ్యప్ప మాలధారినిలో ఉన్న హరి ప్రసాద్ బర్భుమికి వెళ్ళి వస్తుండగా ఈ ప్రమాదం జరిగింది. అతనికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఇతను నీలకంఠాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో హెల్త్ అసిస్టెంట్ గా పని చేస్తున్నారు. గిరిజన సంక్షేమ రాష్ట్ర డైరెక్టర్,జనసేన నియోజకవర్గం ఇన్చార్జి కద్రక మల్లేశ్వర రావు కారుగా గుర్తించారు.ఈ ప్రమాదం జరగటంతో గ్రామంలో విచారచాలు ఏర్పడ్డారు. కురుపాం ఎస్ ఐ నారాయణ రావు కేసు నమోద చేసి దర్యాప్తు చేస్తున్నారు.

### పార్దివ దేహానికి నివాళులు అర్పించిన పుష్పశ్రీవాణి

మాజీ ఉప ముఖ్యమంత్రి పాముల పుష్ప శ్రీవాణి విషయం తెలుసుకున్న వెంటనే గుమ్మ గ్రామానికి చేరి నివాళులు అర్పించారు. వాళ్ళ కుటంబానికి ప్రగాఢ సానుభూతిని తెలియచేశారు.ఆమె వెంట ఎంపీపీ పద్మావతి, జడ్పీటీసీ సుజాత, జిల్లా కో ఆప్షన్ సభ్యులు నిసార్.మాజీ ఎంపీపీ దమయంతి, ఉప సర్పంచ్ ఆదిల్,మండల నాయకులు పాల్గొన్నారు.

## పాలకవర్గం కార్మికుల సమస్యలు పరిష్కారించాలి.. మున్సిపల్ వర్కర్స్ యూనియన్ డిమాండ్

సాలూరు, నవంబర్ 19, ప్రభాతవార్త



మున్సిపల్ కార్మికుల మస్యలను పాలకవర్గం ఇంకా అధికారులు వెంటనే పరిష్కారించాలని ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ కమిటీ డిమాండ్ చేసింది.బుధవారం అందులో భాగంగా వారు ఎదుర్కొంటున్న సమస్యలతో కూడిన వినతి పత్రం శానిటరీ ఇనిస్పెక్టర్ బాలకృష్ణకు అందించారు. యూనియన్ కమిటీ అధ్యక్షుడు కార్యదర్శులు టి.శంకర్రావు, టి.రవి మాట్లాడారు.రాష్ట్రంలో ప్రతి ఏడాది సంక్రాంతికి కాంట్రాక్టు కార్మికులకు కూడా సబ్బులు, నూనెలు, చెప్పులు, బట్టలు, ఇస్తుండగా ఇక్కడ మాత్రం పర్మినెంట్ కార్మికులకు అందించి, కాంట్రాక్ట్ కార్మికులకు ఇవ్వడం లేదని అరోపించారు. అలాగే ఇతర పట్టణాల వలే బడ్జెట్ కేటాయించి ఇకనైనా ఇవ్వాలని కోరారు. గతంలో జీతాలు సరిగా లేవనే కారణాలతో పండుగ లకు కార్మికులను పస్తులించిన సందర్భాలు ఉన్నాయని, కమిషనర్ అలాగే పాలకవర్గం పండుగ దృష్టిలో పెట్టుకొని కార్మికులకు జీతాలు ఇబ్బందులు లేకుండా చూడాలని కోరారు. నాయకులు రాముడు, శ్రీను,పోలా రాజు, ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## అన్నదాత సుఖీభవ - పిఎం కిసాన్ నిధులను విడుదల చేసిన ప్రభుత్వ విప్ జగదీశ్వరి


కురుపాం, నవంబర్19ప్రభతవార్త



కురుపాం నియోజకవర్గ కేంద్రంలో బుధవారం మండల ప్రజా పరిషత్ కార్యాలయం ఆవరణలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో అన్నదాత సుఖీభవ-పీయం కిసాన్ రెండో విడత నిధుల్ని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విప్, కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి విడుదల చేశారు. ఆమె మాట్లాడుతూ అన్నదాత సుఖీభవ పియం కిసాన్ పథకం ద్వారా రైతులకు 2025-26 సంవత్సరానికి రెండో విడతగా రైతులకు వారి ఖాతాలో 7000 జమ చేయడం జరిగిందని తెలిపారు. సెంట్రల్ గవర్నమెంట్ 6 వేలు, స్టేట్ గవర్నమెంట్ 14 వేలు కలిపి 3 విడతల కింద సంవత్సరానికి 20,000 రైతులకు అందించడం జరుగుతుందని తెలిపారు. ఏఎంసీ చైర్పర్సన్ కద్రక కళావతి, ఐసిడిఎస్ పిడి కనకదుర్గ, అరకు పార్లమెంటు రైతు అధ్యక్షులు దేవకోటి వెంకట నాయుడు, ఏడిఏ కె శారద, నియోజకవర్గ రైతు అధ్యక్షులు గురాన శ్రీరామ్ మూర్తి నాయుడు, రాష్ట్ర కొప్పల వెలమ డైరెక్టర్ అక్కేన మధుసూదనరావు, రాష్ట్ర ట్రైకర్ బోర్డ్ డైరెక్టర్ పువ్వల లావణ్య, రాష్ట్ర తూర్పు కాపు డైరెక్టర్ శేఖర్ పాత్రుడు, రాష్ట్ర బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ రంజిత్ కుమార్ నాయకో, సీనియర్ నాయకులు దత్తి లక్ష్మణరావు, మరడాన తవిటినాయుడు, డొంకాడ రామకృష్ణ, ఎంపీపీ బొంగు సురేష్, సుదర్శన్ రావు, మధుసూదన్ రావు, భారతమ్మ, సుకేష్, గుమ్మలక్ష్మీపురం, కురుపాం, జియ్యమ్మవలస, గరుగుబిల్లి టిడిపి మండల పార్టీ అధ్యక్షులు అడ్డాకుల నరేష్, కె వి కొండయ్య, జోగి భుజంగరావు, మరడాన నారాయణ స్వామి, వట్టిగెడ్డ చైర్మన్ ముడడ్ల సత్యం నాయుడు, రాష్ట్ర తెలుగు యువత అధికార ప్రతినిధి కోలా రంజిత్ కుమార్, పిఎసిఎస్ చైర్మన్లు, కురుపాం ఎంపీడీవో ఉమామహేశ్వరి, కురుపాం ఏవో నాగేశ్వరరావు, వ్యవసాయ శాఖ సిబ్బంది, రైతులు కూటమి నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## దేశ సమైక్యత పితామహుడు సర్దార్ వల్లభాయ్ పటేల్

పార్వతీపురం, నవంబర్ 19, ప్రభాతవార్త :



ఉక్కు మనిషి, దేశ సమైక్యత పితామహుడు సర్దార్ వల్లభాయ్ పటేల్ అని రాజ్యసభ సభ్యులు పాక సత్యనారాయణ అన్నారు. కేంద్ర యువజన వ్యవహారాలు మరియు క్రీడల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో మేరా యువ భారత్ నిర్వహించిన సర్దార్ 150 ఐక్యత పాదయాత్ర బుధవారం జరిగింది.ఈ కార్యక్రమానికి రాజ్యసభ సభ్యులు పాక సత్యనారాయణ, శాసనసభ్యులు బోనెల విజయచంద్ర, జిల్లా కలెక్టర్ డా.ఎన్ ప్రభాకర్ రెడ్డి, జిల్లా ఎస్పి ఎస్వి.మాధవ్ రెడ్డి హాజరయ్యారు. ముందుగా ఆర్.సి.ఎం స్కూల్ నుంచి ప్రభుత్వ జూనియర్ కళాశాల వరకు పాదయాత్ర నిర్వహించారు. అనంతరం జరిగిన సభలో వీరు మాట్లాడుతూ భారతదేశ ఐక్యతను మాజీ హెూమ్ మినిస్టర్, స్వర్గీయ సర్దార్ వల్లభాయ్ పటేల్ ప్రపంచానికి చాటి చెప్పారని, ఆయన కృషి వలనే ఈరోజు మనకు ఈ అఖండ భారత్ సాధ్యమైందని అన్నారు. పట్టు పట్టరాదు.. పట్టి విడువరాదు అనే సూత్రంతో ఆయన ఎన్ని అడ్డంకులు వచ్చినా అఖండ భారతదేశాన్ని సుసాధ్యం చేశారని గుర్తుచేశారు. అనంతరం ఆత్మ నిర్భర భారత్ ప్రతిజ్ఞను యువతతో చేయించారు. ఈ కార్యక్రమంలో సబ్ కలెక్టర్ ఆర్.వైశాలి, పోలీసులు, అధికారులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# విజయనగరం పార్వతీపురం మన్యం వార్త

25 Glorious years

## గ్రామస్థుల భాగస్వామ్యంతోనే ఉపాధి పనులు గుర్తింపు సాధ్యం ఉపాధి హామీ ఏపీడి

లక్కవరపుకోట, నవంబర్ 19, ప్రభాతవార్త



ప్రతి గ్రామంలోని గ్రామ ప్రజలు రైతుల భాగస్వామ్యంతో మాత్రమే అవసరం అయినా పనులు గుర్తింపు సాధ్యం అవుతుంది అని ఉపాధి హామీ ఎస్ కోట క్లస్టర్ అసిస్టెంట్ ప్రాజెక్ట్ డైరెక్టర్ వై పద్మజ అన్నారు బుధవారం మండలంలోని రంగరాయపురం గ్రామంలో జరిగిన ఉపాధి హామీ పనులు గుర్తింపు కై జరిగిన ప్రాథమిక గ్రామ సభలో ఆమె ముఖ్య అతిది గా ఆమె పాల్గొన్నారు. ఎల్ కోట మండలం లో 45 కోట్ల 74 లక్షల ఆరు వేలు రూపాయల కి సంబందించిన పనులు మంజూరు అయి పనులు కొనసాగుతున్నాయి అని ఏపిడి తెలిపారు గ్రామంలో ప్రభుత్వం సూచించిన పనులు తో పాటు గ్రామస్తులకు అత్యవసరం అయిన పనులు ఈ గ్రామ సభ ద్వారా గుర్తించడం జరుగుతుంది అని అన్నారు. గ్రామ సర్పంచ్ కరెడ్ల రామ లక్ష్మి మాజీ జడ్పీటీసీ కరెడ్ల ఈశ్వర రావు ఎంపీటీసీ కలవల పల్లి సత్యవతి జగ్గన్న దొర ఎల్ కోట ఏ పి ఓ విజయ లక్ష్మి జేఈ కె వరలక్ష్మి టిఏలు ఉపాధి కూలీలు పాల్గొన్నారు.

## గౌడు హరిప్రసాద్ కుటుంబాన్ని పరామర్శించిన ప్రభుత్వ విప్

కురుపాం, నవంబర్19ప్రభాతవార్త.



కురుపాం మండలంలో గుమ్మ గ్రామంలో బుధవారం తెల్లవారి జామున కారు ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదం లో గుమ్మ గ్రామానికి చెందిన గౌడ హరి ప్రసాదు మరణించారు. ఈ విషయం తెలుసుకున్న ప్రభుత్వ విప్, కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి మరణించిన వ్యక్తి కుటుంబ సభ్యులకు గుమ్మలక్ష్మీపురం హాస్పటల్ కు వెళ్ళి ఆ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.

## రైతు సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయం : ఎం.ఎల్.ఏ.నాగమాధవి, మార్క్ఫెడ్ చైర్మన్ బంగార్రాజు

నెల్లిమర్ల, నవంబర్ 19, ప్రభాతవార్త



రైతు సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని ఎంఎల్ఏ లోకం నాగ మాధవి, ఏపీ మార్క్ఫెడ్ చైర్మన్ కర్రోతు బంగారు రాజు అన్నారు. పూసపాటిరేగ మండలం కుమిలి గ్రామంలో అన్నదాత సుఖీభవ-పీఎం కిసాన్ పథకంను బుధవారం వారు లాంఛనంగా ప్రారంభించారు. రైతులను ఉద్దేశించి వారు మాట్లాడారు. అన్నదాత సుఖీభవ కార్యక్రమాన్ని తమ కూటమీ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్నదని అన్నారు. బంగార్రాజు మాట్లాడుతూ "అభివృద్ధికి ప్రాంతీయ బేధం లేదని రైతే ప్రాధాన్యమని కూటమి ప్రభుత్వం చాటి చెప్పిందని. అన్నదాత సుఖీభవ -పిఎం కిసాన్ పథకాల రెండో విడతగా కేంద్ర ప్రభుత్వం నుండి రూ.2 వేలు, రాష్ట్ర ప్రభుత్వం నుండి రూ.5 వేలు మొత్తం రూ.7 వేలు రైతుల ఖాతాలో జమ చేసామని అన్నారు. డెంకాడ మాజీ ఎంపీపీ కంది చంద్రశేఖర్, పార్లమెంట్ అధికార ప్రతినిధి గేదెల రాజారావు, మాజీ సర్పంచ్ దల్లి ముత్యాలు రెడ్డి, జనసేన పార్టీ నాయకులు చనమల్లు వెంకటరమణ, కరుమజ్జి గోవిందరావు, కోట్ల రఘు, జమరాజు,పతివాడ గోవిందరావు పాల్గొన్నారు.

## అన్నదాత సుఖీభవ - రైతుల సంక్షేమానికి మరో మైలురాయి

పాచిపెంట, నవంబర్ 19, ప్రభాతవార్త



అన్నదాత సుఖీభవ" కార్యక్రమం రైతులు సంక్షేమానికి మరొక మైలు రాయి అని మంత్రి గుమ్మిడి సంధ్యారాణి అన్నారు. మండల కేంద్రమైన పాచిపెంట ఏఎంసి మార్కెట్ యార్డు ఆవరణలో అన్నదాత సుఖీభవ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమం మండల వ్యవసాయాధికారి కొల్లి తిరుపతిరావు ఆధ్వర్యంలో నిర్వహించారు. మంత్రి మాట్లాడుతూ రెండొవ విడతగా రాష్ట్ర వ్యాప్తంగా అర్హులైన ప్రతి రైతు కుటుంబానికి అక్షరాల రూ.7,000 చొప్పున ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అందజేస్తున్నారని తెలిపారు. రెండో విడతగా సాలూరు నియోజకవర్గంలో 31,531 మంది రైతులకు మొత్తం రూ.21.37 కోట్లు రెండో విడత పార్వతీపురం మన్యం జిల్లాలో 1,22,260 మంది రైతులకు రూ.83.32 కోట్లు అందజేస్తున్నట్లు మంత్రి వివరించారు. జిల్లా కలెక్టర్ కే ప్రభాకర్ రెడ్డి సబ్ కలెక్టర్ వైశాలి జిల్లా జాయింట్ కలెక్టర్ ఏఎంసి చైర్మన్ ముఖి సూర్యనారాయణ ఎంపీపీ బి ప్రమీలటిడిపి అధ్యక్షులు జి, యుగంధర్ సాలూరు పట్టణ అధ్యక్షులు ఎన్ చిట్టి, సాలూరు మక్కువ మండల టిడిపి అధ్యక్షులు స్థానిక ఎంపీటీసీలు ప్రజాప్రతినిధులు, అధికారులు, రైతులు భారీ సంఖ్యలో హాజరయ్యారు.

## కార్యదర్శులు ఫుల్... సర్పంచులు అక్కడక్కడ.. పచ్చదనం... పరిశుభ్రత శిక్షణ తీరు

గజపతినగరం, నవంబర్ 19 (ప్రభాతవార్త)



ఎల్.ఎస్.డి.జి.ఎస్ థీమ్ బి 5కి సంబంధించి పచ్చదనంబి పరిశుభ్రత అనే అంశంపై మూడు రోజులు పాటు పాత ఎంపీడీవో కార్యాలయంలో మండల పరిషత్ అధికారులు శిక్షణా కార్యక్రమం బుధవారం నిర్వహించారు. తొలిరోజు గ్రామ కార్యదర్శులు, సర్పంచులు, ఉప సర్పంచులు శిక్షణ పొందాల్సి ఉంది. అయితే తొలిరోజు గ్రామ కార్యదర్శులు పూర్తిస్థాయిలో హాజరుకాగా, సర్పంచులు, ఉప సర్పంచులు 8 మంది వరకు మాత్రమే హాజరు కావడం కనిపించింది. మండలంలో 30 పంచాయితీల సర్పంచులు, ఉప సర్పంచులు ఉండగా, తక్కువ మంది మాత్రమే శిక్షణకు హాజరు కావడం, మిగతా సర్పంచులు డుమ్మా కొట్టడం చర్చనీయాంశంగా మారింది. గ్రామాల్లో పచ్చదనం, పరిశుభ్రత మరింత మెరుగు కోసం తీసుకోవాల్సిన చర్యలలో సర్పంచుల పాత్ర ఎంతో కీలకమైనది. ఇలాంటి శిక్షణ ద్వారా మరింత మెరుగైన ఫలితాలు గ్రామాల్లో సాధించే అవకాశం ఉంది. ప్రభుత్వం ఎంతో ఖర్చు చేసి శిక్షణ కల్పిస్తున్న ఇలాంటి అవకాశాలను సద్వినియోగం చేసుకోవలసిన బాధ్యత సర్పంచులపై ఉంది. అయితే, సర్పంచులు డుమ్మా వెనుక మండలపరిషత్ కార్యాలయ అధికారుల సమాచార లోపమా? మరి ఏదైనా కారణం ఉందా? అన్నది దేవుడికే ఎరుక.

## రైతులకు 5.53 కోట్లు విడుదల

వేపాడ, నవంబరు19, ప్రభాతవార్త



వేపాడ మండలంలో అన్నదాత సుఖీభవ – పీయం కిసాన్ పథకం కింద 8532 మంది లబ్ధిదారులకు 5.53 కోట్ల రూపాయలు నిధులు విడుదల చేసినట్టు కలెక్టర్ రాం సుందర్ రెడ్డి, ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి, డీసీఎంఎస్ చైర్మన్ గొంప కృష్ణ తెలిపారు.వేపాడ తహసీల్దార్ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన అన్నదాత సుఖీభవ- పీయం కిసాన్ 2025-26కి సంబందించి రెండవ విడత నిధులు పంపిణీ కార్యక్రమంలో వారు పాల్గొని పంపిణీ కార్యక్రమం చేపట్టారు. కలెక్టర్ రాం సుందర్ రెడ్డి ఎమ్మెల్యే లలిత కుమారి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగా లేకున్నా రైతులకు ఏటా 20వేలు ఇస్తున్నామన్నారు. ధాన్యం కొన్న 48 గంటల్లోనే రైతుల ఖాతాల్లో ప్రభుత్వం నిధులు జమ చేస్తుందని ఆమె ఇచ్చారు. డీసీఎంఎస్ చైర్మన్ గొంప కృష్ణ, పార్టీ అధ్యక్షులు గొంప వెంకటరావు,ప్రధాన కార్యదర్శి కొట్యాడ రమణ మూర్తి, కూటమి పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు గురుకుల విద్యార్థి


కొమరాడ నవంబర్ 19 ప్రభాతవార్త



గుమ్మలక్ష్మీపురంలో జరిగిన జిల్లా స్థాయిలో వాలీబాల్ పోటీల్లో అండర్ 14 విభాగంలో ఆంధ్రప్రదేశ్ గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాల కొమరాడ ఏడవ తరగతి చదువుతున్న విద్యార్థి తిమ్మక యుగంధర్ రాష్ట్ర పోటీలకు ఎంపిక కాబడ్డారు. యుగంధర్‌ను శిక్షణ ఇచ్చిన వ్యాయామ ఉపాధ్యాయుడు కమలహాసన్ ను గురుకుల పాఠశాల ప్రధానాచార్యులు డి.లక్ష్మణరావు అభినందించారు.

## రైతులు పంట మార్పిడి విధానం అవలంబించాలి: మన్యం జిల్లా కలెక్టర్ ప్రభాకర్ రెడ్డి

పాచిపెంట, నవంబర్ 19 ప్రభాతవార్త



రైతులు ఒకే పంటను ప్రతి యాటను పండించడం వలన భూమి సారవంతం క్షీణించి రైతులకు నష్టం వాటిల్తుందని పంట మార్పిడి విధానం వలన అధిక లాభాలు పొందవచ్చని మన్యం జిల్లా కలెక్టర్ కె ప్రభాకర్ రెడ్డి రైతులకు సూచించారు. మండల కేంద్రమైన పాచిపెంట ఏఎంసి మార్కెట్ యార్డ్ ఆవరణలో అన్నదాత సుఖీభవ కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ జిల్లాలో అధిక సంఖ్యలో రైతులు ప్రతి మొక్కజొన్న పంటలు విరివిగా పండిస్తున్నప్పటికీ రసాయనకి ఎరువులను వినియోగించడం వలన భూసారం చీ నుంచి పోయి పంటలు దిగుబడి తగ్గుతుందని అదేవిధంగా నానో యూరియా ను వినియోగించినట్లయితే రైతులు పాడిపంటకు ఎంతో దోదపడుతుందని ఆయన అన్నారు. పంట మార్పిడి విధానం వలన అదేవిధంగా యూరియాకి బదులుగా నానో యూరియా వినియోగించడం వలన రైతులకు అధిక దిగుబడిని ఇస్తుందని ఆయన అన్నారు. అలాగే మన్యం జిల్లా పసిడి పంటల జిల్లాగా అనవచ్చని పిలవ వచ్చని ఆయన అన్నారు. ప్రాంతమంతా పచ్చని పంటలతో కలకలాడే విధంగా కనులు విందిగా పంట పొలాలు కనిపిస్తుంటాయని అన్నారు. రైతులు ప్రకృతి ఎరువులకు స్వస్తి పలకాలనీ హితో పలికారు.



## దిబ్బగూడలో నాలుగు పురిపాకలు దగ్ధం

**సీతంపేట, నవంబర్ 18 ప్రభాతవార్త:** సీతంపేట మండలం దిబ్బగూడలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ సంభవించి నాలుగు పురిపాకలు దగ్ధమైనట్లు రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ విజయ గణేష్ తెలిపారు. మంగళవారం రాత్రి ఒంటి గంట సమయంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ అవడంతో సత్యము, చిన్నమ్మి, బుద్దు, పార్వతిలకు చెందిన పురిపాకలు కాలిపోవడంతో గ్రామస్తులు వెంటనే ఆర్పే ప్రయత్నం చేశారు. దీంతో పెను ప్రమాదం తప్పింది. పురిపాకలు అగ్నికి ఆహుతి అయిన సంఘటనపై లక్ష యాభై వేల రూపాయలు నష్టం సంభవించినట్లు సీతంపేట ఆర్ఐ విజయ గణేష్ తెలిపారు. సంఘటనా స్థలానికి చేరుకుని అగ్నిప్రమాదంలో ఏ మేరకు నష్టం జరిగింది అనే దానిపై బాధితులు నుండి వివరాలు అడిగి తెలుసుకున్నారు.

## అరుణోదయ పాఠశాలలో శక్తి యాప్‌పై అవగాహన



**పాతపట్నం, నవంబర్ 19 ప్రభాతవార్త:** జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు పాతపట్నం మండలం కొరసవాడ అరుణోదయ స్కూల్లో విద్యార్థులకు టెక్కలి డివిజన్ శక్తి టీమ్ బుధవారం శక్తి యాప్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శక్తి యాప్ వినియోగం, పోక్సో చట్టం, సైబర్ నేరాలు, డయల్ 112, బాల్యవివాహాల నిరోధక చట్టం, యాంటీ డ్రగ్స్, ట్రాఫిక్ సేఫ్టీపై అవహగాన కల్పించారు. ఈ కార్యక్రమంలో శక్తి టీం టెక్కలి డివిజన్ ఇన్‌చార్జ్ గిరిధర్, ద్రాక్షాయణి, కాంచన, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు విజయ్‌కుమార్ మరియు సిబ్బంది పాల్గొన్నారు.



## అన్నా క్యాంటీన్‌లో సేవలు బేష్

**కోటబొమ్మళి, నవంబర్ 19 ప్రభాతవార్త:** కోటబొమ్మాళిలో నిర్వహిస్తున్న అన్నా క్యాంటీన్ సేవలు చాలా సంతృప్తికరంగా ఉన్నాయని స్థానిక ఎంపీడీవో కుప్పిలి ఫణీంద్ర కుమార్ అన్నారు. ఆయన బుధవారం అన్న క్యాంటీన్‌ను మధ్యాహ్నం భోజనాల సమయంలో ఆకస్మికంగా సందర్శించారు. భోజనాల నిర్వహణ వంట కాలు చాలా సంతృప్తికరంగా ఉన్నాయని ఆయన తెలిపారు. అన్నా క్యాంటీన్ పరిసరాల్లో మరిన్ని వస తులు కల్పించేదుకు చర్యలు చేపడతామన్నారు. ఆహ్లాదకరమైన వాతావరణంలో ప్రతి పేదవాడు ఆనందంగా భోజనం చేసేందుకు అనుకూలమైన వాతావరణాన్ని కల్పిస్తామని ఫణీంద్రకుమార్ తెలిపారు.

## పాడి రైతు కుటుంబానికి రూ.30వేలు చెక్కు అందజేత



**కంచిలి, నవంబర్ 19 ప్రభాతవార్త:** కంచిలి మండలం శ్రీరాంపురం గ్రామం పంచాయతీ విశాఖ డెయిరీ పాడి రైతు సూర్య నారాయణ మృతి చెందడంతో అతని భార్య సరోజినికి 30వేలు రూపాయల చెక్‌ను డెయిరీ సూపర్‌వైజర్ వేణుగోపాల్ స్వామి నాయుడు మాదిన రామారావు చేతలు మీదుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో రైతులు చలపతి, శంకరావు, ఢిల్లీరావు పాల్గొన్నారు.

## ప్రతి విద్యార్థి ఝాన్సీ లక్ష్మీబాయి జీవితం ఆదర్శంగా తీసుకోవాలి



**కంచిలి, నవంబర్ 19 ప్రభాతవార్త:** ప్రతి విద్యార్థి ఝాన్సీ లక్ష్మీబాయి జీవితాన్ని ఆదర్శంగా తీసుకొని ముందుకెళ్లాలని ప్రధానోపాధ్యాయులు సోమేశ్వరరావు అన్నారు. కంచిలి మండలం బూరగాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం ఝాన్సీలక్ష్మీబాయి 197వ జయంతి వేడుకలు నిర్వహించారు. హెచ్ఎం మాట్లాడుతూ ఝాన్సీ లక్ష్మీబాయి 30వ యేటనే గంగాధరున్ని వివామాడింది. గ్వాలియర్ కాలాపాని కోసం బ్రిటిష్ వాళ్ళతో పోరాటం చేసి కాపాడుకొని బ్రిటిష్ వారిని గడగడలాడించి వీరనారి బిరుదును పొందిందని చెప్పారు. లక్ష్మీబాయి రాజ్యానికి సంబంధించి ముందర జై కాంత్యరావు సాహెబ్ తదితరులతో కలిసి పోరాటం చేసి బ్రిటీష్ వారిని తరిమికొట్టిన వీరనారి అన్నారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి చంద్రశేఖర్, రోజా రాణి, కాంతారావు, నిరంజన్ ఖడంగా రమణమూర్తి, గణేష్, సోమేశ్‌లు పాల్గొన్నారు.

## బూరాడ గ్రామ దళితులకు ఎట్టకేలకు స్మశాన వాటిక స్థల పరిశీలన



**రాజాం, నవంబర్ 19 ప్రభాతవార్త** రేగిడి మండలం బూరాడ గ్రామంలో దళితుల స్మశాన వాటిక కోసం గత పదేళ్లుగా దళితులు పోరాడుతున్న విషయం తెలిసిందే, అయితే బుధవారం మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ కోట గిరి, గ్రామ సర్వేయర్ లక్ష్మణరావు, కార్యదర్శి భారతి, సర్వే నంబర్ 185/5 లో గల డీ పట్టా భూమిని గుర్తించారు, సమగ్ర నివేదిక కలెక్టర్‌కు ఇస్తామని తెలిపారు, అయితే గ్రామ దళితులు మాత్రం సమగ్ర నివేదిక నిష్పక్షపాతంగా జరిపి దళితులకు న్యాయం చేయాలని ఎన్నో ఏళ్లుగా స్మశాన వాటికకు స్థలం లేదని వారు మీడియా ముందు వాపోయారు. ఈ కార్యక్రమంలో రాజాం నియోజకవర్గం మార్కెట్ కమిటీ డైరెక్టర్ కేత శంకరరావు, రేగిడి మండల దళిత జేపీసీ అధ్యక్షులు తేగల మోహన్, ఎడ్ల దాలయ్య, ఎండ గణపతి, ఉత్తరావల్లి శంకర్రావు, వీ.ఆర్.ఏ చిరంజీవిలు, తామాడ శంకర్రావు, ఉత్తరావల్లి మధు, ఎండ కృష్ణ, వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.



## కూటమి ప్రభుత్వం రైతుల ప్రభుత్వం : ఎమ్మెల్యే కూన

**ఆముదాలవలస, నవంబర్ 19 ప్రభాతవార్త** కూటమి ప్రభుత్వం రైతుల ప్రభుత్వమని ఎమ్మెల్యే, పియుసి చైర్మన్ కూన రవికుమార్ అన్నారు. బుధవారం అన్నదాత సుఖీభవ, పీఎం కిషన్ నిధులు విడుదల చేసిన సందర్భంగా ఎమ్మెల్యే రవికుమార్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీల్లో సూపర్ సిక్స్ పథకంలో భాగంగా అన్నదాత సుఖీభవ నిధులు ప్రభుత్వం విడుదల చేసిందని అన్నారు. ఆముదాలవలస నియోజకవర్గంలో సంబం ధించి 81 రైతు సేవా కేంద్రాలు ఉన్నాయని, వాటి ద్వారా 33052 మంది లబ్ధిదారులు అన్న దాత సుఖీభవ పథకం ద్వారా లబ్ది పొందుతున్నారని అన్నారు. ఈ పథకం ద్వారా 1652.6 లక్షల మందికి లబ్ది చేకూరిందని వివరించారు. అదేవిధంగా పిఎం కిసాన్ పథకం ద్వారా 542.32 లక్షల రూపాయలు కలిపి రైతులకు 2194.92 లక్షల రూపాయలు లబ్దిదారుల ఖాతాలకు నేరుగా జమ చేయ డం జరిగిందని వివరించారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో నడుస్తున్న కూటమి ప్రభుత్వంలో ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉన్నారని తెలిపారు. ప్రజల కోసం నిరంతరం కష్టపడుతున్న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఈ రాష్ట్రాన్ని పాలించడం అదృష్టమని అన్నారు.

## అయ్యప్ప స్వాములకు కార్తీక మాస మహా భారీ అన్న ప్రసాద వితరణ



**ఆముదాలవలస, నవంబర్ 19 ప్రభాతవార్త** కార్తీక మాసం సందర్భంగా అయ్యప్ప స్వామి మాలధారణ దీక్ష స్వాములకు ప్రత్యేక పూజలు నిర్వహించి మహా అన్న ప్రసాద వితరణ నిర్వహించారు. కార్తీక మాస నాలుగో బుధవారం సందర్భంగా ఆముదాలవలస పట్టణంలోని అయ్యప్ప స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి అయ్యప్ప స్వాములకు 13వ వార్డు సొనిసగర్‌కు చెందిన ముద్దాడ గోవిందరావు స్వామి, రజిని దంపతులు ఆధ్వర్యంలో అన్న ప్రసాద వితరణ నిర్వహించారు. అయ్యప్ప భక్తులకు, శివ భక్తులకు, భవాని భక్తులకు ఫలహార కార్యక్రమం చేపట్టారు. గురుస్వాములు ఎడ్ల రమణయ్య స్వామి, ఆలయ ధర్మకర్తలు తమ్మినేని విద్యాసాగర్, మాజీ మున్సిపల్ చైర్మన్ తమ్మినేని గీత, ఆలయ కమిటీ నిర్వాహక సభ్యులు అన్నెపు సురేష్, అయ్యప్ప భక్తులు కెవి రమణమూర్తి, గొండు రమణమూర్తి, రేగాన సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

## చిన్న పరిశ్రమలు స్థాపించి ఆర్థికంగా ఎదగాలి.. ఐటీడీఏ పీవో పవార్ స్వప్నిల్



**సీతంపేట, నవంబర్ 19 ప్రభాతవార్త** గిరిజన యువత చిన్న పరిశ్రమలు స్థాపించి ఆర్థికంగా ఎదగాలని ఐటిడిఏ ఇన్‌చార్జ్ పీవో పవార్ స్వప్నిల్ స్పష్టం చేశారు. బుధవారం ఎస్సార్ శంకరన్ సమావేశ మందిరంలో ఐటిడిఏ పరిధిలోని 20 మండలాలకు చెందిన గిరిజన యువతీ యువకులకు వివిధ సభ్యులు, మహిళా సంఘ సభ్యులతో నిర్వహించిన వర్క్‌షాప్‌లో ఆయన మాట్లాడుతూ ఐటీడీఏ ద్వారా ఇస్తున్న జీవనోపాధి పథకాలను, స్వయం ఉపాధి పథకాలను గిరిజన యువత సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ పథకాన్ని యువత సక్రమంలో తిరిగి చెల్లించాలని గిరిజన యువత వ్యాపారాలపై పూర్తిస్థాయిలో అవగాహన కలిగి ఉండాలని అన్నారు. ఆదే విధంగా సరైన ప్రణాళికలతో ముందుకు సాగితే ఆర్థిక అభివృద్ధి సాధించవచ్చని సూచించారు. గిరిజన యువతకు రుణాల మంజూరులో బ్యాంకులతో మాట్లాడి పూర్తి సహకారం అందిస్తామని అన్నారు. ఇటువంటి వర్క్ షాపులను శ్రీకాకుళం పార్వతీపురం జిల్లాల్లో మరిన్ని సదస్సులు నిర్వహిస్తామని అన్నారు. రుణాల మంజూరులో గిరిజన యువతకు బ్యాంకులు సహకరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌డిఏ పీడీ కిరణ్ కుమార్, లీడ్ బ్యాంక్ మేనేజర్ విజయ్ స్వరూప్, పి.శ్రీనివాస రావు, ఐటిడిఏ ఏపీవో ఎస్.వి.గణేష్, ఇండస్ట్రియల్ అధికారులు రఘునాథ్, దిలీప్ కుమార్‌లు, డీఆర్‌డిఏ ఏజీఎంలు, ఏపీఎంపి పీడీ శ్రీనివాసరావు, పాలకొండ టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ పడాల భూదేవి, వెలుగు డీపీఎం రమణ తదితరులు పాల్గొన్నారు.

## రేపు విద్యుత్‌కు అంతరాయం

**కోటబొమ్మాళి, నవంబర్ 19 ప్రభాతవార్త:** మండలంలోగల కొత్తపల్లి విద్యుత్ ఉపకేంద్రంలో మరమ్మతులు పనుల నిమిత్తం శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ నిలుపుదల చేయబడుతుందని టెక్కలి ఎగ్జి క్యూటివ్ ఇంజనీర్ నరసింహకుమార్ బుధవారం తెలిపారు. కావున కొత్తపల్లి, సరియాపల్లి, కురుడు, చౌదరకొత్తూరు, దంత, నారాయణపురం, చిన్నసాన, పుటిఐంద, రామ్మాపురపేట, కిడిమి, కిడిమి బుడిది, భద్రాపలం, జమచక్రం, మదనాపురం, జలాలి, నవరిపేట, కిడిమి గొల్లపేట, చంద్రాయ్యపేట తదితర గ్రామాలకు, పరిశ్రమలకు విద్యుత్ సరఫరా నిలిపి వేయబడును.



## ఆక్వా రైతులకు ఏఎంఆర్ పై అవగాహన

**సంతబొమ్మాళి, నవంబర్ 29 ప్రభాతవార్త** ప్రపంచవ్యాప్తంగా వార్షిక ప్రచారంలో భాగంగా యాంటీమైక్రోబియల్ రెసిస్టెన్స్ (ఏఎంఆర్) పై మండలం సీతానగరం గ్రామంలో ఆక్వా రైతులకు బుధవారం అవగాహన కల్పించారు. విశాఖపట్నం చెందిన ఎంపెడ అసిస్టెంట్ డైరెక్టర్ శిబాసిస్ మహంతి ఆధ్వర్యంలో ప్రతి సంవత్సరం నవంబర్ 18 నుండి 24 వరకు ప్రపంచవ్యాప్తంగా ఏఎంఆర్ వల్ల కలిగే ప్రమాదాలపై అవగాహన పెంపొందించడం, దాని వ్యాప్తిని అరికట్టేందుకు ఉత్తమ పద్ధతులను ప్రోత్సహించడం లక్ష్యంగా పనిచేస్తుందని అన్నారు. ఈ నేపథ్యంలో, ఎంపడా ఆధ్వర్యంలో పనిచేస్తున్న నేషనల్ సెంటర్ ఫర్ సస్టెయినబుల్ అక్వాకల్చర్ తీర రాష్ట్రాల్లోని ఏ ఎం ఆర్ ప్రాధాన్యం, మంచి ఆక్వాకల్చర్ నిర్వహణ పద్ధతుల అమలుపై అవగాహన కల్పించేందుకు భారీ స్థాయిలో ప్రచారాలు అన్నారు. ఆక్వా సాగులో ఎటువంటి సమస్య తలెత్తిన వెంటనే సంప్రదించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో 103 మంది ఆక్వా రైతులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్ఏసీఎస్ఏ ఎస్ఈఓ ఎస్.బాలాజీ, జిల్లా మత్స్య శాఖ అధికారి వై.సత్యనారాయణ, కేవీక్ సీనియర్ శాస్త్రవేత్త డా.బాలకృష్ణ, స్థానిక సర్పంచ్ పీ.బృందావతి రవికుమార్ రెడ్డి, వాడరేవు చిరంజీవి, వాడరేవు కృష్ణారావు, నగిరి ఖగేశ్వరరావు, ఫీల్డ్ మేనేజర్ ఎం.విజయ్ కుమార్, ఎంపీటీసీ బి.సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రవీణ్‌ను పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి



**పాతపట్నం, నవంబర్ 19 ప్రభాతవార్త:** ఇటీవల ప్రమాదవశాత్తు కాలుకు గాయమై శస్త్ర చికిత్స చేయించుకున్న వైకాపా సీనియర్ నాయకులు, తిడ్డిమి పంచాయతీ సర్పంచ్ ప్రతినిధి తూలుగు ప్రవీణ్‌ను వైఎస్సార్‌సీపీ రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ సభ్యులు, మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి బుధవారం పరామర్శించారు. స్థానిక నాయకులతో కలిసి తిడ్డిమిలోని ప్రవీణ్ గృహానికి వెళ్లి ప్రవీణ్ ఆరోగ్య పరిస్థితిని ఆమె అడిగి తెలుసుకున్నారు. పార్టీకి ఆయన అందిస్తున్న సేవలను కొనియాడుతూ, సంపూర్ణ ఆరోగ్యంతో మళ్లీ ప్రజా కార్యక్రమాలలో చురుగ్గా పాల్గొనాలని రెడ్డి శాంతి ఆకాంక్షించారు. రెడ్డి శాంతితో పాటు వైకాపా నాయకులు సవిరిగాన ప్రదీప్, ఏనుగుతల సూర్యం, మద్దు తాతయ్య మాష్టారు, వైకాపా శ్రేణులు ఉన్నారు.

## ఎంఎస్ పల్లి ఏపీ మోడల్ స్కూల్‌ను సందర్శించిన అధికారులు



**కంచిలి, నవంబర్ 19 ప్రభాతవార్త** పదవ తరగతి పరీక్షా కేంద్రాల తనిఖీ, నియామక ప్రక్రియలో భాగంగా బుధవారం రాష్ట్ర అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ ఎగ్జామినేషన్ జి.చంద్రభూషణ్ తమ సిబ్బందితో, స్థానిక ఎంఈఓ శివరాం ప్రసాద్ ఎంఎస్‌పల్లి ఏపీ మోడల్ స్కూల్ సందర్శించారు. ప్రిన్సిపాల్ ఎన్.శివప్రసాద్, సిబ్బంది పాఠశాలలోని ప్రత్యేకతలను వివరించారు.అలాగే ఇటీవల జరిగిన విద్యార్థి శాసనసభ సభ్యుల ఎంపిక పోటీలలో ఇచ్ఛాపురం నియోజకవర్గ విద్యార్థి శాసనసభ్యులుగా ఎంపికైన ఆరాధ్య పాణిగ్రాహిని ప్రశంసించి నిజమైన మార్పు చట్ట సభల ద్వారానే సాధ్యం కనుక మీకు దొరికిన ఈ సదావకాశాన్ని ఈ నియోజకవర్గంలోని ప్రజల అసలైన సమస్యలను ఈనెల 26 తారీఖున రాష్ట్ర రాజధాని అమరావతిలో జరగబోయే విద్యార్థి శాసనసభ చర్చలలో బలంగా చర్చించమని సూచించారు. డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం అమలు తీరుని పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. విద్యార్థులు తమకు అందుబాటులో అన్ని అవకాశాలను సద్వినియోగం చేసుకొని తమ బంగారు భవిష్యత్తును విద్యార్థి స్థాయి నుంచే తీర్చిదిద్దుకోవాలని ప్రోత్సహించారు.

## విద్యుత్ వినియోగదారులు సహకరించాలి



**జలుమూరు, నవంబర్ 19 ప్రభాతవార్త** మండలంలోని 11 కెవి చల్లవానిపేట, జోనంకి ఫీడర్ పైన శుక్రవారం ఉదయం 9గంటల నుండి మధ్యాహ్నం రెండు గంటల వరకు మరమ్మత్తులు నిమిత్తం విద్యుత్ నిలుపుదల చేయబడునని టెక్కలి ఈఈ నరసింహారావు తెలిపారు. కావున అబ్బాయిపేట, జో నంకి, గంగాధరపేట, తలతిరియ లింగాలపాడు, సుబ్రమణ్యపురం, వెంకటాపురం, ఊడికిలపాడు, ఎర్రన్నపేట, కేఎల్ఎన్ పేట, నామాలపేట గ్రామాలకు, అలాగే పరిశ్రమలకు విద్యుత్ సరఫరా నిలిపి వేయబడునని తెలిపారు. ఈ విషయంలో వినియోగదారులు సహకరించాలని విద్యుత్ శాఖ ఏఈ సూర్యారావు పేర్కొన్నారు.



## మార్కెట్ కమిటీ నిధులతో అభివృద్ధి

**జలుమూరు, నవంబర్ 19 ప్రభాతవార్త:** వ్యవసాయ సాధారణ సర్వసభ్య సమావేశం మార్కెట్ కమిటీ అధ్యక్షులు తర్ర బలరాం అధ్యక్షతన మంగళవారం జరిపారు. ఈ సమావేశంలో ప్రత్యేక అతిథులుగా స్థానిక ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ మార్కెట్ కమిటీ నిధులతో పలు అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టాలని సూచించారు. కార్యాలయంలో మీటింగ్ హాలు, రహదారులు, ప్రహరీ నిర్మాణానికి, గోడౌన్స్ వంటి నిర్మాణానికి చర్యలు చేపట్టాలని సూచించారు. ముందుగా మార్కెట్ కమిటీ కార్యదర్శి బి.శారద తన నివేదికను చదివి వినిపించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ సమన్వయకర్త బగ్గు అర్చన, డైరెక్టర్లు ఎల్లవేళల పిలుస్తారు. మండల వ్యవసాయ అధికారి రవికుమార్, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

## పల్లెలు పచ్చదనంతో మెరిసిపోవాలి



**వీరఘట్టం, నవంబరు 19 ప్రభాతవార్త** పల్లెలు పచ్చదనంతో పరిశుభ్రంగా మెరిసిపోవాలని ఇందుకు మీ వంతు కృషి చేయాలని ఎంపీడీవో బి.వెంకటరమణ పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో థీమ్ 5లో భాగంగా సర్పంచులు, ఉప సర్పంచులు కార్యదర్శులకు క్లీన్ అండ్ గ్రీన్ శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. మండలంలోని అన్ని గ్రామ పంచాయతీలు, హేబిటేషన్స్‌లలో పచ్చదనం పరిశుభ్రత కార్యక్రమంలో భాగంగా పారిశుద్ధ్యం కార్యక్రమాలు ముమ్మరంగా జరిపించి ప్రజలను రోగాల బారి నుండి కాపాడాలని అన్నారు. గ్రామాలను పరిశుభ్రంగా ఉంచి రోగాలు దరిచేరకుండా కృషి చేయాలని అన్నారు. అందరూ గ్రామపంచాయతీ సర్పంచులు, పంచాయతీ సెక్రటరీలు సంయుక్తంగా పూర్తి బాధ్యత వహించి పల్లెలు అన్ని రంగాల్లో మెరిసిపోవాలని ఆయన అన్నారు. జిల్లాకే వీరఘట్టం మండలం ఆదర్శంగా నిలవాలని ఇందుకు తమ వంతు కృషి చేయాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీల సర్పంచులు, ఉప సర్పంచులు, పంచాయతీ సెక్రటరీలు పాల్గొన్నారు.



## భూహక్కు కల్పించేందుకే స్వామిత్వ

**కోటబొమ్మాళి, నవంబర్ 19 ప్రభాతవార్త:** ప్రతి గ్రామంలోనూ ఎవరి యొక్క వారి భూమిని, స్థలాన్ని సొంత హక్కులు కల్పించేందుకు స్వామిత్వ పథకాన్ని ప్రభుత్వం అమలు చేసిందని స్థానిక ఎంపీడీఓ కుప్పిలి ఫణీంద్ర కుమార్ అన్నారు. బుధవారం మండలం గంగారాం గ్రామంలో స్వామిత్వపై ఎంపీపీ రోణంకి ఉమా మల్లేశ్వరరావు అధ్యక్షతన గ్రామ సభ నిర్వహించారు. గ్రామంలో సొంత ఇంటి స్థలాలు, నీటి వనరులు ఇతర సొంత ఆస్తులను ఎవరికి వారిగా కేటాయించి భూహక్కు కార్డులను పంపిణీ చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. అందుకోసం ప్రతి ఒక్కరి సొంత స్థలాలు, ఇతర వివరాలను సేకరించడం జరుగుతుందన్నారు. అందుకోసం ప్రతి ఒక్కరూ తమకు, తమ సిబ్బందికి సహకరించాలని ఆయన కోరారు. భూముల పట్టాలు పత్రాలు వలె ఈ స్వామిత్వ కార్డులు కూడా ఉపయోగపడతాయని అన్నారు. గ్రామకంఠం పరిధిలో ఇల్లు, ఇళ్ల స్థలాలు సర్వే చేసి జారీ చేసిన 9 (2) నోటీసులపై ఫిర్యాదులను స్వీకరించారు. సమ్మతం తెలిపిన ఆస్తి యజమానుల నుండి సంతకాలు తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ ప్రతినిధి మల్లేశ్వరరావు, పంచాయతీ కార్యదర్శి, మండల పరిషత్ సిబ్బంది, గంగారాం, సర్పంచ్ పేడాడ జోష్న, దేశం నేతలు వీరఘట్టపు శివరావు, ఎం.ప్రకాశరావు, లండ వసంతరావు, కొర్ర అప్పన్న తదితరులు పాల్గొన్నారు.

## సంతబొమ్మాళిలో సహకార వారోత్సవాలు



**సంతబొమ్మాళి, నవంబర్ 19 ప్రభాతవార్త** మండల కేంద్రం సంతబొమ్మాళిలో బుధవారం సహకార వారోత్సవాలు జరిగాయి. 72వ అఖిల భారత సహకార వారోత్సవాల్లో భాగంగా సంతబొమ్మళి పిఎసియస్ చైర్మెన్ కూచెట్టి కాంతారావు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ముందుగా సొసైటీ ఆవరణలో పతాక ఆవిష్కరణ చేసి అనంతరం సమావేశాన్ని ఏర్పాటు చేసారు. చైర్మన్ మాట్లాడుతూ రైతులు బాగుంటేనే దేశం అభివృద్ధిలో ముందుకు వెళ్తుందన్నారు. రైతన్నలు కూడా పిఎసియస్‌లు వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా డీసీసీబీ చైర్మన్ శివాల సూర్యనారాయణ, కోటబొమ్మాళి మాజీ పిఎసిఎస్ అధ్యక్షులు కింజరాపు హరివరప్రసాద్, నాలుగు మండలాల పిఎసియస్ అధ్యక్షులు, జిల్లా మండల అధికారులు, నాయకులు, యువత కార్యకర్తలు పాల్గొన్నారు.

## వైఎస్ జగన్‌ను కలిసిన పలువురు నాయకులు



**కవిటి, నవంబర్ 19 ప్రభాతవార్త:** తాడేపల్లి (విజయవాడ) వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాల యంలో జగన్ మోహన్ రెడ్డిని బుధవారం ఇచ్చాపురం నియోజకవర్గం సమీక్ష సమావేశం సందర్బంగా ఉత్తరాంధ్ర వైస్సార్సీపీ కోఆర్డినేటర్ కురుశాల కన్నబాబు, శ్రీకాకుళం జిల్లా వైఎస్సార్‌సీపీ పార్లమెంట్ పరిశీలకులు కుంబా రవిబాబు, శ్రీకాకుళం జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు ధర్మాన కృష్ణదాస్, శ్రీకాకుళం జిల్లా పరిషత్ చైర్‌పర్సన్, ఇచ్చాపురం నియోజకవర్గం వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జ్ పిరియా విజయ, మాజీ శాసనభ్యులు పిరియా సాయిరాజ్‌లు మర్యాదపూర్వకంగా కలిశారు.

శ్రీకాకుళం వార్త



## 28 కిలోల గంజాయితో వ్యక్తి అరెస్ట్

**ఇచ్ఛాపురం, నవంబర్ 19 ప్రభాతవార్త** స్థానిక రైల్వేస్టేషన్ వద్ద 28.070 కిలోల గంజాయితో ఒడిశా గజపతి జిల్లా మోహన బ్లాక్ బాపూజీనగర్‌కు చెందిన అమిలైసా ఫణి అనే వ్యక్తిని అరెస్ట్ చేసినట్లు సీఐ ఎం.చిన్నంనాయుడు చెప్పారు. ఒడిశా కొండ ప్రాంతాల్లో గంజాయి కొని ధీరజ్ అలియాస్ ధర్మబీర్‌నాయక్‌తో కలిసి గంజాయిని బొంబాయిలో కోపర్‌కర్లే ప్రాంతానికి చెందిన ఇండేన్ రామేష్‌కు సరఫరా చేసేందుకు తరలిస్తుండగా ఫణిని టౌన్ ఎస్సై ముకుందరావు అరెస్ట్ చేసి సీజ్ చేసి కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

## 10మంది ఎక్సైజ్ నిందితులపై బైండోవర్ కేసు



**ఇచ్ఛాపురం, నవంబర్ 19 ప్రభాతవార్త** స్థానిక ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో పాత సారా కేసుల్లో నిందితులుగా ఉన్న పది మందిపై కవిటి తహశీల్దార్ బెహరా మురళీమోహనరావు వద్ద బైండోవర్ విధించినట్లు సీఐ పి.దుర్గాప్రసాద్ చెప్పారు. లక్ష రూపాయలు అపరాధ రుసుం నిబంధనలు ఉల్లంఘిస్తే విధిస్తారని, ఏడాది పాటు బైండోవర్ అమలులో ఉంటుందని, మద్యం అధిక ధరలకు అమ్మితే 14405 నెంబర్‌కు సంప్రదించాలని కోరారు.

## భగవాన్ సత్యసాయిబాబా శతజయంతి వేడుకలు

**ఇచ్ఛాపురం, నవంబర్ 19 ప్రభాతవార్త** స్థానిక సత్యసాయిబాబా మందిరంలో భగవాన్ సత్యసాయిబాబా శత జయంతి వేడుకలు నిర్వహిస్తున్నట్లు ఆలయ ఆలయ కమిటీ తెలిపింది. ఈ నెల 23 వరకు జయంతి వేడుకలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ప్రతిరోజు సుప్రభాతం, నగరసంకీర్తన, అష్టోత్తర శతనామార్చన, వందల జ్యోతుల ప్రజ్వలన నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 18న సామూహిక సత్యవ్రతములు నిర్వహించామని, 19న మహిళా దినోత్సవం, సామూహిక పారాయణంలు నిర్వహించారు. 20న యువజన దినోత్సవం, 21న బాలవికాస్ దినోత్సవం, 22 సత్సంగం, 23న జన్మదిన వేడుకలు నిర్వహిస్తామని చెప్పారు. పతాకావిష్కరణ పూజలు విజయ్‌కుమార్ రథో కుటుంబ సభ్యులతో వస్త్రదానం, కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

## ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులకు టెట్ నుంచి మినహాయించాలి



**వీరఘట్టం, నవంబర్ 19 ప్రభాతవార్త** ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులకు, టెట్ నుంచి మినహాయించాలని యుటిఎఫ్ డిమాండ్ చేసింది బుధవారం మండలంలోని కంబర, కంబరవలస, విక్రంపురం, చిట్టాపూడివలస, కిమ్మి, గడగమ్మ, కొట్టుగుమ్మడ, నడుకూరు, జెడ్పీహెచ్ఎస్ వీరఘట్టం, జెడ్పీజీహెచ్ఎస్ వీరఘట్టం పాఠశాలలను సందర్శించారు. యుటిఎఫ్ ప్రతినిధులు మాట్లాడుతూ బోధనేతర కార్యక్రమాల నుండి ఉపాధ్యాయులను మినహాయించి, ఉపాధ్యాయులను బోధనకు మాత్రమే పరిమితం చేయాలని, 12వ పీఆర్సీ కమిషన్‌ను పునరుద్ధరించి 29 మధ్యంతర భృతి ప్రకటించాలని, ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులకు టెట్ నుండి మినహాయించాలని, ఉపాధ్యాయుల ఆర్థిక బకాయిలని వెంటనే చెల్లించాలని, పాఠశాలలకు బోధనేతర సిబ్బందిని నియమించాలని కోరారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి మజ్జి పైడిరాజు, అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు కురమాన గోవిందరావు, బోనంగి దుర్గాప్రసాద్, గౌరవ అధ్యక్షులు అముజూరు స్వామిబాబు, కోశాధికారి బోనంగి వాసుదేవ రావు, యుటిఎఫ్ నాయకులు కమ్మవలస గోవిందరావు తదితరులు పాల్గొన్నారు.

## రైతులకు అన్ని రకాలుగా ప్రభుత్వం అండగా ఉంది : ఎమ్మెల్యే అశోక్



**కంచిలి, నవంబర్ 19 ప్రభాతవార్త** రైతులకు అన్ని రకాలుగా ప్రభుత్వం అండగా ఉందని, వ్యవసాయ ఖర్చులకు ప్రతి ఏటా మూడుసార్లు కలిపి 20 వేల రూపాయలు పెట్టుబడి సహాయం అందించడంలో భాగంగా మొదటి సంవత్సరం రెండవ విడత అన్నదాత సుఖీభవ పీఎం కిసాన్ కలిపి 7వేల రూపాయలు రైతుల ఖాతాలకు విడుదల కార్యక్రమం రైతు సంబరంగా కంచిలి వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆవరణలో వ్యవసాయ అనుబంధ శాఖలు నిర్వహించగా అందులో ప్రభుత్వ విప్ బెందాళం అశోక్ పాల్గొన్నారు. కార్యక్రమానికి అధ్యక్ష వహించిన సోంపేట వ్యవసాయ సహాయ సంచాలకులు టి.భవాని శంకరరావు రైతులకు అందిస్తున్న సేవలను వివరించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ బెందాళం అశోక్ 30వేల 634 మంది రైతులకు చెందిన లబ్ధి 19 కోట్ల 71, 58,000 నమూనా చెక్కును రైతులకు అందించారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ భూసార పరీక్ష ఫలితాల పత్రాలను, రబీ ఆరుతడి పంటలు విత్తనాలను రైతులకు అందించగా కంచిలి మండలానికి చెందిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను లాంఛనంగా ప్రారంభించారు. కార్యక్రమంలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం అధ్యక్షులు పైల పురుషోత్తం రెడ్డి, ఎర్రబాసు వ్యవసాయ మార్కెట్ కమిటీ అధ్యక్షులు మణిచంద్ర ప్రకాష్, మద్దిల నాగేశ్వరరావు, మాదిన రామారావు, పొందల కృష్ణారావు, మద్దు కుమార్, సూరాడ చంద్రమోహన్, కళింగ కార్పొరేషన్ డైరెక్టర్ బార్ల చిన్నబాబు, నాలుగు మండలాల తహశీల్దార్లు, మండల పరిషత్ అభివృద్ధి అధికారులు, మండల వ్యవసాయ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## థీమ్ 5 క్లీన్ అండ్ గ్రీన్ సర్పంచులకు శిక్షణ


**సీతంపేట, నవంబర్ 19 ప్రభాతవార్త** థీమ్ 5 క్లీన్ అండ్ గ్రీన్ అమలుపై సర్పంచులకు శిక్షణ ఇవ్వడం జరిగిందని సీతంపేట ఎంపీడీవో బీబీ మిశ్రా స్పష్టం చేశారు. బుధవారం స్థానిక ఉపాధిహామీ కార్యాలయంలో 53 పంచాయతీలకు చెందిన సర్పంచులు, ఉప సర్పంచులు, పంచాయితీ కార్యదర్శులకు ఒకరోజు పాటు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి గ్రామపంచాయతీలో క్లీనింగ్ గ్రీన్‌గా ఉండాలని అందులో సర్పంచులు కీలక పాత్ర పోషించాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



## ప్రధాన కాలువ శుభ్రతకు నడుం బిగించిన సర్పంచ్


**కొత్తూరు, నవంబరు 19 ప్రభాతవార్త :** మండల పరిషత్ అభివృద్ధి అధికారిణి ఎంపీడీఓ నీరజ సూచనల మేరకు కార్లేమ్మ పంచాయతీలోని యన్.ఎన్.కాలనీ ప్రధాన సాగు నీటి కాలువను ఆ పంచాయతీ సర్పంచ్ లోతుగడ్డ భగవాన్ దాస్ నాయుడు ప్రత్యక్ష పర్యవేక్షణలో స్వచ్ఛభారత్ లక్ష్య సాధనలో భాగంగా, రైతులకు అత్యంత ముఖ్యమైన కాలువను శుభ్రం చేసే కార్యక్రమాన్ని నిర్వహించారు. యన్.ఎన్.కాలనీ గుండా వెళ్లే ప్రధాన కాలువలో పంట సాగుకు ఆటంకంగా పేరుకుపోయిన ప్లాస్టిక్ వ్యర్థాలు, పూడిక, ఇతర చెత్తను పూర్తిగా తొలగించారు. సర్పంచ్ మాట్లాడుతూ కాలువ శుభ్రత అనేది గ్రామంలోని రైతులకు జీవనాడి లాంటిది. స్థానిక ప్రజలు వారి వారి ఇళ్ళల్లో చెత్తని కాలువలలో పడి వేయకుండా ప్రతిరోజు మీ ఇంటి వద్దకు వస్తున్న చెత్త వాహనాలలో వేయాలని ప్రజలను కోరారు. ఈ పనులను పర్యవేక్షించిన ఎంపీడీఓ నీరజ గ్రామ అభివృద్ధిలో ప్రజలు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయడానికి కార్లేమ్మ ఒక చక్కటి ఉదాహరణ అని పేర్కొంటూ, సర్పంచ్‌ను అభినందించారు.

## కవిటి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులకు శిక్షణ



**కవిటి, నవంబర్ 19 ప్రభాతవార్త** గత రెండు రోజులుగా కవిటి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో టీచ్ టూల్‌పై శిక్షణ కార్యక్రమం జరిగింది. శిక్షణ కార్యక్రమానికి డీఆర్‌పీలుగా ఆర్.బెలగాం హెచ్ఎం ఈశ్వరచారి, జుధిష్టి రౌళో, సురేష్‌కుమార్ పాత్రో వ్యవహరించారు. 30 మంది హెచ్ఎంలు, ఉపాధ్యాయులు, సిఆర్ఎంటిలు శిక్షణ పొందారు. గత సంవత్సరం జరిగిన శిక్షణకు ఇది కొనసాగింపు తరగతి గదిలో ఉపాధ్యాయుడు పాఠం చెబుతున్నప్పుడు అనతి ప్రవర్తన ఏకకాలంలో గమనించి పాఠ్య బోధనలో ఎంత వరకు విజయవంతమయ్యారో అంచనా వేసి యాప్‌లో నమోదు చేసే ప్రక్రియను వివరించారు. కార్యక్రమంలో ఎంఈఓ 1, ఎంఈఓ 2, ఎంఆర్‌సి సిబ్బంది, స్థానిక పాఠశాల హెచ్ఎం పాల్గొన్నారు.

## ఎంఎస్ పల్లిలో సైబర్ క్రైమ్‌పై అవగాహన సదస్సు



**కంచిలి, నవంబర్ 19 ప్రభాతవార్త** కంచిలి మండలం మఠం సరియాపల్లి గ్రామంలో సైబర్ క్రైమ్‌పై స్థానిక ఎస్సై పి.పారినాయుడు అవగాహన సదస్సు నిర్వహించారు. బుధవారం సాయంత్రం గ్రామంలో గ్రామ సమక్షంలో మాట్లాడుతూ ప్రస్తుతం కొన్ని రకాలుగా సెల్‌ఫోన్‌లో ఎక్కువగా ప్రజలను మభ్యపెట్టి మోసాలు జరుగుతున్నాయని ప్రతి ఒక్కరూ సెల్‌ఫోన్లు ఉపయోగించేటప్పుడు కంపెనీలు చెప్పే విధంగా నడుచుకోవాలని ఎవరికీ ఎటువంటి ఓటీపీలు చెప్పరాదని అన్నారు. సెల్ ఫోన్లు ద్వారా ఎక్కువగా మోసాలు జరుగు తున్నాయని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కొత్తకోట శ్రీకాంత్, లక్ష్మీనారాయణ, వంశీ, మణి పాల్గొన్నారు.

**CHANGE OF NAME AND DATE OF BIRTH**
I, DAMAYANTHI mother of Service No. JC776897P, Rank SUB (NAME), KUMARA SWAMY CHAPALA Unit 983 Lt AD Regt (Comp) Wksp, Age 65 Yrs, R/at 13-18-9/1, Sivamma Gudi, Nakka Veedhi, Srikakulam Town & District, Andhra Pradesh, India, PIN-532001. Have changed my name & date of birth from DAMAYANTHI to Chapala Damayanthi & Date of birth 01.07.1954 to 15.6.1959. Vide Affidavit No.IN-AP38705659845745X dated: 10.11.2025 all purposes.